# బోయి భీమన్న సమగ్ర సాహిత్యం

## సంపుటి - 4

## వచన గ్రంథాలు భాగం - 2



పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న సాహిత్య పీఠం
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
హైదరాబాద్

# బోయి భీమన్న సమగ్ర సాహిత్యం

సంపుటి -4

## వచన గ్రంథాలు (భాగం-2)

కుల నిర్మూలన (అనువాదం), అంబేద్కరిజం, అంబేద్కర మతం, ఎంత చీకటి ఎన్ని దీపాలు, పురాణాలలో హరి, గిరి జన మనీషులు, నాకు తెలిసిన జాషువా, శ్రీశ్రీ కమ్యూనిస్టు కాదు

ప్రధాన సంపాదకులు

**ఆచార్య అనుమాండ్ల భూమయ్య**

సంపాదకులు

**ఆచార్య కత్రి సంజీవరావు (శిఖామణి)**

సహాయ సంపాదకులు

**శ్రీమతి బోయి విజయేందిర**

**శ్రీ గనుమల జ్ఞానేశ్వర్**

పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న సాహిత్య పీఠం

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

హైదరాబాద్

**Boyi Bhimanna Samagra Sahityam**
**Volume - 2 (Vachana Grandhalu Part - 2)**
***Padmabhushan Dr. Boyi Bhimanna Sahitya Peetham***
Potti Sreeramulu Telugu University
Hyderabad - 500 004.

---

బోయి భీమన్న సమగ్ర సాహిత్యం

సంపుటి - 4

వచన గ్రంథాలు భాగం - 2

© పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

ప్రథమ ముద్రణ : డిసెంబర్, 2010

ప్రతులు : 1000

ISBN : 81-860-73-195-8

మూల్యం : రూ. 165/-

ప్రతులకు :

డైరెక్టర్, ప్రచురణల విభాగం
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
పబ్లిక్ గార్డెన్స్, నాంపల్లి,
హైదరాబాద్ - 500 004.

ముద్రణ :

ప్లానోగ్రాఫర్స్
చిరాగ్ అలీ లేన్, అబిడ్స్,
హైదరాబాద్ - 500 001.
ఫోన్ : 23203390, 66103390

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
POTTI SREERAMULU TELUGU UNIVERSITY

ఆచార్య అనుమాండ్ల భూమయ్య

ఉపాధ్యక్షులు

# డా॥ బోయి భీమన్న సాహిత్య పీఠం - కార్యాచరణ ప్రణాళిక

పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న సాహిత్య పీఠాన్ని తేది 19-09-2006న తెలుగు విశ్వవిద్యాలయంలో స్థాపిస్తామని అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డా॥ వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారు ప్రకటించారు. వెంటనే దీనికి కావలసిన నిధుల్ని 21-01-2007 తేదీన విశ్వవిద్యాలయం నిధుల నుంచే దీని కోసం వేరుగా కేటాయించారు. ఈ సాహిత్యపీఠం వెంటనే వివిధ కార్యక్రమాలకు రూపకల్పన చేసి అమలు పరుస్తుంది. ప్రస్తుత మాన్యశ్రీ ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి గారి నేతృత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భీమన్న పీఠానికి తమవంతు సహకారం కొనసాగిస్తున్నది.

1. డా॥ బోయి భీమన్నకు సంబంధించి అందుబాటులో లేని వారి రచనల్ని (పద్యం, గేయం-వచన కవిత్వం, నాటకం, వచనం) సేకరించి సంపుటాలుగా ప్రకటించడం.
2. డా॥ భీమన్న రచనలపై వివిధ ప్రదేశాలలో సదస్సులను నిర్వహించి, సదస్సు పత్రాల్ని ముద్రించడం.
3. భీమన్న జీవితం - రచనలకు సంబంధించి ఒక వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేయడం.
4. భీమన్న అముద్రిత రచనల్ని సేకరించి ప్రచురించడం.
5. భీమన్న తన కావ్యాలకు రాసుకొన్న పరిశోధనాత్మక పీఠికల్ని రెండు సంపుటాలుగా ముద్రించడం.
6. భీమన్న ఇతరుల గ్రంథాలకు రాసిన ముందు మాటల్ని సేకరించి ప్రకటించడం.
7. భీమన్న రచనలపై వచ్చిన పరిశోధనాత్మక వ్యాసాల్ని, సమీక్షల్ని సేకరించి ప్రకటించడం.
8. భీమన్న నాటకోత్సవాల్ని నిర్వహించడం.
9. డా॥ భీమన్న రచనల్ని కొన్నింటిని ఇంగ్లీషులోకి, కొన్నింటిని భారతీయ భాషలలోకి అనువదించడం.

పైన పేర్కొన్న కార్యక్రమాలను భీమన్న సాహిత్యపీఠం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి శరవేగంతో పూర్తి చేస్తోంది. రాష్ట్రం నాలుగు చెరుగులా, ఆంధ్రవిశ్వవిద్యాలయం, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, కాకతీయ విశ్వవిద్యాలయం, శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయాలలో ఇప్పటి వరకు నాలుగు సదస్సులను విజయవంతంగా నిర్వహించింది. భీమన్న తన కావ్యాలకు రాసుకొన్న పరిశోధనాత్మక పీఠికలను రెండు సంపుటాలుగా ప్రకటించాం. డా॥ భీమన్న రచనలను ప్రసిద్ధులైన అనువాదకుల చేత ఇంగ్లీషులోకి అనువదింప చేయడం జరిగింది. ఇవి త్వరలో ముద్రించబడతాయి.

డా॥ బోయి భీమన్న గారి వచన గ్రంథాలను సేకరించి రెండు సంపుటాలుగా ప్రచురిస్తున్నాం. ఇందులో మొదటి భాగంలో జానపదుని జాబులు, రాగవైశాఖి, ధర్మంకోసం పోరాటం, రాజకీయ వీరుడు డాక్టర్ ఖాన్, రెండవ భాగంలో కులనిర్మూలన, అంబేద్కరిజం, అంబేద్కర మతం, ఎంత చీకటి ఎన్ని దీపాలు, పురాణాలలో హరిగిరిజన మనీషులు, నాకు తెలిసిన జాషువా, శ్రీశ్రీ కమ్యూనిస్టుకాదు గ్రంథాలను చేర్చడం జరిగింది. ఈ గ్రంథాలు భీమన్నగారి అభ్యుదయ దృక్పథానికి, పటిష్టమైన వచన రచనా నైపుణ్యానికి అద్దం పడతాయి. తెలుగు వారి భాషా, సాహిత్యం, సంస్కృతి రంగాలలో విస్తృత అధ్యయనానికి, పరిశోధనలకు వీలు కల్పించే ఉన్నత ఆశయాలతో ఏర్పడిన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం చేస్తున్న ఈ ప్రయత్నానికి మీరు అందించే సలహాలను విశ్వవిద్యాలయం స్వీకరిస్తుంది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి భీమన్న రచనలను ఒకసారికి ముద్రణ (2008) హక్కులు ఇచ్చిన బోయి భీమన్న సాహితీనిధి అధ్యక్షులు శ్రీమతి హైమవతీ భీమన్నగారికి, పీఠం అభివృద్ధికి సహకరిస్తున్న సలహా మండలి సభ్యులకు ధన్యవాదాలు. మా ఈ ప్రయత్నానికి పాఠకుల ప్రోత్సాహం, ఆదరణ ఉంటుందని ఆశిస్తున్నాను.

(అనుమాండ్ల భూమయ్య)

తేది : 10 డిసెంబర్, 2010

హైదరాబాద్

డా॥ బోయిభీమన్న సాహిత్య పీఠం
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

ఆచార్య కర్రి సంజీవరావు (శిఖామణి)
కన్వీనర్

# భీమన్న వచన రచనా నిపుణత

పద్య కవిగా, గేయ కవిగా, వచన కవిగా, నాటక కర్తగా బహు ముఖీనమైన వైదుష్యాన్ని, వైవిధ్యాన్ని ప్రదర్శించిన భీమన్న వచన సాహిత్య సృజనలోను తనదైన ముద్రను నిలుపుకున్నారు. ప్రవాహ గతితో చదువరులను తన వెంట పరుగులు తీయించే వాక్య నిర్మాణ శైలీ, భాషా పటిమ, చెప్పదలచుకున్న విషయాన్ని సహేతుకంగా, తర్కబద్ధంగా వివేచనతో నిరూపించే విషయ పరిజ్ఞానం భీమన్న వచన రచనలోని గుణాలు. భావోద్వేగంతో సాగే శృంగార లేఖా పరంపర రాగవైశాఖి, రచ్చబండపై కూర్చుని ముచ్చట్లు పెట్టినట్టు, జానపదుని అంతరంగాన్ని ఆవిష్కరించే జానపదుని జాబులు, విద్య ద్వారానే ఈ దేశంలోని దళిత బహుజనులకు విముక్తి అని చెప్పిన అంబేద్కర్ సిద్ధాంతాన్ని, దృక్పథాన్ని నాటి, నేటి యువతరానికి అందించే ధర్మం కోసం పోరాటం, అంబేద్కరిజం, అంబేద్కర మతం వంటి గ్రంథాలు, ఆధునిక యుగపు మహాకవులైన గుర్రం జాషువా, శ్రీశ్రీల గురించి తన దృష్టి కోణం నుండి అందించిన సాహిత్య విషయాలు, ఆత్మావలోకనం లాంటి "ఎంత చీకటి, ఎన్ని దీపాలు", సాంస్కృతిక వారసత్వాన్ని అందించిన "పురాణాలలో హరి, గిరిజన మనీషులు" వంటి రచనలు భీమన్న ఆలోచనల్లోని సమసమాజ భావనలకు, విషయ పరిజ్ఞానానికి, వైవిధ్యానికి నిదర్శనంగా నిలుస్తాయి. వచన రచనలో ఇన్ని విభిన్నాంశాల మీద ఇంత లోతైన అధ్యయనం, అవగాహనలతో రచనలు చేసిన వారు తెలుగు సాహిత్యంలో అరుదుగా కనిపిస్తారు. ఈ వచన గ్రంథాలు భాగం-1లో జానపదుని జాబులు, రాగ వైశాఖి, ధర్మంకోసం పోరాటం, రాజకీయ వీరుడు డా॥ఖాన్ గ్రంథాలు:భాగం-2లో కులనిర్మూలన, అంబేద్కరిజం, అంబేద్కర మతం, ఎంత చీకటి-ఎన్ని దీపాలు, పురాణాలలో హరి, గిరి, జన మనీషులు, నాకు తెలిసిన జాషువా, శ్రీశ్రీ కమ్యూనిస్టు కాదు గ్రంథాలు వున్నాయి.

'అంబేద్కర మతం' గ్రంథంలో అంబేద్కర్ ప్రతిపాదించిన ఎడ్యుకేట్, ఆర్గనైజ్, ఏజిటేట్ అంశాలు అవశ్యం ఆచరణీయం అని చెబుతూ, మార్క్సిజం గొప్ప తనాన్ని అంగీకరిస్తూనే సామాన్యుణ్ణి కాక కార్మికుణ్ణి నాయకుడిగా వుంచడం వల్ల పతనం అయింది అంటారు. అంబేద్కర్ ఇస్లాం మతంలోకి కాక బౌద్ధంలోకి వెళ్ళడం ద్వారా ఈ దేశాన్ని పెద్ద ప్రమాదం నుండి గట్టెక్కించారని అభిప్రాయ పడ్డారు.

ఎంతచీకటి-ఎన్ని దీపాలు ఒక రకంగా ఆత్మ కథనాత్మక రచన. 83 ఏళ్ల జీవితంలో చెయ్య గలిగినవి, చెయ్యలేకపోయినవీ, అప్పటి ఆలోచనలూ, ఆకాంక్షలూ ఎలా వుండేవో సింహావలోకనం చేసుకోవడం. ఇతరుల రచనలు చదవక పోవడం వలన మంచివక్తగా రాణించ లేకపోయిన ఆత్మశోధన రచయిత నిజాయితీని పట్టి యిస్తాయి.

'అంబేద్కరిజం' బుద్ధుడు ప్రతిపాదించిన త్రిశరణాలైన ధర్మం, సంఘం, భీమం శరణం గచ్ఛామితో పాటు చైతన్యం, సంఘటితం, సమరం వంటి త్రినినాదాలు ప్రతిపాదిస్తారు.

'జానపదుని జాబుల్లో' దళిత, రైతు కూలీలకు సంబంధించి, వ్యవసాయానికి సంబంధించిన అంశాలు చర్చకు వచ్చాయి. తూర్పు గోదావరి జిల్లా యాసలో సాగిన ఈ రచనలో కోససీమ ప్రకృతి అందాలు, సంఘం, గ్రామ నిర్మాణం, పాలేరు తనం నిర్మూలన వంటి అంశాలపై నిశిత పరిశీలన వుంది.

'ధర్మంకోసం పోరాటంలో' కొలకలూరి గ్రామంలోని మాల మాదిగలు తమ మధ్యగల వైషమ్యాలను విస్మరించి ఏకం కావడం మాల మాదిగల ఐక్యతకు శుభ సూచకంగా భావించి రాష్ట్రం అంతా దీనిని ఆదర్శంగా తీసుకోవాలని సూచిస్తారు. అందుకు 'భీమసేన' నిర్మాణం జరగాలని ఆకాంక్షిస్తారు.

'శ్రీశ్రీ కమ్యూనిస్టు కాదు'లో శ్రీశ్రీ వచ్చి సాహిత్యాన్ని, ఘంటసాల సంగీతాన్ని పాడుచేసారని గతంలోనే సంచలనాత్మక ప్రకటన చేసిన భీమన్న ఈ రచనలో శ్రీశ్రీ గొప్పకవి, మహాకవి అని అతని సినీ గీతాల ద్వారా రుజువు చేస్తూ, అవసరం శ్రీశ్రీని మార్క్సిస్టును చేసింది. మార్క్సిస్టులకు శ్రీశ్రీ లాంటి ఒక నాయకుడు కావలసి వచ్చాడు అని వ్యాఖ్యానిస్తాడు.

'నాకు తెలిసిన జాషువా' గ్రంథంలో పద్య రసవిద్య తెలిసిన మహాకవిగా జాషువాని అభివర్ణిస్తూ, జాషువాతో తనకు గల సాన్నిహిత్యాన్ని ఆత్మీయంగా కలబోసుకుంటారు.

ముస్లిం అయినా తన ఇంటికి సూర్యభవన్ అనీ, తన మనుమరాలుకి సంస్కృత పేర్లు పెట్టుకున్న ప్రముఖ జాతీయ నాయకుడు, కాంగ్రెస్ వాదీ, అచ్చమైన దేశభక్తుడు, రచయిత అయిన డా॥ ఖాన్ రాజకీయ జీవితంలోని ఎత్తుపల్లాలను, తిరుగుబాట్లను తలస్పర్శిగా వివరించిన గ్రంథం 'రాజకీయ వీరుడు డాక్టర్ ఖాన్'.

రాగవైశాఖి 120 పై చిలుకు ఖండికలతో వచనంలో సాగిన శుద్ధ, ముగ్ధమోహన ప్రణయగాథ. మధ్య మధ్యలో సందర్భోచితంగా రసపుష్టి కలిగిన పద్యాలు రసనకు రుచి కలిగిస్తాయి.

ఈ గ్రంథాలు భీమన్న గారిని నిపుణత కలిగిన వచన రచనాతత్వజ్ఞునిగా నిరూపిస్తాయి.

బోయి భీమన్నగారి మొత్తం కావ్యాల్ని సేకరించడానికి కొంత శ్రమపడవలసి వచ్చింది. శ్రీమతి హైమవతీ భీమన్నగారు భీమన్న రచనల్ని చాలా వరకు అందించారు. వారి దగ్గర లేని రచనల్ని మిత్రులు శ్రీ గనుమల జ్ఞానేశ్వర్, భీమన్న గారి కుమారుడు డా॥ బోయి నాగవర్మగారు అందించారు. భీమన్నగారి కావ్యాలు నిర్దుష్టంగా, అందంగా రావడానికి సహకరించిన సహాయ సంపాదకులు శ్రీమతి బోయి విజయేందిర, శ్రీ గనుమల జ్ఞానేశ్వర్‌లకు కృతజ్ఞతలు.

ఈ సంపుటాలను గ్రంథ ముద్రణకు వీలుగా శుద్ధ ప్రతులను తయారు చేయించిన పీఠం పూర్వ కన్వీనర్ ఆచార్య కె. ఆనందన్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు. సహకరించిన డా॥ మాదిరాజు కనకదుర్గ, శ్రీమతి పుష్పలత గారికి అభినందనలు. అందంగా ముద్రించిన ప్లానోగ్రాఫర్స్ వారికి కృతజ్ఞతలు.

హైదరాబాద్
10, డిసెంబర్ 2010

కె. సంజీవరావు
సంపాదకులు

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | కుల నిర్మూలన (అనువాదం) | 1-138 |
| 2. | అంబేడ్కరిజం | 139-246 |
| 3. | అంబేడ్కర మతం | 247-282 |
| 4. | ఎంత చీకటి! ఎన్ని దీపాలు!! | 283-348 |
| 5. | పురాణాలలో హరి - గిరి జన మనీషులు | 349-426 |
| 6. | నాకు తెలిసిన జాషువా | 427-536 |
| 7. | శ్రీశ్రీ కమ్యూనిష్టు కాదు | 537-596 |

# కుల నిర్మూలన

## (Annihilation of Caste)

(మహాత్మా గాంధీ విమర్శ, డాక్టర్ అంబేద్కర్ జవాబు - అనుబంధాలతో సహా)

మూలం

డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్



అనువాదం

డాక్టర్ బోయి భీమన్న

వెల : రూ. 12/-

హక్కులు : అనువాదకుడివి

సంపాదకుడు : **చేకూరి రామారావు**

మొదటి ముద్రణ : 1969 - డా॥ అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ
రెండవ ముద్రణ : 1969 - డా॥ అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ
మూడవ ముద్రణ : 1981 - డా॥ అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ
నాలుగవ ముద్రణ : 1990 - హైదరాబాద్ బుక్ ట్రస్ట్.
ఐదవ ముద్రణ : 1992 - హైదరాబాద్ బుక్ ట్రస్ట్.
ఆరవ ముద్రణ : 1994 - హైదరాబాద్ బుక్ ట్రస్ట్.

వివరాలకు :

**హైదరాబాద్ బుక్ ట్రస్ట్**
1-1-16/10సి, జవహర్ నగర్,
హైదరాబాద్ - 500 020.
ఫోన్ : 611232.

ముద్రణ :

**అనుపమ ప్రింటర్స్**
శాంతి నగర్, హైదరాబాదు.
ఫోన్ : 220106

# నాలుగవ ముద్రణ గురించి

నేను ఉద్యోగ రీత్యా ప్రభుత్వ అనువాదశాఖ డైరెక్టర్‌నే అయినప్పటికీ, ఉద్యోగపరమైన అనువాదాలు తప్ప సాహిత్యపరమైన అనువాదాలు చేయగూడదనుకున్న వాణ్ణి. ఆ మాటను నేటి వరకూ కూడ నిలబెట్టుకుంటూ వస్తున్న వాణ్ణి.

అయితే ఈ గ్రంథం తొలి ముద్రణ ముందుమాటలో చెప్పినట్టు, అప్పుడే ఏర్పడిన అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీకి ఒక క్రియాశీలక స్థాయిని కల్పించాలనే ఉద్దేశంతో డాక్టర్ అంబేడ్కర్ గారి రచనకు 'కుల నిర్మూలన' పేరుతో ఈ అనువాదం చెయ్యడం జరిగింది. ఆ సొసైటి ఛైర్మన్ శ్రీ బి.వి. రమణయ్య గారు మా ప్రాంతపు శాసన సభ్యులు. కార్యదర్శి శ్రీ బి. హెచ్. తిరుపతి గారు నాకు బాల్య మిత్రులు. ఈ కారణాల వల్లనూ, డాక్టర్ అంబేడ్కర్ గారి సాహిత్యం పట్ల నా కుండే గౌరవం వల్లనూ, మిత్రులు నెలకొల్పిన సొసైటీ యోగ క్షేమాలను ప్రోత్సహించే సదభిలాష వల్లనూ ఈ అనువాదాన్ని నేను చెయ్యడం జరిగింది. సొసైటీ పేరు మీదనే ప్రచురించి ప్రచారం చేసుకోమనడమూ జరిగింది. సొసైటీ కార్యక్రమాలకు ఊపు కలిగించడం కోసం నా అత్యంత ప్రియమైన 'ధర్మం కోసం పోరాటం' గ్రంథాన్ని సొసైటీ పేరుమీద ప్రజలలోకి తీసుకు వెళ్ళడానికి అంగీకరించడం సైతం జరిగింది. ఇవన్నీ నేను ప్రతిఫలాపేక్ష లేకుండా రచనా భారాన్నీ, శ్రమనూ స్వయంగా వహించి, కేవలం సొసైటీ అభ్యుదయాన్ని కాంక్షించి చేసిన పనులు.

డాక్టర్ అంబేడ్కర్ గారి తదితర గ్రంథాలను కూడా అనువదించవలసిందిగా సహృదయులు అనేకులు నన్ను కోరడం జరిగింది. కారణాంతరాల వల్ల ఆ పని నెరవేర లేదు.

నేను ఈ కుల నిర్మూలనను వ్రాసి ఇప్పటికి ఇరవై సంవత్సరాలు పైగా అయింది. ఇంతకాలంగా నేను దీని గురించి పట్టించుకోలేదు. సొసైటీ కార్యక్రమాలను గురించి గాని, అది ఎంతవరకు లక్ష్యాలను సాధించడంలో సఫలమయిందనే విషయం గురించి గాని నేను పట్టించుకోలేదు. ఎప్పుడైనా తిరుపతిగారు కనిపించినప్పుడు నేను అడుగుతూ ఉండడం, ఆయన ఏదో చెబుతూ ఉండడం జరుగుతుండేది. సొసైటి

పని చెయ్యడం మందగించిందనే వార్తలను కొంత మంది మిత్రులు చెబుతున్నప్పటికీ నేను వినిపించుకోలేదు. నా సాహిత్య కృషిలో నేను మునిగి ఉండిపోయాను.

ధర్మం కోసం పోరాటం, కుల నిర్మూలన - ఈ రచనలు రెండూ జంట గ్రంథాలు. కొంతకాలంగా ఈ రెండూ కూడా మార్కెట్లో లభించడం లేదని, మరెక్కడా దొరకడం లేదని నా దగ్గర అవి ఉంటే పంపించమని చాలా మంది నన్ను అడగసాగారు. నా దగ్గర కూడా అవి లేవు కనుక సొసైటీని విచారిస్తే అక్కడ కూడా లేవని తెలియవచ్చింది. 1981 తర్వాత ఇంతవరకూ 'కుల నిర్మూలన' ముద్రించబడనే లేదని తెలిసింది. ఈ గ్రంథాన్ని ఇక ముద్రించే ఉద్దేశమే సొసైటీకి లేదని తెలిసినప్పుడు నేను చాలా బాధపడ్డాను. అంతేగాక డాక్టర్ అంబేద్కర్ శతజయంతి సంవత్సరంలో కూడా 'కుల నిర్మూలన' గ్రంథం ప్రజల చేతుల్లోకి వెళ్ళకపోతే ఇక దీనికి అస్తిత్వం ఏమున్నట్టు ? ఇక దీని జీవితం ముగిసి పోయినట్టేనా ? అలా జరగ కూడదు. నా తక్కిన గ్రంథాలతో పాటు దీనిని కూడా నేను స్వయంగా ముద్రించుకోక తప్పదు. నేను ఇలా ఆలోచిస్తూ కూర్చున్నప్పుడు అదృష్టవశాత్తూ 'హైదరాబాద్ బుక్ ట్రస్ట్' కార్యకర్తలు నన్ను కలవడం జరిగింది. నా సమస్యకు పరిష్కారంగా వారు దీనిని తిరిగి వెలుగులోకి తేగలమన్నారు. నాకు చాల ఆనందమయింది. సరే నన్నాను. వారికి నిజంగా నేనెంతో కృతజ్ఞుణ్ణి.

ఇంతకు ముందు కాకపోయినా, ఈ అంబేద్కర్ శత జయంతి సంవత్సరంలోనైనా అంబేద్కర్ గారి రచనలన్నీ వివిధ భారతీయ భాషలన్నిటిలోకి అనువదించబడవలసి ఉంది. ముఖ్యంగా తెలుగులోకి బహు కొద్దిగా మాత్రమే వచ్చినై. హైదరాబాద్ బుక్ ట్రస్ట్ వారు ఈ విషయం మీదికి కూడా తమ దృష్టిని ప్రసరింప జేయగలిగితే భారత సమైక్యానికి ఎంతో దోహదం చేసిన వారవుతారు.

21-7-1990 - బోయి భీమన్న

## అయిదవ ముద్రణ గురించి ఒక మాట

హిందూ సమాజం నుంచి కుల వ్యవస్థను నిర్మూలించడానికి తనకు చివరగా మరొక అవకాశం ఇవ్వవలసిందని గాంధీజీ ప్రాధేయపడడమే గాక, కొద్ది సంవత్సరాలలోనే కుల వ్యవస్థను, అస్పృశ్యతను అంతం చెయ్యడానికి తానూ, తదితర హిందూ నాయకులతో కలసి తీవ్రంగా ప్రయత్నించగలనని "పూనా ఒడంబడిక" సందర్భంలో డాక్టర్ అంబేడ్కర్‌కు హామీ ఇవ్వడం జరిగింది. అది 1932 సెప్టెంబరు నెలలో జరిగింది. ఆ తర్వాత నాలుగు సంవత్సరాలకు 1936లో ఈ 'కుల నిర్మూలన' వ్యాసాన్ని డాక్టర్ అంబేడ్కర్ గ్రంథ రూపంలో ప్రకటించారు.

అంటే ఏమిటి? హిందూ సమాజాన్ని మార్చడానికి ఆ నాలుగు సంవత్సరాలలోనూ హిందూ నాయకుల నుంచి ఎట్టి ప్రయత్నమూ జరగలేదన్న మాటే కదా ! అతి ప్రధానమైన ఒక ఒడంబడిక సందర్భంగా చేయబడిన వాగ్దానాలను కూడా హిందూ అగ్రకుల నాయకులు పట్టించుకోకపోతే ఇక అట్టి మతంలో వుండి ఏం ప్రయోజనం. అందుకే తన వ్యాసంలో అంబేడ్కర్ మతం మార్చే ప్రస్తావన తేవడం తప్పనిసరి అయింది. "అత్త పెట్టదు, అడుక్కు తిననివ్వదు" అన్న సామెతగా హిందూ నాయకులు కులాన్ని వదలరు. అంటరానితనాన్ని నిర్మూలించరు. ఈ దళితుల్ని మతం మారనివ్వరు. ఇంత అన్యాయం మరెక్కడైనా ఉంటుందా? పోనీ నాలుగు సంవత్సరాలలో మార్పు సాధ్యం కాదనవచ్చు. పూనా ఒప్పందం జరిగి ఇప్పటికి 60 సంవత్సరాలైంది. దేశం స్వతంత్రమై 45 సంత్సరాలైంది కదా ! ఏ మాత్రం మార్పు జరిగింది ? అందరూ ముఖ్యంగా హిందూ అగ్ర నాయకులు త్రీవంగా ఆలోచించ వలసిన విషయం ఇది.

"హిందూ సమాజానికి ఆధిపత్యం వహిస్తున్న బ్రాహ్మణులు తమ వద్ద ప్రయోజనాల కోసమే తప్ప మొత్తం ప్రజల యోగ క్షేమాలను గురించి ఆలోచించలేదు" అన్నారు అంబేడ్కర్. ఈ దురదృష్టం ఇంకా కొనసాగుతూనే ఉన్నది.

ఈ విషయమై బ్రాహ్మణ మేధావి వర్గం ఆలోచించకపోతే ప్రజలైనా ఆలోచించి చర్య తీసుకోవలసి ఉంది. అలా ఆలోచించడమే ఈ గ్రంథ పఠన ప్రయోజనం.

– బోయి భీమన్న.

# కుల నిర్మూలన

## పూర్వ రంగం

1935, డిశంబరు 12వ తేదీన జాత్‌పాత్ తోడక్ మండలి కార్యదర్శి శ్రీ శాంత్‌రామ్ వద్ద నుంచి నాకు ఈ క్రింది లేఖ అందింది:

**ప్రియమైన డాక్టర్ సాహెబ్:**

మీరు దయతో డిశంబరు 5వ తేదీన వ్రాసిన లేఖ చేరింది. అందుకు చాలా కృతజ్ఞుడను. ఆ లేఖ నేను పత్రికకు విడుదల చేశాను. మీ అనుమతి లేనిదే ఆ పని చేసినందుకు నన్ను క్షమింప ప్రార్థన. ఆ లేఖ ప్రకటించడంలో వచ్చే బాధ ఏదీ నాకు కనిపించడం లేదు. మీరు గొప్ప మేధావులు. చింతనా పరులు. మీరు పరిశోధించినంత సాకల్యంగా, సమగ్రంగా కుల సమస్యను మరొకరెవరూ పరిశోధించ లేదని నా గాఢ విశ్వాసం. నేను, మా మండలీ కూడా మీ భావాల ద్వారా ఎప్పుడూ ఉత్తేజితుల మౌతూనే ఉన్నాం. వాటిని "క్రాంతి" ద్వారాను, సభాముఖంగాను నేను తరచు ప్రచారం చేస్తూనే ఉన్నాను. "కులవ్యవస్థ ఏ మత నమ్మకాలపై నిర్మించ బడిందో ఆ మత నమ్మకాలను పూర్తిగా నాశనం చేస్తేనేగాని కులాన్ని నిర్మూలించడం సాధ్యం కాదు." అనే మీ నూతన సిద్ధాంతం ఇప్పుడు నా హృదయంలో ఒక క్రొత్త ఉత్సాహాన్ని రేకెత్తించింది. దయచేసి ఈ సిద్ధాంతాన్ని మాకు వీలయినంత త్వరలో మరికొంత విపులీకరించవలసిందిగా కోరుతున్నాను. ప్రస్తుతం అది నాకు పూర్తిగా విశదం కాలేదు. మీరు దాన్ని విశదీకరిస్తే పత్రికల ద్వారాను, సమావేశాల ద్వారాను గట్టిగా ప్రచారం చేయడానికి మాకు వీలవుతుంది.

మా వార్షిక మహాసభకు మీరే అధ్యక్షులుగా ఉండాలని మా కార్యవర్గం పట్టుదలగా ఉన్నారు. మీ వీలునుబట్టి మా మహాసభ తేదీలను మార్చుకోగలం. పంజాబ్‌లోని స్వతంత్ర హరిజనులు మిమ్మల్ని కలుసుకోవాలని, మీతో తమ కార్యక్రమాలను గురించి చర్చించాలని ఎంతగానో ఉవ్విళ్ళూరుతున్నారు. అందువల్ల మీరు దయతో మా కోరికను మన్నించి మా మహాసభకు అధ్యక్షులుగా లాహూరు రాగలిగితే, ఈ రెండు ప్రయోజనాలు సిద్ధించగలవు. వివిధ భావాలకు చెందిన హరిజన నాయకులందరినీ ఆహ్వానిస్తాం. వారందరికీ మీ ఆదర్శాలను అందించే అవకాశం కూడ మీకు కలుగుతుంది.

క్రిష్టమస్‌కి బొంబాయిలో మిమ్మల్ని కలుసుకోడానికి, మీతో యావత్తు పరిస్థితినీ సవివరంగా చర్చించి మా ఆహ్వానాన్ని తప్పక అంగీకరించవలసిందిగా కోరడానికి మా మండలి కార్యదర్శి శ్రీ ఇంద్రసింగ్‌ను పంపిస్తున్నాం....."

జాత్‌పాత్ తోడక్ మండలి సవర్ణ హిందూ సంఘ సంస్కర్తల సంస్థ అనీ, హిందూ సంఘం నుంచి కులవ్యవస్థను నిర్మూలించడమే దాని ఏకైక లక్ష్యమనీ నాకు తెలియజేయబడింది. సాధారణంగా సవర్ణ హిందువులచేత నిర్వహించబడే ఉద్యమంతో ఎటువంటి సంబంధమూ పెట్టుకోవడానికి నేను ఇష్టపడను. సంఘ సంస్కరణ విషయంలో సవర్ణ హిందువుల దృక్పథం వేరు, నాదృక్పథం వేరు కావటంవల్ల వారితో కలిసి పనిచేయడం చాల కష్టతరమని నాకు తెలుసు. మా మధ్యగల అభిప్రాయ భేదాలవల్ల నిజానికి వారితో కలిసి మెలగడ మంటే నాకు ఇరకాటంగా ఉంటుంది. అందువల్ల మొట్టమొదట వారు నన్ను మహాసభకు అధ్యక్షత వహించవలసిందిగా కోరినప్పుడు నే నందుకంగీకరించ లేదు. అయితే వారు నన్నంతటితో విడిచిపెట్టలేదు. తమ సభ్యులలో ఒకరిని నన్ను ఒప్పించడానికి బొంబాయి పంపారు. ఆయన పరిస్థితినంతా వివరించిన తరువాత, చివరకు నేను అందుకు ఒప్పుకోవడం జరిగింది.

మండలి వార్షిక మహాసభ దాని ప్రధాన కార్యస్థానమైన లహోరులో జరగవలసి ఉంది. మొదట ఈ సభను ఈష్టరు పండుగ సందర్భంలో జరపాలనుకున్నారు. కాని తరువాత దానిని 1936 మే నెల వరకు వాయిదా వేశారు. మండలి ఆహ్వానసంఘం ఇప్పుడు ఆ మహాసభను పూర్తిగా రద్దు చేసుకొన్నారు. అలా

ప్రతిభా భారతికి జనకుడు,

ఆయన అందరికీ అప్పుడు ఆత్మీయుడు

సంభావ్యుడు సహాయుడు సన్మార్గ దర్శకుడు,

ఆయన లక్ష్మీ సరస్వతీ పార్వతీ వరప్రసాదుడు

సర్వజనాశ్రయ సముదార గుణశీలుడు,

అట్టి పున్నయ్యగారికి అంకితం ఈ అంబేడ్కరిజం

అదృష్టం అనే దుంటే అది నాదే నిజం!

– భీమన్న

## అంకితం

## జస్టిస్ పున్నయ్యగారికి

న్యాయం అంటే ఏమిటి?
న్యాయ స్వరూపం ఎలాంటిది?
న్యాయం కోరేది ఎవరు?
న్యాయం కావలసిం దెవరికి?
న్యాయ పక్షంలో నిలబడి
న్యాయం కోసం పోరాడే దెవరు?
ఈ ప్రశ్నలన్నిటికీ ఒకే జవాబున్న దయ్యా,
అదే న్యాయమూర్తి కొత్తపల్లి పున్నయ్య!
అంటరానితనం అనే పంకంలో పుట్టి
స్వాతంత్ర్యోద్యమం అనే ఉషస్సును చేపట్టి
యువ జాతీయ నవ పద్మంగా వికసించి,
దళితుల ధర్మ హక్కుల కోసం
సత్యాగ్రహ పోరాటాలు నిర్వహించి,
శాసన కర్తగా అభివ్యక్తుడై
న్యాయ పీఠం అధిరోహించి,
హరికీ హరిజనుడికీ ఒకే పంక్తిలో
అమృతం పంచి ఇస్తున్న ఘనాఘనుడు
కొత్తపల్లి పున్నయ్య మహాశయుడు!
ఆయన వందే మాతరం ఉద్యమోద్భవుడు
ఏ తరం ధర్మానికైనా యువతరం నాయకుడు,
ఆయన ప్రజ్ఞా ప్రజ్ఞాన ప్రాభవుడు

నా సాహితీ కృషిని సదా ప్రోత్సహిస్తూ ఉండే మా చెల్లెలు ద్రౌపదికి కూడా నేను కృతజ్ఞత చెప్పుకోవలసి వుంది.

తప్పు ఒప్పు పట్టిక వేసే అలవాటు నాకు లేదు. ఈ గ్రంథంలో అన్నంలో రాళ్లలా మాట మాటకూ పటుక్కుమనే అచ్చు తప్పులను, విరామ దోషాలను సవరించుకొంటూ పురోగమించ వలసిందిగా పాఠక మిత్రులకు నా మనవి.

ఇందులో అక్కడక్కడ ఉదాహరించబడిన కవితలన్నీ నా 'నఖ క్షతాలు' మినీ కవితల కావ్య వనం నుంచి గ్రహించబడినట్టివే. వాటిని వేరు వేరు టైపులలో ముద్రించ వలసింది. కాని సాధ్యపడలేదు. వివేచించి చదువుకోగలరు.

ఇక్కడ నేనొక విశేషం గురించి పేర్కొనడం ఉచితంగా ఉంటుందనుకుంటున్నాను. ఏ గ్రంథానికైనా ఆవిష్కరణ, అంకితం గురించిన ఏర్పాట్లు దాని ముద్ర తర్వాత జరుగుతాయి. ఈ గ్రంథం విషయంలో ముద్రణ జరుగుతూ వుండగానే అట్టి ఏర్పాట్లు ప్రారంభ మయినాయి. ఇది చాలా అపూర్వమైన, ఆనందకరమైన విషయం.

ఈ గ్రంథం గురించి జస్టిస్ పున్నయ్యగారి చెవిదాకా వెళ్ళినప్పుడు, ఆయన పూర్తి వివరాలు తెలుసుకొన్న మీదట ఉదారులూ, సేవా తత్పరులూ అయిన అనేక మంది తమ ఆత్మీయులతో సంప్రదించి దీని ఆవిష్కరణోత్సవం గొప్పగా చేయాలనే నిర్ణయానికి వచ్చారట. అందుకు జస్టిస్ పున్నయ్యగారికి నేను ప్రత్యేకంగా కృతజ్ఞుణ్ని.

ఈ గ్రంథాన్ని నేను వ్రాస్తున్నప్పుడూ, ప్రెస్సులో ముద్రణ జరుగుతున్నప్పుడూ కూడ ఎంతో మంది దీన్ని వినీ, చదివీ ఉత్తేజితులైనారు.

అందులో వారా వేణు అయితే ఈ గ్రంథంలోని విషయ విశ్లేషణ గురించి ప్రశంసిస్తూ పెద్ద లేఖే వ్రాశారు. ఆయనకూ, నా గ్రంథ ముద్రణ విషయంలో సదా తోడ్పడుతూ వుండే సాహిత్య అకాడమీ పాండురంగయ్య గారికి, దేవేంద్రగారికి కూడ కృతజ్ఞుణ్ని. అలాగే, ఈనా కృషికి ఎంతో చేయూత నిచ్చిన తాడి నేరెళ్ళు, యమ్. జె. సుందరరావు, జె. సిద్ధార్థ కుమార్. జె. సుబ్బారావు, దాకె శివాజీ, పున్నయ్యగారి పి.ఏ. ఈశ్వరరావు గార్ల మేలు మరువరానిది.

ఇక. జ్ఞానేశ్వర్, జవహర్‌లాల్ గార్లు తీసుకొన్న శ్రద్ధ అద్వితీయమైనట్టిది. అ ఈందరికీ నా కృతజ్ఞతాభి వందనాలు.

**4-4-1985** – భీమన్న

అంబేడ్కరు బౌద్ధ మతంలో చేరాడు కాబట్టి మేమంతా అందులో చేరు తున్నాం అంటున్నారు కొంతమంది దళితులు. వాళ్ళకు మతానికీ, సామాజిక వ్యవస్థకూ తేడా తెలియదు. హిందూ మతం గురించి తెలియదు. బౌద్ధ మతం గురించీ తెలియదు. అంబేడ్కరు బౌద్ధుడయ్యాడు కాబట్టి తాము కూడ అవుతాం అంటున్నారు. అలా అంటూ అంబేడ్కరును పక్కకు నెట్టేసి బుద్ధుణ్ని అనుసరిస్తు న్నారు. బుద్ధుడు మనకు చేసిందేమిటి అని ప్రశ్నిస్తే, మొండి జవాబులు తప్ప హేతువాదం లేదు.

మతాన్ని సాకుగా పెట్టుకొని సమాజం పట్ల తమకున్న బాధ్యతల నుంచి తప్పించు కోవడం కోసం కొంతమంది దళితులు అనుసరిస్తున్న విధానాలే డి.పి. దాస్ లాంటి వాళ్లు అంబేడ్కరును అపార్థం చేసుకోవడానికి కారణమవుతున్నై.

అంబేడ్కరు మతం మారడానికి అసలు కారణం ఏమిటో నిశితంగా ఆలో చిస్తే, ఆయన తన సొంత మోక్షం కోసం మతం మారాడని ఎవరూ అనరు. అందుకే బాగా ఆలోచించమంటున్నాను. మతమూ, భక్తీ, ఆరాధనా పూర్తిగా ఎవరికి వారికే వ్యక్తి గత విషయాలు. సాంఘిక స్పృహ మనకు ప్రధానం. మతం ముసుగులో దాగుకోకండి. ముసుగును తీసిపారేసి, అంబేడ్కరు చెప్పిన పోరాట మార్గాన్ని చేబట్టి, ధైర్య సాహసాలతో ముందుకు పదండి.

**కృతజ్ఞతలు**

నా గ్రంథాలన్నిటిలోనూ నేనెంతో మందికి కృతజ్ఞతలు చెప్పుకుంటూనే వస్తున్నాను, వారందరికీ ఇప్పుడూ ఎప్పుడూ కూడ నేను కృతజ్ఞుడినే. వారి పేర్లన్నీ ఇక్కడ మళ్ళీ చెప్పనవసరం లేదు. ఇక్కడ ఇప్పుడు ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పవలసింది (1) ముఖపత్ర శీర్షికను వ్రాసిపెట్టిన బైరుగారికి, ఆయన జె. గోపాల్‌గారి సహోద్యోగి, మిత్రుడూను. మంచి కళాకారుడు.

(2) సర్దార్ గౌతు లచ్చన్న గారి యశోధరా ఆర్ట్స్ ప్రింటర్స్ వారికి. నేనేది వ్రాసినా దానిని అచ్చు అక్షరాలతో చూచినప్పుడే నాకు దాని సమగ్ర స్వరూపం కనిపిస్తుంది. అందుకే అవసరమైన తుది సవరణలను గ్యాలీ, పేజీ ప్రూఫుల దశలో చేస్తూ ఉంటాను. ఈ నా అలవాటును సంతోషంతో భరించే సహృదయులే నా గ్రంథాలకు ముద్రాపకులుగా లభిస్తూ వుండడం నా అదృష్టం.

తక్కువగా రచించితి, వృ
థాశ్రమ" కాదని విశ్వసించితిన్;
భిక్కుతనమ్ము వీడి, జయ
భీములు కండు; పురోగమించి మీ
హక్కులు గెల్చుకొండు; భర
తావని గొల్వుడు ధర్మ సత్త్వులై.

ఈ పద్యం అంబేడ్కరీయులందరికీ నా కానుక.

## సత్క్రమ విమర్శ కావాలి

డి.పి.దాస్ అనే ఒక హరిజన మేధావి ఇంగ్లీషులో వ్రాసుకొన్న ఆత్మకథపై ఇన్‌డియన్ ఎక్స్‌ప్రెస్ 31-3-85 సంచికలో బి.జి.వి. చేసిన సమీక్షను చూశాను. దానిలో ఒక మూడు వాక్యాలు ఇలా వున్నై.

"He is equally critical of Gandhi and Ambedkar, the former justifying Varnashram and evoking pity for untouchables rather than seeking to uproot the evil of caste, and the later for seeking individual salvation by leading a few of his followers to individual salvation by embracing Buddhism".

"Gandhi's concept of Rama Rajya is attacked as another manifestation of 'forever India' - a proclaimed "coronation of the old and ancient value systems."

"In the ultimate analysis, both Gandhi and Ambedkar failed to provide any permanent relief to the untouchables of India."

ఈ మూడు వాక్యాలలోను విమర్శలు వున్నై. గాంధీయొక్క వర్ణాశ్రమ ధర్మ సమర్థనను, అంబేడ్కరు యొక్క బౌద్ధ మత స్వీకరణను, గాంధీ యొక్క రామరాజ్య ప్రతిష్ఠాపన ప్రతిపాదనను డి.పి.దాస్ గారు తీవ్రంగా విమర్శించారు. దేశంలో ఏయే సమస్యల మీద ఎన్నెన్ని రకాల అభిప్రాయాలు వ్యక్తమవుతాయో చూపటానికే ఈ పై ఉదాహరణ లిచ్చాను.

అంబేడ్కరుకు వ్యతిరేకమైన విమర్శలను నేను సహించలేను. అందుకే సమగ్రమైన భావనకు ఉదాహరణగా ఈ గ్రంథాన్ని వ్రాశాను.

లోగడనే నేను వ్రాసి ప్రకటించిన ''అంబేద్కర సుప్రభాతం'' కావ్యం ఎంతో మందిని ఆకర్షించింది. వెలను లెక్కచేయకుండా ఎంతో మంది పుస్తకాల కోసం వ్రాస్తున్నారు. ముత్యాలకూ, మొక్కజొన్నలకూ తేడా గుర్తించగలుగుతున్నారు. సంతోషం. అయితే తగిన సౌకర్యాలు లేక అందరికీ పుస్తకాలు పంపలేక పోతు న్నాను.

ఈ సుప్రభాతంపై, నా తదితర రచనలపై వలెనే, ఎన్నో పత్రికలలో ఎన్నెన్నో మంచి మంచి సమీక్షలు వచ్చినై. అవికాక కావ్యాన్ని వివిధ కోణాల నుంచీ సమీ క్షిస్తూ, ప్రశంసిస్తూ ఎందరెందరో సాహితీ మూర్తులూ, సహృదయ మిత్రులూ నిత్యమూ లేఖలు వ్రాస్తూ వున్నారు. అందులో డాక్టర్ దాశరథీ, డాక్టర్ కొండవీటి వెంకటకవీ, శ్రీ ఎండ్లూరి, అమూల్యశ్రీ, బుంగా సుగుణారావు, పాలమూరి వెంక టస్వామి, జి.మోహనరావు, యమ్.నారాయణ మూర్తిగార్లు కొందరు. ఈ లేఖ లన్నిటినీ చేర్చి ప్రత్యేకంగా ఒక గ్రంథం ప్రకటించాలని వుంది.

నా ఆరోగ్య పరిస్థితిని గురించి ఎప్పటికప్పుడు శ్రద్ధ తీసుకొనడం ద్వారా నా సాహితీ కృషికి దోహదం చేస్తున్న మిత్రులు డా. గురుకుల మిత్రా గారికి, డా. దాసరి ధనపతిరావు గారికి నేనెంతో ఋణపడి వున్నాను.

అంబేద్కర సుప్రభాతం కావ్యపీఠిక ఉషస్సులోనే, ఆ కావ్యాన్ని ఎలాంటి పరిస్థితిలో వ్రాశానో వివరించి వున్నాను. ఆ సమయంలో నేనున్న పరిస్థితిలో మరె వరైనా (అంబేద్కరు తప్ప) ఉండి వుంటే - చుట్టూ డాక్టర్లు, టేబిలుపై మందు లు, బంధుమిత్రులు వగైరాతో అంతా హడావుడిగా వుండేది. అయితే ఆ సమ యంలోనే నా ఊహా ఫలకంపై అంబేద్కరూ, నా మనసు నిండా పద్యాలూ, నా టేబిలుపై రకరకాల కలాలూ, కాగితాలూ - అదీ అప్పుడు నా చుట్టూ వున్న దృ శ్యం.

అలాంటి రోజులలో, నేను అంబేద్కర సుప్రభాతం పద్యాలను ఎప్పుడు మెలకువ వస్తే అప్పుడు లేచి వ్రాస్తున్నప్పుడు, నాకు మహాకవి జాషువాగారి ''ఫిర దౌసీ''లోని ఒక పద్యం గుర్తుకొచ్చింది. అందులో నుంచి జాషువాగారి రెండు పాదా లను స్పృశిస్తూ నేను ఒక పద్యాన్ని వ్రాసుకొన్నాను. అది ఇది-

''ఒక్కొక్క పద్దియమ్మునకు
ఒక్కొక నెత్తురు బొట్టు మేనిలో

పుల మీది చిరునవ్వులు, మనో వీథుల్లోని విద్యుద్దీపాలు జిగేలుమనేది ఆయన కేసే. ఇదంతా మనం చూస్తున్నదే. మన కళ్ళముందు నడుస్తున్న ఆధునిక సాంస్కృతిక చరిత్రే.

పున్నయ్యగారి ఈ సమ్యగౌన్నత్యం వెనక ఎంటి ప్రతిభ వున్నదో, సంకల్ప బలం వున్నదో, మానవ సేవాసక్తి వున్నదో, అలుపెరుగని కృషి వున్నదో మనం నిశితంగా పరిశీలించి చూస్తే, అది యువతరానికీ ఎంతటి లక్ష్యసిద్ధమైనట్టిదో, ఎంతటి మార్గదర్శకమైనట్టిదో స్పష్టపడుతుంది.

పున్నయ్యగారి సతీమణి శ్రీమతి లీలావతి గారు, కుమారుడు రాజకుమార్, కుమార్తె ప్రతిభా భారతి, శాసన సభ్యుడైన సోదరుడు కొత్తపల్లి నర్సయ్య గారు.

శ్రీమతి ప్రతిభా భారతి గారిని గురించి నేనిక్కడ ప్రత్యేకంగా చెప్పనక్కర లేదు. విద్యార్థినిగా విద్యార్థి సంఘాలకు నాయకత్వం వహించి యువతరపు విద్యారంగంలోనే అభ్యుదయకర సంచలనాలను సృష్టించిన వీరబాల ఆమె. తండ్రిని మించిన కుమార్తె. తెలుగుదేశం ప్రభుత్వం మూడు మంత్రివర్గాలలోనూ ఆమె మంత్రి. ప్రస్తుతం సాంఘిక సంక్షేమంతో పాటు సాంస్కృతిక వ్యవహారాలను కూడ నిర్వహిస్తున్న విద్యాభారతి ప్రతిభా భారతి.

కొత్తపల్లి పున్నయ్యగారి వ్యక్తిత్వం ఎంతటిదో నాలుగు మాటలలో చెప్పడం జరిగిందిక్కడ. అంతటి ఉన్నత ఉత్తమ నాయకుడు ఈ అంబేడ్కరిజం గ్రంథానికి కృతిపతిగా లభించడం ఒక గొప్ప అదృష్టం. అందుకు నేనెంతో ఆనందపడుతున్నాను.

రాజకీయ నాయకులు స్వార్థ రహితులు కావాలి. కుల మత పక్షపాతాలు మానాలి. ప్రాంతీయ సంకుచితత్వాలు విడనాడాలి. సార్వజనిక జాతీయతా దృక్పథంతో కార్యవిధానాలను అమలుపరచాలి. అందుకే అంబేడ్కరిజానికి ఒక పరిధి లేని కేంద్రాన్ని మాత్రమే సూచించాను. జాతీయస్థాయిలో కొన్ని ప్రధాన విధానాలను మాత్రమే సూత్రప్రాయంగా పేర్కొన్నాను.

## సుప్రభాతమూ – సుహృద్భావమూ

ఈ గ్రంథం చదివే ముందుగాని, చదివిన తర్వాతగాని, ధర్మంకోసం పోరాటం, జన్మాంతర వైరం గ్రంథాలను కూడ చదవడం అవసరం.

హరిజనాభ్యుదయ కార్యక్రమాలను పున్నయ్యగారు ఉద్యమస్థాయిలో నిర్వహిస్తున్న ఆ రోజులలోనే ఆయన గురించి నేననుకున్నాను - హరిజనాభ్యుదయ నభోమండలంలో ఒక యువతార ఉద్భవించిందని.

నేననుకొన్నట్టే ఆయన క్రమాభ్యున్నతి పొందుతూ వచ్చారు. **1955**లో ఆంధ్ర శాసన సభకు ఎన్నికైనారు, **1956**లో అది ఆంధ్రప్రదేశ్ శాసన సభ్యత్వంగా పరిణమించి **1962** వరకు కొనసాగింది. **62**లో తిరిగి పోటీలేకుండా శాసన సభ్యుడయ్యారు.

రాజకీయ రంగంలో పోటీలేకుండా ఎన్నిక కావడంలో ఆయన యొక్క ప్రజాసేవ నిరతి ఎంతటిదో స్పష్టపడుతున్నది. ఆయన ఎంతగా జన ప్రియుడై నాడో ఈ క్రమాభ్యున్నతి స్పష్టపరుస్తున్నది.

ఈ మధ్యలో శ్రీకాకుళం జిల్లా పరిషత్తు ఉపాధ్యక్షుడుగా వుంటూ మొత్తం మీద జిల్లా అభివృద్ధికీ, ప్రత్యేకంగా ప్రాథమిక విద్యారంగానికీ ఆయన చేసిన సేవ, సాధించిన విజయం అపారమూ, అద్వితీయమూ. ఈనాటికి కూడా అన్ని జిల్లాల లోనూ, మొత్తం దేశమంతటాను అనుసరించవలసివున్న ఆదర్శప్రాయమైన కార్య ప్రణాళిక అది.

ఈ కాలక్రమంలో ఆయనతో నా పరిచయం పెరుగుతూ వచ్చి **1960, 64** ప్రాంతాలలో ప్రగాఢతరమైంది. మేమిద్దరమూ ఆంధ్రయూనివర్సిటీ సెనేట్‌లో సభ్యులంగా వున్నకాలమది. బ్రహ్మానందరెడ్డిగారి ముఖ్యమంత్రిత్వపు రోజులవి. మంత్రివర్గంలో పున్నయ్యగారికి స్థానం కావాలంటూ మేమెంతో కృషిచేసిన రోజులు. అందుకోసం గోవాడ నిరీక్షణ రావు గారు నిరశన వ్రతం కూడా పట్టిన రోజులు. నిలకడవుండని రాజకీయ పదవిని కాదని పవిత్రమైన న్యాయ దేవత ఆయనను వరించింది. **1964**లో జిల్లా జడ్జిగా ప్రవేశించి రాష్ట్రంలో మొత్తం మీద అన్ని జిల్లాల ప్రజల ప్రేమాభిమానాలు చూరగొంటూ **1974** అక్టోబరులో ఆయన హైకోర్టు న్యాయమూర్తి అయినారు.

ఇది కదా మనం ఆశించే హరిజనాభివృద్ధి క్రమం! ఇది కదా ప్రతి దళిత జన యువకుడు చేబట్టవలసిన ఆదర్శ వికాస జ్యోతి.

ఈనాడు ఆయన హైకోర్టు న్యాయమూర్తి. సాంస్కృతిక రంగంలో ఉజ్వలంగా ప్రకాశిస్తున్న సహృదయ సూర్యుడు. కవుల, పండితుల, కళాకారుల పెద

వుల మీది చిరునవ్వులు, ఘనో వీధుల్లోని విద్యుద్దీపాలు జిగేలుమనేది ఆయన కేసే. ఇదంతా మనం చూస్తున్నదే. మన కళ్ళముందు నడుస్తున్న ఆధునిక సాంస్కృతిక చరిత్రే.

పున్నయ్యగారి ఈ సమ్యగౌన్నత్యం వెనక ఎంటి ప్రతిభ వున్నదో, సంకల్ప బలం వున్నదో, మానవ సేవాసక్తి వున్నదో, అలుపెరుగని కృషి వున్నదో మనం నిశితంగా పరిశీలించి చూస్తే, అది యువతరానికీ ఎంతటి లక్ష్యసిద్ధమైనట్టిదో, ఎంతటి మార్గదర్శకమైనట్టిదో స్పష్టపడుతుంది.

పున్నయ్యగారి సతీమణి శ్రీమతి లీలావతి గారు, కుమారుడు రాజకుమార్, కుమార్తె ప్రతిభా భారతి, శాసన సభ్యుడైన సోదరుడు కొత్తపల్లి నర్సయ్య గారు.

శ్రీమతి ప్రతిభా భారతి గారిని గురించి నేనిక్కడ ప్రత్యేకంగా చెప్పనక్కర లేదు. విద్యార్థినిగా విద్యార్థి సంఘాలకు నాయకత్వం వహించి యువతరపు విద్యారంగంలోనే అభ్యుదయకర సంచలనాలను సృష్టించిన వీరబాల ఆమె. తండ్రిని మించిన కుమార్తె. తెలుగుదేశం ప్రభుత్వం మూడు మంత్రివర్గాలలోనూ ఆమె మంత్రి. ప్రస్తుతం సాంఘిక సంక్షేమంతో పాటు సాంస్కృతిక వ్యవహారాలను కూడ నిర్వహిస్తున్న విద్యాభారతి ప్రతిభా భారతి.

కొత్తపల్లి పున్నయ్యగారి వ్యక్తిత్వం ఎంతటిదో నాలుగు మాటలలో చెప్పడం జరిగిందిక్కడ. అంతటి ఉన్నత ఉత్తమ నాయకుడు ఈ అంబేడ్కరిజం గ్రంథానికి కృతిపతిగా లభించడం ఒక గొప్ప అదృష్టం. అందుకు నేనెంతో ఆనందపడుతున్నాను.

రాజకీయ నాయకులు స్వార్థ రహితులు కావాలి. కుల మత పక్షపాతాలు మానాలి. ప్రాంతీయ సంకుచితత్వాలు విడనాడాలి. సార్వజనిక జాతీయతా దృక్పథంతో కార్యవిధానాలను అమలుపరచాలి. అందుకే అంబేడ్కరిజానికి ఒక పరిధి లేని కేంద్రాన్ని మాత్రమే సూచించాను. జాతీయస్థాయిలో కొన్ని ప్రధాన విధానాలను మాత్రమే సూత్రప్రాయంగా పేర్కొన్నాను.

## సుప్రభాతమూ – సుహృద్భావమూ

ఈ గ్రంథం చదివే ముందుగాని, చదివిన తర్వాతగాని, ధర్మంకోసం పోరాటం, జన్మాంతర వైరం గ్రంథాలను కూడ చదవడం అవసరం.

హరిజనాభ్యుదయ కార్యక్రమాలను పున్నయ్యగారు ఉద్యమస్థాయిలో నిర్వహిస్తున్న ఆ రోజులలోనే ఆయన గురించి నేననుకున్నాను – హరిజనాభ్యుదయ నభోమండలంలో ఒక యువతార ఉద్భవించిందని.

నేననుకొన్నట్టే ఆయన క్రమాభ్యున్నతి పొందుతూ వచ్చారు. 1955లో ఆంధ్ర శాసన సభకు ఎన్నికైనారు, 1956లో అది ఆంధ్రప్రదేశ్ శాసన సభ్యత్వంగా పరిణమించి 1962 వరకు కొనసాగింది. 62లో తిరిగి పోటీలేకుండా శాసన సభ్యుడయ్యారు.

రాజకీయ రంగంలో పోటీలేకుండా ఎన్నిక కావడంలో ఆయన యొక్క ప్రజాసేవ నిరతి ఎంతటిదో స్పష్టపడుతున్నది. ఆయన ఎంతగా జన ప్రియుడైనాడో ఈ క్రమాభ్యున్నతి స్పష్టపరుస్తున్నది.

ఈ మధ్యలో శ్రీకాకుళం జిల్లా పరిషత్తు ఉపాధ్యక్షుడుగా వుంటూ మొత్తం మీద జిల్లా అభివృద్ధికీ, ప్రత్యేకంగా ప్రాథమిక విద్యారంగానికీ ఆయన చేసిన సేవ, సాధించిన విజయం అపారమూ, అద్వితీయమూ. ఈనాటికి కూడా అన్ని జిల్లాలలోనూ, మొత్తం దేశమంతటాను అనుసరించవలసివున్న ఆదర్శప్రాయమైన కార్యప్రణాళిక అది.

ఈ కాలక్రమంలో ఆయనతో నా పరిచయం పెరుగుతూ వచ్చి 1960, 64 ప్రాంతాలలో ప్రగాఢతరమైంది. మేమిద్దరమూ ఆంధ్రయూనివర్సిటీ సెనేట్‌లో సభ్యులంగా వున్నకాలమది. బ్రహ్మానందరెడ్డిగారి ముఖ్యమంత్రిత్వపు రోజులవి. మంత్రివర్గంలో పున్నయ్యగారికి స్థానం కావాలంటూ మేమెంతో కృషిచేసిన రోజులు. అందుకోసం గోవాడ నిరీక్షణ రావు గారు నిరశన వ్రతం కూడా పట్టిన రోజులు. నిలకడవుండని రాజకీయ పదవిని కాదని పవిత్రమైన న్యాయ దేవత ఆయనను వరించింది. 1964లో జిల్లా జడ్జిగా ప్రవేశించి రాష్ట్రంలో మొత్తం మీద అన్ని జిల్లాల ప్రజల ప్రేమాభిమానాలు చూరగొంటూ 1974 అక్టోబరులో ఆయన హైకోర్టు న్యాయమూర్తి అయినారు.

ఇది కదా మనం ఆశించే హరిజనాభివృద్ధి క్రమం! ఇది కదా ప్రతి దళిత జన యువకుడు చేబట్టవలసిన ఆదర్శ వికాస జ్యోతి.

ఈనాడు ఆయన హైకోర్టు న్యాయమూర్తి. సాంస్కృతిక రంగంలో ఉజ్వలంగా ప్రకాశిస్తున్న సహృదయ సూర్యుడు. కవుల, పండితుల, కళాకారుల పెద

అంబేడ్కరు బౌద్ధ మతంలో చేరాడు కాబట్టి మేమంతా అందులో చేరు తున్నాం అంటున్నారు కొంతమంది దళితులు. వాళ్ళకు మతానికీ, సామాజిక వ్యవస్థకూ తేడా తెలియదు. హిందూ మతం గురించి తెలియదు. బౌద్ధ మతం గురించీ తెలియదు. అంబేడ్కరు బౌద్ధుడయ్యాడు కాబట్టి తాము కూడ అవుతాం అంటున్నారు. అలా అంటూ అంబేడ్కరును పక్కకు నెట్టేసి బుద్ధుణ్ని అనుసరిస్తు న్నారు. బుద్ధుడు మనకు చేసిందేమిటి అని ప్రశ్నిస్తే, మొండి జవాబులు తప్ప హేతువాదం లేదు.

మతాన్ని సాకుగా పెట్టుకొని సమాజం పట్ల తమకున్న బాధ్యతల నుంచి తప్పించు కోవడం కోసం కొంతమంది దళితులు అనుసరిస్తున్న విధానాలే డి.పి. దాస్ లాంటి వాళ్లు అంబేడ్కరును అపార్థం చేసుకోవడానికి కారణమవుతున్నై.

అంబేడ్కరు మతం మారడానికి అసలు కారణం ఏమిటో నిశితంగా ఆలో చిస్తే, ఆయన తన సొంత మోక్షం కోసం మతం మారాడని ఎవరూ అనరు. అందుకే బాగా ఆలోచించమంటున్నాను. మతమూ, భక్తీ, ఆరాధనా పూర్తిగా ఎవరికి వారికే వ్యక్తి గత విషయాలు. సాంఘిక స్పృహ మనకు ప్రధానం. మతం ముసుగులో దాగుకోకండి. ముసుగును తీసిపారేసి, అంబేడ్కరు చెప్పిన పోరాట మార్గాన్ని చేబట్టి, ధైర్య సాహసాలతో ముందుకు పదండి.

## కృతజ్ఞతలు

నా గ్రంథాలన్నిటిలోనూ నేనెంతో మందికి కృతజ్ఞతలు చెప్పుకుంటూనే వస్తున్నాను, వారందరికీ ఇప్పుడూ ఎప్పుడూ కూడ నేను కృతజ్ఞుడినే. వారి పేర్లన్నీ ఇక్కడ మళ్ళీ చెప్పనవసరం లేదు. ఇక్కడ ఇప్పుడు ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పవలసింది (1) ముఖపత్ర శీర్షికను వ్రాసిపెట్టిన బైరుగారికి, ఆయన జె. గోపాల్‌గారి సహోద్యోగి, మిత్రుడూను. మంచి కళాకారుడు.

(2) సర్దార్ గౌతు లచ్చన్న గారి యశోధరా ఆర్ట్స్ ప్రింటర్స్ వారికి. నేనేది వ్రాసినా దానిని అచ్చు అక్షరాలతో చూచినప్పుడే నాకు దాని సమగ్ర స్వరూపం కనిపిస్తుంది. అందుకే అవసరమైన తుది సవరణలను గ్యాలీ, పేజీ ప్రూఫుల దశలో చేస్తూ ఉంటాను. ఈ నా అలవాటును సంతోషంతో భరించే సహృదయులే నా గ్రంథాలకు ముద్రాపకులుగా లభిస్తూ వుండడం నా అదృష్టం.

నా సాహితీ కృషిని సదా ప్రోత్సహిస్తూ ఉండే మా చెల్లెలు ద్రౌపదికి కూడా నేను కృతజ్ఞత చెప్పుకోవలసి వుంది.

తప్పు ఒప్పు పట్టిక వేసే అలవాటు నాకు లేదు. ఈ గ్రంథంలో అన్నంలో రాళ్లలా మాట మాటకూ పటుక్కుమనే అచ్చు తప్పులను, విరామ దోషాలను సవరించుకొంటూ పురోగమించ వలసిందిగా పాఠక మిత్రులకు నా మనవి.

ఇందులో అక్కడక్కడ ఉదాహరించబడిన కవితలన్నీ నా 'నఖ క్షతాలు' మినీ కవితల కావ్య వనం నుంచి గ్రహించబడినట్టివే. వాటిని వేరు వేరు టైపులలో ముద్రించ వలసింది. కాని సాధ్యపడలేదు. వివేచించి చదువుకోగలరు.

ఇక్కడ నేనొక విశేషం గురించి పేర్కొనడం ఉచితంగా ఉంటుందనుకుంటున్నాను. ఏ గ్రంథానికైనా ఆవిష్కరణ, అంకితం గురించిన ఏర్పాట్లు దాని ముద్ర తర్వాత జరుగుతాయి. ఈ గ్రంథం విషయంలో ముద్రణ జరుగుతూ వుండగానే అట్టి ఏర్పాట్లు ప్రారంభ మయినాయి. ఇది చాలా అపూర్వమైన, ఆనందకరమైన విషయం.

ఈ గ్రంథం గురించి జస్టిస్ పున్నయ్యగారి చెవిదాకా వెళ్ళినప్పుడు, ఆయన పూర్తి వివరాలు తెలుసుకొన్న మీదట ఉదారులూ, సేవా తత్పరులూ అయిన అనేక మంది తమ ఆత్మీయులతో సంప్రదించి దీని ఆవిష్కరణోత్సవం గొప్పగా చేయాలనే నిర్ణయానికి వచ్చారట. అందుకు జస్టిస్ పున్నయ్యగారికి నేను ప్రత్యేకంగా కృతజ్ఞుణ్ని.

ఈ గ్రంథాన్ని నేను వ్రాస్తున్నప్పుడూ, ప్రెస్సులో ముద్రణ జరుగుతున్నప్పుడూ కూడ ఎంతో మంది దీన్ని వినీ, చదివీ ఉత్తేజితులైనారు.

అందులో వారా వేణు అయితే ఈ గ్రంథంలోని విషయ విశ్లేషణ గురించి ప్రశంసిస్తూ పెద్ద లేఖే వ్రాశారు. ఆయనకూ, నా గ్రంథ ముద్రణ విషయంలో సదా తోడ్పడుతూ వుండే సాహిత్య అకాడమీ పాండురంగయ్య గారికి, దేవేంద్రగారికి కూడ కృతజ్ఞుణ్ని. అలాగే, ఈనా కృషికి ఎంతో చేయూత నిచ్చిన తాడి నేరెళ్ళు, యమ్. జె. సుందరరావు, జె. సిద్ధార్థ కుమార్. జె. సుబ్బారావు, దాకె శివాజీ, పున్నయ్యగారి పి.ఎ. ఈశ్వరరావు గార్ల మేలు మరువరానిది.

ఇక. జ్ఞానేశ్వర్, జవహర్‌లాల్ గార్లు తీసుకొన్న శ్రద్ధ అద్వితీయమైనట్టిది. అ ఈందరికీ నా కృతజ్ఞతాభి వందనాలు.

**4-4-1985** – భీమన్న

మానుకొన్నామన్న నోటీసు నా అధ్యక్షోపన్యాసం అచ్చయిన చాల రోజులకు గాని నాకు అందలేదు. ఆ ఉపన్యాసం ప్రతులు నా వద్దనే ఉండిపోయినై. అధ్యక్ష పీఠాన్నుంచి ఉపన్యసించే అవకాశం నాకు లభించనందువల్ల, కులవ్యవస్థ కారణంగా ఏర్పడ్డ సమస్యలపై అభిప్రాయాలు తెలుసుకునే అవకాశం ప్రజలకు లేకుండా పోయింది. నా అభిప్రాయాలను ప్రజలకు తెలియజేయడం కోసం, ఎలాగూ అచ్చయిన ఉపన్యాస ప్రతులు నా వద్ద ఉన్నాయి గనుక, వాటిని మార్కెట్టులో పెట్టడానికి నిశ్చయించాను. నా ఉపన్యాసం పూర్తిపాఠం తరువాత పేజీలలో చూడగలరు.

అయితే-నేను మహాసభాధ్యక్షుడుగా ఉండడాన్ని వారు ఎందుకు విరమించుకోవలసి వచ్చిందో తెలుసుకోవడానికి సహజంగా ప్రజలు కుతూహల పడవచ్చు. మొట్టమొదట ఉపన్యాసాన్ని ముద్రించడం దగ్గరే పేచీ వచ్చింది. ముద్రణ బొంబాయిలో జరగాలని నేనంటే - లాహోరులో జరగాలనీ, అక్కడయితే ఖర్చు తక్కువ అవుతుందనీ మండలి వారన్నారు. నేనందుకంగీకరించక, బొంబాయిలో ముద్రణ జరగాలని పట్టు పట్టాను. ఈ నా కోరికను వారు మన్నించకుండా నా కొక లేఖ వ్రాశారు. మండలి సభ్యులు చాలామంది సంతకాలు చేసి వ్రాసిన ఆ లేఖలోని ఒక భాగాన్ని ఈ క్రింద పేర్కొంటున్నాను.

## పూజ్య డాక్టర్ జీ !

ఈ నెల 24వ తేదీన మీరు శ్రీయుత శాంత్‌రామ్‌కు వ్రాసిన లేఖ మాకు చూపబడింది. దానిని చదివి మేము ఆశాభంగం చెందాం. బహుశా ఇక్కడ ఏర్పడిఉన్న పరిస్థితి మీకు తెలియకపోవచ్చు. మిమ్మల్ని ఈ రాష్ట్రానికి ఆహ్వానించడం పంజాబులోని హిందువులందరికీ మొత్తం మీద ఇష్టంలేదు. ఈ విషయంలో జాత్‌పాత్ తోడక్ మండలి చాలా తీవ్రమైన విమర్శకు గురికావలసి వచ్చింది. మొత్తంమీద ఇక్కడందరూ మమ్మల్ని అతి ఘోరంగా దుయ్యబట్టడం సాగించారు. భాయి పరమానంద్ ఎం.ఏ. (హిందూ మహాసభ మాజీ అధ్యక్షుడు), మహాత్మా హన్స్‌రాజ్, డాక్టర్ గోకుల్‌చంద్ నౌరంగ్ (స్థానిక స్వపరిపాలనశాఖ మంత్రి) రాజ్ నరేంద్రనాథ్ ఎం.ఎల్.సి. మున్నగు ప్రముఖులతో సహా మొత్తం హిందూ నాయకులందరూ మండలియొక్క ఈ కార్యక్రమంతో తెగ త్రెంపులు చేసుకొన్నారు.

అయినాసరే జాత్‌పాత్ తోడక్ మండలి కార్యకర్తలు (అందులో శ్రీయుత శాంత్‌రామ్ (ప్రధానవ్యక్తి) మాత్రం బాగా పట్టుదలగా ఉన్నారు. ఎంత ప్రతిఘటన నైనా సరే, ఎన్ని కష్టాలనైనా సరే ఎదుర్కోడానికి సంసిద్ధంగా ఉన్నారు. మీరే అధ్యక్షులుగా ఉండాలన్న ప్రతిపాదనను మాత్రం వదులుకోదలచలేదు. మండలికి చాల చెడ్డపేరు వచ్చింది.

ఇట్టి పరిస్థితులలో మండలి కార్యక్రమంతో సహకరించడం మీ విధి. ఒక ప్రక్క హిందువులు ఎన్నో కష్టాలను, బాధలను కల్గిస్తూ ఉండగా మరొక ప్రక్క మీరు కూడా ఇబ్బందులు కల్గించడం నిజంగా దురదృష్టమే కాగలదు.

ఈ విషయంలో మీరు బాగా ఆలోచిస్తారని, మనందరికీ క్షేమకరంగా ఉండే విధంగా వ్యవహరిస్తారని ఆశిస్తున్నాం.

ఈ లేఖ నన్ను చాలా ఆందోళన పరిచింది. అధ్యక్షోపన్యాసాన్ని ముద్రించే విషయంలో కొద్ది రూపాయలకోసం మండలి ఎందుకు నన్ను ఇలా వ్యాకుల పరుస్తున్నదో నా కర్థం కాలేదు. అదలా ఉంచి, సర్ గోకుల్ చంద్ నరంగ్ వంటి ప్రముఖులు నా అధ్యక్షతకు అసమ్మతి తెలుపుతూ మండలితో తెగద్రెంపులు చేసుకొన్నారంటే నేను నమ్మలేక పోయాను. ఎందుకంటే, సర్ గోకుల్‌చంద్ నాకు స్వయంగా ఈ క్రింది లేఖ వ్రాశారు.

ప్రియమైన డాక్టర్ అంబేద్కర్ 5, మౌంట్ గొమెరీ రోడ్,

లాహోరు, 7–2–36

వచ్చే ఈష్టరు సెలవులలో లాహోరులో జరగబోయే జాత్‌పాత్ తోడక్ మండలి వార్షిక మహాసభకు అధ్యక్షత వహించడానికి మీరు అంగీకరించినట్టు ఈ మండలి కార్యకర్తల ద్వారా విని నేను చాల సంతోషించాను. మీరు లాహూరు వచ్చినప్పుడు నాతో మకాం చెయ్యగల్గితే నాకెంతో ఆనందంగా ఉంటుంది.

ఇతర విషయాలు మనం కలుసుకొన్నప్పుడు మాట్లాడుకొనవచ్చును.

భగవదీయుడు

**జి.సి.నరంగ్**

వాస్తవం ఏదైనప్పటికీ, నేను మాత్రం వారి ఒత్తిడికి తొంగిపోలేదు. నా అధ్యక్షోపన్యాసాన్ని బొంబాయిలోనే ముద్రించాలని నేను పట్టుబడుతున్న సంగతి తెలిసి కూడా దాన్ని అంగీకరించక మండలి నాకొక తంతి పంపారు. అందులో

వారు విషయాలు నాతో స్వయంగా మాట్లాడడం కోసం శ్రీహర్ భగవాన్ బొంబాయికి పంపుతున్నట్టు తెలిపారు. ఏప్రిల్ 9వ తేదీని శ్రీహర్ భగవాన్‌ను బొంబాయికి వచ్చాడు. ఆయన నాతో మాట్లాడినప్పుడు అధ్యక్షోపన్యాసం ముద్రణ ప్రసక్తే తేలేదు. ముద్రణ బొంబాయిలో జరగాలా, లాహోరులో జరగాలా అనే విషయం ఆయనకు అప్రధానమైనట్లు కనబడ్డారు. ఆయనపడ్డ తాపత్రయమంతా అధ్యక్షోపన్యాసంలోని వివరాలు తెలుసుకోవాలని. దీనినిబట్టి నాకు రూఢి అయింది ఏమంటే–అధ్యక్షోపన్యాస ముద్రణ లాహోరులోనే జరగాలని మండలి పట్టుబట్టడం ఖర్చు తక్కువకోసం కాదని, ఉపన్యాసంలోని వివరాలు తెలుసుకోవడం కోసమని. సరే, ఉపన్యాస ప్రతిని ఆయన కిచ్చాను. అందులోని కొన్ని భాగాలపట్ల ఆయన కొంత కలవరపాటు చెందాడు. లాహోరు తిరిగి వెళ్ళిపోయాడు. లాహోరునుంచి ఈ క్రింది లేఖ వ్రాసాడు.

**ప్రియమైన డాక్టర్ సాహెబ్,** లాహోరు, 14-4-36

బొంబాయి నుంచి 12వ తేదీన ఇక్కడకు చేరాను. నాకు రైలు ప్రయాణంలో అయిదారు రాత్రులు వరుసగా నిద్ర లేకపోవడంవల్ల కొంచెం సుస్తీ చేసింది. మీరు అమృతసర్ వచ్చినట్లు తెలిసింది. నాకు ఆరోగ్యంగా ఉండిఉంటే అక్కడ మిమ్మల్ని కలుసుకుని ఉండేవాడిని. మీ ఉపన్యాసపు ప్రతిని అనువాదం కోసం శ్రీ కాంత్‌రామ్‌కు అందజేశాను. ఉపన్యాసం ఆయనకు ఎంతగానో నచ్చింది. అయితే 25వ తేదీ లోపల ముద్రణకోసం అనువాదాన్ని సిద్ధం చేయడం సాధ్యం కాదేమోనని ఆయన భయపడ్డాడు. ఏది ఏమైనప్పటికి దానికి విశేషమైన ప్రచారం లభించగలదు. అంతేకాదు హిందువులను నిద్రనుంచి మేల్కొలపగలదని మా విశ్వాసం.

ఉపన్యాసంలో నేను బొంబాయిలో మీకు చూపిన భాగాన్ని ఇక్కడ కొంతమంది మిత్రులు చదివి కొంత ఆందోళన చెందారు. మహాసభ ఎట్టి అవాంతరం లేకుండా సవ్యంగా జరిగిపోవాలని కోరుకునే నావంటి వాళ్ళుకూడా మీ ఉపన్యాసం నుంచి కనీసం ప్రస్తుతానికి "వేద" పదాన్ని అయినా తొలగించడం మంచిదని భావిస్తున్నారు. ఈ విషయాన్ని మీ సుహృద్భావానికే విడిచి పెట్టేస్తున్నాను. అయితే మీ అధ్యక్షోపన్యాసంలో మీరు వ్యక్తపరచిన భావాలు మీ వ్యక్తిగతమైనట్టివనీ, వాటికి బాధ్యత మండలికి ఏమీ లేదనీ ఉపన్యాసాంతంలో మీరు స్పష్టపరుస్తారని భావిస్తున్నాను. ఈ నా సూచనకు మీరు అభ్యంతరం చెప్పరనే విశ్వసిస్తున్నాను. ఉపన్యాసం ఒక వేయి ప్రతులు పంపించండి. డబ్బు నేనే చెల్లిస్తాను. ఈ విషయంలో ఈ వేళ మీకు

ఒక టెలిగ్రాం కూడా పంపించాను. వందరూపాయలకు ఇందులో ఒక చెక్కు పంపుతున్నాను. అందినట్టు తెలుపగలరు. ఈ తాలూకు బిల్లులు కూడా తరువాత పంపించగోరెదము. ఆహ్వాన సంఘాన్ని సమావేశపరుస్తున్నాను. వారి నిర్ణయాన్ని వెంటనే మీకు తెలుపగలరు. ఈ తాలూకు బిల్లులు కూడా తరువాత పంపించగోరెదము. అధ్యక్షోపన్యాసాన్ని తయారు చేయడంలో మీరు తీసుకున్న శ్రమకు, నాపట్ల మీరు చూపిన దయకు నా మనః పూర్వక అభివందనాలు. ఈ విషయంలో మీరు మమ్మల్ని ఎంతో కృతజ్ఞతా ప్రపత్తుల్ని చేసుకొన్నారు.

భవదీయుడు

హర్ భగవాన్

పి.ఎస్.

ఉపన్యాసం అచ్చు కాగానే దయచేసి ప్రతుల్ని ప్యాసింజరు ట్రైనుకు పంపించండి. పత్రికలకు విడుదల చేయాలి గదా."

ఆ విధంగానే ఉపన్యాసపు వ్రాతప్రతిని ముద్రణ కిచ్చి, వేయి ప్రతులకు ఆర్డరిచ్చాను. ఎనిమిది రోజుల తరువాత శ్రీ హర్ భగవాన్ నుంచి మరొక లేఖ నాకు అందినది. అందులో ఇలా ఉంది.

ప్రియమైన డాక్టర్ అంబేద్కర్ లాహోరు, 22-4-36.

మీ టెలిగ్రామూ, ఉత్తరమూ అందాయి. అందుకు మేము ఎంతో కృతజ్ఞులం. మీరు కోరినట్లు మా మహాసభను మళ్ళీ వాయిదా వేస్తాం. అయితే, పంజాబు వాతావరణంలో వేడి రోజురోజుకు హెచ్చవుతున్నందువల్ల మహాసభను 25, 26 తేదీలలో జరిపితేనే బాగుంటుందని నా ఉద్దేశం. మే నెల చాల వేడిగా ఉంటుంది. పగలు సమావేశాలు అనుకూలంగాను, సుఖంగాను ఉండవు. అయినప్పటికీ మే నెల మధ్యభాగం లోనే మహాసభ జరిగిననాడు, అది వీలయినంత సౌకర్యవంతంగా జరపడానికి అన్ని ప్రయత్నాలు చేస్తాం.

అయితే ఇక్కడ ఒక్క విషయాన్ని మీ దృష్టికి తేవడం తప్పని సరి అవుతున్నది. మతం మార్పును గురించిన మీ ప్రకటన పట్ల మావాళ్లు కొందరు పడుతున్న సందేహాలను గురించి మీకు లోగడ చెప్పి ఉన్నాను. మీకు జ్ఞాపకం ఉండే ఉంటుంది. ఆ ప్రకటనతో మండలి కేమీ ప్రమేయం లేదని, మహాసభ వేదికనుంచి ఆ ప్రకటన గురించి ప్రస్తావించేదేదీ మీకు లేదని మీరు నాకు చెప్పి ఉన్నారు. అప్పుడే మీరు మీ ఉపన్యాసపు

వ్రాత ప్రతిని నా కిస్తూ ప్రధానమైన ఉపన్యాసం అదేననీ, ముగింపు పేరాలు రెండు మూడు మాత్రమే దానికి చేర్చవలసి ఉన్నదనీ మీరు స్పష్టపరిచి ఉన్నారు. అయితే తదుపరి మీరు పంపించిన మిగతా ఉపన్యాస భాగం చూచి ఆశ్చర్యపడ్డాం. దాన్ని చేర్చి చూస్తే ఉపన్యాసం సుదీర్ఘంగా ఉంది. అంత దీర్ఘమైన ఉపన్యాసాన్ని సాంతం చదివేవాళ్లు ఎంతో మంది ఉండరని మా భయం. అంతేగాక, హిందూసంఘం నుంచి బయటకి వెళ్లిపోవడానికే మీరు నిశ్చయించుకొన్నట్లు పెక్కుసార్లు అందులో పేర్కొన్నారు. ఈ అధ్యక్షోపన్యాసమే హిందువుగా మీ తుది ఉపన్యాసమైనట్టు కూడా వక్కాణించారు. పైగా- వేదాలయొక్క హిందువుల తదితర మత గ్రంథాల యొక్క నైతికతను, సహేతుకతను మీరు అనవసరంగా దుయ్యబట్టారు. హిందూమత సాంకేతికతపై మీరు చేసిన సుదీర్ఘ విమర్శ ప్రస్తుత సమస్యకు ఏ విధంగానూ సంబంధించినది కాదు. తత్కారణంగా మీ ఉపన్యాసంలోని కొన్ని భాగాలు అప్రస్తుతంగాను, అసందర్భంగాను ఉన్నవి. నాకు మీరు మొదట ఇచ్చిన భాగానికే మీ ఉపన్యాసం పరిమితమై ఉంటే ఎంతో బాగుండేది. అవసరమనుకుంటే "బ్రాహ్మణిజం" (బ్రాహ్మణ మతం) మొదలైన విషయాలపై మీరు వ్రాసిన దానితోనైనా సరిపెట్టి ఉండవలసింది. హిందూమతాన్ని పూర్తిగా నిర్మూలించడం, హిందువుల పవిత్ర గ్రంథాల నైతికతను సందేహించడం, హిందూ సంఘంనుంచి, హిందూమతం నుంచి వైదొలగే సూచన చెయ్యడం-వీటికి సంబంధించిన మీ ఉపన్యాసం చివరి భాగం ఏమాత్రం సముచితంగా ఉన్నట్టు నా కనిపించడం లేదు.

అందుచేత పైన పేర్కొనబడ్డ భాగాలను ఉపన్యాసం నుంచి మినహాయించ వలసిందిగాను, నాకిచ్చిన భాగంతోనే ఉపన్యాసాన్ని ముగించవలసిందిగాను, మహాసభా నిర్వాహకుల పక్షాన నేను వినయ పూర్వకంగా మిమ్మల్ని వేడుకుంటున్నాను. కాకపోతే, "బ్రాహ్మణిజం" గురించి కొద్ది పేరాలు కలిపితే కలపవచ్చు. ఉపన్యాసం అనవసరంగా ఉద్రిక్తతను రెచ్చగొట్టేదిగాను, నొప్పించేదిగాను ఉండడం అంతగా మంచిది కాదని నా ఉద్దేశం.

మీ మనో భావాలతో ఏకీభవించేవాళ్లం చాలా మందిమి ఉన్నాం. హిందూమతాన్ని సంస్కరించి సరిదిద్దడానికి మీ నాయకత్వం క్రింద పురోగమించాలని ఎంతగానో ఉవ్విళ్ళూరుతున్నాం. మీ దృక్పథానికి చెందిన వారందరిని కూడగట్టాలని మీకుంటే, అందుకు సిద్ధంగా పంజాబు నుంచి ఎందరో సంస్కరణాభిలాషులు మీ సేవలో చేరేవారు కలరు.

వాస్తవానికి కుల వ్యవస్థా దురాచారాన్ని నిర్మూలించడంలో మీరు మాకెంతో మార్గదర్శకులు కాగలరని భావించాం. ప్రత్యేకించి ఈ రంగంలో మీరు చేసిన కృషీ, పరిశోధన అపారం. అనన్య సామాన్యం. అందువల్లనే ఈ విషయంలో ఒక విప్లవాన్ని మీరు సాధించగలరని మహత్తరమైన ఈ ఉద్యమానికి కేంద్రశక్తిగా నిలిచి మా కార్యపురోగతికి బలం చేకూరుస్తారని ఆశించాం. అయితే-మీరు చేసిన ప్రకటన (మతము నుంచి వైదొలగే విషయం) పదే పదే చెప్పడంలో దాని విశిష్టత పోయి. నిసారమైన నినాదం అవుతుంది కనుక, పరిస్థితులను గుర్తించి విషయాన్ని సమగ్రంగా తిరిగి పరిశీలించ వలసిందిగా మిమ్మల్ని కోరుతున్నాం. హిందువులు నిజంగా వాస్తవిక దృష్టితో పని చెయ్యడానికి అంగీకరించి ముందుకు వస్తే - బంధు మిత్రులను, మత విశ్వాసాలను సైతం వదులుకోవలసి వచ్చినా భయపడకుండా సహకరించడానికి సిద్ధపడితే - కుల వ్యవస్థను నిర్మూలించే ఉద్యమంలో ప్రధాన పాత్రను సంతోషంతో నిర్వహించగలనని మీరు ప్రకటించడం ద్వారా మీ ఉపన్యాసాన్ని పటిష్టం చెయ్యండి. అలా మీరు చెయ్యగలిగితే, ఆ విధమైన ఉద్యమానికి పంజాబు నుంచి మీకు అశేషమైన తోడ్పాటు, ప్రోత్సాహం లభించ గలవని నేను హామీ ఇస్తున్నాను.

ఈ ప్రయత్నంలో ఇప్పటికే మేము చాల ఖర్చు చేశాం. సందిగ్ధ స్థితిలోపడ్డాం. ఇట్టి స్థితిలో మాకు తగువిధంగా సహాయ పడగలిగితే మీకు నేనెంతో కృతజ్ఞుడనైతాను. పైన పేర్కొనబడ్డ విధంగా ఉపన్యాసాన్ని పరిమితం చెయ్యడానికి అంగీకరించవలసింది గాను, మీ అంగీకారాన్ని తిరుగు టపాలో మాకు తెలియజేయవలసిందిగాను కోరుతున్నాం. ఒకవేళ అది మీకు సాధ్యం కాకపోతే, ఉపన్యాసాన్ని యధాతథంగా ముద్రించాలని మీరు పట్టుబడితే--మాకు మహాసభను జరపడమే సాధ్యం కాదని, అంటే అభిలషణీయం కాకపోవచ్చునని చెప్పడానికి చింతిస్తున్నాం. అప్పుడు సభను కాలపరిమితి లేకుండా వాయిదా వేయవలసి వస్తుంది. ఈ విధంగా వాయిదా వెయ్యడం ద్వారా-అంటే ఇప్పటికే వాయిదాలు వేస్తూ వచ్చాం గనుక-ప్రజాభిమానాన్ని పోగొట్టుకున్నవారమౌతాం. ఏది ఏమైనప్పటికి ఒక విషయం మాత్రం మీకు స్పష్టంగా చెప్పవలసి ఉంది. కులవ్యవస్థపై మీరు చేసిన ఈ అద్భుత రచన ద్వారా మీరు మా హృదయాలలో ఒక శాశ్వత స్థానాన్ని ఏర్పరచు కొన్నారు. ఈ విషయంపై ఇంతవరకు వచ్చిన ఏ రచనా, పరిశోధనా ఇంత మహత్తరంగా లేదు. ఇది మన రచనా

వారసత్వంలో ఒక అమూల్య భాగధేయం కాగలదు. దానిని రూపొందించడంలో మీరు చేసిన శ్రమకు మేము అపారంగా ఋణపడి ఉన్నాం.

మీ దయా సమౌదార్యాలకు అభివందనాలు చెల్లిస్తూ.

భవదీయుడు

హర్ భగవాన్

ఈ లేఖకు నేను ఈ క్రింది ప్రత్యుత్తరం పంపించాను.

ప్రియమైన శ్రీ హర్ భగవాన్ 27-4-1936

మీ ఏప్రెల్ 22 లేఖ అందింది. నేను నా ఉపన్యాసాన్ని యధాతథంగా ముద్రించాలని పట్టుబడితే కాలపరిమితి లేకుండా మహాసభను జాత్‌పాత్ తోడక్ మండలి వాయిదా వేసుకోవలసి ఉంటుందని మీరు వ్రాసిన విషయం నాకు చాలా విచారం కలిగించింది. అందుకు నా సమాధానం-అస్పష్టమైన పదజాలం వాడటం నా కిష్టం లేదు. - సూటిగానే తెలియజేస్తున్నాను. నా ఉపన్యాసాన్ని తమ పరిస్థితులకు అనుకూలంగా మార్చక తప్పదని మీ మండలి పట్టుబడితే, మహాసభను రద్దు చేయడమే మంచిదని నేను కూడ వాంఛిస్తున్నాను. ఈ నా నిర్ణయం మీకు నచ్చకపోవచ్చు, అయితే - మహాసభకు అధ్యక్షత వహించే గౌరవం కోసమని, అధ్యక్షోపన్యాసాన్ని తయారు చేసుకోవడంలో ఏ అధ్యక్షునికైనా ఉండవలసిన స్వేచ్ఛను నేను వదులుకోలేను. ఏ అధ్యక్షుడైనా తానధ్యక్షత వహించే మహాసభను తాను సవ్యం, సముచితం అనుకొన్న పద్ధతుల్లో నడప వలసిన బాధ్యతను వహించాలి. కేవలం మండలిని సంతోషపెట్టడం కోసం నేనీ బాధ్యతను వదులుకోలేను. ఈ సమస్య ఒక నియమానికి సంబంధించింది. ఆ నియమాన్ని భంగం చెయ్యడానికి నేను సమ్మతించను.

మహాసభ యొక్క ఆహ్వాన సంఘం తీసుకున్న నిర్ణయం సముచితమా, కాదా అనే విషయంలో వివాదానికి దిగడం నా అభిమతం కాదు. అయితే అందుకు మీరిచ్చిన కారణాలు, తప్పును నాపై మోపుతున్నట్లు కనిపిస్తున్నాయి. అందువల్ల నేను జవాబు చెప్పవలసి వస్తున్నది.

అసలు ఉపన్యాసంలోని ఏ భాగానికి ఆహ్వానసంఘం అభ్యంతరం చూపుతున్నదో ఆ భాగంలోని నా అభిప్రాయం మండలికి ఆశ్చర్యం కలిగించవలసిన క్రొత్త భావాలేమీ కాదు. ముందుగా ఈ దురభిప్రాయాన్ని నేను తొలగించవలసి ఉంది. నా అభిప్రాయాలు మండలికి అంతకు ముందే తెలుసు. కుల వ్యవస్థను

నిర్మూలించడం అనేది వర్ణాంతర వివాహాల వల్లను, వర్ణాంతర భోజనాల వల్లను సాధ్యంకాదనీ, ఏ మత విశ్వాసాలపై, భావనలపై కుల వ్యవస్థ నిర్మించబడిందో ఆ భావనలను సమూలంగా నిర్మూలించడమే మార్గమనీ నేను శ్రీశాంత్‌రామ్‌కు ఒక ప్రత్యుత్తరంలో పేర్కొన్నాను. అపుడాయన దానిని వివరించవలసిందిగా నన్ను తిరిగి కోరారు. నేను చెప్పింది క్రొత్త దృక్పథంగా ఉన్నదనీ, దీనికి వివరణ అవసరమని ఆయన పేర్కొన్నారు. శ్రీ శాంత్‌రామ్ కోర్కెను పురస్కరించుకోనే ఆ విషయాన్ని నీ ఉపన్యాసంలో అంతగా వివరించడం జరిగింది. అందువల్ల ఉపన్యాసంలోని నా అభిప్రాయాలు క్రొత్తవనడం సరికాదు. మీ మండలికి వెలుగుబాట, చైతన్యశక్తి అయిన శ్రీ శాంత్‌రామ్‌కు అవి అసలే క్రొత్త కావు, అదీగాక – నా ఉపన్యాసంలోని ఆ భాగం కేవలం వాంఛనీయమనుకొని మాత్రమే వ్రాయలేదు. నా వాదాన్ని సర్వసమగ్రంగా చర్చించి పూర్తి చేయడానికి ఆ భాగం తప్పనిసరి అయింది. మీ ఆహ్వానసంఘం అభ్యంతరం చూపిన ఆ ఉపన్యాస భాగాన్ని "అప్రస్తుతం", "అసందర్భం" అని మీరు అభివర్ణించడం చూస్తే నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. నేను లాయరునని మీరు ఒప్పుకుంటారు కదా! మీ ఆహ్వాన సంఘంలోని ఏ సభ్యునికైనా ఎంత తెలుసునో అంతమాత్రం ప్రస్తుతాప్రస్తుతాల స్వభావ స్వరూపాలను గురించి నాకు కూడా తెలుసును. నా ఉపన్యాసంలో మీరు అభ్యంతరం చెపుతున్న భాగం ప్రస్తుత మైనట్టిదే కాదు, ప్రధానమైనట్టిదని కూడ నొక్కి వక్కాణిస్తున్నాను. కులవ్యవస్థను నిర్మూలించడానికి అవసరమైన విధానాలను, సాధనోపాయాలను నేను చర్చించింది ఆ భాగంలోనే. కులవ్యవస్థను నిర్మూలించడానికి ఉత్తమ మార్గంగా నేను చేసిన సూచన కొంత ఉలికిపాటును, బాధను కలిగించి ఉండవచ్చు. నేను చేసిన చర్చ, పరిష్కార సూచన తప్పని చెప్పే హక్కు మీకుంది. అయితే, కుల సమస్యకు సంబంధించిన ఉపన్యాసంలో కులాన్ని ఎలా నిర్మూలించాలో చర్చించే అధికారం నాకు లేదని మాత్రం మీరనలేరు.

మీ మరొక ఆరోపణ నా ఉపన్యాసం మరీ దీర్ఘంగా ఉన్నదని. ఆ ఆరోపణకు నా ఉపన్యాసంలోనే క్షమార్పణ చెప్పుకొని ఉన్నాను. అయితే–అది అంత దీర్ఘం కావడానికి నిజంగా బాధ్యులెవరు? ఈ రంగంలోకి మీరు ఆలస్యంగా ప్రవేశించినందు వల్ల బహుశ మీకు తెలిసి ఉండదు. మొదట్లో నేననుకొన్నది అధ్యక్షోపన్యాసాన్ని క్లుప్తంగా ముగించాలని. ఏమంటే, సుదీర్ఘంగాను, సమగ్రంగాను చర్చించి ఉపన్యాసాన్ని తయారు చేయమని మీ మండలి నన్ను కోరింది. కుల వ్యవస్థను గురించి ఒక పెద్ద

ప్రశ్నావళిని మండలి నాకు పంపిస్తూ - ఆ ప్రశ్నలన్నీ తరచు తమ ప్రత్యర్థులు తమను అడుగుతూ వుంటారనీ, వాటికి తాము సంతృప్తికరమైన జవాబులు చెప్పలేకపోతున్నామనీ, అందువల్ల వాటిని నా అధ్యక్షోపన్యాసంలో స్పష్టంగా చర్చించి వాటికి జవాబులు పొందుపరచాలనీ మండలి నన్ను కోరింది. మండలి కోరికను నెరవేర్చడానికి నేను ప్రయత్నించాను. అందువల్లనే ఉపన్యాసం అంతగా పెరిగింది. ఉపన్యాసం దీర్ఘం కావడంలో నా తప్పేమీ లేదని ఇప్పుడు మీరు అంగీకరించగలరు.

హిందూ మతాన్ని నాశనం చెయ్యడం గురించి నేను నా ఉపన్యాసంలో ప్రస్తావించినంత మాత్రం చేతనే, మీ మండలి ఇంతగా తల క్రిందులైపోతుందని నేను ఊహించలేదు. మాటలకు భయపడే వాళ్లు కేవలం ఒక్క తెలివితక్కువ దద్దమ్మలు మాత్రమే అనుకున్నాను. అయినప్పటికీ, ప్రజల మనస్సులలో అనవసరమైన భయాందోళనలు రేకెత్తే వీలు లేకుండా నేనెంతో శ్రమపడి మతం అంటే, మత నిర్మూలన అంటే నా ఉద్దేశం ఏమిటో విపులంగా వివరించాను. నా ఉపన్యాసాన్ని సాంతం చదివిన వారెవరూ కూడా నన్ను అపార్థం చేసుకొనే అవకాశం లేదనే నా విశ్వాసం. నా విపులీకరణలు కూడా గమనించకుండా, మతాన్ని "నిర్మూలించడం" వంటి వట్టి పదజాలానికే మీ మండలి బెదిరి పోయిందంటే, నాదృష్టిలో మండలి స్థాయి చాలా తగ్గిపోతున్నది. సంస్కర్త స్థానంలో నిలబడి, ఆ స్థానానికి సహజమైన ఫలితార్థాల నిచ్చే కార్యక్రమాలను ప్రత్యక్షంగా అనుసరించకపోతే మానె-కనీసం వాటిని గుర్తించడానికి కూడా నిరాకరించే మనుష్యుల పట్ల ఎవరికీ గౌరవాదరాలు ఉండవు.

ఉపన్యాస్సాన్ని క్లుప్తంగా ముగిస్తానని నేనెప్పుడూ చెప్పలేదు. ఉపన్యాసంలో ఏది ఉండాలి, ఏది వుండకూడదు అనే విషయంలో కూడా నాకూ, మండలికి మధ్య ఎట్టి చర్చా జరగలేదు. నేను చెప్పవలసిన విషయంపై, నా ఉపన్యాసంలో నా అభిప్రాయాలను వెల్లడించే స్వేచ్ఛ నాకుంటుందనే నేను మామూలుగా విశ్వసించాను. నిజానికి ఏప్రెల్ 9 న మీరు బొంబాయి వచ్చే వరకూ కూడా నా ఉపన్యాసం ఏ విధంగా తయారు చేస్తున్నానో మండలికి తెలియదు. మీరు బొంబాయి వచ్చినప్పుడు నా అంతట నేనే చెప్పాను. నిమ్నజాతులు మతం మార్చుకోవడం విషయంలో నా ఉద్దేశాలను గూర్చి ప్రచారం చేయడం కోసం మీ వేదికను ఉపయోగించుకొనే ఉద్దేశం నాకు లేదని. నా ఉపన్యాసాన్ని తయారు చేసుకోవడంలో నా మాటను

అక్షరాలా నిలుపుకొన్నాననే అనుకొంటున్నాను. "నేను హిందువుగా వుండను" వంటి మాట ఏదో పరోక్షంగా ఉదహరించడం తప్ప నా ఉపన్యాసంలో ఆ విషయంమీద మరేమీ నేను చెప్పివుండ లేదు. సూచనప్రాయంగా చెప్పిన ఆ మాత్రందానికి కూడా మీరు అభ్యంతరం చెపుతున్నారంటే, ఇప్పుడు మిమ్మల్ని నేను ఒక ప్రశ్న అడగక తప్పదు. మీ మహాసభకు అధ్యక్షత వహించడానికి నేను ఉపన్యాసంలో మార్పులు చేసే అవకాశం ఏమీలేదని మీరు గుర్తించి వుండవలసింది. మీరు బొంబాయి వచ్చినప్పుడు మీతో నేను స్పష్టగా చెప్పాను. నేను నా ఉపన్యాసంలో ఒక కామా కూడా మార్చననీ, నా ఉపన్యాసాన్ని సెన్సారు చెయ్యడానికి అంగీకరించననీ నేను వ్రాసింది వ్రాసినట్టు మీరు అంగీకరించవలసి ఉంటుందనీ, ఉపన్యాసాలలో నేను వ్యక్త పరిచిన భావాలు అంగీకరించానంటే – నిమ్న జాతుల మతం మార్పు విషయంలో నాకు గల ఉద్దేశాలను, వదులుకోవడానికి ఇష్ట పడతాననే మీరు భావించారా? నిజంగా మీరు అలా భావించి వుంటే, అది మీ తప్పే అవుతుంది. దానికి నేను ఏ విధంగాను బాధ్యుడిని కాను. మీ మహాసభకు అధ్యక్షునిగా ఎన్నుకొనడం ద్వారా మీరు నాకిచ్చే గౌరవానికి ప్రతిఫలంగా – మతం మార్పు కార్యక్రమంలో నాకు వున్న విశ్వాసాన్ని నేను వదులుకోవలసి వుంటుందని సూచన ప్రాయంగా అయినా మీరు చెప్పివుంటే, నేను అప్పుడే మీకు స్పష్టంగా చెప్పివుండే వాడిని – మీరిచ్చే గౌరవం కంటే నా విశ్వాసమే నాకు ఎక్కువ విలువైనదని.

మీ 14వ తేదీ ఉత్తరం తరువాత ఈ ఉత్తరం నాకు చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది. నాకే కాదు, ఈ ఉత్తరాలను చదివిన ఎవ్వరికైనా ఆశ్చర్యంగానే ఉంటుంది. మీ ఆహ్వాన సంఘం ఇంత హఠాత్తుగా ఎందుకు తారుమారై పోయిందో నా కర్థం కావడం లేదు. మీ 14వ తేదీ లేఖ నాటికి ఆ సంఘం ముందున్న ఉపన్యాసం చిత్తు ప్రతికీ, ఇప్పుడు ఈ లేఖ నాటికి దాని ముందున్న శుద్ధ ప్రతికీ మధ్య విషయంలో తేడా ఏమీ లేదు. చిత్తు ప్రతిలో లేని క్రొత్త భావం ఒక్కటి కూడా శుద్ధ ప్రతిలో మీరు చూపించలేరు. విషయమూ అదే, భావాలు అవే. ఉన్నతేడా ఒక్కటే. శుద్ధ ప్రతిలో ఎక్కువగా వివరించడం జరిగింది అంతే. ఉపన్యాసంలో అభ్యంతరకరమైన దేదైనా వుంటే ముద్రించ వలసిందిగా మీరు నన్ను కోరారు. మీరు సూచించిన కొద్దిపాటి భాషా సవరణలు ఉండాలా, అక్కర్లేదా, అన్న విషయాన్ని నాకు వదలి వేశారు. అదే విధంగా దానిని నేను అచ్చు కొట్టించాను. వేయి ప్రతులు ఇప్పుడు నాదగ్గర పడి

ఉన్నాయి. ఇంత జరిగిన తరువాత, ఎనిమిది రోజుల అనంతరం, ఇప్పుడు మీరు ఉపన్యాసంలో ఏవో అభ్యంతరకర భాగాలు వున్నాయి అంటున్నారు. మహాసభకు ఇష్టం కాకపోనివిగా వుంటే వాటిని ఖండిస్తూ ఆ మహాసభ ఒక తీర్మానం చేసినా నేనేమి బాధపడనని కూడా మీకు చెప్పి వున్నాను. అంతేకాదు. నా ఉద్దేశాలకు బాధ్యత వహించే భారం నుంచి మీ మండలిని తప్పించాలనీ, మహాసభ వ్యవహారాలలో మరీ ఎక్కువ సన్నిహితంగా నేను ఇరుక్కోకుండా వుండాలనీ మొదటి నుంచీ నేను తాపత్రయ పడుతున్నాను. అందుకే - నా ఉపన్యాసాన్ని ఒక విధంగా ప్రారంభోపన్యాసంగా పరిగణించవలసిందిగాను, మహాసభకు అధ్యక్షుడుగా మరొకరిని ఎవరినైనా పెట్టుకొని తీర్మానాలు చేసుకోవలసిందిగాను మీకు నేను సూచించి వున్నాను. 14వ తేదీనే ఆహ్వాన సంఘం ఈ విషయంలో ఒక నిర్ణయానికి వచ్చి వుండవలసింది. అది అలా చేయలేదు. ఈలోగా ఉపన్యాసం అచ్చుకూడా అయిపోయింది. మీ సంఘం మరికొంచెం గట్టితనంతో వ్యవహరించి వుంటే, ఈ ఖర్చు తప్పేది కదా!

నా అధ్యక్షోపన్యాసంలోని భావాలకూ, మీ ఆహ్వాన సంఘంవారి నిర్ణయానికీ ఏమీ సంబంధం లేనట్టేనని నేను విశ్వసిస్తున్నాను. అమృత్‌సర్‌లో జరిగిన సిక్కు ప్రచార మహాసభకు నేను హాజరు కావడమే మీ సంఘం తీసుకున్న నిర్ణయానికి హేతువు అని అనుకోవచ్చు. అంతకు తప్ప మీ కమిటీ నిర్ణయానికి మరొక సంతృప్తికరమైన కారణం కన్పించడం లేదు. మీ సంఘం అంత హఠాత్తుగా తన నిర్ణయం మార్చుకోవడానికి ఏప్రిల్ 14,22 తేదీల మధ్య అంతకన్న వేరే మరిఏమి జరిగినట్టు? ఏదేమయినా, ఈ వివాదాన్ని నేనెక్కువగా పొడిగించ దలచుకోలేదు. నా అధ్యక్షత క్రింద జరగవలసిన మహాసభ రద్దు చేయబడిందిగా వెంటనే ప్రకటించండి. ఇప్పటికే ఈ వ్యవహారం రాసాభాసగా తయారు అయింది. ఇప్పుడు మీ సంఘం నా ఉపన్యాసాన్ని యధాతథంగా అంగీకరించడానికి సిద్ధపడినప్పటికీ, అధ్యక్షత వహించడానికి నేను మాత్రం సమ్మతించలేను. ఉపన్యాసాన్ని రూపొందించడంలో నేను చేసిన శ్రమను ప్రశంసించినందుకు కృతజ్ఞుణ్ణి. ఇతరులకు ఎవ్వరికి లాభం చేకూరినా, లేకపోయినా నా శ్రమవల్ల నేను కృతకృత్యుడనే అయినాను ! అయితే నా ఆరోగ్యం సరిగా లేని సమయంలో ఇలాంటి అధిక శ్రమకు లోనుకావలసి రావడం ఒక్కటే విచారకరం.

భవదీయుడు

**బి.ఆర్. అంబేద్కర్**

నన్ను అధ్యక్షుడిగా ఎన్నిక చేసి, తరువాత మండలి ఎందుకు రద్దు చేసుకొన్నదో ఈ ఉత్తర ప్రత్యుత్తరాలను బట్టి పాఠకులు గ్రహించగలరు. ఈ వ్యవహారంలో పొరపాటు ఎవ్వరిదో కూడ గుర్తించగలరు. ఒక అధ్యక్షుణ్ణి ఏర్పాటు చేసుకొని, ఆ అధ్యక్షుని అభిప్రాయాలతో ఒక ఆహ్వాన సంఘం ఏకీభవించని కారణంగా, ఆ అధ్యక్షుడినే రద్దు చేసుకోవడం బహుశ ఇంతకు ముందెప్పుడూ జరిగి వుండలేదను కుంటాను. అది జరిగివున్నా లేకపోయినా - ఒక సవర్ణ హిందువుల మహాసభకు అధ్యక్షత వహించడానికి నేను ఆహ్వానించబడటం నా జీవితంలో ఇదే మొదటి సారి. ఇది ఈ విధంగా విషాదాంతంగా ముగియడం నిజంగా శోచనీయం.

అయితే, ఒక ప్రక్క మూఢాచారపరాయణులైన తోటి మానవులను నొప్పించలేని సవర్ణ హిందూ సంస్కర్తలు-మరొక ప్రక్క సంస్కరణ జరిగి తీరాలనీ, వేరే గత్యంతరం, లేదనీ పట్టుబట్టే ఆత్మాభిమానులైన అస్పృశ్యులూ-వారి మధ్య ఇంతకంటే భిన్నంగా సామరస్యం ఎలా వుంటుంది? వారి మధ్యవున్న ఈ శోచనీయ సంబంధం దృష్ట్యా వేరే సత్ఫలితాల నెలా ఆశించగలం?

**బొంబాయి-15-5-1936** **బి. ఆర్. అంబేద్కర్**

రాజగృహ,

దాదర్.

డాక్టర్ అంబేడ్కర్‌గారి

# అధ్యక్షోపన్యాసం

(1936లో, లాహోరులోని జాత్‌పాత్ తోడక్ మండలివారి
వార్షిక మహాసభ కోసం తయారుచేయబడి నట్టిది)

*(ఈ ఉపన్యాసంలో డాక్టర్ అంబేడ్కర్ వెలిబుచ్చిన భావాలతో ఆహ్వాన సంఘం వారు ఏకీభవించక మహాసభనే రద్దు చేసుకొన్నందువల్ల ఇది ప్రసంగించ బడలేదు.)*

మిత్రులారా !

ఈ మహాసభకు అధ్యక్షత వహించడానికి నన్ను ఎంతో దయతో ఆహ్వానించిన జాత్ పాత్ తోడక్ మండలి సభ్యుల్ని చూస్తే నాకు నిజంగా విచారం కలుగుతున్నది. నన్ను అధ్యక్షుడుగా ఎన్నిక చేసినందుకు వారు ఎన్నో ప్రశ్నలకు సమాధానం చెప్పుకోవలసి వుంటుంది. లాహోరులో జరిగే మహాసభకు అధ్యక్షుడుగా ఒక మనిషిని బొంబాయి నుంచి ఎందుకు దిగుమతి చెయ్యవలసి వచ్చిందో జవాబు చెప్పవలసిందిగా మండలి కోరబడవచ్చు. నాకంటే ఎక్కువ అర్హుడైన వ్యక్తి మండలికి సులభంగానే లభించి ఉండే వారని నా ఉద్దేశం. నేను హిందువులను విమర్శించిన వాడిని. వారు ఆరాధించే మహాత్ముడి అధికారాన్ని ప్రశ్నించిన వాడిని. వారు నన్ను ద్వేషిస్తారు. తమ తోటలో ఒక పాముగా వారు నన్ను భావిస్తారు. అందువల్ల ఈ గౌరవస్థానానికి నన్ను ఎందుకు ఆహ్వానించవలసి వచ్చిందో వివరించవలసిందిగా రాజకీయ మనస్కులైన హిందువుల మండలిని అడగక మానరు. ఇది ఒక పెద్ద సాహస కార్యం. కొందరు రాజకీయ హిందువులు దీనిని ఒక అవమానంగా భావించుకొన్నప్పటికీ నేను ఆశ్చర్యపడను. సామాన్య హిందువులకు కూడ ఈ నా ఎన్నిక ఏ విధంగాను సంతోషదాయకంగా ఉండబోదు.

అధ్యక్షుని ఎన్నిక చేయడంలో శాస్త్రీయ నిర్దేశాన్ని ఎందుకు ధిక్కరించవలసి వచ్చిందో జవాబు చెప్పవలసిందిగా మండలిని అడుగుతారు. మూడు వర్ణాలకు గురువుగా బ్రాహ్మణుని శాస్త్రాలు నియమిస్తున్నాయి. "వర్ణానాం బ్రాహ్మణో గురుః" అనేది శాస్త్రాల ఆదేశం. అందువల్ల హిందువుడు ఎవ్వరి నుంచి బోధనలు గ్రహించాలో, ఎవ్వరి నుంచి గ్రహించకూడదో మండలికి తెలిసి ఉన్నదే.

మరొకడెవడూ–అతడెంత మేధావీ, పండితుడూ అయినాసరే – హిందువులకు గురువుగా ఉండడానికి శాస్త్రాలు అంగీకరించవు. గురువుగా ఉండే అర్హత ఒక్క బ్రాహ్మణుడికే ఉంది.

హిందూ రాజ్యాన్ని స్థాపించడానికి శివాజీని ప్రేరేపించాడని చెప్పబడే మహారాష్ట్ర బ్రాహ్మణ సాధువు, రామదాసు, ఈ విషయాన్ని స్పష్టంగా చెప్పాడు. మత, రాజకీయ, సాంఘిక సంబంధమైన **"దాస్‌బోధ్"** అనే తన మరాఠీ పద్య

గ్రంథంలో రామదాసు హిందువుల నుద్దేశించి ఒక ప్రశ్న అడిగాడు. "పండితుడైనంత మాత్రంచేత ఒక అంత్యకులస్థుడిని గురువుగా అంగీకరిస్తామా?" అని ప్రశ్నించి, దానికి తానే జవాబు చెప్పాడు. "అంగీకరించం" అని. ఏది ఏమైనప్పటికీ, దానిపై విసరబడే ఏ ప్రశ్నకైనా జవాబు చెప్పుకొనే బాధ్యత మండలికి సంబంధించినట్టిది. దాన్ని మండలికే వదిలేద్దాం.

అధ్యక్షునికోసం మండలి బొంబాయి వరకూ ఎందుకు ప్రయాణం చెయ్యవలసి వచ్చిందో - హిందువులకు కిట్టని, అందులోను సవర్ణులకు ఉపన్యసించవలసిన, అధ్యక్షునిగా ఒక అంత్యజుడైన అస్పృశ్యుణ్ని నిర్ణయించవలసినంత క్రిందిమెట్టుకు ఎందుకు దిగిపోయిందో - ఆ విషయాలన్నీ మండలికే తెలుసు. నాకు సంబంధించినంతవరకు ఈ ఆహ్వానాన్ని నేను కొంత అయిష్టంగానే అంగీకరించాను. నాతోడి అస్పృశ్యులకు కూడ నేను దీనికి అంగీకరించడం ఇష్టం లేదు. నేనంటే హిందువులకు ఎంతగా అయిష్టమో నాకు తెలుసు. నేను వారి మిత్రకోటిలోని వాడిని కాదని కూడా తెలుసు. ఇదంతా తెలుసు కనుకనే, నెనెప్పుడూ వారికి దూరంగానే ఉంటూ ఉంటాను. నా భావాలు వారిపై రుద్దడానికి వారి సాన్నిధ్యానికై నేనభిలషించను. నా స్వంత వేదిక నుంచి నేను నా అభిప్రాయాలను ప్రకటిస్తాను. అలాచేస్తేనే వారికి ఎంతో చిరాకూ, తపనా కలుగుతూ ఉంటాయి. అందువల్లనే, నేను హిందువుల వేదికను ఎక్కి ప్రత్యక్షంగా నా భావప్రకటనలకు దిగలేదు. వారికి దూరంగా, పరోక్షంగా నేను ఇంతవరకు పని చేస్తున్నాను. నేను ఇప్పుడు ఇక్కడ వున్నానంటే, అది మీ కోరికపైనే కాని నా ఇష్టంపైన కాదు. మీ ఉద్యమం సాంఘిక సంస్కరణ. నాకు చాలా ఇష్టమైనదీ, నన్నాకర్షించేదీ ఈ ఉద్యమం. దాని ప్రగతికి తోడ్పడగల అవకాశం నాకు కల్గినప్పుడు పైగా అలా నేను తోడ్పడగలనని మీరు అనుకున్నప్పుడు - అట్టి అవకాశాన్ని వదులు కోవడం విజ్ఞత కాదనే దృష్టితోనే నేను ఈ అధ్యక్ష పదవికి అంగీకరించాను. ఏ సమస్యతో మీరు కొట్టుమిట్టాడుతున్నారో ఆ సమస్యను పరిష్కరించడానికి నే నీ రోజున చెప్పబోతున్న విషయాలు ఏ మాత్రమైనా తోడ్పడగలవో, లేదో నిర్ణయించుకోవలసింది మీరు. నేను చెయ్యగల్గిందంతా ఈ సమస్యపై నాకు కల అభిప్రాయాలను మీ ముందుంచడం.

# సాంఘిక సంస్కరణలకు, రాజకీయవాదుల వ్యతిరేకత

సంఘ సంస్కరణ మార్గం స్వర్గానికి వెళ్ళే మార్గం వంటిది. ముఖ్యంగా ఇండియాలో ఇది కంటకావృతమైనట్టిది. ఎన్నో కష్టాలతో కూడుకొన్నట్టిది. ఇండియాలో సంఘ సంస్కరణకు మిత్రులు కొద్దిమంది, శత్రువులు అనేక మంది. ఈ శత్రువులు రెండు వర్గాలు. ఒక వర్గం రాజకీయ సంస్కర్తలు, రెండవ వర్గం సోషలిస్టులు.

సాంఘిక సామర్థ్యం లేకుండా, ఇతర కార్యరంగాలలో శాశ్వతమైన అభ్యుదయం సాధ్యం కాదనీ – దురాచారాలు తెచ్చిపెట్టిన కుట్ర కారణంగా హిందూ సంఘం సామర్థ్యాన్ని కోల్పోయిందనీ – ఈ దురాచారాలను నిర్మూలించడానికి ఎడతెగకుండా కృషి చేయవలసి వున్నదనీ ఒక సమయంలో సర్వత్రా గుర్తించబడింది. అలా గుర్తించ బడినందువల్లనే జాతీయ కాంగ్రెసు ఆవిర్భావంతోపాటు, సాంఘిక మహాసభ కూడ ప్రాదుర్భవించింది. దేశంలో రాజకీయ వ్యవస్థలోని లోపాలను సరిదిద్దడానికి కాంగ్రెసు పూనుకుంటే, హిందూ సంఘంలో లోపాలను తొలగించడానికి సాంఘిక మహాసభ పూనుకొన్నది. కాంగ్రెసు, సాంఘిక మహాసభ రెండూ ఒకే ఉద్యమం యొక్క రెండు విభాగాలుగా చాలాకాలం పనిచేశాయి. అవి రెండూ తమ వార్షిక సమావేశాలను ఒకే పందిరిలో జరుపుకొనేవి కూడా. కాని, ఈ రెండు విభాగాలు ఆ తరువాత రెండు పార్టీలుగా విడిపోవడం జరిగింది. ఒకటి రాజకీయ సంస్కరణల పార్టీ, రెండవది సాంఘిక సంస్కరణల పార్టీ. ఈ రెండు పార్టీల మధ్య ఉగ్రమైన ఒక వివాదం కూడా చెలరేగింది. రాజకీయ సంస్కరణలపార్టీ జాతీయ కాంగ్రెసుకూ, సాంఘిక సంస్కరణల పార్టీ సాంఘిక మహాసభకూ మద్దతును ఇవ్వసాగాయి. ఈ రెండు సంస్థలూ క్రమంగా రెండు శత్రుపక్షాలుగా తయారయాయి.

ఇంతకూ, వివాదవిషయ మేమిటంటే, రాజకీయ సంస్కరణ జరిగే ముందుగానే సాంఘిక సంస్కరణ జరగాలా అనేది. ఒక పది సంవత్సరాలపాటు ఈ పోరాటం జరిగింది. ఈ రెండు శక్తులు సమాన బలంతో ఉండేవి. ఏ ఒక్కదానికి స్పష్టంగా విజయం లభించలేదు. అయితే, ఈ తరువాత సాంఘిక మహాసభ బలం సన్నగిల్లడం ప్రారంభమై, క్రమేణా దిగజారడం సంభవించింది. విద్యావంతులైన

హిందువులు, అధిక సంఖ్యాకులు సాంఘిక సంస్కరణ పట్ల నిర్లక్ష్యం చూపుతున్నారనీ, రాజకీయ పురోగమనం పట్లనే వారు సుముఖులై ఉన్నారనీ సాంఘిక మహాసభ సమావేశాలకు అధ్యక్షత వహించిన పెద్ద మనుష్యులు విచారం ప్రకటించసాగారు. కాంగ్రెసు సమావేశాలకు పెద్ద సంఖ్యలో జనం హాజరయ్యేవారు. హాజరు కాకుండా దానిపట్ల సానుభూతిని కలిగివుండేవారి సంఖ్య అంతకంటే అధికంగా ఉండేది. సాంఘిక మహాసభకు హాజరయ్యేవారి సంఖ్య మాత్రం చాలా తక్కువగా, నామ మాత్రంగా వుండేది. ఈ బలం క్రమంగా క్షీణించడంతోపాటు దానిపట్ల రాజకీయవాదుల శత్రుత్వం కూడా అధికం కాసాగింది. తదుపరి, తిలక్‌గారి నాయకత్వం వచ్చాక, సాంఘిక మహాసభకు తమ సమావేశాలను కాంగ్రెసు పందిళ్ళలో జరుపుకొనడానికి అంతకు ముందుండే అవకాశమూ, సహకారమూ కూడా లేకుండా పోయింది.

అంతేకాదు సాంఘిక మహాసభపట్ల దాని ప్రతిపక్షాల విరోధం ఎంత వరకూ వెళ్లిందంటే – తమ సమావేశంకోసం స్వంతంగా ఒక పెండాలును నిర్మించుకోడానికి కూడ వాళ్ళు ఒప్పుకోలేదు. పైగా, స్వంత పెండాలును నిర్మించుకొంటే, దానిని తగలబెడతామని బెదిరించారు కూడా. ఆ విధంగా ఆ రెంటిమధ్య విరోధం పెరిగి పెరిగి చివరకు రాజకీయ సంస్కరణల పక్షం బాగా బలపడడం, సాంఘిక సంస్కరణలకు సంబంధించిన సాంఘిక మహాసభ అదృశ్యమైపోయి విస్మరించబడడం జరిగింది. 1892లో అలహాబాదులో జరిగిన కాంగ్రెసు 8వ మహాసభకు అధ్యక్షత వహిస్తూ, శ్రీ బ్ల్యు. సి బెనర్జీ కావించిన ఉపన్యాసం సాంఘిక మహాసభ యొక్క మృత్యుసమాధి వద్ద చేసిన అంత్య ప్రసంగంలా ధ్వనించింది. కాంగ్రెసు విధానానికి, వైఖరికి అది దర్పణం వంటిది. అందుకే అందులోని ఒక భాగాన్ని నేను ఇక్కడ ఉదహరించడానికి సాహసిస్తున్నాను. తన ఉపన్యాసంలో శ్రీ బెనర్జీ ఇలా అన్నాడు:

"మన సాంఘిక వ్యవస్థను సంస్కరించుకొనేటంతవరకూ మనం రాజకీయ సంస్కరణకు అర్హులం కాజాలమని చెప్పేవారితో నేను ఎంతమాత్రం ఏకీభవించను. వారి మాటలు నా ఓర్పును కూడ పోగొడుతున్నాయి. రాజకీయ సంస్కరణకు, సాంఘిక సంస్కరణకు ఏమిటి సంబంధమో నాకు అర్థం కావడంలేదు. మన వితంతువులు

అవివాహితులుగా ఉండిపోతున్నారు. కాబట్టి, ఇతర దేశాలలో కంటే మనదేశంలో ఆడపిల్లలకు ముందుగా వివాహాలు జరుగుతున్నాయి. కాబట్టి మన భార్యలు, కుమార్తెలు మనతోపాటు వీధులలో షికార్లు కొట్టరు కాబట్టి, ఆక్సుఫర్డుకో, కేంబ్రిడ్జికో మన అమ్మాయిలను పంపించం కాబట్టి మనం రాజకీయ సంస్కరణకు అర్హులం కాదంటారా? (హర్ష ధ్వానాలు)"

## పీష్వాల పరిపాలనలో అస్పృశ్యుల అగచాట్లు

రాజకీయ సంస్కరణ కోసం శ్రీ బెనర్జీ వాదం అలా నడిచింది. విజయం కాంగ్రెసును వరించడం పట్ల చాలామంది హర్షించారు. అయితే, సాంఘిక సంస్కరణలో విశ్వాసం ఉన్న వాళ్ళను కొన్ని అనుమానాలు బాధించవా? శ్రీ బెనర్జీ చేసిన వాదం సవ్యమైనదేనా? అదే తిరుగులేని తుది మాటా? దీనినిబట్టి విజయం ధర్మపక్షాన్నే వరించిందని అనుకోవచ్చునా? రాజకీయ సంస్కరణకు సాంఘిక సంస్కరణతో ప్రమేయం లేదని ఇది పూర్తిగా ధృవపరుస్తున్నదా? ఈ రకమైన ప్రశ్నలు అనేకం సాంఘిక సంస్కరణాభిలాషుల్ని బాధిస్తాయి. ఈ సమస్యను మనం బాగా అర్థంచేసుకోవడానికి నేను రెండవ ప్రక్క దృక్పథాన్ని వివరిస్తాను. నా వాదానికి సంఘంలో అస్పృశ్యులు ఎలా చూడబడుతున్నారు అనే వాస్తవాన్ని ఆధారంగా తీసుకొంటాను.

పీష్వాలు మహారాష్ట్ర దేశాన్ని పరిపాలిస్తున్న రోజులలో పబ్లిక్ వీధులలో హిందువునితో బాటు అస్పృశ్యుడు నడవ కూడదు. అస్పృశ్యుని నీడ కూడ హిందువుని మైలపరచగలదు.

హిందువులు పొరపాటున అయినా తనని ముట్టుకొని మైలపడిపోకుండా, జాగ్రత్తకోసం అస్పృశ్యుడు ఆనవాలుగా తన ముంజేతికి కాని, మెడకు కాని నల్లని నూలు త్రాడును కట్టుకోవలసి ఉంది. పీష్వాల రాజధాని అయిన పూనాలో అస్పృశ్యుడు తన నడుముకు వెనుక ప్రక్క ఒక పొడుగుపాటి చీపురు కట్టుకొని, తన అడుగు జాడలను తుడిచివేసుకొంటూ నడవ వలసి ఉండేది. అస్పృశ్యుడు నడిచినందువల్ల మైలపడిన దారిలో హిందువు నడిచి మైలపడిపోతాడని భయం. పూనాలోనే

అస్పృశ్యుడు తన మెడలో ఒక మట్టిముంత కట్టుకొని బయటికి వెళ్ళవలసి ఉండేది. అతడి ఉమ్మి నేలపై ఎక్కడైనా పడితే, దానిని ఎవ్వడైనా హిందువుడు పొరపాటున త్రొక్కితే, అది ఆ హిందువుణ్ణి మైల పరిచే అవకాశం ఉంది కనుక, ఉమ్మి ముంతలో వేసుకునేందుకు ఆ ఏర్పాటు. పీష్వాల రాజ్యంలో అస్పృశ్యుల పరిస్థితి ఇది.

అదలా ఉంచి ఇటీవలి వాస్తవ పరిస్థితులను, సంఘటనలను గమనించి చూద్దాం. మధ్య ఇండియాలో ఒక అస్పృశ్య కులమైన "బాలాయీ" ప్రజల మీద హిందువులు జరిపే దౌర్జన్యాలను మనం ఇక్కడ ఉదాహరణకు తీసుకోవచ్చు. ఈ విషయంలో "టైమ్స్ ఆఫ్ ఇండియా" పత్రిక 1928 జనవరి నాల్గవ తేదీ సంచికలో ఒక రిపోర్టు పడింది. ఇండోరు సంస్థానంలో, ఇండోరు జిల్లాలోని కనీరియా, బిడోళి, హాఫిసిసి, భిఛోలిమర్దన, మరొక సుమారు పదిహేను ఇతర గ్రామాలకు చెందిన అగ్రవర్ణ హిందువులు అనగా - కలోతాలు, రాజపుత్రులు, బ్రాహ్మణులు - ఆ గ్రామాల పటేళ్ళు (మునసబుల,) పట్వారీలతో సహా - తమ తమ గ్రామాలలోని బాలాయి ప్రజలకు ఒక శ్రీ ముఖం జారీచేసినట్లు ఆ రిపోర్టు తెల్పుతున్నది. ఆ శ్రీముఖం ఏమిటంటే - బాలాయి ప్రజలు (అస్పృశ్యులు) తమతోపాటు తమ మధ్య బ్రతకాలంటే తాము చెప్పిన నియమాలకు బద్ధులై నడుచుకోవాలని. ఆ నియమాలు ఇవి:

1. బాలాయీలు జరీ అంచు కర్గీలను ధరించ కూడదు.
2. రంగు రంగులుగాను, లేక నాజూకు గాను ఉండే అంచులు గల ధోవతులను ధరించకూడదు
3. ఎవరైనా హిందువులు చనిపోతే వెంటనే ఆ వార్తను చని పోయిన వాని బంధువులకు తెలియపర్చాలి- ఆ బంధువులు ఎంత దూరంలో ఉంటున్నా సరే!
4. అన్ని హిందూ వివాహాలకు బాలాయీలు ఊరేగింపుల ముందూ, వివాహ సమయంలోను కూడ డప్పులు వాయించాలి.
5. బాలాయీ స్త్రీలు బంగారు, వెండి నగలు ధరించకూడదు. వాళ్ళు, నాజూకు గౌనులను గాని, జాకెట్లను గాని ధరించకూడదు.

6. బాలాయి స్త్రీలు హిందూ స్త్రీల కానుపులు అన్నిటికీ విధిగా హాజరై సేవచేసి తీరాలి.
7. ప్రతిఫలం కోరకుండా బాలాయీలు హిందువులకు అన్ని పనులూ చేసి తీరాలి. ఏ హిందువుడైనా దయతలచి ఏదైనా ఇస్తే మాత్రం పుచ్చుకోవచ్చు.
8. ఈ షరతులు ప్రకారం బాలాయీ ప్రజలు నడుచుకోడానికి ఇష్టపడక పోతే, వాళ్ళు వెంటనే గ్రామాలను విడిచిపెట్టిపోవాలి.

బాలాయీలు ఈ షరతులను తిరస్కరించారు. దానితో హిందువులు వాళ్ళపై కఠిన చర్యలకు ఉపక్రమించారు. బాలాయీ ప్రజల గ్రామ బావుల నుంచి నీళ్ళు తీసుకు వెళ్లకూడదు. తమ పశువుల్ని మేతకు విడవకూడదు. హిందువుకు చెందని భూమిలో నుంచి నడవ కూడదు. అంటే- బాలాయి వ్యక్తికి చెందిన పొలం చుట్టూ హిందువుల పొలాలు గనుక ఉంటే-అట్టి తన పొలంలోకి వెళ్ళే అవకాశం ఆ బాలాయి వ్యక్తికి లేదన్న మాట! ఈ నిషేధాలు చాలక, బాలాయి వ్యక్తుల పొలాలలోకి హిందువులు తమ పశువుల్ని యధేచ్ఛగా వదల సాగారు.

హిందువులు పెడుతున్న ఈ హింసల నుంచి, ఉపద్రవాల నుంచి తమను కాపాడవలసిందిగా దర్బారుకు బాలాయీలు అర్జీలు పెట్టుకొన్నారు. అయితే సకాలంలో వారికి ఎట్టి సహాయమూ లభించనందువల్ల, హిందువుల హింసాకాండ రోజు రోజుకూ హెచ్చరించడం వల్ల వందలకొలది బాలాయీలు భార్యా బిడ్డలను తీసుకొని తరతరాలుగా తమ పూర్వీకులు నివసించిన తమ మాతృస్థలాన్ని విడిచిపెట్టుకొని ధార్, దేవాన్, బగ్లీ భూపాల్, గ్వాలియర్ మొదలయిన పొరుగు సంస్థానాలలోని గ్రామాలకు వలసపోక తప్పలేదు. అక్కడ వాళ్ళ బ్రతుకులు ఎలా తెల్లవారాయి అనేది ప్రస్తుతానికి వదిలేద్దాం. బాలాయి కులం అస్పృశ్యులు అక్కడి హిందువుల చేతుల్లో పొందిన హింసాకాండ గురించే నేను చెప్పేది.

గుజరాత్‌లోని కవితా గ్రామానికి చెందిన సంఘటన గత సంవత్సరం జరిగినట్టిదే! గ్రామంలోని గవర్నమెంటు స్కూళ్ళలోకి తమ పిల్లల్ని చేర్చుకోవలసిందిగా పట్టు పట్టవద్దని అక్కడి అస్పృశ్యులు హిందువుల అభీష్టాలకు వ్యతిరేకంగా తమ పౌరహక్కులు రక్షించుకోడానికి సాహసించి ఎన్ని బాధలు పడ్డారో ఇక్కడ నేను

వివరించనక్కరలేదు. అదంతా మాకు బాగా తెలుసు. గుజరాత్‌లోని అహమదాబాద్ జిల్లాలోని జాను గ్రామంలో జరిగిన సంఘటన కూడ మీరందరూ ఎరిగిందే. 1935 నవంబరులో కొంచెం కలిగిన కుటుంబాలకు చెందిన అస్పృశ్య స్త్రీలు నీళ్ళు పట్టుకోడానికి కుండలకు బదులు బిందెలను వాడడం మొదలు పెట్టారు. ఈ మార్పు తమ హోదాకు భంగకరమని భావించిన హిందువులు ఆ స్త్రీలపై దౌర్జన్యం జరిపారు. ఇలాంటి సంఘటనే ఒకటి ఈ మధ్య జయపూర్ సంస్థానంలోని చక్వారా గ్రామంలో జరిగినట్టు పత్రికా వార్తల వల్ల తెలుస్తున్నది.

ఆ గ్రామానికి చెందిన ఒక అస్పృశ్యుడు యాత్ర చేసుకొని తిరిగివచ్చి ఆ గ్రామంలోని తన తోడి అస్పృశ్యులకు మత విషయకమైన ఒక విందు ఏర్పాటు చేశాడు. విందు కొంచెం బాగా చేద్దాం అనుకున్నాడు. విందులో వడ్డించిన వివిధ పదార్థాలలో నేయి ఒకటి. భోజనం వడ్డించబడింది. అతిథు లందరూ తినడం ప్రారంభించారు. అంతలోనే ఆ గ్రామానికి చెందిన హిందువులు వందలమంది హఠాత్తుగా ఆ విందు పార్టీని ముట్టడించి, విందారగిస్తున్న అస్పృశ్యులపై బడి, అందినంత మందిని చావమోది, ఆహార పదార్థాలను చిందర వందర చేసి, నానా బీభత్సమూ చేసివేశారు. అమాయకంగా అన్నాలు తింటున్న అసహాయులైన అస్పృశ్యుల మీదకు ఇంతటి దౌర్జన్యంగా దండెత్తడం ఎందుకు జరిగినట్టు? అందుకు హిందువులు చెప్పిన కారణం ఒకే ఒకటి, ఆ విందులో నేయి ఉపయోగించ బడడం!

అస్పృశుడైన వ్యక్తి విందులో నేయి వడ్డించడం! అస్పృశ్యులు దానిని తినడం! అస్పృశ్యులు నేతిని వాడడం గర్వపోతుతనాన్ని ప్రదర్శించడం అట! అది హిందువుల దర్జా హోదాలకు భంగకరమట! అదే హిందువులు జరిపిన అంతటి అఘాయిత్యానికి కారణం. నేయి కలవాడు తినే, భోగబోజ్యం కావచ్చు. కాని అది ఉన్నతస్థాయికి సూచకం అని ఎవరంటారు? అంటే అస్పృశ్యుడు తాను కొనుక్కోగల శక్తి ఉన్నాసరే, నేతిని ఉపయోగించడం అహంకార సూచక మన్నమాట! ఆహారంలో నేతిని వాడుకొనే ప్రత్యేక హక్కు గల హిందువుని పట్ల ఘోరమైన అపరాధం చెయ్యడం అన్న మాట! ఈ సంఘటన 1936 ఏప్రిల్ 1వ తేదీ ప్రాంతంలో జరిగింది.

## ఒక వర్గాన్ని పాలించే అధికారం, మరొక వర్గానికి ఎక్కడిది?

ఈ సంఘటన లన్నింటినీ పేర్కొన్న తరువాత, ఇప్పుడు సాంఘిక సంస్కరణకు ఎందుకు ప్రాధాన్యం ఇవ్వాలో మనవి చేస్తాను. ఈ విషయంలో శ్రీ బెనర్జీ ప్రతిపాదించిన వాద పద్ధతినే నేను చాలా వరకు అనుసరిస్తాను. అదే ధోరణిలో నేను రాజకీయ మనస్కులైన హిందువులను ప్రశ్నలు అడుగుతున్నాను. అస్పృశ్యుల వంటి అత్యధిక సంఖ్యాకులైన మీ స్వంత దేశీయుల్ని ప్రభుత్వ పాఠశాలలలోకి మీరు రానివ్వడం లేదుకదా! అయినప్పటికి కూడా, మీరు రాజకీయ అధికారాన్ని పొందడానికి అర్హులేనా? ప్రభుత్వ బావుల నుంచి అస్పృశ్యులు నీళ్ళు తోడుకోడానికి మీరు అనుమతించడం లేదు. అయినప్పటికీ కూడ, మీరు రాజకీయ అధికారాలకు అర్హులేనా? పబ్లిక్ వీధులలో అస్పృశ్యులు నడవడానికి మీరు ఇష్టపడడం లేదు! అయినప్పటికి కూడా, మీరు రాజకీయ అధికారాలకు అర్హులేనా? అస్పృశ్యులు తమ ఇష్టం వచ్చిన దుస్తులను, నగలను ధరించడానికి మీరు ఒప్పుకోవడం లేదు. అయినప్పటికీ మీరు రాజకీయాధికారానికి అర్హులేనా? అస్పృశ్యులు తమకు నచ్చిన తిండిని తాము తినడాన్ని కూడ మీరు ఓర్చుకోవడం లేదు. అయినప్పటికీ మీరు రాజకీయాధికారానికి అర్హులేనా?

ఈ విధమైన ప్రశ్నలను ఎన్నిటినైనా నేను అడగ గలను, కాని ఇవి చాలు. అయితే ఏ ప్రశ్నలకు శ్రీ బెనర్జీ ఏమి సమాధానం ఇచ్చి ఉండేవాడో! వివేకం గల ఏ మనిషీ కూడా "అర్హులే" అని జవాబు ఇవ్వడానికి సాహసిస్తాడని నే ననుకోను. ఒక దేశాన్ని పరిపాలించే అర్హత మరొక దేశానికి లేదనే "మిల్లు " దొర సిద్ధాంతాన్ని పదే పదే వల్లించే ప్రతీ కాంగ్రెసు వ్యక్తీ, ఒక వర్గం ప్రజల్ని అణగ ద్రొక్కి ఉంచే అధికారం మరొక వర్గానికి లేదనే విషయాన్నీ అంగీకరించి తీరాలి.

అయితే మరి సాంఘిక సంస్కరణల పార్టీ లక్ష్యం ఎందుకు వీగి పోయి నట్టు? అది ఎందుకు ఓడి పోయిందో సరిగా అర్థం చేసుకోవాలంటే, అది వాంఛించిన సాంఘిక సంస్కరణ స్వరూపం ఎలాంటిదో పరిశీలించవలసి ఉంది. సాంఘిక సంస్కరణను రెండు విభాగాలుగా మనం గుర్తించవలసి ఉంది. అందులో ఒకటి హిందూ కుటుంబానికి చెందినది. రెండోది హిందూ సమాజాన్ని సంస్కరించి

పునర్వ్యవస్థీకృతం  చెయ్యవలసిన అగత్యానికి చెందినది. హిందూ కుటుంబాన్ని సంస్కరించడ మంటే వితంతు వివాహాలు చెయ్యడం, బాల్య వివాహాలు మానడం మొదలయి నట్టివి. హిందూ సమాజాన్ని సంస్కరించడం అంటే ముఖ్యంగా కుల వ్యవస్థను నిర్మూలించాలన్న అవసరాన్ని వారు గుర్తించరు. గుర్తించినా, అందుకొరకు ఆందోళన చేసే ధైర్యం వారికి లేదు. సహజంగా తమకు మాత్రమే సంబంధించిన సమస్యలు వారి కెక్కువ ముఖ్యం. అవి వారిలో ప్రబలివున్న నిర్బంధ వైధవ్యం, బాల్య వివాహాలు వంటి దురాచారాలను నిర్మూలించడం వంటివి. హిందూ సమాజాన్ని సంస్కరించడానికి వారు నడుంకట్టి ముందుకు రారు. అందుచేత, వారి పోరాటం కుటుంబ సంస్కరణకు మాత్రమే  పరిమితమైంది. సంఘ సంస్కరణ అంటే కుల వ్యవస్థను నిర్మూలించడం అన్న భావమే వారికి లేకపోయింది. అందువల్లనే సంఘ సంస్కరణల పార్టీ వీగి పోయింది.

సాంఘిక సంస్కరణను దిగద్రొక్కి, రాజకీయ సంస్కరణ ముందడుగు వేసిందన్న యధార్థాన్ని ఎవ్వరూ కాదనరు. అది నిజమైన పురోగమనం కాదని నే నెంత వాదించినా, జరిగిన దానిని తిరగతోడడం సాధ్యం కాదనే విషయం కూడ నాకు తెలుసు. అయితే, ఈ వాదానికి విలువ మాత్రం ఉంది. సంఘసంస్కరణ వాదులు ఎందుకు అపజయం పొందారో అది వివరిస్తుంది. సాంఘిక సంస్కరణ అంటే కేవలం కుటుంబ సంస్కరణ అని అనుకున్నప్పుడు, రాజకీయ పక్షం సాధించిన విజయం చాలా స్వల్పమైంది. ఈ దృష్ట్యా చూస్తే, రాజకీయ సంస్కరణకు ముందుగా సంఘ సంస్కరణ జరగనక్కర లేదనే వాదం ఒక విధంగా అంగీకార యోగ్యం కావచ్చు. నిజానికి సాంఘిక సంస్కరణ అంటే సమాజ పునర్నిర్మాణమనీ, అట్టి సమాజ పునర్నిర్మాణానికే ముందు ప్రాముఖ్యం ఇవ్వాలి గాని దానికి ముందు రాజకీయ సంస్కరణను చేబట్టడం వాంఛనీయం కాదనీ చెప్పే నా ప్రతిపాదనను ఎవ్వరూ కాదనలేరు. రాజ్యాంగ చట్టాలను రూపొందించే నాయకులు సాంఘిక శక్తులను దృష్టిలో ఉంచుకొనక తప్పదని కారల్ మార్క్సుకు మిత్రుడు, సహచరుడు అయిన ఫెర్డినాండ్ లాస్సెలీ వంటి ధీశాలి కూడ ఉద్ఘాటించి ఉన్నాడు. 1862 లో ఒక ప్రష్యను ప్రజల సమావేశంలో మాట్లాడుతూ శ్రీ లాస్సెలీ ఇలా అన్నాడు:

"రాజ్యాంగ సంబంధమైన ప్రశ్నలు ప్రాథమికంగా ధర్మానికి సంబంధించినవి కావు. అవి బలానికి సంబంధించినట్టివి. ఒక దేశపు వాస్తవిక రాజ్యాంగం ఆ దేశపు శక్తి యొక్క వాస్తవ పరిస్థితిపై ఆధారపడి ఉంటుంది. కాగా, రాజకీయ సంవిధానాలు సమాజంలో అమలులోవున్న శకుల యొక్క వాస్తవ పరిస్థితులను సిసలుగా వ్యక్తీకరించి నప్పుడే వాటికి విలువ, శాశ్వతస్థాయి సిద్ధిస్తాయి."

అయితే, దీనికి మనం ప్రష్యా వరకు వెళ్ళనక్కర లేదు. మన దేశంలోనే అందుకు సాక్ష్యాధారం ఉంది. కమ్యూనల్ అవార్డులోని విశిష్టత ఏమిటి? రాజకీయ అధికారాన్ని నిర్దిష్ట శాతాలలో వివిధ వర్గాలకు, మతాలకు పంచడంలోగల అర్థం ఏమిటి? నా దృష్టిలో దీని విశిష్టత ఇది - సాంఘిక వ్యవస్థను రాజకీయ సంవిధానం ఎల్లప్పుడూ దృష్టిలో ఉంచుకోక తప్పదు. ఇండియాలో రాజకీయ సమస్యకు సాంఘిక సమస్యతో ఏమీ సంబంధం లేదని వాదించే రాజకీయ నాయకులు ఇప్పుడు రాజ్యాంగ నిర్మాణంలో సాంఘిక సమస్య ప్రాముఖ్యాన్ని తప్పని సరిగా గుర్తించవలసివచ్చినట్లు దీనివల్ల రుజువు అవుతున్నది. వాస్తవానికి - సాంఘిక సంస్కరణపట్ల వారు చూపిన ఉపేక్ష, నిర్లక్ష్యం తెచ్చి పెట్టిన ప్రతిఫలమే ఈ కమ్యూనల్ అవార్డు అనవచ్చు. సాంఘిక సంస్కరణల పోరాటానికి ఇది ఒక గొప్ప విజయం. ఆనాడు అపజయం పొందినప్పటికీ సాంఘిక సంస్కరణ అవశ్యం అప్రతిహత మైనట్టిదే అని ఈ అవార్డు రుజువు చేస్తున్నది. చాలామంది ఈ పర్యవసానాన్ని అంగీకరించరని నాకు తెలుసు. కమ్యూనల్ అవార్డు కృత్రిమ మైనట్టిదనీ, అది మైనారిటీలకు నిరంకుశ ప్రభుత్వానికీ మధ్యగల అపవిత్ర స్నేహ సంబంధాల ఫలిత మనీ చాలామంది అనుకొంటున్న మాట నిజమే! అలా అనుకోవడంలో వారికి ఒక విధమైన ఆత్మ తృప్తి ఉంటుంది, అంతే.

## రాజకీయ విప్లవానికి ముందు, సాంఘిక విప్లవం జరగాలి!

నా వాదనలకు ఉపబలకంగా కమ్యూనల్ అవార్డు ఉదాహరణ చాలదని అంటే, దాన్ని అలా వదిలేద్దాం. ఐర్లాండు కేసి ఒకసారి దృష్టిని మరల్చుదాం. ఐరిష్ హోమ్‌రూల్ చరిత్ర మనకు చెపుతున్న గుణపాఠం ఏమిటి? దక్షిణ ఐర్లాండు ప్రతినిధులకు, అల్‌స్టర్ ప్రతినిధులకు మధ్య సంప్రదింపులు జరుగుతున్నప్పుడు దక్షిణ ఐర్లాండు ప్రతినిధి శ్రీ రెడ్‌మాండ్ అనే ఆయన, మొత్తం ఐర్లాండు అంతటికీ

చెందిన హోమ్‌రూల్ సంవిధానంలోకి ఆల్‌ష్టర్‌ను తీసుకువచ్చే నిమిత్తం, ఆల్‌ష్టర్ ప్రతినిధులతో "మీకిష్టమైన రాజకీయ రక్షణలను ఎలాంటివైనా సరే కోరుకొనండి అవి మీకు ఇవ్వబడగలవు" అని అన్నాడు. అందుకు జవాబుగా ఆల్‌ష్టర్ ప్రతినిధులు ఏమన్నారు? "వెధవ రాజకీయ రక్షణలు! అసలు ఏ షరతుల మీదనైనా సరే, మీచే పరిపాలించ బడడానికి మేం చచ్చినా అంగీకరించం" అన్నారు. ఆల్‌ష్టర్ ప్రజలు ప్రదర్శించిన వైఖరిని ఇండియలో మైనారిటీ ప్రజలు ప్రదర్శించి ఉంటే, ఇక్కడ మెజారిటీ ప్రజల రాజకీయ లక్ష్యాల గతి ఏమై ఉండేదో ఆలోచించండి. వట్టినే మైనారిటీలను నిందించడం వల్ల ప్రయోజనం లేదు.

ఐరిష్ హోమ్ రూల్ పట్ల ఆల్‌ష్టర్ ప్రజల వైఖరితో పోల్చి చూస్తే, ఇక్కడ మన మైనారిటీల వైఖరి ఉదాత్తంగా లేదా! ఏవో కొన్ని రక్షణలతో తృప్తిపడి, ఏమాత్రమూ రాజకీయ విజ్ఞత కనబరచని మెజారిటీ పరిపాలన క్రింద తాము ఉండడానికి అంగీకరించిన మైనారిటీల విశాల దృక్పథానికి ఏమీ విలువ లేదా! సరే, అది అలా ఉంచండి. ముఖ్యమైన విషయం అదికాదు. ఆల్‌ష్టర్ ప్రజలు అటువంటి వైఖరిని ఎందుకు ప్రదర్శించారనేది ముఖ్య ప్రశ్న. దానికి జవాబు ఒకటే. ఆల్‌ష్టరుకూ, దక్షిణ ఐర్లాండుకూ మధ్య సాంఘిక సమస్య ఒకటి వుంది. కేతలిక్‌లకు, ప్రోటస్టెంట్లకు నడుమ ఉన్న సమస్య అది. వాస్తవంగా అది ఒక కుల సమస్యే, ఐర్లాండులో "హోం రూల్" అంటే "రోం రూల్" అనే ఆల్‌ష్టరు ప్రజల ఉద్దేశం. అదే కారణం వారలా జవాబు చెప్పడానికి. కేతలిక్కులకు, ప్రోటెస్టెంట్లకు మధ్యగల కుల సంబంధమైన సాంఘిక సమస్యే అక్కడి రాజకీయ సమస్య పరిష్కారానికి అడ్డు తగిలింది. అయితే, అక్కడ కూడా సామ్రాజ్యవాదుల కుతంత్రం పనిచేసిందని మీరనవచ్చు. పోనీ, ఐర్లాండు ఉదాహరణను కూడ ఒక ప్రక్కన పెట్టివేద్దాం.

రోమ్ చరిత్ర నుంచి మీకు మరొక సాక్ష్యాన్ని ఉదహరిస్తాను. ఇక్కడ కూడా దుష్టశక్తులు ఏవో పనిచేశాయని చెప్పడానికి వీలులేని ఉదాహరణ ఇది.

రోమ్ యొక్క రిపబ్లికన్ సంవిధానంలో నేటి మన కమ్యూనల్ అవార్డు యొక్క లక్షణాలు ఎక్కువగా కల వన్న విషయం రోమ్ చరిత్రను చదువుకొన్న ఎవరికైనా సరే ఇట్టే తెలుస్తుంది. రోంలో రాజరిక (రాజుపాలన) పద్ధతి రద్దు చేయ

బడ్డప్పుడు, రాజ్యాధికారం కాన్‌షల్సుకు, పాంటీఫెక్సు మెక్సిమాక్సుకు మధ్య విభజింపబడింది. రాజుకు ల మత ప్రమేయ రహితమైన అధికారం కాన్‌షల్సు పరమైంది. రాజుయొక్క మత ధికారం మొక్సిమాక్సుకు సంక్రమించింది. మతాతీత అధికారానికి చెందిన కాన్‌షల్స్‌కు, ఇద్దరిలోను వొకరు పెట్రిషియన్ గాను, రెండవవారు ప్లెబియన్‌గాను ఉండాలనీ, మతాధికారానికి చెందని మొక్సిమాక్సు క్రింది ఉండే మతాచార్యులలో సగం మంది పెట్రిషియన్‌లుగాను, తక్కిన సంగం మంది ప్లెబియన్‌లుగాను ఉండాలనీ సంవిధానంలో నిబంధించబడింది. నేటి మన కమ్యూనల్ అవార్డులో ఉన్న నిబంధనల వంటి నిబంధనలనే రోమ్ రిపబ్లిక్ సంవిధానం ఎందుకు ఏర్పాటు చేసుకోవలసి వచ్చింది? దానికి వొక్కటే సమాధానం. రోమ్‌లో సమాజం పెట్రిషియనులు, ప్లెబియనులు అనే రెండు స్పష్టమైన కులాలుగా (శాఖలుగా) ఏర్పడి ఉన్నారు. ఆ రెండు కులాలకు మధ్యగల సాంఘిక విభేదాలను గుర్తించవలసిన అగత్యం రోమ్ రిపబ్లికన్ సంవిధానానికి కల్గింది. ఒక మాటలో చెప్పాలంటే -- రాజకీయ సంస్కరణ వాదులు ఏదిక్కుకు చూచినా, గమనించదగ్గ విషయం ఒక్కటే! దేశానికి ఒక రాజకీయ సంవిధానం రూపొందించవలసి వచ్చినప్పుడు, అప్పటికి అమలులో వున్న సాంఘిక వ్యవస్థకు సంబంధించిన సమస్యలను ఎవరూ విస్మరించలేదు.

రాజకీయ సంవిధానాలపై మత, సాంఘిక సమస్యలు ఎక్కువ ప్రభావం కలిగి ఉంటాయనే నా వాదనకు ఉపబలంగా ఇప్పుడు నే నిచ్చిన ఉదాహరణలు మరీ ప్రత్యేకమై నట్టివిగా కన్పించవచ్చు బహుశ అలాగే కావచ్చు. అయితే అంత మాత్రం చేత వాటి అన్యోన్య ప్రభావం పరిమితం అని అనుకోకూడదు. చరిత్రను మనం పరిశీలించి చూచినట్లయితే రాజకీయ విప్లవాల ముందు, వాటికి మార్గదర్శక మన్నట్టు మత, సాంఘిక విప్లవాలు జరుగుతూనే వచ్చినై. మార్టిన్ లూథర్ ప్రారంభించిన మత సంస్కరణోద్యమం ఐరోపా ప్రజల రాజకీయ విమోచనకు నాంది అయింది. ఇంగ్లాండులో ప్యూరిటానిజం రాజకీయ స్వాతంత్ర్య సంస్థాపనకు దారి తీసింది. ప్యూరిటానిజం (క్రైస్తవ మతంలో మత పారిశుద్ధ్యాన్ని ప్రతిపాదించే ఒక శాఖ) నూతన ప్రపంచ స్థాపనకు నాంది అయింది. అమెరికా స్వాతంత్ర్య సమరాన్ని గెలిచినట్టిది ప్యూరిటానిజమే. ప్యూరిటానిజం ఒక మతోద్యమం.

ముస్లిం సామ్రాజ్యం విషయంలో కూడ ఇలాగే జరిగింది. మహమ్మద్ ప్రవక్త ప్రారంభించిన మత విప్లవంలో సమగ్ర పరిస్నాతులైన తరువాతనే అరబ్బులు ఒక రాజకీయ శక్తిగా సంఘటితులు కాగలిగారు. హిందూదేశ చరిత్రకూడ ఇందుకు భిన్నం ఏమీ కాదు. చంద్రగుప్తుడు నడిపించిన రాజకీయ విప్లవానికి బుద్ధుడు ఆవిష్కరించిన మత సాంఘిక విప్లవం పురోగామి అయింది. శివాజీ నడిపించిన రాజకీయ విప్లవానికి ముందు మహారాష్ట్ర భక్తవరేణ్యు లెందరో మత, సాంఘిక రంగాలలో సంస్కరణ కృషి చేసి ఉన్నారు. సిక్కులు నడిపించిన రాజకీయ విప్లవం ఎంతో వుంది. ఇలా ఎన్నైనా చూడవచ్చు. ఏ జాతి ప్రజల విషయంలోనైనా రాజకీయ వికాసానికి ముందుగా మానసిక విమోచనం ఆత్మోత్తేజనం, జరుగవలసి వుంటుందనడానికి ఈ ఉదాహరణలు చాలు.

## సోషలిష్టు భ్రమలు, అయోమయ విధానాలు

ఇప్పుడు సోషలిస్టుల సంగతి ఏమిటో చూద్దాం. సాంఘిక పద్ధతికి (సోషల్ ఆర్డరుకు) సంబంధించిన సమస్యలను సోషలిస్టులు ఉపేక్షించి ఊరుకోగలరా? ఇండియాలోని సోషలిస్టులు ఐరోపాలోని తమ సహచరులను అనుసరిస్తూ, చరిత్రయొక్క ఆర్థిక దృక్పథాన్ని ఇండియాలోని వాస్తవ పరిస్థితులకు వర్తింపజేయ జూస్తున్నారు. మానవుడు ఆర్థిక జీవి అనీ, అతని చర్యలూ, ఆశలూ ఆర్థిక స్థితిగతులను అనుసరించి ఉంటాయనీ, అధికారానికి ఆధారం ఆస్తి ఒకటేననీ వారు ఉద్ఘాటిస్తూ ఉంటారు. వారి దృష్టిలో రాజకీయ సాంఘిక సంస్కరణలు వట్టి భ్రాంతులు. ఆస్తిని సమంగా విభజించడం ద్వారా ఆర్థిక సంస్కరణను సాధించడమే ఏ ఇతర సంస్కరణల కంటే కూడ ముందుగా జరగాలన్న సిద్ధాంతం ప్రాతిపదికగా సోషలిస్టులు చేసే ప్రతీ వాదనా విమర్శనీయమే. మానవుని ప్రవర్తనకు ఆర్థిక కారణం ఒక్కటే మూలభూతం కాదు. అధికారం అంటే ఆర్థికాధికారం ఒక్కటే అనే సిద్ధాంతాన్ని మానవ సమాజ చరిత్ర పరిశోధనకు లెవ్వరూ అంగీకరించరు. వ్యక్తికి వుండే సాంఘిక స్థాయి ఒక్కటి మాత్రమే హోదాకు, అధికారానికీ మూలాధారం కాగలదు. సామాన్య మానవుడి మీద మహాత్ములు చలాయిస్తున్న ప్రభావమే ఇందుకు నిదర్శనం. ఇండియాలో పైసా లేని సాధువులకు, పకీరులకు కోటీశ్వరులైన వాళ్ళు విధేయులై ఉంటారెందుకు?

ఇండియాలోని కోట్లకొలది దరిద్రులు తమ కున్న చిల్లర మల్లర వస్తువులన్నీ అమ్ముకొని కాశీకీ, మాక్కాకూ పోతున్నా రెందుకు! మతం సమస్తాధికారాలకు మూలాధారం అనే సత్యం ఇండియా చరిత్ర సదా నిరూపిస్తూనే వుంది. సామాన్య మానవుడి మీద మేజిస్ట్రేటు కంటే కూడా మతాచార్యుడు ఎక్కువ అధికారాన్ని చెలాయించ గలిగిన ఇండియాలో మతమే అధికారానికి మూలభూతం అనేది సర్వవిదితం. ఇక్కడ సమ్మెలు ఎన్నికలు వంటివి కూడ క్షణంలో మతావేశానికి దారితీస్తాయి. ఇట్టే మత సమస్యలుగా పరిణమిస్తాయి.

మానవుడి మీద మతానికి ఎంతటి ప్రభావం ఉన్నదో తెలపడానికి మరొక ఉదాహరణ - రోమ్‌లోని ప్లెబియనుల ఉదంతం ఈ విషయంలో సమగ్రావగాహనకు చాల తోడ్పడుతుంది. రోమన్ రిపబ్లిక్‌లోని ఉన్నత కార్యవర్గంలో ప్రాతినిధ్యం కోసం ప్లెబియన్లు పోరాటం సాగించి, చివరకు విజయం సాధించారు. ప్లెబియనుల అసెంబ్లీ అయిన "కమిష్యా చెంచూరియేటా" చే నిర్మాణమైన ప్రత్యేక నియోజక వర్గం ద్వారా ఎన్నుకోబడిన ప్లెబియన్ కాన్సల్ (అధికార ప్రతినిధి) యొక్క నియామకాన్ని వారు సాధించారు. తమ కోసం ప్రత్యేక కాన్సల్‌ను వారు కోరడానికి కారణం - పరిపాలనా నిర్వహణలో ప్లెబియన్‌లకు వ్యతిరేకంగా పాట్రిషియను కాన్సలులు విచక్షణ చూపుతున్నారన్నదే. రోమ్‌యొక్క రిపబ్లికన్ సంవిధానం ప్రకారం ఒక కాన్సలు మరియొక కాన్సలు చేసిన పనిని వీటో (రద్దు) చేసే అధికారం ఉంది. కనుక ఈ ప్రత్యేక ప్రాతినిధ్యం వల్ల ప్లెబియన్‌లకు ఎంతో మేలు చేకూరినట్టే కనబడుతుంది. కాని నిజానికి వారికి ఎలాంటి మేలైన చేకూరిందా?

లేదనేదే ఈ ప్రశ్నకు జవాబు. ఎందువల్లనంటే - బలమైన వ్యక్తిత్వం గలవాడు - నాట్రిషియన్ కాన్సలును కాదని స్వతంత్రంగా వ్యవహరించగలవాడు. - అయిన ప్లెబియన్లకు ఇవ్వబడిన ప్రత్యేక నియోజక వర్గం ద్వారానే ఎన్నిక జరుగుతుంది కనుక ఒక బలమైన కాన్షలు ప్లెబియనులకు సహజంగా లభించవలసే ఉంది. మరి అలా ఎందుకు లభించ లేదన్నదే మన ప్రశ్న. మానవుల మనస్సులపై మతం ఎలాంటి ప్రభావాన్ని చెలాయిస్తుందో ఈ ప్రశ్నకు జవాబు మనకు వెల్లడిస్తున్నది. రోమ్‌లో ఒక ఆచార మున్నది. రోమన్ ప్రజలంతా ఆమోదించి అనుసరిస్తున్న

ఆచారమది. దాని ప్రకారం - రోమ్‌లో ఏ అధికారి కూడా, అతడు దేవతలకు అంగీకార యోగ్యుడే అని, డెల్ఫీ దేవతా వాణి (ఓరకిల్ ఆఫ్ డెల్ఫి) ప్రకటిస్తేనే తప్ప తన ఉద్యోగ నిర్వహణకు పూనుకో కూడదు. డెల్ఫీ దేవత గుడిలోని మతాచార్యులందరూ పెట్రిషియన్‌లే. అందువల్ల బలమైన పార్టీవ్యక్తిగా పెట్రిషయన్‌లకు వ్యతిరేకంగా -- అంటే ఇప్పుడు ఇండియాలో వాడుకలో ఉన్నమాటలో చెప్పాలంటే కమ్యూనల్ దృష్టికల ఏవ్యక్తినైనా - ప్లెబియనులు తమ కాన్సలుగా ఎన్నుకోవడం జరిగినప్పుడెల్లా అతడు దేవతకు ఇష్టుడు కాడని దేవతావాణి ప్రకటిస్తూ ఉండేది. తమకు సంక్రమించిన హక్కుల్ని అనుభవించకుండా ప్లెబియన్‌లు ఈ విధంగా మోసగించబడేవారు.

అయితే ఇక్కడ మనం గమనించవలసిన విశేషం ఏమిటంటే తాము అలా మోసగించబడడానికి తామే కారణం కావడం. ఎందుకంటే ఒక అధికార పదవిని స్వీకరించడానికి కేవలం ప్రజలచేత ఎన్నుకోబడటం చాలదనీ, దేవత ఆమోదముద్ర అందుకు తప్పనిసరిగా ఉండాలనీ ఆ పెట్రీషియన్ల వలెనే ప్లెబియనులు కూడ గాఢంగా నమ్మారు. ఎన్నిక ఒక్కటి చాలుననీ, దేవత అనుమతి అక్కర లేదనీ ప్లెబియనులు వాదించి ఉన్నట్లయితే వారు సంపాదించుకున్న రాజకీయ హక్కు ద్వారా సంపూర్ణ లాభాన్ని వారు పొందివుండేవారు. అయితే, వారు అలా చేయలేదు. ఒక బలమైన నాయకుణ్ణి దేవత నిరాకరిస్తే మళ్ళీ ఎన్నిక జరిపి దేవతకు అనుకూలుడైన మరొకణ్ని, అంటే - పెట్రిషియనులకు అనుకూలుడైన వాణ్ని, తమ కంతగా అనుకూలుడు కానివాణ్ని ఎన్నుకొనేవారు. మతాన్ని వదులుకోలేక, ప్లెబియనులు తాము ఎంతో పోరాడి సాధించుకొన్న వాస్తవ లాభాలనే వదిలేసుకొన్నారు. మతం ధనంతో సమానంగా-అంతకంటే అధికంగా కూడ.... శక్తివంతమైనదని, అధికారానికి అదే మూలాధారమనీ ఈ ఉదంతం విశదపరచడం లేదా?

సోషలిస్టుల వాదనలో భ్రమ ఎక్కడ ఉన్నదంటే - ఐరోపాలోని ప్రస్తుత సమాజంలో ఆస్తే అధికారానికి మూలాధారంగా వుంటున్నది కాబట్టి, ఇండియాలో కూడ అలాగే వుంటుందని ఊహిస్తున్నారు. అంతే కాదు. ఐరోపాలో కూడ ప్రస్తుత స్థితే పూర్వం కూడా వుండేదనుకుంటున్నారు. మతం, సాంఘిక స్థాయి, ఆస్తి ఈ మూడు కూడా శక్తికీ, అధికారానికీ మూల కారణాలే. అవి కలిగిన ఏ మనిషి

అయినా సరే – మరొక మనిషి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను తన అధీనంలో ఉంచుకోగలడు. అయితే ఆ మూడింటిలోను ఒకటి ఒక దశలో ప్రాముఖ్యం వహిస్తే, మరొకటి మరొక దశలో ప్రాధాన్యం వహిస్తుంది. అంతే తేడా, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలే లక్ష్యం అయితే – స్వేచ్ఛా స్వాతంత్ర్యాలంటే ఒక మనిషిమీద మరొక మనిషికి గల నియంత్రణాధికారాన్ని నిర్మూలించడమే అయితే – ఆర్థిక సంస్కరణ ఒక్కటే అనుసరించదగినట్టి సంస్కరణ అని భీష్మించ నక్కరలేదు. ఏ ప్రత్యేక సమాజంలో అయినా, ప్రత్యేక కాలంలో అయినా శక్తికీ, అధికారానికీ మూలాధారాలు సంఘమూ, మతమూ అయినప్పుడు–అప్పుడు సంఘసంస్కరణ, మత సంస్కరణ మాత్రమే అత్యవసరంగా జరగవలసిన సంస్కరణలు అని మనం గుర్తించవలసి ఉంటుంది.

ఈ విధంగా చరిత్రకు భారతీయ సోషలిస్టులు ఇచ్చే ఆర్థిక విశదీకరణను, సిద్ధాంతీకరణను ఎవ్వరైనా సరే ఖండించవచ్చు. నిజానికి, ఆస్తి సమాన పంపకం ఒక్కటే సరిఅయిన సంస్కరణ అనీ తక్కిన అన్ని సంస్కరణలకు ముందు ఇది జరగవలసి ఉన్నదనీ సోషలిష్టులు చెప్పాలనుకున్నప్పుడు, అందుకు ఈ ఆర్థిక సిద్ధాంతీకరణను వారు ఆశ్రయించ వలసిన పనిలేదు. ఏది ఏమైనా నేను సోషలిష్టుల్ని అడగదలిచింది ఇది.

## కార్మికవర్గంలో అంతర్విభేదాలు లేవా?

ఇండియాలో సాంఘిక వ్యవస్థలో తగు సంస్కరణను ముందుగా సాధించకుండా ఆర్థిక సంస్కరణను మీరు అమలు జరుపగలరా? ఈ సమస్యను భారతీయ సోషలిస్టులు తిన్నగా పరిశీలించినట్టు లేదు. వారిపై అన్యాయంగా అభియోగం తేవాలని నా ఉద్దేశం కాదు. కొద్ది రోజుల క్రితం నా మిత్రుడికి ఒక ప్రముఖ సోషలిస్టు వ్రాసిన ఒక లేఖలోని ఈ క్రింది వాక్యాలు పరిశీలించండి.

"ఒక వర్గం ఈ విధంగా పీడించబడుతూ అవమానించబడుతూ ఉన్నంతకాలం, ఈ వర్గదౌర్జన్యం నామమాత్రంగా అయినా సమాజంలో ఉన్నంత కాలం ఇండియాలో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు గల సమాజాన్ని నిర్మించగలగడం సాధ్య మౌతుందని నేననుకోను. సోషలిస్టు సిద్ధాంతంలో, లక్ష్యంలో విశ్వాసం కలవాడిని

కనుక-సమాజంలోని వివిధ వర్గాలను, గ్రూపులను సంపూర్ణ సమానత్వంతో చూడాలని నేను విశ్వసిస్తాను. ఈ సమస్యకూ, ఇతర సమస్యలకూ కూడ నిజమైన పరిష్కారాన్ని సోషలిజం ఒక్కటే అందివ్వగలదని నా ఉద్దేశం."

ఇక్కడ నాది ఒక ప్రశ్న ఉంది. "వివిధ వర్గాలను సంపూర్ణ సమానత్వంతో చూడాలనడంలో నాకు విశ్వాసం ఉంది." అని చెప్పినంత మాత్రంచేతనే ఒక సోషలిస్టు బాధ్యత తీరిపోతుందా? వట్టి విశ్వాసం ఉం'డమే చాలు నంటే, అలా అనడం-సోషలిజం అంటే ఏమిటో దాని ఆంతర్యాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేక పోవడమే కాగలదు. సోషలిజం ఒక వాస్తవ కార్య ప్రణాళిక అయితే -అది ఎప్పుడో ఎక్కడో దూరదూరాలలో ఉండే వట్టి ఆదర్శం మాత్రం కాకపోతే-సోషలిస్టులు ఆలోచించవలసిన ప్రశ్న సమానత్వంల తమకు విశ్వాసం ఉన్నదా లేదా అనేది కాదు. సోషలిస్టు అయినవాడు ఆలోచించవలసిన ప్రశ్న ఇది. ఒక వర్గాన్ని మరొక వర్గం ఒక ఆచారంగా ఒక సిద్ధాంతం, క్రింద అవమానించడాన్ని అణగద్రొక్కడాన్ని తాను సహిస్తాడా? నిరంకుశత్వం, అక్రమం, అన్యాయం, హింసా ఒక వర్గాన్నుంచి వేరు చేస్తూ నిత్యమూ విలయతాండవం చేస్తుండడాన్ని ఒప్పుకుంటాడా?

నా ఉద్దేశాన్ని మీకు ఇంకా విపులంగా చెప్పాలంటే సోషలిజాన్ని సాధించడంలో సాధక బాధకాలన్నింటినీ పూర్తిగా వివరించ వలసి ఉంది. సోషలిస్టులు ఉద్దేశించిన ఆర్థిక సంస్కరణ ఎప్పుడు ఎలా సాధ్యపడుతుంది? విప్లవం ద్వారా అధికారాన్ని హస్తగతం చేసుకుంటేనే గాని అది సాధ్యం కాదన్నది స్పష్టమే కదా. ఆ అధికారాన్ని చేజిక్కించుకొనేవాళ్ళు కార్మికవర్గం (ప్రొలిటేరియట్) ప్రజలై ఉండాలి. అయితే ఇక్కడ నేను అడిగే మొదటి ప్రశ్న - విప్లవం తేవడానికి ఇండియా లోని కార్మికవర్గం ప్రజలంతా ఏకం అవుతారా? ఆ విప్లవానికి ప్రజల్ని ప్రేరేపించే శక్తి ఏది? నీ దృష్టిలో అట్టి శక్తి ఒక్కటే. అది ఏదంటే-తమతోపాటు విప్లవంలో పాల్గొంటున్న మరొక వ్యక్తిపట్ల సంపూర్ణ విశ్వాసం. తక్కిన విషయాలన్నీ మామూలుగా ఉన్నప్పుడూ-ఒక మనిషి తాను ఏ వ్యక్తితో కలసి విప్లవంలో పాల్గొంటున్నాడో ఆ వ్యక్తి సమానత్వం, సౌభ్రాతృత్వం, అన్నిటినీమించి న్యాయం అనే భావాల సహజ ప్రేరణతో పోరాడగలడనే ప్రగాఢ విశ్వాసం ఆ మనిషికి ఉండవలసి ఉంది. మనుష్యులు కేవలం ఆస్తి సమానత్వం కోసం మాత్రమే విప్లవంలో పాల్గొనరు. విప్లవం సాధించబడిన తరువాత తాము కుల మత విభేదాలు, విచక్షణలు లేకుండా

అందరితో సమాన ప్రతిపత్తితో చూడబడతామని తెలిసినప్పుడే వాళ్లు విప్లవంలో పాల్గొంటారు. విప్లవాన్ని నడిపిస్తున్న సోషలిస్టు తనకు కులవ్యవస్థలో నమ్మకం లేదని ప్రకటించినంత మాత్రాన సరిపోదు. అంతకన్న గాఢవిశ్వాస ప్రేరితమైన హామీ నివ్వాలి. అది ఏమిటంటే - విప్లవ సహచరులలో ఒకరిపట్ల ఒకరికి ఉండవలసిన సమానత్వమూ, సౌభ్రాతృత్వమూ, వీటిపట్ల వారి మనోవైఖరీ. అయితే ఇది ఇండియాలో ఉన్నదా? ఇండియాలో పేదవారయిన కార్మికవర్గం పేద, ధనిక వర్గ భేదాన్ని తప్ప మరే విభేదాలను పాటించరని చెప్పగలమా? ఇండియాలో పేదలైనవారు కుల, మత, నిమ్న ఉన్నత విభేదాలను గుర్తించడమే లేదా? ఇండియాలో పేదలైనవారు స్పష్టంగా కనిపిస్తున్నప్పుడు, వాళ్లంతా కలిసి ధనిక వర్గానికి వ్యతిరేకంగా ఎలా ఏకం కాగలరు? కార్మిక వర్గం అంతా కలిసి ఏకం కాకపోతే, ఏక ముఖంగా పోరాడడానికి ఉద్యమించకపోతే విప్లవం ఎలా రాగలదు? ఇంపైన సమాసాలను, భాషను వాడడంలోనే సోషలిస్టులు తృప్తి పడకుండా, సోషలిజం అనేదాన్ని నిర్దుష్టమైన వాస్తవ రూపంలో సాధించాలనే కోరిక తమకుంటే వారు సాంఘిక సంస్కరణయొక్క ప్రాధాన్యాన్ని గుర్తించక తప్పదు. వేరే మార్గాంతరం లేదు. ఇండియాలో సాంఘిక వ్యవస్థను సోషలిస్టులు ఎదుర్కొనక తప్పదు. అలా ఎదుర్కొనకుండా విప్లవం సాధ్యం కాదు. ఒక వేళ ఏ అదృష్టం వల్లనో అది సాధ్యమైనా, వారి ఆశయాలు నెరవేరాలంటే - సదరు సాంఘిక వ్యవస్థతో సోషలిస్టులు కుస్తీ పట్టక తప్పదు. ఇది నా దృష్టిలో నిర్వివాదమైన సత్యం. విప్లవానికి ముందే కుల వ్యవస్థతో సోషలిస్టులు ఢీకొనకపోతే విప్లవం తరువాత అయినా వారు దానితో తలపడక తప్పదు. మరొక విధంగా చెప్పాలంటే-నీవు ఏ దిక్కుకు తిరిగినా సరే, దాని కడ్డంగా నిలబడే పెనుభూతం కుల వ్యవస్థ. ఈ భూతాన్ని చంపి పారవేస్తే తప్ప నీవు రాజకీయ సంస్కరణగాని, ఆర్థిక సంస్కరణగాని సాధించలేవు.

## శ్రమ విభజన వేరు, కుల వ్యవస్థ వేరు

ఈరోజుల్లో కూడ కుల వ్యవస్థను సమర్థించేవాళ్లుండడం ఒక దురదృష్టం. సమర్థించడం ఎన్నో రకాలు. అందులో ఒకటి-కుల వ్యవస్థను శ్రమ విభజన (పనిని పంచుకునే) పద్ధతితో పోల్చడం. అన్ని నాగరిక సమాజాలలోను శ్రమ విభజన

పద్ధతి అత్యావశ్యకంగా ఉంటున్నది కనుక, అదే రకమైన కులవ్యవస్థ మన సమాజంలో ఉండడం తప్పుకాదని ఈ వాదాన్ని సమర్థించే వాళ్లు అంటున్నారు. ఈ వాదం వాస్తవ విరుద్ధం. కుల వ్యవస్థ శ్రమ విభజనే కాదు. అది శ్రామికుల విభజన కూడా. నాగరిక సమాజానికి శ్రమ విభజన అవసరమే. అయితే శ్రమ విభజనతోపాటు శ్రామికుల విభజన జరగడం, వారి నడుమ అసహజమైన, అలంఘ్యమైన అడ్డుగోడలు కట్టబడడం ఏ నాగరిక సమాజంలోను లేదు. అంతేకాదు. శ్రామికులలోని ఈ విభాగాలు ఒక దానిపై ఒకటి నిమ్నోన్నత కులాల వారీగా నిర్మించబడ్డ వారసత్వపు నిరంకుశత్వం ఇది. శ్రామికులలో శ్రామికులు హెచ్చుతగ్గు తారతమ్యాలతో తరగతులుగా విభజింపబడ్డ ఈ రకమైన పద్ధతి మరి ఏ దేశం లోను లేదు. మరొక విషయం ఏమిటంటే–ఇండియాలోని ఈ కార్మిక విభజన స్వచ్ఛంద మైనట్టిది కాదు. వారి వారి సహజ స్వభావాలను, అభిరుచులను బట్టి చేయబడ్డ విభజన కాదది. సాంఘిక సామర్థ్యాన్ని వ్యక్తిగత సామర్థ్యాన్ని అభివృద్ధి పరచాలంటే ముందుగా తన జీవితమార్గాన్ని తాను ఎన్నుకొని పురోగమించగల సామర్థ్యాన్ని మనం వ్యక్తిలో పెంపొందించాలి. ఈ సూత్రం కుల వ్యవస్థలో పూర్తిగా అతిక్రమించబడింది. స్వభావసిద్ధమైన, సురక్షితమైన, శక్తి సామర్థ్యాలను బట్టి కాక, కేవలం తల్లిదండ్రుల సాంఘిక స్థాయిని బట్టి వ్యక్తులు చేయవలసిన పనులను ముందుగానే నిర్ణయించడం కులవ్యవస్థలోని ముఖ్యోద్దేశం. కులవ్యవస్థలోని ఈ పద్ధతి వ్యక్తులు చేయవలసిన పన్నుల్ని అవలంబించవలసిన వృత్తుల్ని, పుట్టుకను బట్టి ముందే నిర్ణయించడం కులవ్యవస్థలోని ముఖ్యోద్దేశం. కులవ్యవస్థలోని ఈ పద్ధతి వ్యక్తులు చేయవలసిన పనుల్ని అవలంబించవలసిన వృత్తుల్ని, పుట్టుకను బట్టి ముందే నిర్ణయించడం అనే పద్ధతి. మరొక విధంగా కూడ ఇది చాలా వినాశకరమైనట్టిది. ఉదాహరణకు, ఏ పరిశ్రమైనా తీసుకోండి. పరిశ్రమ ఎప్పుడూ ఒకేవిధంగా ఉండేది కాదు. త్వరితగతినీ, ఆకస్మికంగాను మార్పులు ఎన్నో అందులో జరుగుతూ ఉంటాయి. ఆ రకమైన మార్పులను అనుసరించి తమ పనులను, వృత్తులను మార్చుకొనే స్వేచ్ఛ వ్యక్తికి లేనప్పుడు అతడు బ్రతుకుతెరువు చూచుకోవడమే అసాధ్యమవుతుంది. తాము ఏ పనికి తగుదురో, ఏ వృత్తికి సమర్థులో అట్టి పనులను, వృత్తులను చేబట్టే స్వేచ్ఛను హిందువులకు కులవ్యవస్థ అనుమతించడం లేదు. తన కులానికి ప్రత్యేకించబడ్డ

వృత్తిని తప్ప-ఆకలితో మాడి చావనైనా చస్తాడు కాని-మరొక క్రొత్త వృత్తిని హిందువుడు చేపట్టడు. దీనికి కారణం కులవ్యవస్థలోనే మనకు కనిపిస్తుంది. వృత్తులలో పరిస్థితులను బట్టి, శక్తి సామర్థ్యాలను బట్టి సర్దుబాట్లు జరగకుండా అరికట్టడం వల్ల కులవ్యవస్థే దేశంలోని నేటి నిరుద్యోగ సమస్యకు చాలా వరకు ప్రత్యక్ష కారణం అవుతున్నది.

శ్రమ విభజనకు కులవ్యవస్థ ఒక రూపం అన్నప్పుడు, అందులో మరొక పెద్ద లోపం కన్పిస్తుంది. కుల వ్యవస్థ తెచ్చి పెట్టిన శ్రమ విభజనలో వ్యక్తియొక్క ఇష్టా నిష్టాలకు స్థానం లేదు. వ్యక్తిగతమైన అభిరుచికీ స్థానం లేదు. కర్మ సిద్ధాంతంపై అది ఆధారపడింది. సాంఘిక సామర్థ్యం గురించి ఆలోచించినప్పుడు, పారిశ్రామిక వ్యవస్థలో ఉన్న గొప్ప ఇబ్బంది పేదరికం ఒక్కటే కాదు. అందులో పనులు చేస్తున్న చాలామందికి ఆయా పనులపట్ల ఒక రకమైన అసహ్యతను, ద్వేషాన్ని పుట్టిస్తాయనీ, పని ఎగగొట్టే మనస్తత్వం కూడా అందువల్లనే కలుగుతుందనీ మనం గుర్తించక తప్పదు. ఇండియాలో అనేక వృత్తులు హిందువులచే హీనంగా చూడబడడంచేత వాటిని అవలంబించే వారిలో అవి అమితమైన హేయ భావాన్ని కలిగిస్తున్నవి. అటువంటి వృత్తులనుంచి, తప్పించుకోవడానికీ, వాటిని వదులుకోవడానికీ వారు నిరంతరం యత్నిస్తూనే ఉంటారు. ఎందువల్ల? హిందూమతం ఆ వృత్తుల మీద చల్లిన మురికి అంత అసహ్యకరమైంది కావడం వల్ల.

హిందూమతం ఆ వృత్తులకు ఆపాదించిన నీచత్వం, న్యూనత కారణంగా వాటి అవలంబకులలో కలిగే నైరాశ్యం, నిస్పృహ ఈ పరిస్థితికి కారణం. పనిచేసేవాళ్ల మనస్సులు, హృదయాలు ఆయా పనులలో లగ్నం కాకపోయినప్పుడు ఒక సామర్థ్యం ఎక్కడ నుంచి వస్తుంది? అందువల్ల ఒక ఆర్థిక వ్యవస్థగా కుల వ్యవస్థగా ఎంతో హానికరమైన సంస్థ అని చెప్పాలి. ఎందుకంటే అది మానవుని సహజశక్తులను, అభిలాషలను అణచివేసి సంఘ సూత్రాల వెర్రితలలకు లోను చేస్తున్నది కనుక.

## ఒకే ప్రాంతం బ్రాహ్మణుడు, అస్పృశ్యుడు ఒక రక్త సంబంధీకులే!

కులవ్యవస్థ రక్షణార్థం కొందరు జీవశాస్త్రాధారమైన ఒక మహా కందకాన్ని నిర్మించారు. వాళ్ళు చెప్పే దేమిటంటే - జాతి యొక్క రక్తం యొక్క స్వచ్ఛతను

కాపాడటం కోసం కులవ్యవస్థ ఏర్పాటు చేయబడిందని. ఈ వాదం ఎంత హాస్యాస్పదమో ఎత్నాలజిస్టులు (నరసంతతి శాస్త్రజ్ఞులు) చెప్పేదాన్ని గమనిస్తే తెలుస్తుంది. ప్రపంచంలో ఎక్కడా కూడా స్వచ్ఛమైన జాతికి (రేసుకు) చెందిన మనుష్యులు లేరనీ, ప్రపంచంలోని ఏ మూల చూచినా అన్ని జాతులలోనూ సాంకర్యం జరుగుతూనే వచ్చిందనీ ఈ శాస్త్రజ్ఞులు చెప్పుతున్నారు. ముఖ్యంగా ఇండియాలోని ప్రజల విషయంలో ఇది పరమయథార్థం. శ్రీ డి. ఆర్. భండార్కర్ తన "హిందూ జనాభాలో విదేశీ బీజాలు" అనే వ్యాసంలో ఇలా అన్నాడు :

ఇండియాలో విదేశీ రక్త సంమిశ్రమం లేని కులంగాని, వర్గంగాని ఉన్నట్టు లేదు. క్షత్రియులైన యోధవర్గానికి చెందిన రాజపుత్రులలోను, మహారాష్ట్రులలోను మాత్రమే కాక - విదేశీ సంమిశ్రమ సంబంధం ఏమీ లేకుండా ఉన్నామని భ్రమపడుతున్న బ్రాహ్మణులలో కూడ విదేశీ రక్త సాంకర్యం ఉంది."

కుల వ్యవస్థ రక్త స్వచ్ఛతను నిలుపుకోడానికిగాని, వివిధ జాతుల సంమిశ్రమాన్ని నిరోధించడానికిగాని ఏర్పరచబడిందనడంలో సత్యం లేదు. నిజానికి ఇండియాలో రకరకాల జాతులు రక్తపరంగాను, సంస్కృతీ పరంగాను ఒక దానితో ఒకటి సమ్మిళితం అయిన తరువాతనే కుల వ్యవస్థ ఉనికిలోకి వచ్చింది. వివిధ కులాల నడుమ ఉండే భేదాలను, వివిధ జాతుల నడుమ ఉండే భేదాలుగా చిత్రించడం, వివిధ కులాలను వివిధ జాతులుగా భావించడం వాస్తవ సత్యాలను చీల్చిచెండాడడమే. పంజాబులోని బ్రాహ్మణుడికీ, మద్రాసులోని బ్రాహ్మణుడికీ జాతి సంబంధం (రక్త సామరస్యం) ఏముంది? బెంగాలులోని అస్పృశ్యుడికీ, మంద్రాసులోని అస్పృశ్యుడికీ జాతి సంబంధం ఏముంది? అలాగే-పంజాబులోని బ్రాహ్మణుడికీ, అదే పంజాబులోని చర్మకారుడికీ (మాదిగకూ) జాతిభేదం ఏముంది? అదే విధంగా మద్రాసులోని బ్రాహ్మణుడూ, అదే మద్రాసులోని పెరియా (మాల కులస్థుడూ) ఒకే జాతికి చెందినవారే. కుల వ్యవస్థ మనుష్యులను జాతి రీత్యా విభజించడం లేదు. అది ఒకే జాతిలోని ప్రజలను సాంఘికంగా విభజిస్తున్నది.

పోనీ-కులవ్యవస్థ జాతి విభజనకై జరిగినట్టిదేనని వాదనకోసం ఒప్పుకొన్నా అప్పుడు ఇండియాలో వివిధ కులాల మధ్య వర్ణాంతర వివాహాల ద్వారా జాతి

మిశ్రణ, రక్త సమ్మేళన జరగనిస్తే వచ్చిన హాని ఏముంది? మృగాలకు, మనుష్యులకు మధ్య అనంతమైన జాతిభేదం ఉంది. మానవులు, జంతువులు రెండు వేరు వేరు సంతతులకు చెందివున్నట్టు ప్రకృతి విజ్ఞాన (సైన్సు) శాస్త్రం కూడ అంగీకరించిందే. జాతుల స్వచ్ఛతలో నమ్మకం గల సైన్సు శాస్త్రజ్ఞులు కూడా మానవులలోని వివిధ జాతులు వివిధ సంతతులకు (స్పీసీసుకు) చెందినవారని అనడంలేదు. వారంతా ఒకే సంతతికి చెందిన పలు జాతులు. సర్వజాతుల మానవులూ ఏక బీజముల సృష్టే కనుక ఆయా జాతుల మధ్య అంతః సంయోగం సంతానోత్పాదకమే కాని గొడ్డుది కాజాలదు.

కుల వ్యవస్థను సమర్థించడానికి వారసత్వం గురించీ, నర సంతతి వృద్ధి శాస్త్రం గురించీ చెత్త వాదన ఎంతో లేవనెత్తబడింది. నరవంశ శుద్ధి శాస్త్రం (యూజెనిక్స్) యొక్క ప్రాథమిక సూత్రానికి కుల వ్యవస్థ అనుగుణంగా ఉంటే దానికి ఎవ్వరూ అభ్యంతరం చెప్పరు. ఎందుకంటే స్త్రీ పురుషులను వివేకంతో జత కలపడం ద్వారా జాతి అభివృద్ధిని సాధించడానికి ఎవరూ అభ్యంతరం చెప్పరు. అయితే వివేక వంతమైన స్త్రీ, పురుష సంయోగాన్ని కులవ్యవస్థ ఏ విధంగా సాధిస్తున్నదో ఎవరికీ అర్థంకావడంలేదు. కులవ్యవస్థ ప్రకృతి విరుద్ధమైన ఒక కృత్రిమ వ్యవస్థ. అది చేస్తున్నదల్లా వివిధ కులాల స్త్రీ పురుషులు కులాంతర వివాహాలను చేసుకొనకుండా నిషేధించడం. ప్రకృతి స్థిరమైన పద్ధతి కాదది. ఒక కులంలో ఏ ఇద్దరు కలసి వివాహం చేసుకోవలసి ఉన్నదో నిర్ణయించే పద్ధతి కాదది. జాతి వృద్ధి శాస్త్రం దృష్ట్యా కులమే ఒక ప్రత్యేక మూల జాతి అయితే-ఉపకులాల పుట్టుక కూడ అదే విధం అయిఉండాలి. అయితే ఉపకులాల మూలం కూడా యూజినిక్సే అని నిజంగా ఎవ్వరైనా వాదించగలరా? అలాంటి వాదన పూర్తిగా అసంగతం. ఒక్కొక్క కులం ఒక్కొక్క జాతి అయితే, ఉపకులాల మధ్య తేడాలు జాతిభేదాలుగా పరిగణించడానికి వీలులేదు. ఎందుకంటే ఉపకులాలు ఒకే జాతిలోని ఉపవిభాగాలు. అందువల్ల ఉపకులాల మధ్య వర్ణాంతర వివాహాలను వర్ణాంతర భోజనాలను నిషేధించడం జాతి యొక్కగాని, రక్తం యొక్కగాని స్వచ్ఛతను కాపాడటం కోసం కానేరదు. ఉపకులాల ఏర్పాటులో యూజినిక్సు ప్రమేయం లేకపోతే కులాల పుట్టకలో యూజినిక్సు ప్రమేయం అర్థవంతం కాదు. అంతేకాక, మూలంలో కులం యూజినిక్స్ అయిఉంటే వర్ణాంతర

వివాహాల నిషేధాన్ని అర్థం చేసుకోవచ్చు. అయితే వర్ణాంతర భోజనాలపై నిషేధం ఎందుకు పెట్టబడినట్టు? కులాల మధ్య, ఉపకులాల మధ్య కూడ సహపంక్తి భోజనాలను నిషేధించడంలో ఏమిటి ప్రయోజనం? సహపంక్తి భోజనాలు రక్తాన్ని కల్తీ చేయలేవు గదా! కాబట్టి జాతి యొక్క ఉన్నతీకరణకు గాని, న్యూనీకరణకు గాని అవి కారణం కాజాలవు. దీని వల్ల కుల వ్యవస్థకు ప్రకృతి శాస్త్రీయ ప్రాతిపదిక లేదని స్పష్టపడుతున్నది. పూర్తిగా ప్రకృతి శాస్త్రాధారం లేని కుల వ్యవస్థను శాస్త్ర సమ్మతమైనట్టిదిగా యూజినిక్స్ మూలాధారాన్ని కల్పించి చెప్పడానికి వారు తంటాలు పడుతున్నారు. అంతే. ఈనాడు కూడా వారసత్వ చట్టాలను మనం స్పష్టంగా అర్థం చేసుకొంటేనే తప్ప యూజినిక్స్ యొక్క వాస్తవ ప్రయోజకత్వాన్ని గుర్తించలేం. "మెండల్స్ ప్రిన్సుపుల్సు ఆఫ్ హెరిడిటీ" అనే తన గ్రంథంలో ప్రొఫెసర్ బెటిసన్ ఇలా అంటాడు:

"ఉన్నత మానసిక గుణాల యొక్క వంశానుక్రమణ పరిస్థితిని పరిశీలించి చూస్తే,, అది ఏదో ఒక అభివాహక్రమాన్ని అనుసరిస్తుందని చెప్పడానికి ఏమీ లేదు. మానసిక గుణాలు, అంతకన్నా స్పష్టంగా వ్యక్తమయ్యే భౌతిక శక్తులు కూడా అసంఖ్యాకమైన ప్రకృతి శక్తుల సమైక్యం వల్ల ఏర్పడతాయే కాని ఏదో ప్రత్యేక వంశాను గత బీజ ప్రవృత్తి వల్ల మాత్రమే కాదని చెప్పవచ్చు"

కులవ్యవస్థ యూజెనిక్స్ ప్రకారమే ఏర్పడిందని (నరజాతి సమున్నతీకరణ శాస్త్రానుసారంగా ఏర్పడిందని) వాదించడం ఈనాటి హిందువుల మూల పురుషులకు నేటి ఆధునిక ప్రకృతి శాస్త్రజ్ఞులకు కూడా లేని వారసత్వపు విజ్ఞానాన్ని అంటగట్టడమే అవుతుంది. చెట్టు ఎలాంటిదో అది కాసే కాయలే నిరూపిస్తాయి. మన కులవ్యవస్థకు యూజినిక్స్ ప్రాతిపదిక అయిఉంటే అది ఎటువంటి సంతతి మనుష్యుల్ని ఉత్పత్తి చేసి ఉండాలి? నిజానికి ఎటువంటి సంతతిని ఉత్పత్తి చేసింది? భౌతికంగా మనం పరిశీలించి చూస్తే హిందువుల "సి3" క్లాసు జాతిమనుష్యులు. ఆకారంలో కుదించుకుపోయిన, శక్తి విహీనులైన, మరుగుజ్జు మనుష్యుల జాతి నేటి హిందువులు. పదివంతులలో తొమ్మిది వంతులు మంది మిలిటరీ సర్వీసుకు పనికిరారని తీసివేయబడ్డ జాతి ఇది. అందువల్ల ఆధునిక వైజ్ఞానికులు పేర్కొంటున్న యూజెనిక్స్‌తో ఈ కుల వ్యవస్థకు ఏవిధమైన సంబంధమూ లేదని స్పష్టపడుతుంది. కాగా హిదువులలో

సాంఘికంగా ఉన్నత స్థాయిలో ఉండి తమ క్రింది వారిని తమ ఇష్టానుసారం అణచిపెట్టి ఉంచగలిగినంత నిరంకుశాధికారం కల వక్రబుద్ధులైన కొంతమంది స్వప్రయోజన దృష్టితో కల్పించిన సంఘ వ్యవస్థే ఈ కులవ్యవస్థ. దీనికి ఏ విధమైన శాస్త్రీయ ప్రమాణమూ లేదు.

## హిందూ అనే పేరే ఒక పుక్కిటి పురాణం

కుల వ్యవస్థ ఆర్థిక సామర్థ్యాన్ని పెంచలేదు. కులవ్యవస్థ జాతిని సమున్నతీకరించలేదు. అందుకు దానికి శక్తి లేదు కూడా. అయితే అది ఒక పని మాత్రం చేసింది. హిందువులను కులవ్యవస్థ పూర్తిగా విచ్ఛిన్నుల్ని చేసింది. నైతిక పతితుల్ని చేసివేసింది.

ఇంతకూ ప్రప్రథమంగా మనం గుర్తించవలసింది. ఏమిటంటే అసలు హిందూ సమాజమే ఒక పుక్కిటి పురాణం అని. "హిందూ" అనే పదమే ఒక విదేశీ పదం. మహమ్మదీయులు తమ ప్రత్యేకతను తెలియజేసుకునేందుకు ఈ దేశపు ప్రజలకు హిందువులు అని పేరు పెట్టారు. మహమ్మదీయుల దండయాత్రకు పూర్వం ఏ సంస్కృత గ్రంథంలోను "హిందూ" అనే శబ్దం కనిపించదు. ఈ దేశపు ప్రజలు తామందరకు కలిసి ఒకే ఒక పేరు ఉండడం అవసరమని అనుకొని ఉండలేదు. ఎందుకంటే తామంతా కలిసి ఒక జాతి ప్రజలమనే భావమే వారికి లేదు. హిందూ సమాజం అనేది ఏదీ ఒకటి లేదు. ఉన్నది ఒకటే. అది కొన్ని కులాల సముదాయం. ప్రతి కులానికీ తాము బ్రతకడం ఒక్కటే లక్ష్యం, పరమార్థం. ఈ కులాలు దేనికదే, అవి అన్నీ కలిసి ఒక సమాఖ్యగా అయినా ఏర్పడలేదు. ఎప్పుడైనా, హిందూ ముస్లిం కొట్లాట వంటిది సంభవించినప్పుడు తప్ప, ఏ కులానికీ మరో కులంతో అనుబంధం ఉన్నట్లు కనిపించదు. ఏ కులాని కా కులం తక్కిన కులాల నుండి దూరంగా ఉండిపోవడానికి తన ప్రత్యేకతను నిలబెట్టుకోవడానికి మాత్రమే ప్రయత్నిస్తుంది. ప్రతి కులమూ వాళ్ళలో వాళ్ళే కలిసి తింటూ, వివాహాలను చేసుకొంటూ ఉంటారు. అంతేగాక ప్రతీ కులానికి ఈ ప్రత్యేకమైన వేషధారణ ఉంటుంది. ఇండియాలో స్త్రీపురుషుల వస్త్రధారణను చూచి టూరిస్టులు వినోదపడుతున్నారంటే - వివిధ రకాల రీతుల వేషధారణే కదా కారణం? నిజానికి ఒక ఆదర్శ హిందువును ఇతర

వాటితో ఏ సంబంధమూ పెట్టుకోకుండా తన కన్నంలో తాను బ్రతికే ఒక ఎలుకతో పోల్చవచ్చు. సాంఘికశాస్త్ర నిపుణులు (సోషియాలజిస్టులు) చెప్పే "జాతి చైతన్యం" అనేది హిందువులలో ఏ మాత్రమూ లేదు. హిందువులకు తామంతా ఒక జాతి అన్న చైతన్యమే లేదు. హిందువులలో ఉన్న చైతన్యం ఒక్కటే! అది కులచైతన్యం. హిందువులు ఒక సమాజం అని గాని, ఒక "నేషన్" అని గాని చెప్పలేక పోవడానికి ఇదే కారణం. అయితే ఇండియన్లు ఒక నేషను కాదనీ, ఒక నియమిత రూపం లేని ప్రజల గుంపు మాత్రమేననీ ఒప్పుకోవడానికి చాలమంది భారతీయులకు తమ దేశభక్తి అడ్డు వస్తుంది. అట్టి వారి వాదన ఏమిటంటే "పైకి కనిపించే ఈవైవిధ్యం క్రింద ఒక ప్రాథమిక ఏకత్వం ఉన్నదని, మొత్తం భరత ఖండం అంతటా హిందువుల జీవిత విధానాన్ని చూస్తే వారి ఆచార వ్యవహారాలలో, విశ్వాసాలలో, ఆలోచనలో ఒక విధమైన పోలిక ఉంది. కాబట్టి ఈ ఏకత్వానికది తార్కాణమని వాదిస్తారు. పోలికలున్నమాట నిజమే. అయితే తత్కారణంగా హిందువులు ఒక సమాజంగా ఏర్పడి ఉన్నారని చెప్పే వాదాన్ని ఎవ్వరూ అంగీకరించరు. అలా అంగీకరించడం అంటే సమాజ నిర్మాణ ప్రాతిపదికల్ని అపార్థం చేసుకోవడమే. మానవులు భౌతికంగా దగ్గర దగ్గరగా నివసిస్తున్నంత మాత్రం చేత ఒక సమాజంగా పేర్కొనబడరు. అలాగే ఒక మనిషి ఎన్నో మైళ్ళ దూరంలో నివసిస్తున్నంత మాత్రాన అతడు తన సమాజం నుంచి విడిపోయినట్లు కాదు. మరొక విషయం ఏమిటంటే-మానవులు ఒక సమాజంగా నిర్మాణం కావాలంటే ఆచార వ్యవహారాలలోను, సంప్రదాయాలలోను, విశ్వాసాలలోను, ఆలోచనలలోను పోలిక ఉంటే చాలదు. ఏ వస్తువులైనా ఇటుకలవలే భౌతికంగా ఒకరి చేతుల నుంచి మరొకరి చేతులలోకి పోవచ్చు. ఆచారాలు, సంప్రదాయాలు, నమ్మకాలు, భావాలు ఒక వర్గానికి చెందినట్టివి మరొక వారిచే స్వీకరించబడవచ్చు. అప్పుడా రెండు వర్గాల మధ్య పోలిక కన్పించవచ్చు. సంస్కృతి అనేది ఎల్లప్పుడూ వికసిస్తూ విస్తరిస్తూనే ఉంటుంది. అందుచేతనే సమీపంలో నివసించని ఆదిమ వర్గాల ప్రజలలో కూడ ఆచారాలు, అలవాట్లు, నమ్మకాలు, భావాలు విషయంలో పోలికలు కనిపిస్తాయి. అలాంటి పోలికలు ఉన్నంత మాత్రాన ఆ ఆదిమజాతుల ప్రజలంతా ఒకే సమాజం అని ఎవరైనా అనగలరా? ఎందుచేతనంటే ఒక సమాజ నిర్మాణానికి ఏవో కొన్ని విషయాలలో పోలికలుంటేనే సరిపోదు.

మానవులు ఒక సమాజం ఎప్పుడవుతారంటే వారందరికీ కావలసిన ఉమ్మడి హక్కు కాగల, విషయాలు కొన్ని ఉన్నప్పుడు. ఒకే రకమైన విషయాలు ఉండడం వేరు. అందరికీ ఉమ్మడి సొత్తు కాగల విషయాలు కలిగి ఉండడం వేరు. ఉమ్మడిసొత్తుగా ఒకరితో ఒకరు సమిష్టిగా పంచుకోగల విషయాలు ఉండడం అనేది ఒక్క పరస్పర సంసర్గం వల్ల మాత్రమే సాధ్యం అవుతుంది. మరొక విధంగా చెప్పాలంటే సమాజం యొక్క ఉనికి ఒక పరస్పర సంసర్గం వల్లనూ, ఆ సంసర్గం లోనూ ఉంటుంది. ఇంకా నిర్దుష్టంగా చెప్పాలంటే వ్యక్తులు ఇతర వ్యక్తుల వలెనే ప్రవర్తించడం ఒక్కటే చాలదు. ఒకేలా, సమానాంతరంగా క్రియాకలాపాలు సాగించడం వల్లనే సమాజ నిర్మాణం కాజాలదు. దీనిని రుజువు చేయడానికి మనం పండుగలను తీసుకోవచ్చు. హిందువుల లోని వివిధ కులాలవారు ఒకే రకమైన పండుగలను చేస్తూ ఉంటారు. ఈ పండుగలు జరుపుకోవడంలో సమానాంతర రేఖలవలె సారూప్యం ఉన్నప్పటికి అవి అన్ని కులాల వారికి కలిసి ఒక సమగ్ర సమాజంగా రూపొందించలేక పోతున్నాయి. అలా సమీకృత సమాజం కావడానికి ఒక్కటే. అది ఏ వ్యక్తి అయినా ఆ ఉమ్మడి కార్యకలాపాలలో స్వేచ్ఛగా పాల్గొని పాలుపంచుకొంటూ ఆ కార్యకలాపాలలో పాల్గొన్నప్పుడు , ఇతరులను ఉత్తేజపరచే భావోద్రేకాలు తనను కూడా ఉత్తేజపరచగలిగి ఉండాలి. ఉమ్మడి కార్యకలాపాలలో వ్యక్తిని భాగస్వామిగా చెయ్యడం. ఏ తత్కార్యక్రమాల జయాపజయాలను తన జయాపజయాలుగా అట్టి వ్యక్తి విశ్వసించడం ఇది ఒక్కటే ఆ వ్యక్తులందరినీ కలిపి సమాజంగా బంధించగల సూత్రం. హిందువులలోని కులవ్యవస్థ ఉమ్మడి కార్యకలాపాలను నిరోధిస్తున్నది. తద్వారా హిందువులు ఒక సమాజంగా ఏర్పడ లేకుండా ఏక సంఘీయుల మనే భావనతో ఏకీకృత జీవితమూ, ఆత్మావబోధనమూ లేకుండా విడిపోతున్నారు.

ఎక్కడైనా ప్రజలు, ముఠాలు, గుంపులుగా వేరుపడి ఇతరులతో కలవకుండా జీవించేవారిని చూచి హిందువులు వారిని పట్టుకొని నిందిస్తారు. వారిని సంఘ వ్యతిరేకతత్వం గలవారని తరచూ నింద వేస్తారు. అయితే అట్టి సంఘవ్యతిరేక తత్వం తమ కులవ్యవస్థలో ఉన్నతం ఘోరంగా మరెక్కడా లేదన్న సంగతిని హిందువులు సులభంగా మర్చిపోతారు. గత యుద్ధ సమయంలో ఆంగ్లేయుల మీద జర్మనులు ఎంతటి విద్వేషాన్ని వెదజల్లారో అంతటి విద్వేషాన్నే హిందువులు ఒక కులంవాళ్లు

మరొక కులంవాళ్లపై వెళ్ళగ్రక్కుతూ ఆనందిస్తారు. హిందువుల సాహిత్యం నిండా కులాలను గురించి వ్రాయబడి ఉంటుంది. అందులో ఒక కులాన్ని ఉత్తమ జన్మగాను, మరొక కులాన్ని నీచజన్మ గాను చిత్రించే యత్నం జరిగినట్టు కన్పిస్తుంది. ఈ రకమైన సాహిత్యంలో "సహ్యాద్రి ఖండం" అనేది పేరు పొందిన గ్రంథం.

## హిందువులలో సంఘ వ్యతిరేక తత్వానికి కులమే కారణం

ఈ సంఘ వ్యతిరేక తత్వం కులానికి మాత్రమే పరిమితమై ఉండలేదు. ఇది ఇంకా లోతుకు పోయి ఉపకులాల మధ్య పరస్పర సంబంధాలను కూడ విషతుల్యం చేసి పారవేసింది. మా రాష్ట్రంలో గులక్ బ్రాహ్మణులు, ద్యోరుఖ బ్రాహ్మణులు, కరదా బ్రాహ్మణులు, పల్షే బ్రాహ్మణులు, చిత్‌పవన్ బ్రాహ్మణులు–వీరందరూ బ్రాహ్మణకులంలో ఉపశాఖలుగానే చెప్పుకుంటారు. అయితే ఈ ఉపశాఖల మధ్య సంఘ వ్యతిరేకతత్వం, పరస్పర విభేదతత్వం– బ్రాహ్మణ బ్రాహ్మణేతర కులాలమధ్య ఎంత ఘోరంగా ఉన్నదో అంత ఘోరంగానూ ఉన్నది. ఇందులో ఆశ్చర్యం ఏమీలేదు. ఎక్కడైతే ఒక వర్గానికి స్వప్రయోజనాలు ఉంటాయో అక్కడ వాటిని కాపాడుకోడానికి ఆ వర్గం వాళ్ళు ఇతర వర్గాలకు దూరంగా ఉంటారు. వారికున్న స్వప్రయోజనాలను రక్షించుకోవడమే వారికి పరమార్థం గనుక ఇతరులతో కలిసిమెలిసి ఉండరు. ఈ సంఘ వ్యతిరేకతత్వం, ఈ స్వప్రయోజన రోణ తత్వం వివిధ దేశాల (నేషన్ల) మధ్య ఎంత ప్రస్ఫుటంగా కనబడుతుందో అంత సుస్పష్టంగానూ వివిధ కులాల మధ్య కనిపిస్తుంది. బ్రాహ్మణుడు తాపత్రయ పడేది ప్రధానంగా తన స్వప్రయోజనాలను బ్రాహ్మణేతరుల నుంచి కాపాడుకోవడం కోసం, బ్రాహ్మణేతరుడు తాపత్రయ పడేది ముఖ్యంగా బ్రాహ్మణులనుంచి తన స్వప్రయోజనాలను సంరక్షించుకోవడం కోసం. కాగా హిందువులు కేవలం కొన్ని కులాలు మాత్రమే కాదు. ఏ కులాని కా కులం తమ స్వప్రయోజనాలను రక్షించుకోవడం కోసం తక్కిన కులాలతో నిరంతర పోరాటం సలిపే విడి విడి గుంపులు.

మరీ విచారకరమైన, ఘోరమైన మరొక లక్షణం ఈ కుల వ్యవస్థకు ఉంది. నేటి ఆంగ్లేయుల పూర్వీకులు "రోజెస్" యుద్ధాలలోను క్రాంవిలియన్ యుద్ధంలోను

ఏదో ఒక పక్షాన్ని ఉండి పోరాడారు. అయితే ఒక పక్షాన్ని ఉండి పోరాడిన వాళ్ళ వారసులు మరొక పక్షాన్ని ఉండి పోరాడిన వాళ్ళ వారసులపై విరోధ భావం పెట్టుకోలేదు. ఆనాటి అంతర్యుద్ధం అప్పుడే పోయింది. కాని ఇండియలో మాత్రం అలా కాదు. పూర్వం శివాజీకి అప్పటి బ్రాహ్మణులు చేసిన అగౌరవానికి ఈనాటి బ్రాహ్మణుల్ని, ఈనాటి బ్రాహ్మణేతరులు క్షమించలేకుండా ఉన్నారు. కాయస్తులు తమ పూర్వీకులపై అప్పటి బ్రాహ్మణులు వేసిన అభాండాలకి ఇప్పటి బ్రాహ్మల్ని క్షమించలేకుండా ఉన్నారు. ఈ తేడా ఎందువల్ల వచ్చినట్టు? నిస్సందేహంగా కుల వ్యవస్థ వల్లనే. దేశంలో కులవ్యవస్థా, కులతత్వ జాగృతీ ఉండడం వల్లనే గతంలోని అంతః కలహాల జ్ఞాపకాలు మాసిపోకుండా నిలవగలుగుతున్నై. కులాల మధ్య ఏకీభావాన్ని భగ్నపరుస్తున్నై, సమైక్యాన్ని నిరోధిస్తున్నై.

## ఆదిమవాసులు ఇంకా అనాగరిక స్థితిలోనే ఎందుకున్నారు?

మినహాయించబడి, పాక్షికంగా చేర్చుకోబడిన ప్రాంతాలను గురించి లోగడ జరిగిన చర్చలు ఇండియాలో ఆదిమవాసులనబడుతున్న తెగల పరిస్థితి ఏమిటో తెలుసుకోవడానికి కొంత అవకాశం ఇచ్చాయి. ఈ తెగల ప్రజలు ఒక కోటి ముప్ఫై లక్షల మంది ఉన్నారు. బహుశ ఇంకా ఎక్కువ మందే ఉండవచ్చు. వారందరినీ క్రొత్త రాజ్యాంగం నుంచి మినహాయించడం ఉచితమా, అనుచితమా అన్న ప్రశ్నలను అలా ఉంచి వాళ్ళ వాస్తవ పరిస్థితిని గురించి ఆలోచించి చూస్తే అది చాల దుర్భర అనాగరిక పరిస్థితిలోనే నివసిస్తున్నారంటే ఏమనాలి? కాని ఇది మాత్రం నగ్న సత్యం. ఇన్ని వేల సంవత్సరాలుగా ఈ దురదృష్ట వంతులు నాగరికులు కాలేకపోవడం ఒక్కటే కాక ఇందులో కొందరు దుష్టవృత్తుల నవలంబించే దుస్థితికి దిగజారి నేరస్తజాతులు (క్రిమినల్సు)గా పరిగణించబడుతున్నారు. కోటి ముప్ఫై లక్షలమంది, నాగరికత మధ్య బ్రతుకుతూ అనాగరిక ఘోర దుస్థితిలో ఉండిపోవడం! పైగా వంశపరంపరగా నేరస్తులుగా బ్రతకడం! దీనికి హిందువులు సిగ్గయినా పడక పోవడం! ప్రపంచంలో ఎక్కడా సాటిలేని విచిత్ర పరిస్థితి ఇది. ఈ లజ్జా కరమైన పరిస్థితి ఏమిటి కారణం? ఈ ఆదిమవాసుల్ని నాగరికులుగా మార్చడానికి, గౌరవప్రదమైన వృత్తులు చేపట్టేలాగ చేయడానికి అసలు ప్రయత్నమే జరగలేదు. ఎందువల్ల?

బహుశ, వాళ్ళ అనాగరిక స్థితికి జన్మ సిద్ధమైన బుద్ధి మాంద్యమే కారణమని చెప్పడానికి హిందువులు ప్రయత్నించవచ్చు. ఆదిమవాసుల తరతరాలుగ అనాగరికులుగానే ఉండిపోవడానికి కారణం తామేననీ ఒప్పుకోకపోవచ్చు. వాళ్ళకు నాగరికత నేర్పడానికిగాని, వైద్య సహాయం మొదలైన వాటిద్వారా వాళ్ళను సరిదిద్దడానికిగాని, వాళ్ళను సంస్కరించి మంచి పౌరులుగా తయారుచేయడానికి గాని తాము ఏ మాత్రమూ ప్రయత్నించకపోవడమే ఆదిమవాసుల అనాగరిక స్థితికి కారణమని హిందువులు అంగీకరించకపోవచ్చు. ఈనాడు ఈ ఆదిమవాసుల కోసం ఒక క్రైస్తవ మిషనరీ ఏమి చేస్తున్నాడో అదే ఒక హిందువు చెయ్యదలచాడనుకొందాం. అయితే అలా చెయ్యగల్గి ఉండేవాడా? చెయ్యగల్గి ఉండేవాడు కాదనే నా ఉద్దేశం. ఆదిమవాసుల్ని నాగరికుల్ని చెయ్యడం అంటే వాళ్ళను నీ వాళ్ళుగానే భావించడం. వాళ్ళ మధ్య నివసించడం. వాళ్ళలో ఒక సహానుభూతిని పెంపొందించడం. క్లుప్తంగా చెప్పాలంటే, వాళ్ళను ప్రేమించడం. హిందువుడికి ఇది అంతా ఎలా సాధ్యమవుతుంది.

హిందువుడి జీవిత పరమార్థం అంతా, హిందువుడి తాపత్రయం అంతా, తన కులాన్ని భద్రంగా కాపాడుకోవడం. కులం హిందువుడికి అమూల్య సంపద. ఏది ఏమైనా సరే తన కులాన్ని కాపాడు కోవడమే హిందువుడి పరమలక్ష్యం. వేదకాలం నాటి అసహ్యకర అనార్యుల యొక్క అవశేషాలైన ఆదిమవాసులతో సంపర్కం పెట్టుకోవడమంటే హిందువుడు తన కులాధిక్యతను పోగొట్టుకోవడమేకదా! పతిత మానవజాతి పట్ల తన బాధ్యత ఎటువంటిదో హిందువుడికి బోధించడం సాధ్యం కాదని కాదు. కాని పతిత మానవజాతి పట్ల తన కెంత బాధ్యత ఉన్నదనుకొన్నా తన కులాన్ని నిలుపుకోవడంలో తనకున్న బాధ్యతను మాత్రం అధిగమించలేదు. ఎట్టి పశ్చాత్తాపము, సిగ్గూ, చింతా లేకుండా హిందువుడు తన నాగరికత మధ్యలో అనాగరికులను అనాగరికులుగానే ఉండిపోనిస్తున్నాడంటే అందుకు నిజమైన కారణం కులమే.

ఈ ఆదిమవాసులు, అలానే అనాగరిక స్థితిలోనే ఉండిపోవడం దేశానికి ఎంత ప్రమాదకరమో హిందువుడు గుర్తించలేదు. ఈ ఆదిమవాసులు అనాగరికతా పశుప్రాయులుగా ఉండిపోతే వారినుండి హిందువులకు కలిగే పెద్ద బాధేమీ లేదు. కాని ఇతర మతాలవాళ్ళు ఈ ఆదిమవాసుల్ని ఉద్ధరించి తమ మతాలలో

కలుపుకొన్నప్పుడు - అప్పుడు హిందువులకు శత్రువులైన ఆ ఇతర మతాలవాళ్ల బలాన్ని బాగా పెంచడానికి ఈ ఆదిమవాసులు ఉపయోగపడతారు. అలా జరిగినప్పుడు హిందువులకు మిగిలేది - తనను తానూ, తన కుల వ్యవస్థనూ అభినందించుకోవడమే!

## వికసించడం, వ్యాపించడం హిందూ మతానికి సాధ్యమా?

ఆదిమవాసుల్ని నాగరికుల్ని చెయ్యడం అనే పవిత్ర మానవతా కార్యరంగంలో ఏ విధమైన కృషినీ, ప్రయత్నాన్నీ హిందువుడు చెయ్యలేదు. అంతేకాదు. హిందూమత పరిధిలోనే వున్న దిగువ కులాల వారు సాంస్కృతిక స్థాయిలో తమతో సమానంగా అభ్యున్నతి పొందడాన్ని కూడా అగ్రకులాల హిందువులు బలవంతంగా నిరోధించారు. ఇందుకు ఇక్కడ రెండు ఉదాహరణలిస్తున్నాను. అందులో ఒకటి సోనారులకు సంబంధించింది. రెండవది పథారే ప్రభువులకు సంబంధించింది. మహారాష్ట్రంలో ఈ రెండు కులాలు బాగా ప్రసిద్ధమైనట్టివి. సమాజంలో తమస్థాయి పెంచుకోడానికి తక్కిన కులాలు ప్రయత్నిస్తున్నట్టే ఈ రెండు కులాలు కూడ ప్రయత్నిస్తూ, కొంతకాలం క్రితం బ్రాహ్మణుల ఆచారవ్యవహారాలను కొన్నింటిని అవలంబించడం మొదలు పెట్టారు. అందులో సోనారులు తమ కులం పేరును దైవజ్ఞ బ్రాహ్మణులుగా మార్చుకున్నారు. బ్రాహ్మణులు ధరించేటట్టే ధోవతులను మడతలు వచ్చేటట్టు ధరించేవారు. బ్రాహ్మణులు ఒకరినొకరు కలుసుకున్నప్పుడు అనేటట్టే "నమస్కారం" అనేవాళ్ళు. కుచ్చుపోసి ధోవతి ధరించడం, నమస్కారం అనడం-ఇవి రెండూ బ్రాహ్మణులకు ప్రత్యేక అలవాట్లు. అయితే ఆవిధంగా సోనార్లు బ్రాహ్మణులను అనుకరించడం, బ్రాహ్మణుల లాగే చలామణి కావాలనుకోవడం, బ్రాహ్మణులకు గిట్టలేదు. పీష్వాలు అధికారంలో ఉన్న రోజులవి. సోనారులు బ్రాహ్మణుల ఆచార వ్యవహారాలను అనుకరించే ప్రయత్నాన్ని బ్రాహ్మణులు అధికారుల మద్దతుతో విజయవంతంగా నిరోధించి వేశారు. అంతేకాదు. సోనారులు బొంబాయిలో నివసించకూడదని అక్కడ ఇండియా కంపెనీ శాఖకు చెందిన అధికారి (కౌన్సిలు ప్రెసిడెంటు) చే ఒక నిషేధాజ్ఞను కూడా జారీ చేయించగలిగారు.

పథారే ప్రభు కులం వారిలో వితంతు పునర్వివాహం వారి కులాచారంగా ఉండేది. రాను రాను వారిలో కొందరు ఈ ఆచారం ఏదో తక్కువ కులాచారంగా పరిగణించసాగారు. ఎందుకంటే బ్రాహ్మణులలో వితంతు పునర్వివాహం ఆచారంగా లేదు కనుక. అందువల్ల తమ కులం యొక్క గౌరవస్థాయిని పెంచుకోవడంకోసం, తమ కులాచారమైన వితంతు పునర్వివాహ పద్ధతిని రద్దు చేయడానికి కొంతమంది పథారె ప్రభువులు నడుం కట్టారు. దానితో మొత్తం కులం రెండు ముఠాలు అయినై. ఒక ముఠా వితంతు పునర్వివాహాలు జరగకూడదన్నారు. రెండవ ముఠా అందుకు వ్యతిరేకించి కులాచారమే సాగాలన్నారు. అప్పటి పరిపాలకులైన పీష్వాలు రెండవ ముఠా వారినే సమర్థించి, వితంతు పునర్వివాహ పద్ధతిని బలపరచి, పథారేప్రభు కులంవారు బ్రాహ్మణుల ఆచారాన్ని అనుసరించకుండా నివారించ గలిగారు.

ఖడ్గం ద్వారా తమ మతాన్ని వ్యాపింపజేసిన మహమ్మదీయులను హిందువులు విమర్శిస్తారు. శోధన ప్రాతిపదిక అయిన క్రైస్తవ మతాన్ని కూడ హిందువులు అవహేళన చేస్తారు. అయితే మోక్ష సుఖానికి మార్గమని నమ్మిన తమ మతాలలోకి ఇతరులను కూడ చేర్చుకొనే నిమిత్తం అందుకు ఇష్టపడనివారిమీద కత్తి ఝుళిపించిన మహమ్మదీయులు బలవంతంచేసిన క్రైస్తవులు ఒక ప్రక్క – తన వెలుగును ఇతరులకు అందివ్వకుండా, ఇతరులను శాశ్వతంగా చీకటిలోనే ఉంచడానికి ప్రయత్నిస్తూ, తమ మేధాసంపత్తికీ, సాంఘిక వారసత్వానికీ భాగస్వాములు కావడం కోసం తమతో కలవడానికి సుముఖులుగా సంసిద్ధులుగా ఉన్నవారిని త్రోసి పుచ్చే హిందువులు ఒక ప్రక్క – వారిలో ఎవరు నిజంగా మన గౌరవానికి ఎక్కువ అర్హులు? మహమ్మదీయుడు క్రూరుడనుకొంటే, హిందువుడు నీచుడు. క్రూరత్వం కంటే నీచత్వం దుష్టమైనట్టిది.

హిందూమతం ధర్మవ్యాపక సంస్థ (మిషనరీ మతం) అవునా కాదా అనేది వివాద గ్రస్తమైన సమస్య, హిందూమతం ఏనాడూ ప్రచారక మతంగా ఉండలేదని కొందరంటారు. హిందూమతం ప్రచారక మతమే అని మరికొందరంటారు. అయితే పూర్వం ఒకానొక కాలంలో హిందూమతం ప్రచారక మతంగా ఉన్నదనడమే సరియైన వాదంగా కన్పిస్తుంది. అది ప్రచారక మతం కాకపోతే భారత భూభాగంగా ఇంతగా

వ్యాపించి ఉండేది కాదు. ఈనాడు అది ప్రచారక మతం కాదనేది కూడ సత్యమే, అందుచేత హిందూమతం ప్రచారక మతమా కాదా అనేది కాదు మన సమస్య. ఒకప్పుడు ప్రచారక మతంగా ఉన్న హిందూమతం ఇప్పుడెందుకు తద్వ్యతిరేకంగా మారింది? ఈ ప్రశ్నకు నా జవాబు ఇది. హిందూమతం ప్రచారక మతంగా ఎప్పుడాగిపోయిందంటే - హిందువులలో కులవ్యవస్థ ఏర్పడిప్పుడు. కులవ్యవస్థకూ మతం మార్పుకు పొసగదు. మతం మార్పుకు కావలసింది విశ్వాసాలూ సిద్ధాంతాలు స్వీకరించడం మాత్రమే కాదు. ఈ మతం మార్పులో అంతకంటే ముఖ్యమైన మరొక విషయం ఉంది. అది మతం మార్చుకొన్నవారికి సంఘం జీవనంలో లభించే స్థానం ఈనాడు ఇతరుడెవడైనా హిందూమతాన్ని స్వీకరించదలిస్తే - హిందూ మతంలో అతని స్థానమెక్కడ? ఏ కులంలో చేర్చుకోవడం? అన్యులైన వారిని తన మతంలో చేర్చుకోవాలనుకునే ప్రతీ హిందువుణ్ని తికమక పరిచే సమస్య ఇది. ఏదో ఒక క్లబ్బులో చేరినట్టు ఒక కులంలో అందరూ చేరడానికి వీలులేదు. క్లబ్బు సభ్యత్వంవలే కులసభ్యత్వం స్వేచ్ఛా యుతమైంది కాదు. ఆ కులంలో పుట్టిన వారికే ఆ కులంలో సభ్యత్వం. ఇది కుల న్యాయం. ఈ న్యాయం క్రింద ఏ కులాని కాకులమే స్వయం స్వతంత్రం. ఎవరైనా క్రొత్తవారిని ఏ కులంలోనైనా చేర్పించే అధికారం ఈ భూమి మీద ఎవ్వరికీ లేదు.

హిందూ సమాజం ఒక కులాల సమ్మేళన. ప్రతి కులమూ అదొక పరిమిత సంస్థ. కాగా అందులోకి క్రొత్తవాడికి ప్రవేశం లేదు. ఇతర మతాల వాళ్లను, జాతులను తమ మతంలో కలుపుకొని తద్వారా తమ మతాన్ని, తమ సమాజాన్ని విస్తరింపజేసుకొనే అవకాశం హిందువులకు లేకుండా పోవడానికి కారణం కేవలం కులవ్యవస్థే. హిందూ మతంలో కులాలు నిలిచి ఉన్నంతకాలం హిందూమతం ప్రచారక మతం ఎన్నటికీ కాజాలదు. కులాలు నశించకుండా ఇతరుల్ని హిందువులుగా మార్చే శుద్ధి కార్యక్రమం అర్థరహితమూ, నిరర్ధకమూ.

## హిందువుల పిరికితనానికీ, నిస్సహాయతకూ కులమే కారణం

హిందువులలో శుద్ధికార్యక్రమం హాస్యాస్పదమూ, నిరర్థకమూ కావడానికి ఏవి హేతువులో, "సంఘటన" కార్యక్రమం అసాధ్యం కావడానికి కూడా అవే హేతువులు సంఘటన ఉద్దేశం ఏమిటంటే - మహ్మదీయులపట్ల, సిక్కులపట్ల

హిందువులు కనబరిచే భయాన్నీ, పిరికితనాన్నీ తొలగించడం. ఆ భయమూ, పిరికితనమూ వల్లనే హిందువులు తమను తాము కాపాడు కోవడం కోసం ఎన్నో నీచమైన, జిత్తులతో కూడిన విద్రోహకర మార్గాలను అవలంబించవలసి వచ్చింది.

అయితే, సహజంగా ఇక్కడ ఒక ప్రశ్న ఉదయిస్తుంది. సిక్కులకు గాని మహమ్మదీయులకుగాని అంత ధైర్యాన్ని, నిర్భయత్వాన్ని ఇచ్చే శక్తి ఎక్కడనుంచి వచ్చింది?

శారీరకమైన బలాధిక్యతవల్లగాని, ఆహార వ్యాయామాలలో ఆధిక్యతవల్లగాని వారికి ఆ శక్తి కల్గిందని నేను అనుకోను. ఆ శక్తి ఎక్కడనుండి వచ్చిందంటే - ఒక సిక్కుకు ఏదైనా ప్రమాదం జరిగితే, తక్కిన సిక్కులంతా అతని రక్షణకు సిద్ధపడతారనే భావం ప్రతిసిక్కుకూ ఉండడంవల్ల సిక్కులకు ఆ శక్తి వచ్చింది. మహ్మదీయుల విషయంలో తక్కిన మహ్మదీయులంతా అండగా నిలబడతారు. అటువంటి శక్తి హిందువులకు లేదు. తనకేదైనా ఆపద కల్గినప్పుడు తక్కిన హిందువులు తనకు తోడ్పడగలరనే నమ్మకం ఏ హిందువునకూ లేదు. హిందువుడు ఏ పరిస్థితిలోనైనా సరే తాను ఒక్కడు ఏకాకిగా నిలిచిపోవలసినవాడు. కాబట్టి శక్తి విహీనుడౌతున్నాడు. వెనుక బలం లేనందువల్ల అతడు లొంగిపోతాడు. లేక పారిపోతాడు. ఒక సిక్కుగాని, ఒక ముస్లింగాని ఎదిరించబడినప్పుడు అతడు ధైర్యంగా నిలబడి పోరాడుతాడు. ఆ పరిస్థితిలో అతడొక్కడే అయినా - తాను ఏకాకిని కాననీ, తన వెనుక తన మతస్థులంతా ఉన్నారనీ అతడికి తెలుసు. అది అతడికి అపారమైన ధైర్య సాహసాలు ఇస్తుంది. అందుకే సిక్కులు, మహమ్మదీయులు నిల్చి పోరాడగల్గుతున్నారు.

సిక్కులలోను, మహమ్మదీయులలోను సహాయ సహకారాల విషయంలో అంత విశ్వాసమూ, హిందువులలో అంత నిరాశా ఏర్పడడానికి హేతువు ఏమిటని పరిశీలించి చూస్తే - అందుకు కారణం వారి వారి జీవిత విధానాలలోనే కన్పిస్తుంది. సిక్కులు, మహమ్మదీయులు కలిసి మెలిసి, ఏక కుటుంబంవలె బ్రతుకుతారు. అది వారిలో సోదరభావం పెంపొందిస్తుంది. హిందువులలో అలాంటిది ఏదీ లేదు. సిక్కులలోను, ముస్లింలలోను సాంఘిక సమైక్యత ఉంది. అది వారి మధ్య సోదర భావాన్ని కల్గిస్తుంది. ఒక సిక్కు మరొక సిక్కుకు సోదరుడే, (భాయి). ఒక ముస్లిం

మరొక ముస్లింకు సోదరుడే. హిందువులలో అలాంటి సమైక్యభావం ఏమీ లేదు. ఒక హిందువుడు మరొక హిందువుడ్ని సోదరుడుగా పరిగణించడు. ఒక సిక్కు (ఒక ఖాల్సా) అంటే సవాలక్ష సిక్కులని ప్రతిసిక్కూ చెప్పుకొంటాడు. అలా భావిస్తారు. ఒక్క మహమ్మదీయుడు ఒక పెద్ద హిందువుల గుంపుకు సమానమని భావించడానికి కారణం ఇదే! ఈ తేడాకు కారణం కులమే అనడం నిస్సందేహం. కులవ్యవస్థ ఉన్నంతకాలం సంఘటిత శక్తి రాదు. సంఘటిత శక్తి లేనంతవరకూ హిందువుడు బలహీనుడుగాను, పిరికివాడుగాను ఉండక తప్పదు.

హిందువులు ఓర్పు గలవారమనీ, సహనశీలురమనీ చెప్పుకొంటూ ఉంటారు. అది నిజం కాదని నా ఉద్దేశం. చాలా సందర్భాలలో హిందువులు సహనశీలురు కారు. వారు సహనాన్ని ప్రదర్శించే సందర్భాలు ఏమైనా ఉంటే, అవి తమకు అనువుగాని సందర్భాలే. ఎదిరించే శక్తి లేకనూ, వట్టి ఉదాసీన భావం వల్లనూ మెదలకుండా ఊరుకొంటారు. హిందువులలోని ఈ అలక్ష్యభావం వారి స్వభావంలో ఒక భాగం అయిపోయి, వారిని నిర్వీర్యులను చేసి వేసింది. ఎలాంటి అవమానాన్నైనా సరే, తప్పునైనా సరే చేతులు కట్టుకొని హిందువుడు సహిస్తాడు.

మోరిన్ మహాశయుని మాటలలో చెప్పితే – హిందువులలో గొప్పవాళ్ళు తక్కువవాళ్ళను తొక్కేస్తారు. బలమైనవాళ్ళు బలహీనుల్ని అణచివేస్తారు. క్రూరులైనవాళ్ళకు భయభీతులు లేవు. దయ గలవాళ్ళు సాహసించి ముందుకురారు. మేధావులైన వాళ్ళు ఉపేక్ష వహిస్తారు. ఇది హిందువుల పరిస్థితి. ఓర్పు, సహనమూ అనబడేవి వట్టి బలహీనత, ఉదాసీనత మాత్రమే.

హిందూ దేవతలంతా ఓర్పుగలవాళ్ళే కావడంవల్ల హిందువులలో బాధితుల యొక్క పీడితులయొక్క అవస్థ ఎంత దయనీయంగా ఉంటుందో, ఎంత దైన్యంగా ఉంటుందో ఊహించడం కష్టం కాదు. జాతిని నాశనం చెయ్యగల రోగాలలో ఉపేక్షను మించిన ఘోర రోగం మరొకటి ఉండదు. హిందువుడు అంతా ఉపేక్షా శాపబద్ధుడు ఎందుకైనట్టు? నా ఉద్దేశంలో అందుకు కారణం కులవ్యవస్థే? ఒక మంచి పనికోసం కూడా పరస్పర సహకారానికి ఐక్య సంఘటనను అసాధ్యం చేస్తున్న కులవ్యవస్థే హిందువులలోని ఈ ఉపేక్ష అనే దుష్టవ్యాధికి కారణమైంది.

# సంఘ బహిష్కారం సంస్కరణకు గొడ్డలిపెట్టు

ఒక వర్గం యొక్క సాయుదాయక (గ్రూపు) ప్రమాణాలకు, అధికారాలకు ప్రయోజనాలకు అతీతంగా ఒక వ్యక్తి తన స్వంత భావాలను, నమ్మకాలను స్వాతంత్ర్యాన్ని ప్రయోజనాన్ని దృఢీకరించుకోవడంతో సంస్కరణ ప్రారంభమవుతుంది. అయితే ఆ సంస్కరణ కొనసాగాలంటే, అది వ్యక్తి ప్రాధాన్యతకు ఆ వర్గం ఇచ్చే అవకాశాన్ని బట్టి వుంటుంది. ఈ రకమైన స్వతంత్ర వ్యక్తులతో వ్యవహరించేటప్పుడు, సంఘం కొంత సహనాన్ని, ఔదార్యాన్ని ప్రదర్శిస్తేనే అట్టి వ్యక్తులు తమ స్వతంత్ర వ్యక్తిత్వాన్ని నిలుపుకొంటూ చివరకు తమ తోడి వారి నందరినీ కూడ తమ భావాలకు అనుగుణంగా మార్చగల్గుతారు. అలా కాక అటువంటి స్వతంత్ర వ్యక్తుల భావాలను సంఘం సహించలేకపోతే - అట్టివారిని అణచివెయ్యడానికి ఇష్టం వచ్చిన పద్ధతులను అవలంబించ సాగితే - అట్టి వ్యక్తులు ఎంతోకాలం స్వతంత్రంగా మనలేరు. వారితో పాటు సంస్కరణ కూడ అచిరకాలంలోనే అంతరించి పోతుంది.

ఈ దృష్టిలో కుల వ్యవస్థను పరిశీలించి చూడండి. మతాచారాలను గాని, కుల నియమాలను గాని వ్యతిరేకించడానికి సిద్ధపడే ఏ వ్యక్తినైనా సరే వెలివేసే సర్వాధికారం కులానికి ఉంది. కులంనుంచి వెలివేయడం అంటే సాంఘిక జీవనం నుంచి పూర్తిగా బహిష్కరించడమే. అట్టి బహిష్కారాన్ని మించిన కఠినశిక్ష మరొకటి ఏదీ ఉండదు. చావో, సాంఘిక భహిష్కారమో - ఈ రెండింటిలో ఏదో ఒకటి కోరుకో మన్నప్పుడు, క్రూరత్వంలో రెండూ ఒక టిగానే కన్పిస్తాయి. హిందువులలోని వ్యక్తులు తమ స్వాతంత్ర్యాన్ని దృఢీకరించుకొనలేక పోతున్నారంటే తమ వ్యక్తిత్వాన్ని నిలుపుకోలేకపోతున్నారంటే - అందుకు కారణం ఈ సాంఘిక బహిష్కార భయమే. కులం కల్పించే అవరోధాలను, అడ్డుగోడలను ఛేదించి సంస్కరణ పథంలో పురోగమించ లేకపోతున్నారంటే - అందుకు కారణం వెలివేయడంలోని బాధే. మనిషి తన తోడి వారితో నిష్పూచీగా మెలగనూ లేడు. వారిని విడిచి విడిగా బ్రతకనూ లేడు. మనిషి తన సమాజంలోని సహచరులు తన కనుకూలంగా ఉండాలని కోరుకుంటాడు. తన ఇష్టానుసారం నడుచుకోవడానికి సమాజం అనుకూలించకపోతే, ఎలాంటి సమాజంలోనైనాసరే తన ఇష్టాలను వదులుకొని బ్రతకడానికి సిద్ధపడతాడు.

ఎందువల్లనంటే సమాజం లేకుండా ఒక్కడూ బ్రతకలేడు కాబట్టి, వ్యక్తిలోని ఈ బలహీనతను, అసహాయతను అవకాశంగా తీసుకొని కులం అతన్ని లొంగదీసుకొంటుంది. తన ఆచార విధి నిషేధాలను బద్ధుడ్ని కావించుకొంటుంది. సంఘం ఒక సంస్కర్తయొక్క జీవితాన్ని నరకంగా మార్చగలదు. సంఘ పెద్దలు కూడబల్కుకొని, సంస్కర్తలను వెలివేసి హింసించ గలరు. అదొక పెద్ద కుట్ర వంటిది. కుట్ర అనేది చట్టం క్రింద నేరమే అయినప్పుడు – ఒక కులం యొక్క విధి నిషేధాలను కాదనగల ధైర్య వంతుడ్ని వెలివెయ్యడానికి ఆ కులం చేసే కుట్రను కూడ ఎందుకు శిక్షార్హ నేరంగా చెయ్యకూడదో నా కర్థం కాదు. అయితే, ఇప్పుడు ఉన్న పరిస్థితి ఏమంటే, చట్టం ప్రతి కులాన్నీ ఒక స్వతంత్ర సంస్థగా గుర్తిస్తుంది. తన సభ్యత్వాన్ని కాపాడుకొంటూ, భిన్నాభిప్రాయం కలవారిని బహిష్కారం ద్వారా శిక్షించే హక్కును చట్టమే ప్రతి కులానికీ ఇస్తుంది. మూఢాచారపరుల చేతిలో కులం ఒక వజ్రాయుధం. సంస్కర్తల్ని హింసించి అన్ని సంస్కరణలను అది చంపివేయగలదు.

## హిందువుల కులనీతి, ఆటవిక నీతి

హిందువుల ధర్మసిద్ధాంతాల మీద కులానికి ఉన్న ప్రభావం నిజంగా ఘోరాతి ఘోరం. ప్రజాసేవాసక్తిని కులం చంపేసింది. దానధర్మ భావాన్ని నాశనం చేసింది. స్వతంత్ర భావప్రకటనను అసాధ్యం చేసింది.

హిందువుడి ప్రజలు, సమాజం అతడి కులంవారే. హిందువుడి బాధ్యత అతడి కులం వరకే. హిందువుడి భక్తి ప్రపత్తులు అతడి కులానికే పరిమితం. గుణం సామర్థ్యాలు కలవారిని హర్షించేది లేదు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం లేదు. బాధను గుర్తించి సాయపడేది లేదు. దానం చెయ్యడం ఉంది కాని, అది కులంతోనే ప్రారంభమై కులంతోనే అంతరిస్తుంది. సానుభూతి ఉంది. అయితే, అది ఇతర కులాలవారిపట్ల కాదు.

గొప్పవాడూ, మంచివాడూ అయిన ఒక వ్యక్తి నాయకత్వాన్ని కులప్రమేయం లేకుండా ఏ హిందువుడైనా గుర్తించగలడా? మహాత్ముడి సంగతి అట్లా వదిలేద్దాం. హిందువుడైనవాడు తన కులానికి చెందినవాడు నాయకుడైతేనే, ఆ నాయకుడ్ని

అనుసరిస్తాడు. బ్రాహ్మణుడు బ్రాహ్మణుని నాయకత్వాన్నే గుర్తిస్తాడు. కాయస్థుడు కాయస్తుని నాయకత్వాన్నే అనుసరిస్తాడు. ఏ కులంవాడు ఆ కులంవాడ్ని మాత్రమే నాయకుడిగా ఒప్పుకుంటాడు. కులంతో సంబంధం లేకుండ ఆ వ్యక్తిలోని గుణగణాలను, శక్తి సామర్థ్యాలను, గొప్పతనాన్ని గుర్తించే పద్ధతి హిందువులలో లేదు. గొప్పతనాన్ని గుర్తించే శక్తి అసలు లేదని కాదు. అట్టి గొప్పతనం కలవాడు తన కులంవాడైనప్పుడు మాత్రమే అది గుర్తించబడుతుంది. హిందువులలోని మొత్తం నీతి అంతా ఆటవిక నీతి వంటిది. మంచిగాని చెడుగాని నా కులంవాడే, నా వాడనే తత్వం హిందువులది. మంచికోసమో, చెడ్డకోసమో నిలబడాలనే ప్రశ్న లేదిక్కడ. తన కులం కోసం నిలబడడం అనే దొక్కటే ఇక్కడ ఉన్నది. తమ తమ కులాల స్వప్రయోజనాల కోసం హిందువులు మొత్తం దేశానికే ద్రోహం చేయలేదా?

## ఆదర్శ ప్రాయమైన సమాజం ఎలా ఉండాలి?

కులవ్యవస్థ తెచ్చిపెట్టిన దురవస్థల గురించి నేనిలా చెప్పుకుపోతుంటే, మీలో కొందరికి విసుగ్గా ఉండవచ్చు. అందులో విచిత్రమేమీ లేదు. నేను చెప్పేదానిలో క్రొత్తకూడ ఏమీలేదు. కులవ్యవస్థా-దాని విచ్ఛిన్నకర స్వభావమూ, అవి దేశానికి చేసిన ద్రోహమూ-ఇదంతా అందరికీ తెలిసిన విషయమే. అందువల్ల, ఈ సమస్యలు పరిష్కరించడానికి నిర్మాణాత్మకంగా ఎలాంటి కృషి చెయ్యవలసి ఉంటుందో ఇప్పుడు కొంత పరిశీలిద్దాం.

కులం అక్కర లేదనుకుంటే, మరి మీకు ఆదర్శప్రాయమైన సమాజం ఎలాంటిది అని ఎవరైనా అడగవచ్చు. ఈ ప్రశ్న మీరు నన్ను అడిగితే, నీ కాదర్శప్రాయమైనట్టిది - స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం ఈ మూడింటి మీదా ఆధారపడిన సమాజం అని నే నంటాను. మన సమాజం అలా ఎందుకు కాకూడదు? స్వాతంత్ర్యం, సమానత్వం సమాజానికి ఎంత ముఖ్యమో, సౌభ్రాతృత్వం కూడా అంతే ముఖ్యం. సౌభ్రాతృత్వానికి ఎందుకు అభ్యంతరం ఉండాలో నాకర్థంకాదు. ఆదర్శప్రాయమైన సమాజం మార్పుకు అనుకూల మైందిగా ఉండాలి. స్తబ్దంగా ఉండకూడదు. ఒకచోట ఒక మార్పు జరిగితే, ఆ మార్పు తక్కినచోట్ల కూడ

ప్రతిబింబించే మార్గాలతో నిండి ఉండాలి. ఆదర్శ ప్రాయమైన సమాజంలో సమాజ సభ్యులంతా కలిసి ఇష్టంగా పంచుకోగల అనేక ఉమ్మడి ప్రయోజనాలు ఉండాలి. సామాజిక సంబంధాలన్నింటిలోను స్వేచ్ఛాయుతమైన. బహుముఖమైన సంసర్గం ఉండాలి. క్లుప్తంగా చెప్పాలంటే - సమాజంలోని మానవులందరి మధ్యా సాంఘిక సోదరత్వం ఉండాలి. అదే సౌభ్రాతృత్వం. సౌభ్రాతృత్వం అంటే, ప్రజాస్వామికానికి మరొక పేరు. ప్రజాస్వామిక మంటే ఒకరకమైన ప్రభుత్వం మాత్రమే కాదు. పరస్పరాను బంధం గల ఒక పద్ధతి. జీవిత విధానం అది. ఒక పద్ధతి సంయుక్త సంసర్గ సౌమ్యానుభవ మది. తోటి మానవులపట్ల గౌరవ మర్యాదలను ప్రదర్శించడం ప్రజాస్వామిక జీవిత విధానంలో అత్యంత ప్రధాన విషయం, కనుక సమాజంలో సౌభ్రాతృత్వం తప్పని సరిగా ఉండాలనడంలో ఎవ్వరికీ ఏ విధమైన అభ్యంతరము ఉండదనుకుంటాను.

## ఇక స్వాతంత్ర్యం విషయం

స్వాతంత్ర్యం అక్కర లేదనేవారు ఎవరైనా ఉంటారా? ఎవ్వరూ ఉండరు. స్వేచ్ఛగా తిరగడం, స్వేచ్ఛగా బ్రతకడం, స్వేచ్ఛగా అభివృద్ధి పొందడం వీటి నిచ్చేదే స్వాతంత్ర్యం అనుకొంటే-స్వాతంత్ర్యం అక్కరలేదనేవారు ఎవ్వరైనా ఉంటారని నేననుకోను. ఆస్తిపై హక్కు కావాలి. ఉపకరణాలు, సాధనాలు, ముడిపదార్థాలు-ఇవి అన్నీ ధనార్జనకు కావాలి. శరీరం ఆరోగ్యంగా ఉండడానికి తగిన బ్రతుకుదెరువు కావాలి. అందుకు కావలసిన సదుపాయాల సాధనకు స్వాతంత్ర్యం కావాలి. అంతవరకు స్వాతంత్ర్యం అక్కరలేనివారు ఉండరు. అయితే, ఇక్కడ నేను ఒక ప్రశ్న అడుగుతాను. వ్యక్తికిగల శక్తి సామర్థ్యాలను చక్కగా ఉపయోగించుకోవడం ద్వారా ఈ స్వాతంత్ర్యం అనేది ఎందుకు ఎక్కువ ఫలప్రదం కాకూడదు? బ్రతకడానికి, ఆస్తికి హక్కు కలిగి ఉండడం వరకు స్వాతంత్ర్యాన్ని అంగీకరిస్తున్న కులతత్వవాదులు వ్యక్తి తన వృత్తిని తాను ఎంచుకొనే స్వాతంత్ర్యానికి అంగీకరించడం లేదు. ఈ రకమైన స్వాతంత్ర్యాన్ని నిరోధించడం అంటే బానిసత్వాన్ని శాశ్వతంగా స్థిర పరచడమే. బానిసత్వమంటే ఒకళ్ళ అధీనంలో మరొకళ్ళు ఉండడం మాత్రమే కాదు. బానిసత్వమంటే కొంతమంది మనుషులు తమజీవిత కార్యకలాపాలను మరికొంత మంది మనుష్యుల ఆజ్ఞల ప్రకారం

బలవంతంగా స్వీకరించవలసి రావడం. అదీ బానిసత్వం. చట్టంక్రింద బానిసత్వ పరిస్థితులు వ్యాపించి ఉన్నవి. కొంతమంది వ్యక్తులు తమకు ఇష్టంకాని వృత్తులను అవలంబించేటట్టు బలవంతం చెయ్యబడడం ఉంది. అందుకు కులవ్యవస్థ ఒక ప్రబల నిదర్శనం.

**ఇక మూడోది సమానత్వం:** దీనికేమైనా అభ్యంతరం ఉంటుందా? ఫ్రెంచి విప్లవం నినాదంలో అత్యంత వివాదాస్పదమైన అంశం ఇది. సమానత్వానికి వ్యతిరేకంగా చెప్పబడే వాదన సరైందిగానే కన్పించవచ్చు. మనుష్యులంతా సమానులు కారు. ఒక మనిషికీ, మరొక మనిషికీ రకరకాల తేడాలు కన్పిస్తాయి. అంతమాత్రంచేత సమానత్వాన్ని త్రోసి పుచ్చడమేనా. సమానత్వం అనేది కేవలం మిథ్య అనవచ్చు. అయినప్పటికీ సామాజిక జీవితాన్ని నడిపే ప్రాథమిక సూత్రంగా దాన్ని అంగీకరించక తప్పదు.

**మానవుని శక్తి:** 1. భౌతికమైన వారసత్వం మీద 2. తల్లి దండ్రుల జాగ్రత్త. విద్య, ప్రకృతి విజ్ఞానం మొదలైన సాంఘిక సౌకర్యాల ప్రాప్తిమీద 3. స్వప్రయత్నం మీద ఆధారపడి ఉంటుంది. ఈ మూడు విషయాలలోనూ మానవుల మధ్య తరతమ భేదాలు ఉన్నమాట నిజమే, అయితే-వారిలో తరతమ భేదాలు ఉన్నాయి కాబట్టి, వారిని సమానులుగా చూడ కూడదు-అనడం సవ్యమేనా? సమానత్వానికి వ్యతిరేకులైన వారు జవాబు చెప్పవలసిన ప్రశ్న ఇది. వ్యక్తిత్వవాది దృష్టితో చూస్తే-మనుష్యుల్ని వాళ్ళ కృషుల్ని-అవి ఒకే విధంగా ఉండవన్నంత వరకు- అసమానంగా చూడ్డమే న్యాయం కావచ్చు. ప్రతీ మనిషి శక్తులు సంపూర్ణంగా వికసించడం కోసం, వీలైనంత ప్రోత్సాహాన్ని ఇవ్వడం కూడ ఆపేక్షణీయమే కావచ్చు. కాని నేను పైన పేర్కొన్న మొదటి రెండు విషయాలలోను మనుష్యులు ఉన్న వాళ్ళున్నట్టు అసమానంగా చూడబడితే, ఏమి జరుగుతుంది? ఏమి జరుగుతుందో ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. పుట్టుక, చదువు, వంశప్రఖ్యాతి, వ్యాపార సంబంధాలు, వారసత్వంగా వచ్చిన ధనం ఇవి ఎవరికి అనుకూలంగా ఉంటాయో అట్టి వ్యక్తులే జీవిత సమరంలో ముందుకు వచ్చేలాగు ఎంచుకోబడతారనేది స్పష్టం. సమాజంగా అట్టి వాళ్ళకి జాతిలో ప్రాధాన్యం ఇవ్వబడుతుంది. అట్టి ఎన్నిక సామర్థ్యాన్ని అనుసరించి జరిగేదిగా ఉండదు. అంతవరకూ వాళ్ళు అనుభవిస్తున్న ప్రత్యే సౌకర్యాల దృష్ట్యా జరిగేది మాత్రమే ఔతుంది.

కాగా పైన చెప్పబడ్డ మూడో విషయంలో మనుష్యుల్ని అసమానంగా పరిగణించాలనే టందుకు గల కారణమే మొదటి రెండు విషయాలలోను వారిని వీలైనంత సమానంగా పరిగణించాలనే టందుకు కారణం ఔతుంది.

అంతేకాదు. సమాజం దాని సభ్యులనుంచి వీలైనంత ఎక్కువ ఫలితాన్ని పొందడం మంచి దనుకొన్నప్పుడు, ఆ విధంగా పొందడం వారిని వీలైనంత వరకూ జీవితప్రారంభ దశ నుంచీ సమానులుగా చెయ్యడం ద్వారా మాత్రమే సాధ్యమౌతుంది. సమానత్వం నుంచి మనం తప్పించుకోలేకపోవడానికి ఇది ఒక కారణం.

సమానత్వాన్ని మనం తప్పకుండ అంగీకరించలసిన హేతువు మరొకటి ఉంది. ఏ రాజ్యతంత్రజ్ఞుడైనా అనేక మందికి ప్రజలతో సంబంధాన్ని కలిగి ఉంటారు కదా! అట్టి వారికి అసంఖ్యాకులైన ప్రజల మధ్య విచక్షణతో విభాగాలను ఏర్పరచడానికి – అంటే అవసరాన్ని బట్టో, సామర్థ్యాన్ని బట్టో విభజించి తగు విధమైన న్యాయం చేకూర్చడానికి చాలినంత సమయమూ ఉండదు, పరిజ్ఞానమూ ఉండదు. ప్రజలందరికీ ఎవరికి తగిన న్యాయం వారికి చేకూర్చడం అనేది అవసరమే అయినప్పటికీ, మానవ సమాజాన్ని అందుకు అనుకూలంగా తరగతులుగాను, వర్గాలుగాను విభజించడం సాధ్యం కాదు. అందువల్ల రాజ్య తంత్రజ్ఞుడు ఏదో ఒక సాధారణ బండ పద్ధతిని అవలంభించక తప్పదు. అట్టి పద్ధతి మొత్తం మానవులందరినీ సమానంగా చూడ్డం. ఎందుకంటే – మానవులందరూ సమానులై నందువల్ల నని కాదు. మానవుల్ని వర్గాలుగా, తరగతులుగా విభజించడం అసాధ్యమైనందువల్ల. సమానత్వం, సిద్ధాంతం స్పష్టంగా మిథ్య అనే చెప్పవచ్చు అయితే, సమస్త విషయాలనూ పరిగణనలోకి తీసుకొన్నప్పుడు రాజకీయరంగంలో ఏ రాజ్యతంత్రజ్ఞుడైనా చెయ్యగల్గింది. ఒక్కటే సార్వజనికమైన బండ పద్ధతిని అవలంబించి ముందుకు సాగడం. అట్టి బండపద్ధతి సర్వమానవ సమానత్వం. రాజకీయ రంగం ఒక ప్రగాఢ వాస్తవిక వ్యవహారం. దానికి అదే స్థాయిలో ఒక ప్రగాఢ వాస్తవిక పద్ధతి కావలసి ఉంది.

## ఆర్య సమాజకులు - వర్ణ వ్యవస్థ

అయితే, కొందరు సంస్కర్తలున్నారు. వారు మరొక విధమైన లక్ష్యాన్ని ప్రతిపాదిస్తున్నారు. వారు ఆర్య సమాజకులు. వారు చెప్పే సాంఘిక వ్యవస్థ ఇది. ఇండియాలో ఇప్పుడు మనకున్న నాలుగువేల కులాలకు బదులు, నాలుగు వర్ణాలుగా

సమాజాన్ని విభజించడం. అదే చాతుర్వర్ణ్య వ్యవస్థ. అయితే హిందువులు చెప్పే చాతుర్వర్ణ్య వ్యవస్థకూ నేటి ఆర్యసమాజకులు చెప్పే చాతుర్వర్ణ్య వ్యవస్థకూ భేదం ఉంది. ఆర్య సమాజకుల చాతుర్వర్ణ్య వ్యవస్థ పుట్టుకమీద ఆధారపడినట్టిది కాదు. గుణంమీద అధారపడినట్టిది. ఆధునిక కాలానికి ఆకర్షణీయంగా ఉండడం కోసం ఆర్యసమాజకులు చాలా జాగ్రత్తగా తమ లక్ష్యాన్ని నిర్వచించారు. అయితే -గుణాన్ని అనగా అర్హతను ప్రాతిపదికగా చెపుతున్నప్పటికీ, నాకు ఈ క్రొత్త చాతుర్వర్ణ్య వ్యవస్థలో నమ్మకం లేదు. ఆర్యసమాజకులు చెప్పే చాతుర్వర్ణ్య వ్యవస్థ క్రింద ఒక వ్యక్తి నాలుగు వర్ణాలలోను ఏదో ఒక వర్ణంలో అతడి అర్హతను బట్టి చేరవలసి ఉంటుంది. ఇందుకు నాకు అభ్యంతరం ఏమిటంటే - అసలు మనుషుల్ని ఎందుకు విడదీయాలి? బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు అని మనుషుల్ని ఆర్యసమాజకులు ఎందుకు విడదీయాలంటారో నాకు అర్థం కాదు. బ్రాహ్మణుడు అనేపేరు పెట్టకుండా జ్ఞానసంపన్నుడైన వ్యక్తిని గౌరవించలేమా? క్షత్రియుడు అనే పేరుతో పిలవకుండానే సైనికుడు గౌరవించబడగలడు. ఐరోపా సమాజంలో ఏదో ఒక కులం పేరో, వర్గం పేరో పెట్టకుండా-అంటే, ఏదో ఒక శాశ్వత ముద్ర వేయకుండా- సైనికులను, సేవకులను సన్మానించడం జరుగుతున్నప్పుడు, అట్టిది హిందూసమాజంలో ఎందుకు సాధ్యం కాదో అర్థం కాదు. ఈ ప్రశ్నను ఆర్యసమాజకులు కనీసం పరిశీలన యోగ్యమని కూడ అనుకోలేదు. ఈ కుల ముద్రలను కొనసాగించడానికి మరొక అభ్యంతరం కూడ ఉంది. ఏ సంస్కరణ అయినా సరే, మార్పును కోరుతుంది. మార్పు లేకుండా సంస్కరణ లేదు. సంస్కరణ అంటే - మనుష్యులపట్ల, విషయాలపట్ల - ప్రజల భావనలోను, సెంటిమెంట్సులోను, విశ్వాసాలలోను, మనోవైఖరిలోను మార్పు జరగడమే. కొన్ని పేర్లకు కొన్ని విశ్వాసాలతో, అభిప్రాయాలతో అనుబంధం ఉండటం - ఇది మనుష్యుల పట్ల, విషయాలపట్ల ఒక వ్యక్తి వైఖరిని నిర్ణయిస్తూ ఉండటం - సాధారణంగా మనం చూస్తూ ఉంటాం. బ్రాహ్మణుడు, క్షత్రియుడు, వైశ్యుడు, శూద్రుడు అన్నపేర్లు - ప్రతి హిందువుడి మనస్సులోను కొన్ని స్థిరమైన భావాలను, స్థిరమైన వైఖరులను కలిగించే పేర్లు. ఆ భావన జన్మమీద ఆధారపడిన హెచ్చుతగ్గు వ్యవస్థను స్ఫురింపజేసేది. ఈ పేర్లు ఎంతకాలం అయితే వాడుకలో ఉంటాయో అంత కాలం - బ్రాహ్మణుడు, క్షత్రియుడు, వైశ్యుడు, శూద్రుడు అనగానే జన్మరీత్యా హెచ్చు తగ్గు

కుల విభాగాల గుర్తింపు హిందువుల మనస్సులలో యథాతథంగా ఉండిపోతుంది. ఆ విధంగానే ఆచరిస్తూ ఉంటారు. ఇదంతా హిందువుడు విస్మరించేలా చెయ్యాలి. అయితే, ఈ పాత పేర్లు అమల్లో ఉన్నంతకాలం మరచిపోవడం అనేది ఎలా సంభవం? ఈ పేర్లు గత పాత అభిప్రాయాలను నిత్యమూ జ్ఞప్తికి తెస్తూనే ఉంటాయి గదా. ప్రజలు మనస్సులలో క్రొత్త పేర్లను పెట్టుకోక తప్పదు. పాత పేర్లను కొనసాగించడం సంస్కరణను విఫలం చెయ్యడమే? గుణం మీద (అర్హత మీద) ఆధారపడ్డ ఈ (ఆర్యసమాజకుల) చాతుర్వర్ణ్య వ్యవస్థలోని వర్ణాలకు మళ్ళీ ఆ క్రుళ్ళి పాడుకంపు కొడుతున్న పాత బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అనే పేర్లే పెట్టడం-పుట్టుక మీద ఆధారపడ్డ పాత వ్యవస్థను మరొక రూపంలో స్థిరపరచడమే అవుతుంది. ఇదొక వలయం.

## కులాన్ని భగ్నం చెయ్యకుండా

## ఆర్య సమాజపు వర్ణ వ్యవస్థ సాధ్యమా?

పాత ముద్రలతో కొనసాగాలంటున్న ఈ క్రొత్త చాతుర్వర్ణ్య విభజన సూత్రం నాకు చాల అసహ్యం. నా సమస్త వ్యక్తిత్వంతోను దాన్ని ఎదిరించాలనిపిస్తుంది నాకు. అయితే ఈ సూత్రానికి నా వ్యతిరేకత కేవలం సెంటుమెంటు మీద మాత్రమే ఆధారపడింది కాదు. నేను దానిని వ్యతిరేకించడానికి ఇంకా ఎక్కువ బలమైన కారణాలు ఉన్నాయి. దీనిని లోతుగా, వివరంగా పరిశీలించి చూస్తే - ఒక సామాజిక వ్యవస్థగా చాతుర్వర్ణ్య సూత్రం అమలుజరపడానికి వీలులేనిదిగా కన్పిస్తుంది. వాస్తవ దృష్టిలో ఆచరణయోగ్యం కానిదిగా, హానికరంగా కూడ కన్పిస్తుంది. ఆ వ్యవస్థ పూర్తి పరాజయం పొందినట్టు సైతం మనకు స్పష్టపడుతుంది. ఆచరణదృష్టితో చూస్తే చాతుర్వర్ణ్య వ్యవస్థ కలిగించే ఇబ్బందులకు లెక్కలేదు. అయితే, వాటిని దాని అనుయాయులు గుర్తిస్తున్నట్టు లేదు?

కులం, వర్ణం - ఈ రెండింటి మూల సూత్రాలు ఒకటి కాదు. వాటి మధ్య ప్రాథమికమైన భేదం చాల ఉంది. కేవలం భేదం మాత్రమే కాదు. ఈ రెండూ ఒకదాని కొకటి పరస్పర విరుద్ధమైనట్టివి. ఇందులో మొదటిది (కులం ) పుట్టుక

మీద ఆధారపడినట్టిది. రెండవది (వర్ణం) అర్హత మీద ఆధారపడినట్టిది. పుట్టుక రీత్యా ఒక ఉన్నత స్థానంలో ఉన్న వారిని – అంటే అర్హతను బట్టి వచ్చిన స్థానం కాదు – ఈ ఉన్నత స్థానాలనుంచి వారిని బలవంతంగా మనం ఎలా ఖాళీ చేయించగలం? అలాగే, పుట్టుక కారణంగా తక్కువ స్థాయిలో ఉన్న ఒక ప్రజ్ఞావంతుణ్ని, అతని నిజమైన అర్హతను బట్టి అతనికి రావలసిన ఉన్నత స్థాయిని చేకూర్చేటట్టు మనం ప్రజల్ని ఎలా బలవంతం చేయగలం? అలా చేయాలంటే, ముందుగా మనం కులవ్యవస్థను భగ్నం చెయ్యక తప్పదు. కులవ్యవస్థను భగ్నం చెయ్యకుండా వర్ణ వ్యవస్థను స్థాపించలేం. పుట్టుకమీద ఆధారపడిఉన్న ఈ నాటి నాలుగువేల కులాలను అర్హత ప్రాతిపదికగా ఉండే నాలుగు వర్ణాల క్రిందకు ఎలా తీసుకురావడం? చాతుర్వర్ణ్య సూత్రాన్ని పట్టుకొని వ్రేలాడుతున్న వాళ్ళు ఎదుర్కోవలసిన మొదటి ఇబ్బంది ఇది.

ప్రజల్ని నాలుగు స్పష్టమైన వర్గాలుగా విభజించ వచ్చుననే ఊహమీద చాతుర్వర్ణ్య సూత్రం ఆధారపడి ఉంది. ఈ విభజన సాధ్యమేనా? ఈ చాతుర్వర్ణ్య సూత్రం ప్లేటోనిక్ సిద్ధాంతానికి చాల దగ్గరగా ఉన్నట్లు కన్పిస్తుంది. చూడండి. స్వభావరీత్యా మానవులు మూడు వర్గాల క్రిందికి వస్తారని ప్లేటో మహాశయుడు అంటాడు. కొంతమంది మనుష్యులు కేవలం ఆకలి బాధకే ప్రాముఖ్యం ఇస్తారట. అట్టి వాళ్ళను కార్మికులుగా, వర్తకవ్యాపారులుగా కేటాయించాలట. మరికొందరు ఆకలి బాధలకు అదనంగా ధైర్యసాహసాలు కలిగి ఉంటారట. అట్టివాళ్ళే దేశరక్షక యోధులు, శాంతి రక్షకులూ అట. ఇంకా కొందరు ఈ భౌతిక విషయాల వెనుక నున్న విశ్వజనీనతనూ, కార్య కారణ సంబంధాన్నీ గ్రహించగల శక్తి కలిగి ఉంటారట. అట్టివాళ్ళే శాశనకర్తలట. అది ప్లేటో మహాశయుని సిద్ధాంతం.

ఆయన ఈ సిద్ధాంతం ఎట్టి విమర్శకు లోనయిందో మీ చాతుర్వర్ణ్య సూత్రం కూడ అట్టి విమర్శకే గురి అవుతుంది. అంటే మానవుల్ని నాలుగు నిర్దుష్టమైన తరగతులుగా విభజించవచ్చునని ఊహించడంలో చాతుర్వర్ణ్య సూత్రావలంబకులు ప్లేటో మహాశయుని సూత్రంపట్ల ఇచ్చినట్టి విమర్శకు గురికాక తప్పదు. ప్లేటోమీద వచ్చిన ముఖ్య విమర్శ ఏమిటి? అసంఖ్యాకులైన వ్యక్తుల్ని మూడు కట్టలుగా కట్టిపారవెయ్యడం. అంటే – మానవ స్వభావాన్నీ, మానవ వ్యక్తుల్నీ అపార్థం

చేసుకోవడమే అవుతుంది. ప్రతి వ్యక్తి ఒక ప్రత్యేకమైన స్వభావాన్నీ మానవ శక్తుల్ని అపార్థం చేసుకోవడమే అవుతుంది. ప్రతి వ్యక్తి ఒక ప్రత్యేకమైన స్వభావాన్నీ, శక్తినీ కలిగి ఉంటాడన్న సత్యాన్ని ప్లేటో మహాశయుడు గుర్తించలేదు. ఏ వ్యక్తికి ఆ వ్యక్తే ఒక ప్రత్యేక శక్తి. ఏ వ్యక్తికి ఆ వ్యక్తే ఒక విశిష్టత గల అనన్య సామాన్యుడు. తనకు తానే ఒక ప్రత్యేక వర్గం. ఒక వ్యక్తిలో ఉండే వివిధప్రకృతులలోను, వాటి సమీకరణలోను ఉండే అనంతమైన వైవిధ్యాన్నీ ప్లేటో గుర్తించలేదు. ఆయన దృష్టిలో వ్యక్తికి కొన్ని రకాల శక్తులూ, నైపుణ్యాలూ మాత్రమే ఉంటాయి. ఈ దృష్టి పూర్తిగా తప్పు. మానవుల్ని కొన్ని స్పష్టమైన వర్గాలుగా విభజించడం మానవ మనస్తత్వాన్ని గుర్తించక పోవడమే అవుతుంది. అట్టి సిద్ధాంతాన్ని లక్ష్యపెట్టనక్కరలేదని ఆధునిక విజ్ఞాన శాస్త్రం నిరూపించి చూపింది. మానవులలోని శక్తులు అనంత మైనట్టివి. విభిన్నమైనట్టివి. అట్టి మానవులందరినీ కలిపి మూడో, నాలుగో, వర్గాలుగా విభజించడం వారిలోని శక్తుల్ని ఉపేక్షించి నిరుపయోగ పరచడమే!

కాగా, ప్లేటో సిద్ధాంతం ఎందుకు విఫలం అయిందో, ఏకారణంగా విఫలం అయిందో, ఆ కారణంగానే చాతుర్వర్ణ్య సూత్రం విఫలం కాక తప్పదు. అపారమైన శక్తి యుక్తులు గల మానవుల్ని ఏవో మూడు, నాలుగు తరగతులుగా వేరు పరచి, పావురాలవలే పట్టి బొరియల్లో ఇమడ్చడం సాధ్యం కాదు. ఆదిలో నాలుగు వర్ణాలుగా విభజించబడ్డ వారు, ఇప్పుడు నాలుగు వేల కులాలుగా పెరిగిపోవడాన్ని బట్టి చూస్తే ప్రజల్ని నాలుగు నిర్దుష్టమైన వర్గాలుగా విభజించడం అసాధ్యమని తేలిపోయింది.

చాతుర్వర్ణ్య వ్యవస్థ ఏర్పాటు విషయంలో మరో ఇబ్బంది ఉంది. చాతుర్వర్ణ్య వ్యవస్థ ఏర్పడిందే అనుకొందాం. ఏర్పడిన తరువాత దానిని నిర్వహించడం ఎలా! ఈ చాతుర్వర్ణాలను ఖచ్చితంగా అమలుపరచాలంటే – దానికోసం ఆ ప్రక్కనే ఒక నేర విచారణ శాఖను కూడ ఏర్పాటు చేసుకోవలసి ఉంటుంది. మానవుల్ని నాలుగు వర్ణాలుగా విభజించడం అంటే, ఆ ప్రక్కనే వర్ణ సాంకర్య ప్రమాదం కూడ ఉన్నదన్న మాట. వర్ణ సాంకర్య దోషానికి ఖచ్చితమైన శిక్షలను నిర్ణయించక పోయినట్లయితే, మానవులు తమ తమ వర్ణాలకు కట్టుబడి ఉండరు. మానవులందరినీ నాలుగు వర్ణాలుగా విభజించడం అంటే, అది మానవ స్వభావానికే విరుద్ధం కనుక, వర్ణ సాంకర్యం తప్పదు. కనుక, అందుకోసం ఒక శిక్షాస్మృతి లేకపోతే, చాతుర్వర్ణ్య

పద్ధతి ఎక్కడికక్కడే కూలిపోక తప్పదు. చాతుర్వర్ణ పద్ధతుల్లో స్వభావ సిద్ధమైన మంచి ఏమీ లేదు. పైగా, అది మానవ స్వభావానికి విరుద్ధం. అందువల్ల ఆ పద్ధతి స్వశక్తిమీద నిలవడం సాధ్యం కాదు. కాగా చట్టం ద్వారా దానిని అమలు పరచవలసి ఉంది.

శాసనం, శిక్షా లేకాండా, చాతుర్వర్ణ్య వ్యవస్థ బ్రతకజాలదన్న సత్యం, రామాయణంలోని శంభుకవధ ఉదంతం నిరూపించింది. కొంత మంది ఈ విషయంలో రాముణ్ని నిందిస్తారు. రాముడ్ని నిందించడం పరిస్థితిని పూర్తిగా అపార్థం చేసుకోవడమే. రామరాజ్యం చాతుర్వర్ణ్య వ్యవస్థను కాపాడవలసి ఉంది. శంభుకుడు శూద్రుడు. అతడు తన వర్ణ ధర్మాన్ని విడిచిపెట్టి, బ్రాహ్మణుడు కావాలని ప్రయత్నించాడు. అది వర్ణ సాంకర్యమే కనుక, శిక్షాపాత్రమే కనుక, అతనిని చంపడం రాముడికి తప్పదు. అలా చంపక పోతే, రాముడు తన కర్తవ్యాన్ని విస్మరించిన వాడవుతాడు. రాముడు శంభుకుడ్ని చంపటానికి కారణం ఇది. ఈ ఉదంతం వల్ల మనకు తెలుస్తున్న దేమిటంటే – చాతుర్వర్ణ్య వ్యవస్థ అమలు జరిపి, దానిని సక్రమంగా నిర్వహించాలంటే, సాధారణ శిక్షలే కాదు. మరణ శిక్షలు కూడా అవసరం అవుతాయి. అందుకే, రాముడు మరణశిక్ష కంటే తక్కువ శిక్షను శంభుకుడికి విధించలేకపోయాడు. అందుకే–వేదం చదివిన శూద్రుడి నాలుక కొయ్యాలి. వేదం విన్న శూద్రుడి చెవిలో సీసం కరిగించి పొయ్యాలి మొదలైన కఠినమైన శిక్షలను మనుస్మృతి విధించింది. కాగా, చాతుర్వర్ణ్య వ్యవస్థను అమలులో పెడతామని చెప్పుతున్న వాళ్ళ ఇరవయ్యో శతాబ్దంలో ఆధునిక సమాజంలోని మానవులను ఖచ్చితంగా నాలుగు భాగాలుగా విభజింపగలమనీ, మనుస్మృతి చెప్పిన శిక్షలను అమలు పరచగలమనీ హామీ ఇవ్వవలసి ఉంటుంది.

చాతుర్వర్ణ్య వ్యవస్థను సమర్థిస్తున్న వారు తమ వ్యవస్థలో స్త్రీల కేమౌతుందన్న విషయాన్ని ఆలోచించినట్టు కనబడదు. స్త్రీలు కూడ బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాలుగా విభజించ బడతారా, లేక తమ భర్తల హోదానే పొందుతారా? స్త్రీ యొక్క వర్ణం వివాహం మీద ఆధారపడవలసి ఉంటే, అసలు చాతుర్వర్ణ్య మూల సిద్ధాంతమే ఎగిరిపోదా? ఒక మనిషి విలువను బట్టి ఆ మనిషి వర్ణాన్ని

నిర్ణయించాలనేది కదా చాతుర్వర్ణ్య సిద్ధాంతం? విలువలను బట్టి మానవులు నాలుగు వర్ణాలుగా విభజించ బడడం అనేది నిజమైన విభజనా? లేక, నామమాత్ర విభజనా? అది కేవలం నామమాత్ర విభజనే అయితే, అది వ్యర్థం. అప్పుడు తమ పద్ధతి స్త్రీలకు వర్తించదని చాతుర్వర్ణ్య సమర్థకులు ఒప్పుకోవలసి ఉంది. అది నిజమైన విభజన అయితే, దానిని స్త్రీలకు కూడా యథాతథంగా వర్తింపజేయడానికి చాతుర్వర్ణ్య వాదులు సిద్ధంగా ఉన్నారా? అప్పుడు, పురోహితురాండ్రను, సైనికురాండ్రు, కావడానికి స్త్రీలను అనుమతించే మగవాడు గొప్ప సాహసవంతుడై ఉండాలి. మరి చాతుర్వర్ణ్య పద్ధతిని స్త్రీలకు వర్తింప జేయడం అంటే ఈ పర్యవసానాలు తప్పవు. ఈ ఇబ్బందులన్నీ పరామర్శించి చూచుకొన్న తరువాత, కేవలం మనిషి పుట్టుకతో మూర్ఖుడు అయితే తప్ప, మరొక డెవడూ చాతుర్వర్ణ్య పద్ధతిని విజయవంతంగా పునరుద్ధరించ గలమను కొంటాడని నేను భావించను.

## అత్యధిక సంఖ్యాకులైన శూద్రుల్ని బానిసలుగా చేసిన వ్యవస్థ

పోనీ, చాతుర్వర్ణ్య పద్ధతి ఆచరణ సాధ్యం అనుకొన్నప్పటికీ, అది చాల విషతుల్యమైన వ్యవస్థ అని నా ఉద్దేశం. బ్రాహ్మణులు జ్ఞానార్జన చెయ్యడం క్షత్రియులు ఆయుధపాలురు కావడం, వైశ్యులు వ్యాపారం నిర్వర్తించడం, శూద్రులు సేవకావృత్తిని అవలంబించడం - ఇది అంతా పైకి క్రమ విభాగ పద్ధతిగా కన్పించవచ్చు. శూద్రులు యీ పద్ధతి ప్రకారం ఇతర వృత్తులు, అంటే - జ్ఞానార్జన, ఆయుధ ధారణ, వ్యాపారం వంటి వేవీ చేయనవసరం లేదా? చేయకూడదా? ఇది చాలా గమనార్హమైన విషయం. చాతుర్వర్ణ్యాన్ని సమర్థించేవాళ్ళు మొదటి అర్థాన్నే చెపుతారు అంటే తక్కిన పనులు చేయనవసరంలేదనే అర్థాన్నే చెపుతారు. శూద్రుడు ధనం సంపాదించే శ్రమెందుకు పడాలి? అతడ్ని పోషించడానికి తక్కిన మూడు వర్ణాలు ఉన్నాయి కదా? చదవడం, వ్రాయడం అవసరమైనప్పుడు చదివి చెప్పడానికి, వ్రాసి పెట్టడానికి బ్రాహ్మణుడు ఉన్నాడు కదా! శూద్రుడు ప్రత్యేకంగా బాధపడి చదువెందుకు నేర్చుకోవాలి. అవసరమైనప్పుడు రక్షించడానికి తక్కిన మూడు వర్ణాలు ఉన్నాయి కదా? తానే ఆయుధాలు ధరించే బాధను శూద్రుడు ఎందుకు పడాలి? ఇదే చాతుర్వర్ణ్య సిద్ధాంతం.

ఈ సిద్ధాంతం రీత్యా చూస్తే శూద్రుడు కేవలం చిన్నకుర్రవాడు. మిగిలిన మూడు వర్ణాలూ అతని సంరక్షకులు. ఈరకంగా చూచుకొంటే, ఇది ఏదో మంచి ఆకర్షణీయమైన సిద్ధాంతంగానే కన్పిస్తుంది. చాతుర్వర్ణ్యం యొక్క అంతర్యం ఇదే అనుకున్నప్పటికీ - ఈ పద్ధతి నా దృష్టిలో సక్రమమైనది గాను, ఆచరణ యోగ్యంగాను కనిపించదు. బ్రాహ్మణులు విద్యార్జనను, క్షత్రియులు సైనిక వృత్తిని, వైశ్యులు కృషి వ్యాపారాలను మానివేస్తే - అప్పుడు శూద్రుడి పని ఎమి కావాలి? పోనీ ఆ మూడు వర్ణాలూ తమ వృత్తుల్ని తాము నిర్వహించుకొంటారనుకుందాం. కాని శూద్రుడి పట్ల వాళ్ళ బాధ్యతల్ని నిరాకరిస్తే, ఏమయ్యేటట్టు? అంటే - పై వర్ణాలు అన్నీ కలిసి. న్యాయమైన షరతుల మీద శూద్రుడ్ని రక్షించడానికి నిరాకరించి, అణచి పెట్టి ఉంచడానికి ప్రయత్నిస్తే, ఏమయ్యేటట్టు? అప్పుడు శూద్రుడ్ని - ఆ మాటకు వస్తే క్షత్రియుడ్ని, వైశ్యుడ్ని కూడా-వారి అజ్ఞానాన్ని ఆధారంగా చేసుకొని, తన ప్రయోజనాన్ని పెంపొందించుకోవడానికి బ్రాహ్మణుడు ప్రయత్నిస్తే, అప్పుడు శూద్రుడి ప్రయోజనాలను లేక వైశ్యుల, క్షత్రియుల ప్రయోజనాలను కాపాడగలవాడెవడు? శూద్రుడి యొక్క స్వేచ్ఛ స్వాతంత్ర్యాలను దోచుకోవడానికి క్షత్రియుడు ప్రయత్నిస్తే, అడ్డుకొనగలవాడు ఎవడు?

వర్గాలు పరస్పరం ఒక దానిపై ఒకటి ఆధారపడడం తప్పదు. ఒక వర్గం మరొక వర్గంపై ఆధారపడడం కూడ ఒక్కొక్క సమయంలో అవసరమే కావచ్చు. అయితే ప్రధానమైన, ప్రాణప్రదమైన అవసరాల విషయంలో ఒక వ్యక్తి మరొక వ్యక్తిపై ఆధారపడేటట్టు ఎందుకు చెయ్యాలి? విద్య అందరూ తప్పనిసరిగా ఆర్జించవలసింది కాదా? ఆత్మ రక్షణ సాధనాలు అందరికీ ఉండవలసిందే కాదా? ఏ మనిషికైనా బ్రతకడానికి, ఆత్మ రక్షణకీ ఈ రెండూ తప్పనిసరి ప్రాథమికావసరాలు. విద్యావిహీనుడూ, నిరాయుధుడూ అయిన ఒక మనిషికి తన పొరుగువాడు విద్యావంతుడూ, సాయుధుడూ అనే విషయం ఎలా తోడ్పడగలదు? ఈ సిద్ధాంతం మొత్తం వట్టి అసందర్భం. ఆ చాతుర్వర్ణ్య పద్ధతిని బలపరచేవాళ్ళు ఈ ప్రశ్నలను గురించి పట్టించుకొన్నట్టే కన్పించదు. కాని ఈ ప్రశ్నలు వాస్తవమైనవీ, సవ్యమైనవీ.

వివిధ వర్గాల మధ్య బాలుడికీ, సంరక్షకుడికీ మధ్య ఉండవలసిన సంబంధం

ఉండడమే చాతుర్వర్ణ్య సిద్ధాంతంలోని ప్రధాన లక్ష్యం అని అనుకొన్నప్పటికీ-బాలుడి ప్రయోజనాలను రక్షకుల దుష్కృత్యాల నుండి కాపాడడానికి ఏ విధమైన నిబంధననూ ఈ సిద్ధాంతం చెయ్యడం లేదు కదా! చాతుర్వర్ణ్య సిద్ధాంతం యొక్క లక్ష్యం బాలుడూ, సంరక్షకుడూ మధ్య ఉండే సంబంధం మీద ఆధారపడినదే నని అనుకొన్నప్పటికీ వాస్తవంగా అనుసరణలో మాత్రం అది సేవకుడికీ, యజమానికీ మధ్య ఉండే సంబంధంగా తయారయిందనడం నిస్సందేహం కాదా?

బ్రాహ్మణ, క్షత్రియ వైశ్య-ఈ మూడు వర్గాల మధ్య సంబంధమూ అంత సామరస్యంగా లేనప్పటికి-ఏదో ఒక విధంగా కలిసి బ్రతకడం నేర్చుకొన్నాయి. బ్రాహ్మణుడు క్షత్రియుడ్ని బాగా పొగుడుతాడు. వారిద్దరూ కలిసి తాము అతనిపై బ్రతకడం కోసం వైశ్యుడ్ని బ్రతకనిస్తారు. అయితే, ముగ్గురూ శూద్రుడ్ని త్రొక్కిపట్టి ఉంచడంలో ఏకమవుతారు. శూద్రుడు ధనం సంపాదించకూడదన్నారు. సంపాదిస్తే అతడు ఈ మూడు కులాలకూ లోబడకుండా స్వతంత్రుడవుతాడని వారి భయం. శూద్రుడు విద్యార్జన చెయ్యగూడదన్నారు. చేస్తే తన ప్రయోజనాలను గురించి తెలుసుకొని జాగ్రత్త పడతాడని వారి భయం. శూద్రుడు ఆయుధాలు ధరించ కూడదన్నారు. ధరిస్తే తమ అధికారాన్ని ధిక్కరించి ఎదురు తిరుగుతాడని వారి భయం.

## ద్విజ కులాలు శూద్రుల పట్ల ప్రదర్శించిన అమానుషత్వం

పై మూడు వర్ణాల వారు (త్రయ వర్ణికులు) శూద్రుల పట్ల అనుసరించిన విధానం ఇదీ అని చెప్పడానికి మను ధర్మశాస్త్రం ప్రబల సాక్ష్యం. సాంఘిక హక్కుల విషయంలో మను ధర్మశాసనాలను మించిన అఘాయిత్యపు దుష్ట శాసనాలు ప్రపంచంలో మరెక్కడ లేవు. ప్రపంచంలో సాంఘిక దురన్యాయాలు ఎక్కడైనా జరిగి ఉంటే, అట్టి ఉదంతాలు ఈ మనుధర్మశాసనం ముందు గడ్డిపరకలు. అంతటి అప్రతిష్టాకరమైనట్టిది మనుస్మృతి. ఇంతటి దుష్టమైన సంఘ పీడను, అన్యాయాన్ని ప్రజానీకం ఎందుకు భరించినట్టు?

ప్రపంచంలో అన్ని దేశాలలోను సాంఘిక విప్లవాలు జరిగినై. భారతదేశంలో సాంఘిక విప్లవాలు ఎందుకు జరగలేదన్నది నిరంతరం నన్ను వేధించే ప్రశ్న. బహుశా

అందుకు ఒకే ఒకటి కారణమై ఉండవచ్చు. అది–హిందువులలోని దిగువ తరగతుల ప్రజలు పనికిమాలిన చాతుర్వర్ణ్య వ్యవస్థ కారణంగా అణచపెట్టబడి, ప్రత్యక్ష చర్యకు పూర్తిగా పనికిరాకుండా చేయబడటం. వారు ఆయుధాలు ధరించకూడదు. ఆయుధాలు లేకుండా తిరుగుబాటు సాధ్యం కాదు. వాళ్ళు సేద్యగాండ్రుగా నిర్ణయించబడ్డారు. ఏ రకమైన ఆయుధాలు వారికి లేవు. అందువల్లనే ప్రతివాడూ వాళ్ళ తలపై ఎక్కి కూర్చున్నాడు.

చాతుర్వర్ణ్య వ్యవస్థ కారణంగా ఈ దిగువ కులాల ప్రజలు విద్యను ఆర్జించలేక పోయారు. వీరు విముక్తిని గురించి స్వయంగా ఆలోచించుకొనే శక్తిని కోల్పోయారు. తమ విమోచనకు తాము ఏవిధంగా పాటు పడాలో గుర్తించలేని అజ్ఞానులైనారు. సంఘంలో హీనులుగా, దీనులుగా అణగద్రొక్కి ఉంచడం వల్లను, తమ హైన్యదైన్యాల నుంచి తప్పించుకోవడం ఎలాగో తెలియక పోవడం వల్లను, ఈ ప్రజలు "అంతా తమ కర్మ" అనుకొంటూ, శాశ్వత బానిస వృత్తికి అలవాటై పోయారు.

ఐరోపాలో కూడా బలమైన వాళ్ళు బలహీనులను దోచుకోవడం, కొల్లగొట్టడం ఉన్న మాట నిజమే. అయితే అక్కడ బలవంతులు దోపిడీకి గురిచేయబడే ప్రజలపట్ల ఇండియాలో హిందువులు క్రింద కులాల పట్ల వ్యవహరించేటంత దుర్మార్గంగా వ్యవహరించలేరు. క్రింది కులాల ప్రజలపట్ల హిందువులు వ్యవహరించే విధం ఎంతసిగ్గు మాలినదో, ఎంత అమానుషమైనదో చెప్పటానికి వీలులేదు. ఈ క్రింది కులాల ప్రజలు నిస్సహాయులుగా చెయ్యబడ్డారు. ఐరోపాలో బలవంతులకు, బలహీనులకు మధ్య – ఇండియాలో ఎప్పుడూ జరగనంత తీవ్రంగా – సాంఘిక పోరాటం జరుగుతుండేది. అయినప్పటికీ ఐరోపాలో బలహీనుడికి మిలటరీ సర్వీసు ద్వారా భౌతికమైన ఆయుధమూ, ఎన్నికలలో పాల్గొనడం ద్వారా రాజకీయమైన ఆయుధమూ, విద్యాభ్యాసంద్వారా నైతికమైన ఆయుధమూ – ఈ మూడు ఉన్నాయి. స్వయం విముక్తికీ, అభ్యుదయానికీ సాధనాలైన ఈ మూడు ఆయుధాలూ ఐరోపాలోని బలహీన వర్గాలకు ఎప్పుడూ నిరాకరించబడలేదు. ఇండియాలో మాత్రం చాతుర్వర్ణ్య వ్యవస్థ ద్వారా ప్రజా బహుళ్యానికి ఈ ఆయుధాలు మూడు కూడా నిషేధించబడ్డాయి.

చాతుర్వర్ణ్యం వంటి భ్రష్ట వ్యవస్థ ప్రపంచంలో మరెక్కడా కన్పించదు. ప్రజలను

జీవచ్ఛవాలుగా, నిర్ వ్యాపారులుగా, పక్షపాత రోగులుగా, క్షతగాత్రులుగా, ఎందుకూ పనికిరాని దద్దమ్మలుగా తయారు చేసిన నికృష్ట నీచ వ్యవస్థ ఇది. ఇందులో అతిశయోక్తి ఏమీ లేదు. చరిత్రే దీనికి ప్రజల సాక్ష్యం.

భారత చరిత్ర స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు, కీర్తి ప్రతిష్టలు గల కాలం ఒక్కటే ఉంది. అది మౌర్య సామ్రాజ్య కాలం. ఇక తక్కిన చరిత్ర అంతా కూడా అపజయాలతోను, అంధకారంతోను నిండినట్టిది. అయితే, మౌర్య కాలంలో మాత్రం చాతుర్వర్ణ్య పద్ధతి నిర్మూలించబడింది. హిందూ ప్రజలలో అధిక సంఖ్యాకులైన శూద్రులు తమ దాస్య శృంఖలాలను ఛేదించుకొని బయటపడి, దేశ పాలకులు కాగలిగిన కాలం అది. చాతుర్వర్ణ్య వ్యవస్థ ప్రబలంగా ఉన్న కాలంలోనే దేశం మొత్తం మీద ప్రజా బాహుళ్యం అపజయం అడుగున, అంధకారం లోతుల్లో మ్రగ్గడం జరిగింది.

## బ్రాహ్మణుల, క్షత్రియుల మధ్య ఘర్షణలే మన పురాణాల గాథలు

చాతుర్వర్ణ్యం క్రొత్తదేమీ కాదు. వేదాలు ఎంత ప్రాచీనమైనవో చాతుర్వర్ణ్యం కూడా అంత ప్రాచీనమైనదే. అందుకే ఆర్య సమాజకులు దీని ప్రాశస్త్యాన్ని గురించి ఆలోచించవలసిందిగా మనల్ని అడుగు తున్నారు. సాంఘిక వ్యవస్థా నిర్మాణంలో ఒక పద్ధతిగా దీనిని పరిగణించి, దీని గత చరిత్రను పరిశీలించి చూస్తే – ఈ పద్ధతి అమలుకు పెట్టబడిందనీ, అమలులో వ్యర్థమైందనీ మనకు స్పష్టపడుతుంది. బ్రాహ్మణులు మొత్తం క్షత్రియ జాతినే ఎన్నిసార్లు దుంప నాశనం చెయ్యలేదు? క్షత్రియులు ఎన్నిసార్లు బ్రాహ్మణులను నిర్మూలనం చెయ్యలేదు.? మహాభారతం నిండా, పురాణాల నిండా ఉన్నదంతా ఎక్కువగా బ్రాహ్మణులకూ, క్షత్రియులకూ మధ్య జరిగిన సంఘర్షణ చరిత్రే కాదా!

బ్రాహ్మణుడూ, క్షత్రియుడూ వీధిలో తారస పడినప్పుడు ఎవరు ఎవరికి ముందు నమస్కరించాలి. ఎవరు తప్పుకొని ఎవరికి దారి ఇవ్వాలి అనే అల్ప విషయాలలో కూడ బ్రాహ్మణులూ, క్షత్రియులూ కొట్లాటకు సిద్ధపడేవారు కాదా!

బ్రాహ్మణులూ, క్షత్రియులూ ఒకళ్ళను చూచి ఒకళ్ళు కళ్ళల్లో కారం

కొట్టుకొనేవారనే విషయం అటుంచి-క్షత్రియులు దుష్ట నిరంకుశులుగా తయారు కావడం, చాతుర్వర్ణ వ్యవస్థ క్రింద ప్రజలందర్నీ నిరాయుధుల్ని చేసి అణచిపెట్టి పీడించడం, ప్రజలంతా విమోచన కోసం ఏక కంఠంతో భగవంతుణ్ణి ప్రార్థించడం కూడా పరిపాటిగనే ఉండేది కదా!

క్షత్రియుల్ని పూర్తిగా నశింపు చెయ్యడం అనే పవిత్ర కార్యం ఒక్కదాని కోసమే శ్రీకృష్ణుడు అవతరించాడని భగవద్గీత మనకు స్పష్టంగా చెప్తున్నది. వివిధ వర్ణాల మధ్య ఇంత విరోధం, ఇంత వైషమ్యం ఉన్న ఉదంతాలు చరిత్ర మనకు చెపుతుండగా, చాతుర్వర్ణ్య వ్యవస్థ మంచి సాంఘిక వ్యవస్థ అని ఎవరైనా ఎలా అంగీకరిస్తారు? మానవ సమాజాన్ని పునర్నిర్మాణం చెయ్యడానికి చాతుర్వర్ణ్య పద్ధతి ఆదర్శ ప్రాయమైనదిగా ఎవరు ఒప్పుకుంటారు?

మీకు వెలుపల ఉంటూ, బాహాటంగా మీ ఆశయాలకు వ్యతిరేకంగా ఉన్న వారిని గురించి ఇంతవరకూ ప్రస్తావించాను. అయితే మీకు వెలపలనూ ఉండక, మీతోనూ చేరక, తటస్థంగా కొందరుండవచ్చు. అట్టివారి దృక్పథం గురించి ప్రస్తావించాలా వద్దా అని సందేహిస్తున్నాను. బాగా అలోచించిన మీదట, వారి దృక్పథాన్ని వివరించడానికే నిర్ణయించుకొన్నాను. అందుకు రెండు కారణాలు. మొదటి కారణం ఏమిటంటే-అట్టి ప్రజలు కుల సమస్యపట్ల అనుసరించే వైఖరి. వాళ్ళు తటస్థులుగా ఉండటమే కాక, సాయుధులైన తటస్థులుగా కూడా ఉండటం. రెండవ కారణం ఏమిటంటే-వాళ్ళు హిందూజనాభాలో అత్యధిక సంఖ్యాకులుగా ఉండటం.

ఈ తటస్థులతో ఒక భాగం వారికి హిందూవ్యవస్థలో ఏ విధమైన వైపరీత్యమూ, దౌష్ట్యమూ కనిపించవు. హిందువులలో వర్ణ వ్యవస్థ అపూర్వమైనదేమీ కాదనీ, ముస్లిములలోను, సిక్కులలోను, క్రైస్తవులలోనూ కూడా అంతర్విభాగాలు ఎన్నెనో ఉన్నాయనీ వారంటారు. అలా అనుకొని సంతృప్తి పడతారు. ఈ విషయాన్ని గురించి ఆలోచించేటప్పుడు, మన మొక సంగతి ముందుగా దృష్టిలో పెట్టుకోవాలి. అదేమంటే ప్రపంచంలో మానవ సమాజం ఎక్కడా కూడా ఒకే సముదాయంగా లేదు. ఎప్పుడూ సమాజంలో విభాగాలుంటాయి. మానవులు అనేక సంఘాలుగా, శాఖలుగా, ముఠాలుగా, తెగలుగా ఉన్నారు. కార్య రంగంలో వ్యక్తి ఒక పరిమితి.

సంఘం మరొక పరిమితి, ఈ రెండింటి మధ్యా రకరకాలు సామాజిక మేళనలు, వ్యక్తులు, కుటుంబాలు, స్నేహాలు, సహకార సమాఖ్యలు, వ్యాపార సంస్థలు, రాజకీయ పార్టీలు, దొంగలు, దోపిడీ ముఠాలు - ఇలా ఎన్నో రకాల సంబంధాలున్నై. ఈ చిన్న చిన్న వర్గాలు ఒక్కొక్కటి ఆంతరంగికంగా కలిసికట్టుగా ఉంటూ-బాహ్యంగా ఒకదాని నుంచి ఒకటి వేరువేరుగా ఉంటాయి. అలాంటి గ్రూపులకు సంకుచితమూ, తీవ్రతరమూ అయిన రకరకాల నియమావళి ఉంటుంది. ఈ నియమావళి తరుచుగా సాంఘిక వ్యతిరేకమైనట్టిదిగా కూడా ఉంటుంది. ఈ పరిస్థితి ప్రతీ సమాజంలోనూ తప్పని సరే. అది ఐరోపా కావచ్చు. ఆసియా కావచ్చు. ఎక్కడైనా అంతే.

## హిందువులందర్నీ కలిపి ఉంచే సమాన సూత్రా లేమిటి?

అయితే - ఒక సమాజం ఆదర్శప్రాయమైనట్టిదా, కాదా అని నిర్ణయించడానికి ఆ సమాజంలో గ్రూపులు ఉన్నాయా, లేవా అనే ప్రశ్న కాదు వెయ్యవలసింది. ఎందుచేతనంటే - గ్రూపులు అన్ని సమాజాలలోను ఉంటాయి. ఆదర్శప్రాయమైన సమాజం ఏదో నిర్ణయించడానికి అడగవలసిన ప్రశ్నలు ఇవి:

ఆ సమాజంలో ఉన్న గ్రూపుల స్వభావం ఎలాంటిది? ఆ గ్రూపు లన్నీ కలిసి పంచుకొనే ప్రయోజనాల స్వరూప స్వభావాలెలాంటివి? ఇతర సామాజిక సంస్థలతో స్వేచ్ఛగా కలసిమెలసి ఉండే స్వభావం ఎలాంటిది? అన్యోన్యత ఎలాంటిది? ఆయా గ్రూపులను, వర్గాలను వేరుచేసే వ్యక్తులు వారిని సన్నిహితం చేసే శక్తుల కంటే ఎక్కువగా ఉన్నాయా? ఆయా గ్రూపుల ప్రజల జీవితాలకు గల సాంఘిక ప్రాముఖ్యం ఎలాంటిది? ఈ గ్రూపుల మధ్య ఉండే వేరుపాటు (విడి విడిగా ఉండడం) ఒక ఆచార బద్ధమూ, సౌకర్యం కోసం ఏర్పడిందీ అవునా? లేక, మత విషయకమైనట్టిదా?

ఈ ప్రశ్నలకు మనం చెప్పుకొనే సమాధానాల దృష్టితో నిర్ణయించవలసి ఉండి హైందవేతర సమాజాలలోని వర్గ భేదమూ, హిందూ సమాజంలోని వర్ణభేదము ఒకటేనా అనేది - మహమ్మదీయుల, సిక్కుల, క్రైస్తవులలోని శాఖలకూ, హిందువులలోని కులాలకూ మధ్య ఎంత ప్రాథమికమైన తేడా ఉన్నదో ఈ ప్రశ్నలకు

సమాధానాలు చెప్పుకుంటే మనకు తెలుస్తుంది. హైందవేతరులలో ఒక గ్రూపు ప్రజలను కలిపి ఉంచే శక్తులు చాల ఎక్కువ. హిందువులలోని కులాల విషయంలో పరిస్థితి అందుకు పూర్తిగా విరుద్ధం. వాటికి శక్తులే మృగ్యం. ఏ సమాజం బలమైనా ఆ సమాజంలోని వివిధ వర్గాల ప్రజల మధ్య అన్యోన్య సంబంధాల మీద, అన్యోన్య సహకార క్రియావకాశాల మీద ఆధారపడి ఉంటుంది. వీటినే ఆర్గానిక్ ఫిలమెంట్సు (జీవసూత్రాలు) అన్నాడు. - కార్లైల్ మహాశయుడు. జీవసూత్రాలు హిందూ సమాజంలో లేవు. కులవ్యవస్థవల్ల కలిగే విచ్ఛిత్తిని నిరోధించి, కులాలమధ్య సాన్నిహిత్యాన్ని సాధించగల ఇట్టి సమైక్యశక్తి హిందువులలో లేదు. హైందవేతరులలో వారిని ఐక్యం చేసే అనుసంధాన జీవ సూత్రాలు అనంతంగా ఉన్నవి.

మనం గుర్తుంచుకోవలసిన మరొక విషయ మేమంటే-హిందువులలో కులాలున్నట్లూ, హైందవేతరులలో వర్గాలున్నప్పటికీ-హిందువులలో వర్ణాలకున్న ప్రత్యేకత హైందవేతరులలో వర్గానికి లేదు. ముస్లింను నీవెవరువు అని అడగండి? నేను ముస్లింను అని జవాబు చెపుతాడు. ఒక సిక్కును నీవెవరవు అని అడగండి? నేను సిక్కును అని జవాబు చెపుతాడు. ముస్లింలలోను, సిక్కులలోను శాఖాభేదాలు ఉన్నప్పటికీ వారు చెప్పరు. ముస్లింను అనో, సిక్కును అనో మాత్రమే వారు చెబుతారు. దానితో మనం తృప్తి పడతాం. ఒక ముస్లిం తాను ముస్లిం అని చెప్పిన తరువాత, ఆపైని అతడ్ని తాను-షియా, సున్నీ, షేక్, సయ్యద్, ఖటిక్, పింజారి అనే శాఖలలో ఏశాఖకు చెందినవాడో మనం అడగం. సిక్కు విషయంలో అతడు జాత్, దోడా, మజ్బి, రాందాన్ వంటి - శాఖలలో దేనికి చెందినవాడో అడగం. కాని ఒక హిందువుడు "నేను హిందువుడ్ని" అని చెపితే మనం తృప్తిపడం. అతడి కులం ఏదో కూడ తెలుసుకోవాలని ఉంటుంది. ఎందుచేత? ఎందుచేతనంటే -- హిందువులలో కులానికి అంత విశిష్టత ఉన్నది కాబట్టి. కులం తెలిస్తేనే కాని ఆ వ్యక్తి ఎవరో, ఎలాంటి వాడో వివరం తెలియదు కాబట్టి.

హిందువులలో ఉండే కులాలకూ, తక్కిన మతాలలో ఉండే శాఖలను ధిక్కరించిప్పుడు వచ్చే పర్యవసానాన్ని మనం గమనించాలి. సిక్కులలోను, మహమ్మదీయులలో గాని, క్రైస్తవులలో గాని సాంఘిక బహిష్కారం అనే మాటే లేదు. కాని హిందువులలో మాత్రం పరిస్థితి పూర్తిగా వేరు. ఎవడైనా కులాన్ని

అతిక్రమించాడంటే, వాడు తప్పనిసరిగా ఆ కులం నుంచి వెలివేయ బడ్డాడన్నమాటే. హిందువులలో కులానికి, హైందవేతరులలో శాఖలకు వాటి నిర్మాణంలో ఎంత తేడా ఉన్నదో తెలుసుకోడానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి? హిందువులకు, హైందవేతరులకు మధ్య గల ముఖ్య తేడాలను చూపడంలో ఇది రెండవ అంశం.

అయితే, మూడవది, అన్నింటికంటే ఎక్కువ ప్రధానమైంది మరో అంశం కూడా ఉన్నది. హైందవేతరులలో ఉండే శాఖా భేదం మత సంబంధమైన పవిత్ర వ్యవస్థ కాదు. హిందువులలోని కుల భేదం మాత్రం నిశ్చయంగా పవిత్రమైన మత విశ్వాసాలతో ముడి పెట్టబడి నట్టిది. హైందవేతరులలో శాఖా విభజన అనేది ఒక అభ్యాసం మాత్రమే: పవిత్ర సంస్థ కాదు. దానిని మతపరంగా స్థాపించుకోలేదు. వారు శాఖలను మత నమ్మకాలుగా పరిగణించడం లేదు. కులానికి, కులానికి మధ్య ఎడము, వేర్పాటు ఉండాలని, అలా ఉండటమే పవిత్రమైన విధి అనీ హిందువులకు మతం నిర్దేశిస్తుంది. ప్రతి హిందువూ కుల భేదాన్ని పాటించాలని శాసిస్తుంది. హైందవేతరులలో అలాంటి మత భేదం లేదు. హిందువుడు కులాన్ని అతిక్రమించడానికి మతం ఒప్పుకోదు. హైందవేతరుల కదేమి లేదు. అందువల్ల హైందవేతరులలో కూడా కులాలను పోలిన శాఖలు ఉన్నాయని తృప్తి పడడం చాలా ప్రమాదకరమైన భ్రమ. హైందవేతరులలోని శాఖా భేదాలు మొత్తం సమాజ భావానికి లోబడినట్టివి. హిందువులలోని కులాలు మాత్రం సమాజ భావాలను విచ్ఛిన్నం చేసే అవరోధాలు. ఈ సత్యాన్ని పూర్తిగా గుర్తించ వలసి ఉంది. హిందువులలో కులాలు హైందవేతరులలోని శాఖలు ఒకటే అనే భ్రమను హిందువులు ఎంత త్వరగా తొలగించుకొంటే అంత మంచిది.

## బ్రతకడానికి గల అర్హత, బ్రతికి ఉండడ మేనా?

కుల వ్యవస్థ పట్ల తటస్థంగా ఉండేవాళ్ళలో మరొక వర్గం వాళ్ళు చెప్పేదేమంటే హిందువుల కులం ఒక సమస్యే కాదని, దాని వలన ఉత్పన్నం అయిన క్లిష్ట సమస్య ఏదీ లేదనీ, యుగ యుగాల నుంచీ హిందువులుగా మనగలిగామనీ, అందుకు యుగాల నాటి కుల వ్యవస్థ ఏమీ అడ్డం రాలేదనీ, దాని

సుస్థిరత కిది తార్కాణమనీ ఆ బాపతు హిందువులు అంటారు. ప్రొఫెసర్ ఎస్. రాధాకృష్ణ పండితుడు "హిందూ వ్యూ ఆఫ్ లైఫ్" (జీవితం పట్ల హిందువుల దృక్పథం) అనే తన గ్రంథంలో ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. హిందూ జీవితం గురించి ప్రస్తావిస్తూ ఆయన ఇలా అన్నారు.

"అసలు నాగరికతే అల్పకాలికమైనది కాదు. చరిత్ర కందినంత వరకు మనం వెనక్కి తిరిగి చూస్తే ఈ నాగరికత నాలుగు వేల సంవత్సరాలకు పూర్వమే ఉన్నత స్థాయినందుకుని - అప్పటి నుంచీ మధ్య మధ్య మందగించడం, చప్పబడి పోవడం జరిగినా -- ఈనాటి వరకూ ధారావాహికంగా వస్తూనే వున్నది. సుమారు నాలుగైదు వేల సంవత్సరాల పాటు ఎన్నో ఒడిదుడుకులను తట్టుకొని ఆధ్యాత్మిక భావనకూ, అనుభవానికి మకుటాయమానమై నిలిచిన నాగరికత ఇది. చరిత్రకు తెలిసిన కాలం నుంచీ కూడ అనేక జాతులకు, సంస్కృతులకు చెందిన ప్రజలు నిరంతరంగా ఇండియాలోకి తోసుకు వస్తున్నప్పటికీ, హిందూమతం తన ఆధిక్యతను నిలుపుకో గలిగింది. అంతేగాక అన్యమత ప్రచారకులు రాజాదరణతోను, అధికార బలంతోను విజృంభించినప్పటికి, హిందువులలో అధిక సంఖ్యాకులను తమ తమ మతాలలోకి మార్చుకోలేక పోయారు. హిందూ మతాన్ని ఏమీ చేయలేక పోయారు. బహుశా ఇతర మతాలకు, మత భావాలకు లేని జీవశక్తి ఏదో హిందూ సంస్కృతికి ఉన్నదనవచ్చు. బ్రతికి ఉన్న చెట్టులో రస ప్రసరణ జరుగుతున్నదో లేదో తెలుసుకొనడానికి ఆ చెట్టును కొట్టి చూడవలసిన అవసరం ఎలా లేదో, అలాగే హిందూమతంలో అమృత శక్తి ఉన్నదో లేదో కనుక్కోవడానికి దాన్ని మధించి చూడవలసిన అవసరం కూడా లేదు."

ప్రొఫెసర్ రాధాకృష్ణన్ చాలా పేరు ప్రఖ్యాతులు గలవాడు. ఆయన ఏది చెప్పినా అది పాఠకుల మనసుల్ని ఆకట్టుకోగలదు. అయితే, నా మనస్సులోని మాట కూడ నేనే స్పష్టంగా చెప్పవలసి ఉంది. ఆయన చెప్పిన మాటలు ప్రజలను పెడదారి పట్టించ వచ్చని నా భయం. బ్రతకడానికి గల అర్హతకు నిదర్శనం బ్రతికి ఉండడమే అనే దుష్ట వాదనకు ఆయన వ్యక్త పరిచిన అభిప్రాయం ప్రాతిపదికగా తయారు కావచ్చు.

నా దృష్టిలో ఒక సమాజం బ్రతుకుతుందా, చస్తుందా అనేది కాదు సమస్య.

ఆ సమాజం ఏ స్థాయిలో బ్రతికున్నది అనేదే సమస్య. బ్రతకడంలో అనేక పద్ధతులు ఉన్నాయి. అన్ని పద్ధతులూ సమాన గౌరవం కలిగినట్టివి కావు. అది వ్యక్తి కావచ్చు. సమాజం కావచ్చు మామూలుగా బ్రతకడానికి, ప్రయోజనకరంగా బ్రతకడం ఒక పద్ధతి. యుద్ధంలో ఓడిపోయి, లొంగిపోయి, ఖైదీగా బ్రతకడం కూడా బ్రతకడంలో ఒక పద్ధతే.

తానూ, తన ప్రజలూ ఎప్పటినుంచో బ్రతుకుకొంటూ వస్తున్నామని హిందువుడు తృప్తి పడడం శుద్ధ అవివేకం. తాను చూడవలసింది తమ జీవిత ప్రమాణం ఏలాంటిది అని. అలా చూస్తే తమ మనుగడ స్థాయిలో గర్వపడవలసిందేమీ లేదని స్పష్ట పడగలదు. హిందువుడి జీవితం ఒక నిరంతర పరాజయం. నిరంతరాయంగా జీవిస్తున్నట్టు తనూ భావించేది. నిజానికి నిరంతరంగా జీవిస్తున్నా ననడం కాదు. అది నిరంతరంగా నశిస్తూ ఉండడం. సత్యద్రష్టా, యధార్థవాదీ అయిన హిందువుడెవడైనా సరే – ఇప్పుడు హిందూ సమాజం బ్రతుకుతున్న పద్ధతిని చూసి సిగ్గుపడకుండా ఉండలేడు.

## హిందూ సమాజం నుంచి, కులాన్ని నిర్మూలించడం ఎలా?

మీ సమాజ ధోరణిని పూర్తిగా మార్చుకోకపోతే, మీరు ఏ విధమైన అభ్యుదయాన్ని సాధించలేరని నా ఉద్దేశం. ఇందులో ఏమాత్రం అనుమానం లేదు. దెబ్బ కాచుకోడానికి గాని, ఎదురు దెబ్బ కొట్టడానికి గాని ఇప్పుడున్న పద్ధతిలో హిందూ సమాజాన్ని సమీకరించలేం. కులం పునాదుల మీద మీరు దేన్నీ నిర్మించలేదు. ఒక జాతినీ నిర్మించలేరు. ఒక నీతినీ నిర్మించలేదు. కులం పునాదుల మీద మీరు ఏదైనా నిర్మిస్తే అది పగిలి ముక్కలు కావడం తప్పదు. అట్టిదేదీ ఒక సంపూర్ణ నిర్మాణంగా మన జాలదు.

ఇప్పుడు మనలను ఎదుర్కొనే ఒకే ఒక సమస్య ఇది. హిందూ సమాజ పద్ధతిలో సంస్కరణలు ప్రవేశపెట్టడం ఎలా? కుల వ్యవస్థను రద్దు చెయ్యడం ఎలా?

ఈ సమస్య ఎంతో ప్రధానమైనట్టిది. బహుశా, అసలు సమస్య ఇదొక్కటే అనవచ్చు. కుల వ్యవస్థను రద్దు చేయడానికి ప్రాతిపదికగా ముందు ఉపకులాలను

రద్దు చేయాలనే వర్గం ఒకటుంది. రెండు కులాల మధ్య కంటే రెండు ఉపకులాలను రద్దు చేయాలనే వర్గం ఒకటుంది. రెండు కులాల మధ్య కంటే రెండు ఉపకులాల మధ్య ఎక్కువ సాదృశ్యమూ, సమాన ధర్మమూ - ఆచార వ్యవహారాలలోనూ, సాంఘిక స్థాయిలోనూ ఎక్కువ సామ్యమూ ఉంటుందని ఈ వర్గం ఉద్దేశం. ఈ ఉద్దేశం సరైంది కాదని నా భావం. ఉత్తర, మధ్య భారత ప్రాంతాలలోని బ్రాహ్మణులు దక్కను, దక్షిణ భారత ప్రాంతాల బ్రాహ్మణుల కంటే సాంఘికంగా తక్కువ స్థాయి కలవాళ్ళు. ఉత్తర, మధ్య భారత ప్రాంతాల బ్రాహ్మణులు కేవలం వంట వాళ్ళు, నీళ్ళు మోసే వాళ్ళూ మాత్రమే.

దక్కను, దక్షిణ భారత ప్రాంతాల బ్రాహ్మణులు సాంఘికంగా ఉన్నత స్థానాన్ని ఆక్రమించి ఉన్నవాళ్ళు, ఉత్తర భారతంలోని వైశ్యులూ, కాయస్తులూ సాంఘికంగాను, తెలివి తేటలలోను దక్కను, దక్షిణ భారత బ్రాహ్మణులతో సరితూగ గల ఉన్నత స్థాయిలో వున్నారు. అంతేగాక ఆహారం సంగతి పరిశీలించి చూస్తే - దక్కను, దక్షిణ భారత బ్రాహ్మణులకూ, కాశ్మీరు, బెంగాలు బ్రాహ్మణులకూ సంబంధమే లేదు. దక్కను, దక్షిణ భారత బ్రాహ్మణులు శాఖాహారులు. మరొక విశేషమేమంటే దక్కను, దక్షిణ బ్రాహ్మణులకూ, గుజరాతులోని మార్వాడీలు, వైశ్యులు, జైనులు మొదలైన బ్రాహ్మణేతరులకూ, ఆహార విషయంలో ఎక్కువ సామ్యం ఉంది.

హిందువుల్ని ఒక కులం నుంచి మరొక కులానికి మార్చవచ్చుననే దృక్పథాన్ని అంగీకరిస్తే - దక్షిణాది బ్రాహ్మణులను ఉత్తరాది బ్రాహ్మణులతో కలపడం కంటే ఉత్తరాది కాయస్తులను, ఇతర దక్షణాది బ్రాహ్మణేతరులను దక్కనులోని ద్రావిడ దేశంలోని బ్రాహ్మణేతరులతో కలపడం ఎక్కువ ఆచరణసాధ్యం అవుతుంది. అయితే ఉప కులాలను ఒక దానితో ఒకటి కలిపివేయడం సాధ్యమే అనుకొన్నప్పటికీ ఉపకులాల రద్దు అసలు కులాల రద్దుకు దారితీస్తుందనే గేరంటీ ఏముంది? అంతేగాక, సమ్మిశ్రణ కార్యక్రమం ఉపకులాలు రద్దు చేస్తే, అది అసలు కులాలను బలపరచడానికే తోడ్పడవచ్చు. అప్పుడు అట్టి కులాలు ఎక్కువ శక్తివంతమూ, ప్రమాదకరమూ కావా! అందువల్ల ఉపకులాలను రద్దు చేయడమనే పద్ధతి, కులాల రద్దుకు ఏ విధంగా ఉపకరించదు. ఆచరణ సాధ్యం కూడా కాదు. పైగా, అది తప్పుడు పంథాగా పరిణమించవచ్చు.

## కుల నిర్మూలన - వర్ణాంతర వివాహాలు

కులాల రద్దుకు చెప్పబడే మరొక పద్ధతి ఏమిటంటే, వర్ణాంతర భోజనాలను ఏర్పాటుచేయడం. నా ఉద్దేశంలో ఇది కూడా సరైన పద్ధతి కాదు. వర్ణాంతర భోజనాలకు అభ్యంతరం లేని కులాలు చాలానే ఉన్నాయి. వర్ణాంతర భోజనాలను అనుమతిస్తూనే వర్ణ (కుల) పట్టింపులు పెట్టుకోవడం సాధారణానుభవం. కులతత్వాన్ని, కులాభిమానాన్ని తొలగించడంలో వర్ణాంతర భోజనాల పద్ధతి సఫలీకృతం కాలేదు.

కుల నిర్మూలనకు సరైన పద్ధతి వర్ణాంతర వివాహాలేనని నా దృఢ విశ్వాసం. రక్తసమ్మిశ్రణ ఒక్కటే మానవులలో అన్యోన్య అనుబంధ భావాన్ని, బాంధవ్యాన్ని కలిగిస్తుంది. అట్టి బంధు భావ ప్రభావం లేనిదే కులం కల్పించిన విభేదాలను, వివక్షతలను రూపుమాపలేం. వివిధ కులాల మధ్య స్నేహాను బంధాలను కలిగించాలంటే, ఆయా కులాల వ్యక్తుల నడుమ రక్తసంబంధాలను కల్పించక తప్పదు.

హిందువుల సాంఘిక జీవనంలో వర్ణాంతర వివాహాలు, హైందవేతరులలో శాఖాంతర వివాహాల కంటే అత్యధిక ప్రాధాన్యం వహించాలి. హైందవేతరులలో సాంఘిక సమైక్యానికి ఇతర శక్తులు ఎన్నో పనిచేస్తూ వుంటై కనుక, ఈ వివాహాలు అంత ప్రాధాన్యం వహించనక్కర లేదు. అవి ఒక సాధారణ సంఘటనలు మాత్రమే. హిందూ సమాజం కులాల వల్లా, ఉప కులాల వల్లా చిన్నాభిన్నం చెయ్యబడి ఉంది. కనుక వారందరినీ కలిపి ఒక సుసంఘటితమైన సమాజంగా తీర్చిదిద్దాలంటే, అందుకు వర్ణాంతర వివాహాలు తప్పనిసరైన తక్షణ కర్తవ్యం. కుల వ్యవస్థను రద్దు చేయడానికి సరైన మందు వర్ణాంతర వివాహాలే. మరొకటేదీ పనికి రాదు.

కుల వ్యవస్థను ఎదుర్కొనడానికి ఇట్టి అమోఘమైన మార్గాన్ని చేపట్టి నందుకు మీ జాత్‌పాత్ తోడక్ మండలిని నేను ఎంతగానో అభినందిస్తున్నాను. ఇలా ప్రత్యక్షంగా దానితో తలపడటంలో మీరు అసలు జబ్బు ఏమిటో తెలుసుకొని సరైన విధానాన్ని అనుసరించారు. మీ ధైర్యం గొప్పది. హిందువులకు తమను పట్టుకొన్న జబ్బు ఏమిటో సిసలుగా వారి ముఖంమీదే మీరు చెప్పగలిగారు. సాంఘిక నిరంకుశత్వాన్ని ఎదిరించే సంస్కర్త ప్రభుత్వాన్ని ఎదిరించే రాజకీయవాదికంటే ఎక్కువ ధైర్యవంతుడై ఉండాలి.

వర్ణాంతర భోజనాలు, వర్ణాంతర వివాహాలు సర్వత్రా, సర్వ వేళలా జరగడం పరిపాటి అయినప్పుడే కుల వ్యవస్థ సడలిపోయినట్టవుతుందని మీరు భావించడం ఎంతో సమంజసంగా ఉంది. హిందూ సమాజంలో గల నిజమైన వ్యాధిని, వ్యాధి కారణాన్ని మీరు బాగానే గుర్తించారు.

అయితే, వ్యాధికి మీరు సూచించిన మందు పటిష్టమైనదేనా? సరైనదేనా? ఈ ప్రశ్న వేసుకొని, ఆలోచించి చూడండి. హిందువులలో అత్యధిక సంఖ్యాకులు వర్ణాంతర భోజనాలకు, వర్ణాంతర వివాహాలకు అంగీకరించ రెందువల్ల? మీ ఉద్యమం అధిక సంఖ్యాక ప్రజలకు ఆమోదకరం కాలేదెందువల్ల? ఈ ప్రశ్నకు జవాబు ఒక్కటే, హిందువులు పవిత్రంగా ఎంచుకునే సిద్ధాంతాలకు, విశ్వాసాలకున్నూ, వర్ణాంతర భోజనాలకు, వర్ణాంతర వివాహాలకున్నూ పొసగదు. కులం అనేది హిందువులను కలవకుండా చేసే ఒక ఇటుక గోడో, ముళ్ళ తీగో కాదు - సులభంగా తొలగించి పారవేయడానికి. హిందువులలో కులం అనేది ఒక భావన. ఒక విశ్వాసం. ఒక మనఃస్థితి. కులాన్ని తొలగించడం అంటే - భౌతికమైన ఒక అడ్డంకిని తొలగించడం కాదు. మనోభావనలోనే ఒక మార్పును సాధించడం. కులం చెడ్డదే కావచ్చు. మానవుడు మరొక మానవుడి పట్ల అమానుషంగా ప్రవర్తించేటంతటి దుష్ప్రవర్తనకు కారణం కులమే కావచ్చు. అయితే ఒక సత్యాన్ని మనం గుర్తించవలసి ఉంది. హిందువులు కులంపట్ల అంత పట్టుదలగా ఉంటారంటే, అందుకు కారణం - వాళ్ళు కులాన్ని అంతగా ఎందుకు పట్టుకు వ్రేలాడతారంటే - వాళ్ళు పూర్తిగా మతం అంటే పిచ్చి నమ్మకం కలవాళ్ళు కనుక. హిందూ ప్రజలు కులమంటే పట్టింపు కలిగి ఉండడం తప్పేమీ కాదు. నిజానికి, నా ఉద్దేశంలో అసలు తప్పు ఏదంటే, అది వాళ్ళ మతం. కులం అనే పిచ్చి నమ్మకాన్ని వాళ్ళ మనస్సులో నాటిన వాళ్ళ మతం. కులం అనే పిచ్చి నమ్మకాన్ని వాళ్ళ మనస్సులో. నాటిన వాళ్ళ మతం. అటువంటప్పుడు, మనం ఎదుర్కోవలసిన శత్రువు కుల వ్యవస్థను అనుసరిస్తున్న ప్రజ కాదు. అట్టి కుల వ్యవస్థతో కూడిన మతాన్ని వాళ్ళకు ప్రబోధిస్తున్న శాస్త్రాలు. అందువల్ల వర్ణాంతర వివాహాలకు వ్యతిరేకులయిన వారిని విమర్శించడం వల్ల గాని, హేళన చేయడం వల్ల గాని, లేక అప్పుడప్పుడు వర్ణాంతర భోజనాలు, అక్కడక్కడ వర్ణాంతర వివాహాలు జరపడం వల్ల గాని ఏమీ ప్రయోజనం ఉండదు. మనం అనుసరించ వలసిన సరైన

మార్గం ఏమిటంటే - శాస్త్రాల పట్ల, వాటి పవిత్రత పట్ల ప్రజలకు గల విశ్వాసాన్ని తొలగించడం.

## కులాన్ని నిర్మూలించాలంటే, శాస్త్రాల అధికారాన్నే నిర్మూలించాలి

ప్రజల విశ్వాసాలను, భావాలను శాస్త్రాలు తీర్చిదిద్దుతున్నంత కాలం మీ ఆదర్శాన్ని మీరు ఎలా సాధించ గలరు? ఒక ప్రక్క శాస్త్రాల అధికారాన్ని ప్రశ్నించకుండా - అవి చెప్పే సిద్ధాంతాలను పవిత్ర భావంతో ప్రజలు నమ్మడాన్ని, అనుసరించడాన్ని అంగీకరిస్తూ - మరొక ప్రక్క అట్టి ప్రజల ప్రవర్తన అసంగతంగాను, అమానుషంగాను ఉన్నందుకు వారిని విమర్శించడం, నిందించడం పిచ్చి పని. సాంఘిక సంస్కరణకు అది మార్గమే కాదు. శ్రీ గాంధీతో సహా - అస్పృశ్యతా నివారణ కోసం కృషి చేస్తున్న ఏ సంస్కర్తా కూడా, ఈ వాస్తవాన్ని గుర్తించినట్టు లేదు. ప్రజలు చేసే పనులు వారు నమ్ముతున్న శాస్త్రాల ఆదేశాలను బట్టి ఉంటాయని, ప్రజల ప్రవర్తనను మార్చడానికి ముందు అట్టి ప్రవర్తనకు బాధ్యత వహిస్తున్న శాస్త్రాల పవిత్రతలో వారికి గల విశ్వాసాన్ని తొలగించవలసి ఉంటుందని ఈ సంస్కర్తలు గమనించినట్లు లేదు. అందువల్ల వారి కృషి ఎట్టి ఫలితాలను సాధించలేక పోయిందంటే ఆశ్చర్యమేముంది? అంటరానితనాన్ని నిర్మూలించడం కోసం కృషి చేస్తున్న ఈ సంస్కర్త లందరూ ఎక్కడ పొరపాటు పడ్డారో, అక్కడే మీరు కూడ తప్పటడుగు వేస్తున్నట్టు కనిపిస్తుంది. వర్ణాంతర భోజనాల కోసం, వర్ణాంతర వివాహాల కోసం ఆందోళన చెయ్యడం, అట్టివాటిని ఏర్పాటు చెయ్యడం అవాంఛనీయం. అట్టి బలవంతపు భోజనాలు, బలవంతంగా ఏర్పాటు చేసే వర్ణాంతర వివాహాలు కూడ అసంగతమైనట్టివే. ప్రతి స్త్రీని, ప్రతి పురుషుడినీ శాస్త్రాల దాస్యం నుంచి విముక్తుల్ని చెయ్యండి. శాస్త్రాలు బోధిస్తున్న అక్రమ దుష్ట భావాలను వారి మనస్సుల నుంచి తుడిచి పెట్టండి. అప్పుడు మీరు చెప్పనవసరం లేకుండానే అట్టి స్త్రీ పురుషులు వర్ణాంతర భోజనాలు చేస్తారు. వర్ణాంతర వివాహాలూ చేసుకొంటారు.

మాటల గారడీ వల్ల, శ్లేషల వల్ల లాభం లేదు. మాటలకు విశేషార్థాలను చెప్పి తప్పించుకో చూడడం నిష్ప్రయోజనం, వ్యాకరణ విశేషాన్నో, వ్యాఖ్యాన వైచిత్రినో

చూపి శాస్త్రాల అర్థం మీరనుకొంటున్నది కాదని ద్వందార్థాలు ప్రజలకు చెప్పి లాభంలేదు. ముఖ్యమైన విషయమేమిటంటే, ప్రజలు శాస్త్రాలను ఏవిధంగా అర్థం చేసుకున్నారనేది. బుద్ధుడు ఏ వైఖరిని అవలంబించాడో ఆ వైఖరినే మీరనుసరించ వలసి ఉంది. గురునానక్ ఎట్టి వైఖరిని అవలంబించాడో ఆ వైఖరినే మీరు అవలంబించ వలసి ఉంది. కేవలం శాస్త్రాలను నిరాకరించడం మాత్రమే చాలదు. బుద్ధుడు, నానక్ చేసినట్లు మీరు శాస్త్రాల అధికారాన్నే తిరస్కరించ వలసి ఉంది. తమలో ఉన్న దోషం తమ మతమేనని - కులంపట్ల పవిత్రతా భావాన్ని నూరిపోసినది తమ మతమేనని - హిందువులకు మీరు చెప్పవలసి ఉంది. అలా చెప్పగల ధైర్యం మీకున్నదా? ఉంటే, అట్టి ధైర్యాన్ని మీరు ప్రదర్శించి చూపగలరా?

ఈ ఉద్యమంలో మీకు గల విజయావకాశం ఎంత? సాంఘిక సంస్కరణలు అనేక రకాలు. ఇందులో ఒకరకం ఏ మాత్రమూ మత ప్రమేయం లేనట్టిది. మరొక రకం పూర్తిగా మత ప్రమేయం కలిగినట్టిది. అంటే మత విశ్వాసాలకు సంబంధించి నట్టిది.

ఈ సంస్కరణలో కూడా రెండు తరహాలున్నాయి. అందులో ఒకటి మత సిద్ధాంతాలకు అనుకూలమైనట్టిది. మత సిద్ధాంతాల నుంచి ఎడమై పోతున్న ప్రజలకు ఉద్బోధించి, వారిని తిరిగి ఏతత్ సిద్ధాంతాలను అనుసరించేటట్టు చేసేది. రెండో తరహా మత సిద్ధాంతాలకు ప్రతికూలమైనట్టిది, మత సిద్ధాంతాలను నిరాకరించి, వాటి అధికారాన్ని తిరస్కరించి, హేతుబద్ధంగా ఆలోచించేటట్టు ప్రజలను పురి కొల్పేది.

కులం అనేది కొన్ని మత విశ్వాసాల కారణంగా ఏర్పడిన వ్యవస్థ. ఆ మత విశ్వాసాలకు శాస్త్రాలు దైవ సమానులైన ఋషులచే ప్రతిపాదించబడినట్టివనే ప్రతీతి ఉంది. ఆ ఋషులు మానవాతి శక్తులు కలవారని, మహా జ్ఞానులని, అట్టి వారి ఆదేశాలను ధిక్కరించడం మహా పాపమని, ప్రజలకు ఒక నమ్మకం ఉంది. అందువల్ల కులవ్యవస్థను వదులుకొమ్మని ప్రజలను కోరడం వారి ప్రాథమిక మత భావాలకు విరుద్ధంగా వారిని నడుచుకోమనడమే.

మొదటి రెండు రకాల సంస్కరణలు సులభమే కావచ్చు. కాని, ఈ తరహా సంస్కరణ – కుల నిర్మూలనా చాలా మహత్తరమైన పని. చాలా వరకు అసాధ్యమైన పని కూడ కావచ్చు. హిందువులు తమ సామాజిక వ్యవస్థను పరమ పవిత్రంగా భావిస్తారు. కులానికి దైవిక ప్రాతిపదికను ఆపాదిస్తారు. అందువల్ల మీరు కులాన్ని నిర్మూలించాలంటే దానికి ఆధారంగా కల్పించబడ్డ దైవికతను, పవిత్రతను ముందు నిర్మూలించ వలసి ఉంది. అంటే శాస్త్రాల యొక్క వేదాల యొక్క అధికారాన్ని నిర్మూలించ వలసి ఉన్నదన్నమాట.

## కుల నిర్మూలనోద్యమంలో బ్రాహ్మణులు ఎందుకు సహకరించరు!

కులనిర్మూలనకు అవసరమైన ఈ పద్ధతులన్నింటిని నేను ఇక్కడ ఎందుకు చర్చించానంటే లక్ష్యాన్ని తెలుసుకోవడం కంటే, లక్ష్య సాధన పద్ధతులను తెలుసుకోవడం ఎక్కువ ముఖ్యం కనుక. లక్ష్య సాధన పద్ధతులు నిజంగా ఏమిటో మీకు తెలియక పోతే, మీరు చేసే ప్రతి ప్రయత్నం అది ఎంత గట్టి ప్రయత్నమైనా సరే, నిష్ఫలమే అవుతుంది. ఈ సమస్య స్వభావ స్వరూపాలపై నేను చేసిన విమర్శ సరైనదే అని మీరు భావిస్తే, దాని పరిష్కారం ఎంత కష్టమైనదో మీరు గుర్తించిన వారవుతారు. అప్పుడు అట్టి కష్టతర మహత్కార్యాన్ని సాధించే శక్తి మీకున్నదో లేదో మీరే చెప్పవలసి ఉంది.

నా మట్టుకు నాకు ఏమనిపిస్తుందంటే – ఈ పని అంతా నిజంగా దుస్సాధ్యం అనిపిస్తుంది. నేను అలా ఎందుకు అనుకొంటున్నానో తెలుసుకోవాలనే కుతూహలం బహుశ మీకు ఉండవచ్చు. నేను అలా అనుకోవడానికి కారణాలు చాలా ఉన్నై. వాటిలో ముఖ్యమైన కొన్నిటిని మాత్రం ఇక్కడ చెపుతాను.

అందులో ఒకటి ఏమిటంటే ఈ సమస్యపట్ల బ్రాహ్మణులు ప్రదర్శిస్తున్న శత్రుధోరణి. రాజకీయ సంస్కరణోద్యమంలోను, కొన్ని సందర్భాలలో ఆర్థిక సంస్కరణోద్యమంలోను కూడ, ముందు నడుస్తున్న –ఉద్యమాన్ని నడిపిస్తున్న ప్రధాన వర్గం బ్రాహ్మణులే, కాని, సాంఘిక సంస్కరణ విషయంలో ముఖ్యంగా కుల అవరోధాలను తొలగించే ప్రధాన విషయంలో ఈ బ్రాహ్మణులు మందుకైనా కనిపించక

పోవడం విచిత్రంగా లేదా? ఈ విషయంలో ఈ సమస్యను చేబట్టి ఈ ఉద్యమాన్ని బ్రాహ్మణులు ముందుండి నడిపించ గలరనే ఆశ ఏ మాత్రమైనా ఉన్నదా?

నేను అనుకొంటున్నది ఏమిటంటే అట్టి ఆశ లేనే లేదని. ఎందుకు లేదు అని మీరు అడగవచ్చు. ఆర్థిక, రాజకీయ రంగాలలో అంతగా సంస్కరణను కోరుతున్న బ్రాహ్మణులు, ఈ సాంఘిక సంస్కరణ విషయంలో వెనుకబడి పోవలసిన అవసరం లేదని మీరు వాదించవచ్చు. హిందూ సమాజం యొక్క వెన్నెముక కుల వ్యవస్థే నన్న విషయం బ్రాహ్మణులకు తెలుసుననీ, సమాజంలో అత్యధిక విద్యా విజ్ఞాన పరులైన అట్టి బ్రాహ్మణులకు ఈ కుల వ్యవస్థ అభివృద్ధి నిరోధకమనీ తెలుసు గనుక, దానివల్ల వచ్చే దుష్ఫలితాల పట్ల వారు ఉపేక్షవహించి ఉండలేరనే మీరు వాదించవచ్చు. అంతే కాక బ్రాహ్మణులలో మత ప్రసక్తి లేని విజ్ఞానవంతులు సహకరిస్తారనీ కూడ మీరు వాదించవచ్చు. ఈ వాదన అంతా సమంజసంగానే ఉన్నట్టు కనిపించవచ్చు. అయితే ఈ విషయంలో ఒక్క సత్యం విస్మరించ బడింది. కుల వ్యవస్థ నిర్మూలించబడితే దానివల్ల నష్టపడేది బ్రాహ్మణ కులమే కదా!

కాగా తమ కులం యొక్క శక్తిని, పరువు ప్రతిష్టలను నాశనం చేసే కుల నిర్మూలనోద్యమాన్ని బ్రాహ్మణులు తాముగా ముందుండి నడిపించడానికి అంగీకరిస్తారని మనం ఆశించడం సముచితమేనా? మత ప్రసక్తి లేని విజ్ఞానవంతులైన బ్రాహ్మణులు, కేవలం ఆచారపరులైన బ్రాహ్మణులకు మధ్య తేడా ఊహించడం కూడా నిష్ప్రయోజనమే. ఆ రెండు రకాల బ్రాహ్మణులూ రక్త సంబంధీకులే. ఒకే శరీరానికి రెండు చేతులవంటి వాళ్ళు. అందులో ఒకరి మనుగడకు మరొకరు పోరాడక తప్పదు.

## బ్రాహ్మణుడు చచ్చినా, విప్లవవాది కాలేడు

ఈ సందర్భంలో నాకొక విషయం జ్ఞాపకం వస్తుంది. ఇంగ్లీషు కానిస్టిట్యూషన్ (ఆంగ్ల రాజ్యాంగం) అనే తన గ్రంథంలో పార్లమెంటు యొక్క శాసనాధిపత్యంలోని వాస్తవ పరిమితి గురించి చెబుతూ ప్రొఫెసర్ డెయాసి ఇలా అంటాడు: "అధికారాన్ని చెలాయించడానికి ఏ రాజ్యాధిపతికైనా – ముఖ్యంగా పార్లమెంటుకి తప్పనిసరిగా

రెండు పరిమితులు ఉంటాయి. వీటిలో ఒకటి బాహ్యమైనట్టిది. రెండవది అంతరంగికమైనట్టిది. బాహ్యమైన పరిమితి ఏమిటంటే - ఆ అధికారాన్ని ఆ రాజ్య ప్రజలే (అందరూ కాకున్నా, అధిక సంఖ్యాకులు) ధిక్కరించే అవకాశం. ఆంతరంగికమైన పరిమితి మాత్రం ఆ రాజ్యాధికారం యొక్క స్వరూప స్వభావాలకు చెందినట్టిది. ఒక నిరంకుశుడైన ప్రభువు కూడా తన అధికారాలను తాను జీవిస్తున్న దేశ కాలాలకు అప్పటి సాంఘిక, నైతిక పరిస్థితులకు అనుకూలంగా మలచబడ్డ తన మానసిక ప్రవృత్తిని బట్టి చెలాయిస్తాడు. ఒక సుల్తాను తాను కావాలనుకున్నా మహమ్మదీయ ప్రపంచంలోని మతాన్ని మార్చలేడు. ఒకవేళ సుల్తాను చేయగలిగినా మహ్మదీయ మతాధిపతి మహమ్మదు ప్రవక్త బోధించిన మతాన్ని పడగొట్టటానికి ఇష్టపడ గలడా? అది ఊహించరాని అసంగతం. అందుచేత ఆంతరంగికంగా వచ్చే నిరోధం బాహ్య పరిమితికేమాత్రం తీసిపోదు. ఒక్కొక్కసారి ప్రజలు కొన్ని చొప్పదంటు ప్రశ్నలడుగుతారు. పోపు మహాశయుడు (క్రైస్తవ మతాధిపతి) క్రైస్తవ మతంలో ఆ సంస్కరణో, ఈ సంస్కరణో ఎందుకు ప్రవేశ పెట్టాడు అని. దీనికి సరైన జవాబు ఒక్కటే. విప్లవ వాదియైన వాడు పోప్ కాలేడు. పోప్ అయినవాడు విప్లవాది కాదలచడు.

ప్రొఫెసర్ డెయసీ ఉద్ఘాటించిన ఈ సత్యం ఇండియాలోని బ్రాహ్మణుల పట్ల కూడా అక్షరాలా వర్తిస్తుంది. పోప్ అయినవాడు విప్లవవాది ఎలా కాదలంచడో, బ్రాహ్మణుడుగా పుట్టినవాడు అలానే విప్లవవాది కాదలంచడు. (ఏదో ఒక పరిస్థితిలో పోప్ అయినా విప్లవవాది కావచ్చునేమో కాని, బ్రాహ్మణుడుగా పుట్టినవాడు చచ్చినా విప్లవ వాది కాడు). సాంఘిక సంస్కరణ విషయాలలో బ్రాహ్మణుడు విప్లవవాది కావాలనుకోవడం - వెస్లీ స్టేఫెన్ మహాశయుడన్నట్లు ఇంగ్లాండులో నీలికన్నుల శిశువులందరిని హత్య చెయ్యాలని బ్రిటిషు పార్లమెంటు చట్టం చెయ్యాలని ఆశించడం. ఇంతకంటే పిచ్చితనం మరొకటి ఉండదు.

కుల నిర్మూలనోద్యమాన్ని నడిపించడానికి బ్రాహ్మణులు ముందుకు వచ్చినా రాకపోయినా - దాని గురించి పట్టించుకోనక్కర లేదని, దానికంత ప్రాధాన్యం ఇవ్వనక్కర లేదని మీలో కొందరనవచ్చు. అలా అనేవారు సమాజంలో మేధావి వర్గం నిర్వహించగల పాత్రను అవగాహన చేసుకోలేదనే నా ఉద్దేశం. ఒక మహా

వ్యక్తి చరిత్రను సృష్టించ గలడు అనే సిద్ధాంతాన్ని మీరు అంగీకరించినా, అంగీకరించక పోయినా - ఒక సత్యాన్ని మాత్రం మీరు గుర్తించక తప్పదు. అదేమిటంటే ప్రతి దేశంలోనూ కూడ మేధావి వర్గమే పాలకవర్గం కాకపోయినా, అత్యంత పలుకుబడి గల వర్గం, భవిష్యత్తును ఊహించ గలది, సలహాలు ఇవ్వగలది, నాయకత్వం వహించగలది ఒక్క మేధావి వర్గమే. ఏ దేశంలోనైనా సరే సూక్ష్మంగా ఆలోచించగల వాళ్ళు. తెలివితేటలతో పనిచేయగల వాళ్ళు సామాన్య ప్రజలు కానే కాదు. సామాన్య ప్రజలు ఎప్పుడూ ఎక్కువగా మేధావి వర్గాన్ని అనుసరిస్తూ, అనుకరిస్తూ ఉంటారు. ఏ దేశానికైనా సరే - దాని భవిష్యత్తు మొత్తం దాని మేధావి వర్గంపై ఆధారపడి ఉంటుందన్నా అతిశయోక్తి కాదు. అట్టి మేధావి వర్గం నిజాయితీ కలదై, స్వతంత్రమై నట్టిదై, స్వప్రయోజనం లేనిదై ఉంటే - విపత్కర పరిస్థితులలో దాని నాయకత్వాన్ని విశ్వసించవచ్చు. మంచి లక్షణానికి మేధస్సు ఉంటే చాలదు. మేధస్సు ఒక సాధనం వంటిది. ఈ సాధనం యొక్క ప్రయోజనం దాన్ని ఉపయోగించే మేధావి సాధించ దలచిన లక్ష్యాన్ని బట్టి ఉంటుంది. మేధావి అయిన ఒకడు మంచిగా ఉండవచ్చు. అతడు మంచి వంచకుడు కూడా కావచ్చు. అదేవిధంగా మేధావి వర్గం - మానవులను తప్పు దారి నుంచి తప్పించి వారి నుద్ధరించడానికి సిద్ధపడే ఉన్నతాదర్శాలు కల ఉన్నతాత్ములు కావచ్చు. తద్విరుద్ధంగా - మేధావి వర్గం కపట ముఠాదారులు కావచ్చు లేక తమ స్వప్రయోజనాల కోసం తమకు మద్దతు నిచ్చే సంకుచిత ముఠాదారులకు సలహాదారులు కూడ కావచ్చు.

ఇండియాలో మేధావి వర్గం అంటే., అది బ్రాహ్మణ కులానికే మరొక పేరు. మేధావి వర్గం ఒక్క బ్రాహ్మణ కులానికే పరిమితం కావడం, ఆ వర్గం ఒక్క బ్రాహ్మణుల బాగోగులను, అభివృద్ధిని మాత్రమే పట్టించుకోవడం దురదృష్టకరం. దేశ క్షేమానికి బాధ్యత వహించవలసిన మేధావి వర్గం, ఒక్క బ్రాహ్మణ కుల క్షేమాన్ని మాత్రమే కాంక్షించేదిగా ఉంది. ఇది ఎంతో విచారకర పరిస్థితి కావచ్చు. ఐనప్పటికి హిందువులలో ఈ మేధావి వర్గం బ్రాహ్మణులే అనేది మాత్రం పచ్చి నిజం.

అంతేకాదు. తక్కిన హిందువులందరి వల్ల కూడ, గొప్ప పూజలందుకొంటున్న మేధావి వర్గం ఈ బ్రాహ్మణులే. బ్రాహ్మణులు భూదేవతలని హిందువులందరికి

బోధించ బడింది. బ్రాహ్మణులు మాత్రమే తమకు గురువులుగా ఉండగలరని హిందువులందరికి చెప్పబడింది. "వర్ణానాం బ్రాహ్మణో గురుః"

మనువు ఇలా అంటాడు - "ప్రత్యేకంగా పేర్కొన బడిన ధర్మ సూత్రాల విషయంలో ఏమి చెయ్యాలి, వాటి నెలా తెలుసుకోవాలి అని సంశయం వచ్చినప్పుడు నైష్టికులైన బ్రాహ్మణులు ఏది చెప్పితే దానినే న్యాయబద్ధమైన ధర్మంగా స్వీకరించాలి." అని.

"అనామ్నా తేషు ధర్మేషు కథం స్యాదితి చేద్భవేత్
యం శిష్టా బ్రాహ్మణా బ్రూయుఃస ధర్మః స్యాదశంకితః"

అటువంటి మేధావి వర్గం - తక్కిన సమాజాన్నంతా తన గుప్పిటిలో పెట్టుకొని ఉన్న మేధావి వర్గం - కుల సంస్కరణకు వ్యతిరేకమై యుండగా, కుల వ్యవస్థను నిర్మూలించే ఉద్యమం ఫలప్రదం అయ్యే అవకాశాలు చాలా తక్కువ అని నా అభిప్రాయం.

## కుల వ్యవస్థను ఎదుర్కోడానికి హిందువులు ఎందుకు ఏకం కారు?

కుల వ్యవస్థను నిర్మూలించడం కష్టసాధ్యం అనడానికి నేను చెప్పే రెండవ కారణాన్ని మీరు సమగ్రంగా అర్థం చేసుకోవాలంటే - ఈ కుల వ్యవస్థ నిర్మాణంలోని కీలకాన్ని మీరు పూర్తిగా గ్రహించుకో గలగాలి. ఈ కీలకం ద్విముఖమైనట్టిది. అందులో ఒకటి - ఈ కుల వ్యవస్థ మనుషుల్ని వేరు వేరు కులాలుగా విడదీస్తున్నది. రెండు - ఈ కుల వ్యవస్థ విడదీసిన కులాలను సాంఘిక హెూదాలో ఒకదానిపై ఒకటి అంతస్తులుగా అమరుస్తున్నది. ఈ అంతస్తుల నిర్మాణంలోని గారడీ ఏమిటి అంటే - ప్రతీ కులం తాను మరొక కులాని కంటే ఎక్కువ అనే గర్వం. తన క్రింద మరొక కులం ఉన్నదనే ఓదార్పు పొందడం. ఈ అంతస్తులకు బాహ్య చిహ్నంగా సాంఘికమైన, మత విషయకమైన, హక్కుల సంబంధమైన అంతస్తుల నిర్మాణం మరొకటి ఉంది. అట్టి హక్కులకు సాంకేతికమైన పేరు అష్టాధికారాలు లేక సంస్కారాలు. కులం ఎంత పై అంతస్తుదైతే అన్ని ఎక్కువ హక్కులుంటాయి. కులం ఎంత తక్కువ అంతస్తుదైతే అన్ని తక్కువ హక్కులుంటాయి.

కుల నిర్మాణంలో ఈ అంతస్తుల వల్ల, హెచ్చు తగ్గు తారతమ్యాలవల్ల కుల వ్యవస్థకు వ్యతిరేకంగా ఒక సమిష్ఠి ఉద్యమాన్ని సంఘటిత పరచడం అసాధ్యమే అవుతుంది. ఒక వేళ ఏదయినా ఒక కులం వాళ్ళు తమకంటే పై కులం వాళ్ళతో కలిసి భోజనం చెయ్యాలని గాని, వివాహ సంబంధాలు పెట్టుకోవాలని గాని అనుకుంటే - దానికి తుంటపెట్టే తుంటరులు వెంటనే తయారవుతారు. అట్టి తుంటరులలో ముఖ్యులు బ్రాహ్మణులు. పైకులంతో అట్టి సంబంధాలు పెట్టుకోవాలని కోరే కులాలు తమ క్రింది కులానికి కూడా అట్టి అవకాశాన్ని కలిగించ వలసి ఉంటుందని ఈ తుంటరులు వాదనలు మొదలు పెడతారు. అంతటితో ఆ ప్రయత్నం నాశనమవుతుంది.

అందరూ యీ కుల వ్యవస్థకు బానిసలే. అయితే, ఈ బానిలందరూ ఒకే స్థాయికి చెందినవాళ్ళు కాదు. ఆర్థిక విప్లవం తీసుకురావడం కోసం శ్రామిక జనాన్ని రెచ్చగొట్టేటందుకు మార్క్స్ మహాశయుడు "మీరు పోగొట్టుకునేదేమీ లేదు - మీ సంకెళ్ళు తప్ప" అని వారికి ఉద్బోధించాడు. కాని, హిందువులలోని వివిధ కులాల ప్రజలను కుల వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రేరేపించడానికి మార్క్స్ మహాశయుని నినాదం ఏవిధంగానూ పనికి రాదు. అంత చాకచక్యంతో విచిత్రంగా మత సాంఘిక హోదాలు ఏర్పాటు చేయబడ్డాయి. ఈ కులాల అంతస్తులూ, వాటి హక్కులూ - ఈ కులాలన్నింటికీ దేనికి దానికే కొద్దో గొప్పో కొన్ని కొన్ని ఆధిక్యతలు ఉండేటట్టు ఏర్పాటు కావడం వల్ల - మొత్తం కుల వ్యవస్థ రద్దయితే తమ స్వాతిశయాలు పోగలవనే భయం ప్రతీ కులానికీ ఉంది. ఇంతేకాక, ఒక కులానికి మరొక కులం మీద ఉన్న ప్రభావాలు, ప్రతిష్టలు పోతాయనే భీతి కూడా ఉంది. ఈ విషయాలలో ఒక కులం కంటే మరొక కులం ఎక్కువ పోగొట్టుకునే వీలు వున్నందువల్ల, ఈ కులాలు నిత్యమూ పరస్పర మాత్సర్యంతో మ్రగ్గుతూ ఉన్నందువల్ల, మార్క్స్ మహాశయుడు శ్రామిక జనంలో ఆశించే ఐకమత్యం హిందువులలో మృగ్యం కాగా - కుల వ్యవస్థను ఎదిరించడానికి హిందువులను ఒక సంఘటిత శక్తిగా సమీకరించడం మీకు సాధ్యం కాదు.

## హేతువాద శక్తి హిందువుకు శాస్త్ర విరుద్ధం

హేతువాదాన్ని చూసి, హేతు విరుద్ధమైన కుల వ్యవస్థను విడిచిపెట్టుకో వలసిందిగా మీరు హిందువులను అడగ గలరా? ఇప్పుడు ఒక ప్రశ్న ఉదయిస్తున్నది.

తన హేతువాదాన్ని అనుసరించే స్వేచ్ఛ హిందువుకు ఉన్నదా? మనువు మూడు ఆదేశాలను ఇచ్చాడు. ఆ మూడు ఆదేశాలను ప్రతీ హిందువు తన దైనందిన ప్రవర్తనలో అనుష్టించవలసి ఉంది. "వేదః స్మృతిః సదాచారః స్వస్యచ ప్రియమాత్మనః"ఇక్కడ హేతువాదనకు ఏ రకమైన స్థానమూ, ఆస్కారమూ లేదు. హిందువైనవాడు వేదాన్ని గానీ, స్మృతిని గాని, సదాచారాన్ని గాని అనుసరించి తీరవలసిందే. మరొక దానిని అతడు అనుసరించ లేడు. అనుసరించ కూడదు.

ఈ విషయాన్ని గురించి సూక్ష్మంగా పరిశీలించి చూడండి. ఏదైనా ఒక విషయంలో వేదంగాని, స్మృతి గాని చెప్పేదాని అర్థం గురించి అనుమానం వచ్చినప్పుడు అట్టి వేద భాగానికో, స్మృతి భాగానికో సరైన అర్థం చెప్పుకోవడం ఎలా? ఇది చాలా ముఖ్యమైన ప్రశ్న కాదా? ఈ ప్రశ్నకు మనువు చెప్పిన జవాబు ఎంత స్పష్టంగా ఉందో చూడండి.

*యోఽవ మన్యేత్ తే మూలే హేతు శాస్త్రాశ్రయాతు ద్విజః!*

*స సాధు భి బహిష్కార్యో నాస్తికో వేదనిందకః!"*

ఈ నిబంధన ప్రకారం వేదాలకు, స్మృతులకు అర్థం చేప్పుకోవడంలో హేతువాదానికి తావు లేకుండ చేయబడింది. హేతుబద్ధంగా వేదాదులకు అర్థం చెప్పడం నాస్తికత్వం వంటి దుష్టత్వమని హెచ్చరించబడింది. అందుకు శిక్ష సాంఘిక బహిష్కారం (వెలి) అని కూడ నిర్దేశింప బడింది.

ఈ విధంగా వేదానికి కాని, స్మృతికి కాని సంబంధించిన విషయాలలో ఏ హిందువు కూడా హేతుబద్ధంగా ఆలోచించడానికి వీలు లేదు. ఏదైనా ఒక విషయంలో వేదాలు, స్మృతులు పరస్పర విరుద్ధమైన ఆదేశాలు ఇచ్చి ఉన్నప్పుడు కూడా, పరిష్కారం హేతువుకు విడిచిపెట్టబడలేదు. రెండు శ్రుతుల మధ్య వైరుధ్యం ఏర్పడినప్పుడు రెంటికీ కూడ సమాన అధికారమే ఉంటుంది. ఆ రెండింటిలో ఏ ఒక దానినైనా అనుసరించవచ్చు. ఆ రెంటిలో ఏది హేతుబద్ధమైనదో తెలుసుకొనే ప్రయత్నమే చెయ్యకూడదు. ఈ విషయాన్ని మనువు స్పష్టంగా చెప్పి వున్నాడు.

*"శ్రుతి ద్వైధంతు యత్ర స్యాత్తత్ర ధర్మావు భౌ స్మృతా!!"*

శ్రుతికీ, స్మృతికీ మధ్య వైరుధ్యం ఏర్పడినప్పుడు శ్రుతినే అధికారంగా స్వీకరించ వలసి ఉంటుంది. అయితే ఇక్కడ కూడ ఆ రెండింటిలో ఏది ఎక్కువ హేతుబద్ధమో కనుగొనే ప్రయత్నమే చెయ్యకూడదు. ఈ విషయాన్ని కూడ మనువు ఈ క్రింది శ్లోకంలో పేర్కొని ఉన్నాడు.

*'యా వేద బాహ్యాః స్మృతయో యాశ్చ కాశ్యకుదృష్టః!*
*సర్వాస్తా నిష్ఫలాః ప్రేత్య తమో నిష్ఠా హితః స్మృతాః"*

అలానే - రెండు స్మృతుల మధ్య సంఘర్షణ ఏర్పడినప్పుడు మనుస్మృతినే అనుసరించాలి. ఆ రెండు స్మృతులలో ఏది హేతువాదానికి నిలబడుతుందో కనుక్కొనే ప్రయత్నమే చెయ్యకూడదు. ఈ ఆదేశాన్ని (రూలింగును) ఇచ్చినవాడు బృహస్పతి

*"వేదా యత్వోప నిబంధృత్వత్ ప్రమాణ్యాం హి మనోః స్మృతం!*
*మన్వర్థ విపరీతా తు యా స్మృతిః సా న శస్యతే!"*

కాగా శృతులు కాని, స్మృతులు కాని ఖచ్చితమైన ఆదేశాలను ఇచ్చిన ఏ విషయంలో నైనా సరే, హిందువు తన హేతువాద శక్తిని ఉపయోగించ లేడు. అలా ఉపయోగించే స్వేచ్ఛ అతనికి లేదు. ఇదే నిబంధన మహాభారతంలో కూడ ఉపపాదించబడింది.

*పురాణం మానవో ధర్మ: సాంగో వేద శ్చికిత్సితం*
*అజ్ఞా సిద్ధాని చత్వారి న హంతవ్యాని హేతు భిః !"*

హిందువుడు వాటి నిర్దేశాలకు కట్టుబడి ఉండవలసిందే. వేదాలు, స్మృతులు కూడ కులం విషయంలోనూ, వర్గం విషయంలోనూ తమ నిర్దేశాలను ఇచ్చి ఉన్నై. అందుకే హేతువాదానికి హిందువుడి మనస్సులో స్థానమే లేదు. కులమూ, వర్ణమూ విషయంలో హిందువుడు తన తార్కిక బుద్ధిని ఉపయోగించడానికి శాస్త్రాలు సమ్మతించక పోగా - అతడు కులం విషయంలోనూ, వర్ణం విషయంలోనూ గల విశ్వాసాల పుట్టు పూర్వోత్తరాలను గురించి హేతుబద్ధంగా ఆలోచించడానికి అవకాశాన్ని కూడ ఇవ్వవు.

హిందువుడు తన కుల, వర్ణ ఆచారాలను పాటించే పద్ధతి చూస్తే చాలా తమాషాగా వుంటుంది. వందలు వేల మంది హిందువులు ప్రతి నిత్యమూ రైల్వే ప్రయాణాలు, విదేశ యాత్రలు వంటి ఎన్నో సందర్భాలలో కులాన్ని విచ్ఛిన్నం చేస్తూనే ఉంటారు. కులాచార నిబంధనలను ఉల్లంఘిస్తూనే ఉంటారు. అయినా తమ తక్కిన జీవితంలో కులాన్ని పాటించడం పట్ల పట్టుదలగా ఉంటారు. ఈ ధోరణి చూస్తే హైందవేతరులకు ఎంతో వినోదాన్ని కలిగిస్తూ ఉంటుంది. ఈ విచిత్ర పరిస్థితికి ఏమిటి హేతువని తరిచి చూస్తే, హిందువుడి హేతువాద శక్తి ఎంత అస్వతంత్రమై శృంఖలాబద్ధమై పోయిందో తెలుస్తుంది.

## కోటి పాపాలు కొబ్బరికాయతో పోతాయా!

మనిషి యొక్క జీవితం సాధారణంగా అలవాటును బట్టి సాగిపోతుంది. ఏదైనా ఒక క్లిష్ట పరిస్థితో, ఒక సంశయమో, ఒక మానసిక సంఘర్షణమో, కలిగినప్పుడు తప్ప ఒక అంశం మీద పూర్వాపరాలు, పర్యావసానాలు, ఉచితానుచితాలు తర్కించి, యోచించి పని చేయడు. రైల్వే ప్రయాణాలు, విదేశ యాత్రలూ మొదలయిన సందర్భాలలోనే నిజమైన సంశయాలూ, సంఘర్షణలూ పొడసూపేది. తాను అన్ని సందర్భాలలోను ఖచ్చితంగా కులాన్ని పాటించలేనప్పుడు, అసలు కులాన్నే ఎందుకు పాటించాలని హిందువుడు తనను తాను ప్రశ్నించుకో వలసిన సందర్భాలవి. కాని హిందువుడు అలా ప్రశ్నించుకోడు. అలాంటి ప్రశ్నే అతని మనస్సుకు తట్టదు. ఒకచోట కులాన్ని ధిక్కరించి ప్రవర్తించి, వెంటనే మరొకచోట కులాన్ని ఖచ్చితంగా అనుసరించి ప్రవర్తిస్తాడు. దానికొక ప్రశ్నా, ఆలోచనా అంటూ ఉండదు. హిందువుడి యొక్క ఈ విస్మయకర ప్రవర్తనకు మూల కారణం అతడి ప్రవర్తనను శాసించే శాస్త్రాలు నిబంధనలో ఉంది. వీలున్నంత వరకు కులాన్ని పాటించమనీ, వీలు తప్పినప్పుడు ప్రాయశ్చిత్తం చేసుకోమనీ శాస్త్రాలే అతడికి బోధిస్తున్నై. ఈ ప్రాయశ్చిత్త సిద్ధాంతం ద్వారా ఒక విధమైన రాజీ ధోరణిని శాస్త్రాలు అవలంభించడం వల్ల కులానికి ఒక స్థిరత్వం ఏర్పడింది. వాస్తవ ప్రవర్తనలో అది క్షణక్షణమూ చస్తూ ఉన్నా, ప్రాయశ్చిత్తాల ద్వారా అది మళ్లీ మళ్లీ బ్రతుకుతూ కొనసాగుతూనే ఉంటుంది. ఈ రాజీ ధోరణే లేకపోతే హేతువాదనకు పునరాలోచనకు స్థానం ఏర్పడి, అవాస్తవికమైన ఈ కులభావన ఏనాడో అదృశ్యమైపోయి ఉండేది.

కులాన్ని, అంటరానితనాన్ని రద్దు చేయడానికి ఎంతోమంది ప్రయత్నించి ఉన్నారు. వారిలో రామానుజుడు, కబీరు అత్యంత ముఖ్యమైన వాళ్ళు. మహానుభావులైన ఈ సంస్కర్తల జీవితాలను ఆదర్శంగా చూపి, వారిని అనుసరించ వలసిందిగా హిందువులను మీరు హెచ్చరించగలరా? హెచ్చరిస్తే, హిందువుడనేవాడు మీ మాటను వింటాడా? శాస్త్రం విననిస్తుందా? శ్రుతితోనూ, స్మృతితోను సమానమైన స్థానం సదాచారానికి కూడ మనువు ఇచ్చిన మాట నిజమే. నిజానికి శాస్త్రాల కంటే ఉన్నత స్థానమే సదాచారానికివ్వబడింది.

*"యద్యద్ధా చర్యతే యేన ధర్మ్య వా 2 ధర్మ్య మేవ వా*
*దేశ స్యా చరణం నిత్యం చరిత్రం తద్ధి కీర్తి తం"*

దీని ప్రకారం సదాచారాన్ని - అది ధర్మమైనదైనా సరే, అధర్మమైనదైనా సరే, శాస్త్రాలకు అనుకూలమైనట్టిదైనా సరే, ప్రతికూలమైనట్టిదైనా సరే - అనుసరించి తీరవలసిందే. అయితే, సదాచారం అంటే అర్థం ఏమిటి? సదాచారం అంటే మంచి ఆచారం అనో, మంచి వాళ్లూ, సత్పురుషులు ఆదరించే ఎవరైనా అనుకొంటే, అంత కంటే పెద్ద పొరపాటు మరొకటి ఉండదు. మనువు చెప్పే సదాచారానికి, సత్పురుషుల సత్కార్యాచరణకూ ఏమీ సంబంధం లేదు. మనువు చెప్పే సదాచారానికి అర్థం పూర్వాచారం అని. అట్టి పూర్వాచారం మంచిది కావచ్చు. చెడ్డది కావచ్చు. మంచి చెడ్డలతో నిమిత్తం లేకుండా సనాతనాచారాన్ని అనుసరించి తీరాలని మనువు చెపుతున్నాడు. ఈ శ్లోకం చూడండి:

*"యాస్మిన్ దేశే య ఆచారః పారం పర్య క్రమాగతః*
*వర్ణానాం కిల సర్వేషాం న సదాచార ఉచ్యతే."*

హిందువైన వాడెవడైనా సదాచారమంటే మంచిపని అనో, మంచివాళ్ళ సత్కార్యాలనో అర్థం చేసుకొనే ప్రమాదం ఉన్నది కనుక, అట్టి ప్రమాదం ఏర్పడకుండా చూడడం కోసం స్మృతులు చాల జాగ్రత్త తీసుకున్నై. శ్రుతికీ, స్మృతికీ సదాచారానికి విరుద్ధమైన కార్యాలు - అవి ఎంత మంచివైనా, వాటిని దేవతలే ఆచరించినా - నిషిద్ధాలే. అట్టి వాటిని ఆచరించడం తగదని హిందువులకు స్మృతులు స్పష్టంగా,

అసందిగ్ధంగా ఆదేశిస్తున్నై. ఈ ఆదేశం ఎంతో అసాధారణంగాను, పరమ మూర్ఖంగాను కనిపించవచ్చు. కాని ఇది స్పష్టంగా ఇవ్వబడ్డ ఆదేశనే. "నదేవ చరింత చరేత్" అనేది హిందువులకు వారి శాస్త్రాలు ఇచ్చిన స్పష్టమైన నిర్దేశం.

ఏ సంస్కర్తకైనా అవసరమైన ఆయుధాలలో హేతువాదం, నైతిక శక్తి అనేవి రెండూ అత్యంత ముఖ్యమైనట్టివి. బలమైన ఈ రెండు అయుధాలను అతనికి నిరుపయోగం చెయ్యడం కార్య రంగంలో అతణ్ణి నిస్సహాయుడ్ని చెయ్యడమే. కుల వ్యవస్థ హేతుబద్ధమైనదా కాదా అని ఆలోచించడానికే ప్రజలకు స్వేచ్ఛ లేనప్పుడు, వీరు కులాన్ని ఎలా భేదించ గలరు? కుల వ్యవస్థ నీతిబద్ధమైనదా కాదా అని ఆలోచించడానికే ప్రజలకు స్వాతంత్ర్యం లేనప్పుడు వీరు కులాన్ని ఎలా భగ్నం చేయగలరు? కులానికి చుట్టూ నిర్మించబడ్డ గోడ అజేయమైనట్టిది. ఆ గోడకు ఉపయోగించబడ్డ పదార్థం హేతువాదానికి, కాని, నైతిక శక్తికి కాని సోలనిది, కాలనిది. దీనికి తోడు ఆ గోడ లోపల ఉన్న వాళ్ళు బ్రాహ్మణ సైన్యం. బ్రాహ్మణులంటే ఎలాంటి బ్రాహ్మణులు? మేధావి వర్గంగా రూపొందిన బ్రాహ్మణులు! హిందువులకు సహజ నాయకులైన బ్రాహ్మణులు! దేశ రక్షణకు నియమించే మామూలు సైనికులు కాదు. తమ సంస్థాన రక్షణ కోసం ఒక సైన్యంగా సంఘటితులై పోరాడే బ్రాహ్మణులు! ఇప్పుడు ఆలోచించి చూడండి - హిందువులలో కుల వ్యవస్థను ఛేదించడం దుస్సాధ్యమని నేను ఎందుకు అంటున్నానో మీకు అవగాహన కాగలదు. ఏవిధంగా చూచినా, ఈ కోట గోడను ఛేదించడానికి - కనీసం ఒక చిన్న పగులు అయినా కొట్టడానికి యుగాలు పట్టవచ్చునని నా ఉద్దేశం.

ఏది ఏమైనా - ఈ గోడను ఛేదించడానికి యుగాలు పట్టినా, లేక ఆ పని వెంటనే జరిగినా - కులవ్యవస్థను ఛేదించడానికి మీరు నిర్ణయించుకుంటే - ఒక్క సంగతి మాత్రం మీరు మరిచిపోకూడదు. అదేమిటంటే - అలా ఛేదించడానికి మీరుపయోగించే డైనమైటును (ప్రేలుడు మందును) వేదాలపైని, శాస్త్రాల పైని ప్రయోగించ వలసి ఉంటుంది. హేతువాదానికి కాని, నైతిక శక్తికి కాని స్థానం లేకుండా చేస్తున్నవి అవే. వాటిని భేదిస్తేనే తప్ప కుల వ్యవస్థను ఛేదించలేరు. శ్రుతుల యొక్క స్మృతుల యొక్క మతాన్ని మీరు నాశనం చెయ్యవలసి వుంది. మరి దేని వల్లనూ మీ కృషి ఫలించదు. ఈ విషయంపై నా నిశ్చితాభిప్రాయం ఇది.

## హిందూమతం ఒక విధి నిషేధాల శిక్షా స్మృతి

## ఇదే మత మనుకోవడం మూర్ఖత్వం

మతాన్ని నాశనం చెయ్యడం అంటే నా ఉద్దేశం ఏమిటో చాల మందికి అర్థం కాకపోవచ్చు. మతాన్ని నాశనం చెయ్యడం అనే భావనే కొందరికి తిరుగుబాటుతనంగా కనిపించవచ్చు. మరికొందరికి అది విప్లవాత్మకంగా గోచరించవచ్చు. అందువల్ల నా ఉద్దేశాన్ని ఇక్కడ కొంత స్పష్టపరుస్తాను. సూత్రాలకు (ప్రిన్సిపుల్సుకు), నిబంధనలకు (రూల్సుకు) తేడాను మీరు గుర్తిస్తారో లేదో నాకు తెలియదు. నేను మాత్రం గుర్తిస్తాను. వట్టి గుర్తించడం మాత్రమే కాదు. ఆ రెంటికీ మధ్య ఉన్న తేడా వాస్తవమైనట్టిదనీ, చాలా ముఖ్యమైనట్టిదనీ నా ఉద్దేశం. నిబంధనలు ప్రయోగ శీలమైనట్టివి. ఒక ఆదేశాన్ని అనుసరించి పనిచేసే అభ్యాసాలు అవి. సూత్రాలు వివేకానికి సంబంధించినట్టివి. ఆయా పనులు మంచివో, చెడ్డవో నిర్ణయించడానికి అవి ఉపయోగకరమైన ప్రమాణాలు. ఒక పనిని చేసే పద్ధతిని నిబంధనలు స్పష్టంగా నిర్దేశించి చెపుతై. సూత్రాలు అలా స్పష్టంగా నిర్దేశించి చెప్పవు. వంట పద్ధతుల వలె నిబంధనలు ఏమి చెయ్యాలో, ఎలా చెయ్యాలో మాత్రమే చెపుతై. ఒక సూత్రం న్యాయ సూత్రం వలె ప్రధాన విషయాలను మనస్సులో ఉంచుకోవలసి ఉంటుందో వాటన్నింటినీ ఆ సూత్రం సూచిస్తూ ఉంటుంది. నిబంధనలకు, సూత్రాలకు మధ్య ఉండే ఈ తేడా, వాటి ననుసరించి ఒక వ్యక్తి చేసే పనులలో కూడ అట్టి తేడానే కలిగించక తప్పదు. ఒక నిబంధన ననుసరించి మంచి అనబడేదాన్ని చెయ్యడానికీ, ఒక సూత్రాన్ని అనుసరించి మంచి చెయ్యడానికి చాలా తేడా ఉంది. అవి రెండు వేరు వేరు పనులు. ఒక సూత్రం తప్పైనదే కావచ్చు. కాని ఆ సూత్రాన్ని అనుసరించి చేసే పని బుద్ధి పూర్వకమైనదీ, బాధ్యతతో కూడినదీ కాగలదు. ఒక నిబంధన ఒప్పైనది కావచ్చు. అయినా, ఆ నిబంధనను అనుసరించి చేసే పని కేవలం యాంత్రికమైనట్టిది మాత్రమే అవుతుంది.

నిబంధనకూ, సూత్రానికి ఈ తేడాను గుర్తించిన తర్వాత, ఇప్పుడు ఈ దృష్టితో మతాన్ని పరిశీలించి చూడండి. ఒక మత విషయకమైన పని సరైన పని

కాకపోవచ్చు. కాని అది కనీసం బాధ్యతతో కూడిన పని మాత్రం కావలసి ఉంది. అంటే మతం తప్పని సరిగా సూత్రాలకు సంబంధించినదై ఉండవలసి ఉన్నదన్నమాట. మతం నిబంధనలకు సంబంధించినది కానేరదు. అది సూత్రాలకు సంబంధించినది మాత్రమే. మతం సూత్రాలను వదిలివేసి ఎప్పుడయితే నిబంధనలకు దిగజారి పోతుందో, అప్పుడు అది మతంగా ఉండకుండా పోతుంది. నిజమైన మత విషయిక కార్యానికి కావలసింది బాధ్యత. బాధ్యతే మతాచరణకు మూల బీజం. అట్టి మూలబీజమైన బాధ్యతను చంపి వేసే మతం నిజమైన మతం ఎలా అవుతుంది.!

ఈ హిందూమతం ఏమిటి? ఇది ఒక సూత్రాల సమూహమా? ఒక నిబంధనల చట్టమా? ఈ హిందూ మతం - వేదాలలోను, స్మృతులలోనూ ఉన్న ప్రకారంగా ఈ హిందూమతం - కేవలం యజ్ఞాది కర్మలకు, సాంఘిక రాజకీయ విషయాలకు, ఆరోగ్య పద్ధతులకు సంబంధించిన ఒక నిబంధనల చట్టం మాత్రమే. నిబంధనలు, నిర్దేశాలు, ఆజ్ఞలు, విధి నిషేధాలు అన్నీ కలగాపులగం చేయబడి ఉన్న ఒక నిబంధనల చట్టమే ఈ హిందూమతం. హిందువుల చేత హిందూమతం అని పిలవబడేది కేవలం అసంఖ్యాకమైన ఆదేశాలు, నిషేధాలు మాత్రమే. నిజమైన మతానికి ఉండవలసిన ఆధ్యాత్మిక సూత్రాలు - హిందూ మతంలో కనిపించవు. ఒక వేళ అలాంటివేవైనా ఉన్నాయనుకుంటే, అట్టివి హిందూ మతస్థుడి వాస్తవిక జీవితాన్ని నడిపేవిగా మాత్రం లేవు.

## ధర్మం అంటే - విధి నిషేధాలేనా?

## ఒక వర్గనీతి శాసనం మతమెలా అవుతుంది?

ధర్మం అంటే – ఆ పదం వేదాలలోను, స్మృతులలోను ఉపయోగించబడ్డ పద్ధతిని బట్టి, వ్యాఖ్యాతలు అర్థం చేసుకొన్న దానిని బట్టి - ధర్మం అంటే హిందువుడి దృష్టిలో కేవలం విధులు, నిషేధాలు మాత్రమే. వేదాలలో ఉపయోగించబడ్డ ధర్మ పదానికి చాల సందర్భాలలో మత విషయమైన ఆజ్ఞలూ, కర్మకాండా అని అర్థం. జైమిని కూడ తన పూర్వ మీమాంసలో ధర్మాన్ని - "వేదాలలోని ఆదేశాలు సూచిస్తున్న లక్ష్యం లేక ఫలితం" అంటూ నిర్వచించాడు. స్పష్టమైన భాషలో చెప్పాలంటే హిందువుల

చేత మతం అని పిలువబడేది, నిజానికి ఒక న్యాయ శాసనం, లేక, శాసన బద్ధం చెయ్యబడ్డ వర్గనీతి అంటే అనవచ్చు. ఆ విధి నిషేధాల, ఆదేశ నిర్దేశాల శిక్షాస్మృతి నిజంగా మతం ఎలా అవుతుంది?

నా దృష్టిలో అది (హిందూమతం) మతం కానేకాదు. ఈవిధి నిషేధాల శిక్షాస్మృతినే నిజమైన మతంగా ప్రదర్శించి ప్రజలను భ్రమపెట్టడం జరిగింది. అందువల్ల జరిగిన చెడు ముఖ్యంగా ఏమిటంటే – ప్రజల నైతిక జీవనంలో ఆంతరంగిక స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు పతనం కావడం. బహిరంగంగా రుద్దబడ్డ నిబంధనలకు అది (ప్రజల నైతిక జీవనం) బానిస అయిపోవడం. ఈ రకం శిక్షాస్మృతి క్రింద స్వేచ్ఛా పూర్వకమైన ఆదర్శాలు వర్ధిల్లవు.

ఈ శిక్షాస్మృతి వల్ల వచ్చే మరొక అనర్థం ఏమిటంటే – ఇందులో ఉండే శాసనాలు పూర్వం ఏవో ఈనాడూ అవే. ఎప్పటికి అవే. మార్పే ఉండదు. పైగా అవి చాలా అన్యాయమైనట్టివి. ఒక వర్గానికి ఒక న్యాయం. మరొక వర్గానికి మరొక న్యాయం. ఎప్పటికీ మార్పు లేకుండా చేసి, ఈ అన్యాయాన్ని శాశ్వతీకరించడం మరీ దురన్యాయం. అయితే ఈ అన్యాయ శాసనాలను ఎవరో కొందరు ప్రవక్తలో, స్మృతి కర్తలో చేశారంటే అది వేరే విషయం. కాని, వీటికి ఒక స్థిరత్వం, తిరుగులేని శాశ్వత స్థాయి కల్పించ బడ్డాయి. ఇందులో మరీ అభ్యంతరకరమైన పరిస్థితి ఇది.

ప్రపంచంలో సౌఖ్యమనేది వ్యక్తియొక్క పరిస్థితులను బట్టి, పరిసరాలను బట్టీ, యుగాలను బట్టి మారుతూ ఉంటుంది. అలాంటప్పుడు ఈ రకమైన శాశ్వత శాసనాల శిక్షాస్మృతి మానవజాతి ఎలా భరించ గలదు? అట్టి అన్యాయ శాసనాల బరువు భారాల క్రింద నలిగిపోతూ ఎంతకాలం మనగలదు? అందువల్ల అటువంటి మతాన్ని నాశనం చెయ్యాలని చెప్పడానికి నేను ఏ విధంగానూ తటపటాయించను. అటువంటి మతాన్ని నాశనం చెయ్యడానికి కృషి సల్పడం మత విరోధం ఏ మాత్రమూ కాదనే నా ఉద్దేశం.

## ఈ మత ముసుగును చించి పారెయ్యండి

ఈ కృషిలో నిజానికి మీరు నిర్వహించ వలసిన పాత్ర ఎంతో ఉంది. ఒక అన్యాయ శాసనాల శిక్షాస్మృతికి వేయబడ్డ ఈ మత ముసుగును మీరు చించి

పారవేయవలసి ఉంది. ఇదే మతమని ప్రజలకు కల్పించబడ్డ భ్రాంతిని మీరు పటాపంచలు చెయ్యవలసి ఉంది. ఇది మీ ముఖ్య కర్తవ్యం. ప్రజల మనస్సుల నుంచి ఈ భ్రాంతిని మీరు తొలగించిన నాడు - తమకు మతంగా చూపబడి నట్టిది నిజంగా మతం కాదనీ, అది కేవలం ఒక శాసనం మాత్రమే నని ప్రజలు గుర్తించిన నాడు - మతంగా చెప్పబడుతున్న ఈ శాసనాన్ని సవరించాలనో, రద్దు చెయ్యాలనో కోరగల స్థితిలో మీరుంటారు. దాన్ని మతమని ప్రజలు ఎంతకాలం భావిస్తూ ఉంటారో అంతకాలం దాన్ని మార్చడానికి వారు ప్రయత్నం చెయ్యరు. అందుకు కారణం - మతం అనేది సాధారణంగా మార్పుకు అతీతం అని తలంచబడడమే. శాసనం విషయంలో అలా కాదు. శాసనం మార్పుకు లోబడినట్టిది. హిందూమతం అని చెప్పబడుతున్నట్టిది నిజంగా మతం కాదనీ, అది కేవలం ఒక పాతబడ్డ పురాతన శాసనమనీ ప్రజలు గుర్తించినప్పుడు వారు మార్పుకు సిద్ధపడ గలరు. శాసనాన్ని మార్చుకోవచ్చునన్న సత్యం ప్రజలకు బాగా తెలుసు.

## హిందూమతానికి ఒకే ప్రామాణిక గ్రంథాన్ని రూపొందించాలి

అయితే-వట్టి నిబంధనలతో కూడిన మతాన్ని నేను ఖండిస్తున్నా నంటే-అసలు మతమే అక్కరలేదంటున్నానని అనుకోకూడదు. నా ఉద్దేశంలో మతానికి చాల ఉన్నతమైన స్థానం ఉంది. "నిజమైన మతం సమాజానికి పునాది. నిజమైన ప్రజాప్రభుత్వానికి అది ప్రాతిపదిక" అన్న బర్క్ మహాశయుని ఉద్దేశంతో నేను పూర్తిగా ఏకీభవిస్తాను. హిందూ మతం పేరుతో చెలామణి అవుతున్న ఈ ప్రాచీన జీవిత నిబంధనలు రద్దు కావాలని నేనంటున్నానంటే-ఆ నిబంధనల స్థానంలో సమ్యక్‌సూత్ర బద్ధమైన ఒక నిజమైన మతం అమలు పరచ బడాలనే నేను ఆశిస్తున్నా నన్నమాట. మానవుడికి మతం ఉండక తప్పదనే కృతనిశ్చయంగల వాడిని గనుకనే మతం అంటే ఏమిటో, ఈ మత సంస్కరణలో విధిగా సాధించ వలసిన అంశాలు ఏమిటో నా మనస్సులోని అభిప్రాయాలను మీ కిప్పుడు చెప్పవలసి ఉంది. ఈ మత సంస్కరణలో ఈ క్రింద చెప్పబడినవి ముఖ్యాంశాలని నా ఉద్దేశం.

1. హిందువు లందరికీ ఆమోదకరమైన, హిందువు లందరిచేతా గుర్తించబడిన ఒకే ఒక ప్రామాణిక హిందూమత గ్రంథం రూపొందించబడాలి. ఆ గ్రంథం ఒక్కటే

హిందువు లందరికీ అధికారిక గ్రంథంగా ఉండాలి. ప్రస్తుతం హిందూ మతానికి పవిత్ర అధికారిక గ్రంథాలుగా ఎంచబడుతున్న వేదాలు, శాస్త్రాలు, పురాణాలు మొదలైన వాటి అధికారం చట్టం ద్వారా రద్దు చెయ్యబడాలి. ఈ గ్రంథాలలో ఉండే సాంఘిక సంబంధమైన ఏ సిద్ధాంతాలనైనా సరే ప్రచారం చెయ్యడాన్ని శిక్షార్హం చెయ్యాలి.

2. హిందువులలో మతాచార్యత్వం రద్దు చెయ్యబడితే-అది ఎంతో ఉత్తమంగా ఉంటుంది. అయితే ఆ పని సాధ్యం కాకపోవచ్చు. అందువల్ల కనీసం మతాచార్యత్వం అనువంశికంగా ఉండడమైనా రద్దు కావాలి. హిందువు నని చెప్పుకొనే ఏ వ్యక్తి అయినా సరే మతాచార్యుడు కావడానికి అర్హత ఉండాలి. ప్రభుత్వం నిర్ణయించిన పరీక్షలో ఉత్తీర్ణుడు కాకుండా, ప్రభుత్వం నుంచి ప్రాక్టీసు పర్మిట్టు లేకుండా, ఏ వ్యక్తీ కూడ మతాచార్యుడు కాగూడదు. అట్టి నియమాన్ని ప్రభుత్వం శాసనం ద్వారా నిబంధించాలి.

3. ప్రభుత్వం నుంచి అట్టి పర్మిట్టును లేక సర్టిఫికెటును (ధృవపత్రాన్ని) పొందని ఏ వ్యక్తీ కూడా ఎట్టి మత విషయక కర్మకాండనూ జరపకూడదు. అలా జరపడం చట్టవిరుద్ధం చెయ్యబడాలి. అట్టి ధ్రువ పత్రంలేని వ్యక్తి మతాచార్యత్వం వహించడాన్ని శిక్షార్హం చెయ్యాలి.

4. ఆ విధంగా చట్టం ద్వారా అంగీకరించబడ్డ మతాచార్యుడు ప్రభుత్వానికి విధేయుడై ఉండాలి. ప్రభుత్వ సేవకుడై ఉండాలి. దేశంలోని సాధారణ శాసనానికి సాధారణ పౌరునివలె తానుకూడ లోబడి ఉండడంతో పాటు-అట్టి మతాచార్యుడు తన నైతిక సూత్రాలు, నమ్మకాలు, పూజా పద్ధతులు మున్నగు విషయాలలో ప్రభుత్వ క్రమశిక్షణ చర్యకు లోబడి ఉండాలి.

5. ఐ.సి.ఎస్. ఉద్యోగుల విషయంలో వలెనే మతాచార్యుల విషయంలో కూడా అవసరానికి తగినట్టుగా వారి సంఖ్య శాసనం ద్వారా పరిమితం చెయ్యబడాలి.

హిందూ మత సంస్కరణకు నేను చేసిన ఈ సూచనలు కొంతమందికి మరీ తీవ్రమైనవిగా కనిపించవచ్చు. అయితే నాకు మాత్రం ఇందులో విప్లవాత్మకమైన

దేదీ కనిపించడం లేదు. భారత దేశంలో ప్రతీ వృత్తీ క్రమబద్ధం చెయ్యబడింది. తమ తమ వృత్తులను కొనసాగించుకోడానికి అనుమతించబడే ముందు-ఇంజనీర్లు తమ ప్రావీణ్యాన్ని చూపవలసి ఉంది. డాక్టర్లు తమ నైపుణ్యాన్ని చూపవలసి ఉంది. వీరందరూ తమ జీవితం పొడుగునా దేశం యొక్క సివిల్, క్రిమినల్ శాసనాలకు లోబడి ఉండడమే కాక తమ తమ వృత్తులకు సంబంధించిన ప్రత్యేక నైతిక సూత్రాలకు కూడా లోబడి ఉండవలసి ఉంది. హైందవ సమాజంలో ఏ నైపుణ్యమూ, ప్రావీణ్యమూ, కౌశలమూ అక్కరలేని వృత్తి మతాచార్యత్వం ఒక్కటే.

## బ్రాహ్మణతత్వాన్ని నిర్మూలించకుండా, హిందూమతాన్ని రక్షించలేరు

హిందూ మతాచార్యుడి వృత్తి ఒక్కటే ఏ నియమ నిబంధనకూ కట్టుపడనట్టిది. హిందూ మతాచార్యుడు మానసికంగా ఒక వెంగళప్ప కావచ్చు. శారీరకంగా సెగ, సవాయి వంటి అసహ్య రోగాలతో పీడించబడుతున్న వాడు కావచ్చు. నైతికంగా ఒక నికృష్ట పతితుడే కావచ్చు. అయినప్పటికి అతడు హిందువుల పవిత్ర మత కర్మలకు ఆచార్యత్వం వహించ వచ్చు! హిందూ దేవాలయాల పవిత్ర గర్భగుడి ప్రవేశించి హిందూ దైవానికి పూజ లర్పించ వచ్చు ! ఇదంతా హిందువులలో ఎందుకు చెలామణి అవుతున్నదంటే- ఒక మతాచార్యుడైన వాడు మతాచార్య కుటుంబంలో (బ్రాహ్మణ కుటుంబంలో) పుట్టినవాడైతే చాలు. హిందువులలో మాతాచార్య వర్గం ఏరకమైన శాసనానికి, నైతిక సూత్రానికీ కట్టుబడక పోవడమే ఈ ఘోర పరిస్థితి కంతకూ కారణం అనవచ్చు.

ఈ మతాచార్య వర్గానికి బాధ్యతలు లేవు. కర్తవ్యాలు లేవు. హక్కులూ, సౌకర్యాలూ మాత్రమే ఉన్నాయి. ప్రజా బాహుళ్యం యొక్క మానసిక నైతిక పతనానికి భగవంతుడు వారికి విధించిన శిక్షగా ఈ పరిస్థితిని అభివర్ణించవచ్చు. అందువల్ల నేను పైన సూచించిన పద్ధతిలో ఏదో ఒక చట్టం చెయ్యడం ద్వారా ఈ మతాచార్య వర్గాన్ని అదుపులోనికి తేవలసి ఉంది. ఈ వర్గం వాళ్ళు ప్రజల్ని పెడదారులు పట్టించకుండా, మోసగించకుండా అట్టి చట్టం నిరోధించగలదు. ఆ చట్టం ద్వారా మతాచార్య వృత్తిని హిందువులందరి అందుబాటులోకి తేవడం, దానిని ప్రజాస్వామిక పద్ధతి కనుగుణంగా చేయడమవుతుంది. బ్రాహ్మణ తత్వాన్ని నిర్మూలించడానికి, కులవ్యవస్థను రద్దు చెయ్యడానికి అట్టి చట్టం నిజంగా సహకరించగలదు.

బ్రాహ్మణ మతం యొక్క వాస్తవ సాక్షాత్కారమే కుల వ్యవస్థ. హిందూమతాన్ని నాశనం చేసిన క్రూర విషమే బ్రాహ్మణమతం. బ్రాహ్మణ మతాన్ని మీరు నిర్మూలించి పారవెయ్యగలిగినప్పుడే, హిందూమతాన్ని మీరు రక్షించిన వాళ్లౌతారు. ఈ సంరక్షణకు ఎవరి నుంచీ, ఏ విధమైన వ్యతిరేకత ఉండనవసరం లేదు. ఆర్య సమాజంవారు కూడా దీనికి అంజలి పట్టవచ్చు. ఎందుకంటే వారి గుణకర్మ సిద్ధాంతానికి ఇది కేవలం ప్రయోగ రూపం మాత్రమే.

వారు ఆవిధంగా చేసినా, చెయ్యకపోయినా, మీ మతానికి సైద్ధాంతికమైన ఒక క్రొత్త ఆధారాన్ని మాత్రం కల్పించవలసి ఉంది. అది స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృం అనే మూడు మానవ సూత్రాలకు-అంటే సంపూర్ణ ప్రజా స్వామికానికి అనుగుణంగా ఉండాలి. ఈ విషయంలో నాకు అంతగా ప్రవేశం లేదు. కాని, నేను విన్న దానిని బట్టి -- స్వాతంత్ర్యంతోనూ, సమానత్వంతోను, సౌభ్రాతృత్వంతోనూ సమన్వయం పొందగల మత సూత్రాలు మనకు కరువేమీ కాదనీ, అట్టివి మన ఉపనిషత్తులనిండా ఉన్నాయనీ, అట్టివాటిని విదేశాల నుంచి అప్పు తెచ్చుకోవలసిన అవసరం లేదనీ తెలుస్తున్నది. అట్టి మత సూత్రాలను ఉపనిషత్తుల నుంచి తీసుకున్నప్పుడు-ఆ సూత్రాలను ఎక్కువ మార్పు చెయ్యకుండానే తీసుకోవచ్చునో, లేక వాటికి అంటి ఉన్న తప్పును పూర్తిగా తొలగించి పునర్నవీకరించి స్వీకరించవచ్చునో - అదంతా మీరే ఆలోచించుకో వలసి ఉంది. జరగవలసిందేమిటంటే-జీవిత మూల సిద్ధాంతాల భావనలోనే ఒక పూర్తి మార్పు తేవాలి. బ్రతుకు విలువ లోనే ఒక పూర్తిమార్పు జరగలవలసి ఉంది. మానవుల పట్ల, వారి స్థితి గతుల పట్ల ప్రదర్శించబడే వైఖరిలోనే, దృక్పథంలోనే ఒక పూర్తి మార్పు జరగవలసి ఉంది. అంటే మతాంతరీకరణే జరగవలసి ఉన్నదన్న మాట.

మతాంతరీకరణ అన్న మాట మీకు నచ్చకపోతే-దానికి బదులు నూతన జీవం అనవచ్చు. అయితే, నూతన జీవం, చచ్చిపోయినా శరీరంలోకి ఎలా ప్రవేశించగలదు? ఒక క్రొత్త శరీరంలోకి మాత్రమే క్రొత్తజీవం ప్రవేశించ గలదు. ఒక క్రొత్త శరీరం ప్రస్థితిలోకి వచ్చేముందు, ఆ కొత్త శరీరంలోకి క్రొత్తజీవం ప్రవేశించే ముందు, పాత శరీరం చచ్చిపోక తప్పదు. ఇంకా వివరంగా చెప్పాలంటే-కొత్తదేదైనా

వికసించడం, స్పందించడం ప్రారంభించడానికి ముందు పాతది కార్యరంగంనుంచి నిష్క్రమించ వలసి ఉంది. శాస్త్రాల మతాన్ని నిర్మూలించ వలసి ఉన్నదని నేను చెప్పినప్పుడు నా మనస్సులో ఉన్న ఉద్దేశం ఇది.

## హిందువులు గమనించవలసిన కొన్ని ముఖ్య సమస్యలు

ఇప్పటికే మీ సమయం చాలా తీసుకున్నాను. ఇక ఈ ఉపన్యాసం ఇంతటితో ముగించడం మంచిది. అయితే ఒక్క విషయం-బహుశా హిందువులకు చాలా ముఖ్యమైన విషయం మీద, హిందువుల సభలో నేను ఉపన్యసించడం ఇదే చివరిసారి కావచ్చు. అందువల్ల నా ఉపన్యాసాన్ని ముగించేముందు హిందువుల దృష్టిని, వారనుమతిస్తే, కొన్ని సమస్యల మీదకు ప్రసరింప చెయ్యాలనుకొంటున్నాను. నా దృష్టిలో ఈ సమస్యలు చాల ముఖ్యమైనట్టివి. వీటిని మనస్ఫూర్తిగా, శ్రద్ధగా పరిశీలించవలసిందిగా హిందువుల్ని కోరుతున్నాను.

ఒకటి: ప్రపంచంలోని వివిధ జాతి మానవుల యొక్క నమ్మకాలు, అలవాట్లు, నైతిక సూత్రాలు, జీవిత దృక్పథాలు వివిధ విధాలుగా భేదిస్తాయనడం తప్ప, వాటి గురించి మరేమీ చెప్పనక్కరలేదనే ఆంత్రోపాలజిష్టుల (మనుష్య జాతిపరిశోధక శాస్త్రజ్ఞుల) తీరుబాటు కబుర్లను యథాతథంగా తీసుకొని ఊరుకొంటారా? లేక - అట్టి వాటిలో ఏ రకం నమ్మకాలు, అలవాట్లు, నైతిక సూత్రాలు, జీవిత దృక్పథాలు ఉత్తమమైనట్టివో-శక్తి సామర్థ్యాలు గల జాతిగా ప్రజలను ప్రవర్ధిల్ల చేయగలిగి నట్టివో - ప్రపంచ మంతా విస్తరించి ఆధిపత్యం వహించే శక్తి నివ్వగలిగి నట్టివో - తెలుసుకో వలసిన అగత్యం ఏమైనా ఉన్నదంటారా?

ఈ ప్రశ్నను ప్రధానంగా హిందువులు పరిశీలించ వలసి ఉంది. ప్రొఫెసర్ కార్వార్ చెప్పినట్లు - జీవిత మార్గంలో నైతికతా, మతమూ - ఈ రెంటినీ బ్రతుకు పోరాటంలో రెండు ఆయుధాలుగా, సాధనాలుగా పరిగణించవలసి ఉంది. కోరలు, గోరులు, కొమ్ములు, గిట్టలు, రోమాలు, ఈకలు ఇవన్నీ - దాడికీ, రక్షణకూ కూడ అవసరమైనట్టే - ఈ మతమూ, నైతికతా జీవిత సమరంలో అవసరమైన ఆయుధాలు. ఒక సమాజం గాని, వర్గం గాని, తెగ గాని, జాతిగాని, ప్రజా జీవిత క్రమ నిర్మాణానికి, అభివృద్ధికి, శక్తికి, వికాసానికి తోడ్పడే నైతిక సూత్రాలను త్రోసిపుచ్చి, తద్విరుద్ధమైన

వాటిని - అంటే జీవిత రంగంలో శక్తిహీనులుగాను, అసమర్ధులుగాను చేసే ఆచరణయోగ్యం కాని నైతిక సూత్రాలను ఆమోదించి, వాటిపై మతపరమైన నమ్మకాన్ని, అభిమానాన్ని, పెంపొందించుకున్ననాడు - చివరకు అట్టిజాతి, వర్గం, తెగ అంతరించి పోతుంది. మతం, నైతికత-వీటి ఫలితంగా ఏర్పడే అంగీకార, అనంగీకార అలవాటే ఆ సమాజాన్ని కాని, జాతిని కాని ఇబ్బందులపాలు చేస్తాయి. ఈగకు రెండు రెక్కలూ ఒక ప్రక్కనే ఉండి, రెండో ప్రక్క ఏమీ లేకుండా ఉంటే ఈగల జాతికి ఎంత ఇబ్బందికరంగా ఉంటుందో మానవజాతి విషయంలో కూడా అంతే. ఏ విధంగా ఉన్నా ఒకటే అనుకోవడం అర్ధరహితం.

అందువల్ల నైతికతా, మతము - ఇవి రెండూ కేవలం ఇష్టా ఇష్టాలకు సంబంధించిన విషయాలు మాత్రమే కాదు. ఒక నైతిక పద్ధతి మీకు పూర్తిగా ఇష్టం కానిదై ఉండవచ్చు. అయితే, అది ఆ జాతిలో అందరిచేతా అనుసరించబడి, అది ఆ జాతిని ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన జాతిగా రూపొందించ గలిగేదైతే - మీరు దాని పట్ల అయిష్టం ప్రదర్శించి నప్పటికీ, దాని వల్ల ఆ జాతి శక్తిని పొంది తీరుతుంది. ఒక నైతిక పద్ధతి మీకు ఎంతో ఇష్టమైనదిగా ఉండవచ్చు. న్యాయ సమ్మతమూ, ఆదర్శప్రాయమూ అయినట్టిదై ఉండవచ్చు. కాని అది ఆ జాతిలో అందరిచేతా అనుసరించబడి నపుడు అది ఆ జాతిని తక్కిన ప్రపంచ జాతులలో నిర్వీర్యం చేసే దయితే-అది మీ మన్ననకెంతగా పాత్రమైన దైనప్పటికీ, కాలక్రమేణా ఆ జాతి నశించి పోక తప్పదు. ప్రపంచ జాతుల మధ్య బ్రతుకు పోరాటాల దృష్ట్యా, జీవిత సంఘర్షణలో అవరోధాలను నిగ్రహించి జీవించి ఉండ వలసిన అవసరం దృష్ట్యా తమ మతాన్నీ, నైతికతనూ హిందువులు పునఃపరిశీలన చేసుకోవలసి ఉంది.

రెండు: హిందువులు తమ ప్రాచీన సాంఘిక సంప్రదాయాలన్నింటినీ భద్రపరచు కొంటారా? లేక - అందులో పనికిరాని భాగాన్ని తీసి పారవేసి పనికివచ్చే భాగధేయాన్ని మాత్రం ఎంచి భావి తరాల వారికి అందజేస్తారా?

విషయాన్ని హిందువులు పూర్తిగా తర్కించి ఆచరణలో పెట్టవలసి ఉంది. నాకు అత్యంత భక్తిపాత్రుడైన ఉపాధ్యాయుడు ప్రొఫెసర్ జాన్ డ్యూయి చెప్పినట్టు ప్రతీ సమాజమూ ఏవో పనికి మాలిన, గతానికి సంబంధించిన సంప్రదాయాల్లో చిక్కుకుంటూనే ఉంటుంది. అందులో అధిక భాగం వట్టి మృత పదార్ధం. దాని

చుట్టూ అల్లుకొన్న వక్ర ప్రవృత్తులు. ఒక సమాజం వికాసం చెందే కొలదీ ఈ చెత్తనంతా, ఈ మృత పదార్థాన్నంతా దులిపి పారవేసి, భవిష్యస్సమాజాన్ని శక్తి వంతమూ, తేజోవంతమూ చెయ్యగలిగిన జీవపదార్థాన్ని మాత్రమే ముందుకు అందివ్వడం దాని కర్తవ్యం. ఫ్రెంచి విప్లవ మూల భూతమైన పరిణామ సాధనం లేని రాజ్యం ఆత్మ రక్షణ సాధనం లేని రాజ్యమే అవుతుందని అంగీకరించక తప్పలేదు. అట్టి రాజ్యం, దేనిని అతి పవిత్రంగా (మతైక శీలంగా) భద్రపరుచుకోవాలని అనుకొంటుందో, దానినే తన రాజ్యాంగం నుంచి విలుప్తం చేసుకోవలసిన ప్రమాదం సంభవించ వచ్చునని ఆయన పేర్కొన్నాడు. శ్రీ బర్క్ చెప్పిన విషయం ఒక రాజ్యానికి ఎంతగా వర్తిస్తుందో, ఒక సమాజానికి కూడా అంతగానే వర్తిస్తుంది.

మూడు: గతాన్ని ఆరాధించడం, ఆదర్శాల కోసం గతం మీద ఆధారపడడం మానుకోవలసిన అవసరం హిందువులకు లేదా!

ఈ విషయాన్ని హిందువులు తీవ్రంగా ఆలోచించ వలసి ఉంది. హిందువుల యొక్క గతాన్ని ఆరాధించే పద్ధతి ఎంత అనర్థాన్ని కలిగిస్తున్నదో ప్రొఫెసర్ డ్యూయి చెప్పిన మాటలు వింటే అర్థమవుతుంది. డ్యూయి ఇలా అంటాడు. "ఏ వ్యక్తి అయినా వర్తమానంలోనే బ్రతుకుతాడు. వర్తమానం అంటే గతం తరువాత వచ్చినట్టిది మాత్రమే కాదు. గతంలో నుంచి పుట్టినది అంతకంటే కాదు. గతాన్ని వెనక్కి నెట్టేసిన తర్వాత మిగిలిన జీవితమే వర్తమానం. గతవస్తు పరిశోధన వర్తమానాన్ని అర్థం చేసుకోడానికి సాయపడదు. గతాన్నీ, గతానికి సంబంధించిన సంప్రదాయాది భాగధేయాన్నీ గురించిన విజ్ఞానం ఎంతో ప్రాముఖ్యం కలిగినట్టిదే కావచ్చు. అయితే, అది వర్తమానంలోకి చొచ్చుకొని రాగలిగినప్పుడే దాని ప్రాముఖ్యత ఉంటుంది. గతానికి సంబంధించిన రికార్డులను, అవశేషాలను గురించి తెలుసుకోవడం మాత్రమే ప్రధాన విద్యా విధానంగా చెయ్యడం చాల పొరపాటు. ఈ పొరపాటువల్ల వర్తమానానికి గతం ప్రత్యర్థి కావడం, వర్తమానం గతానికి ఒక వ్యర్థమైన అనుకరణ కావడం మాత్రమే జరుగ గలదు.

ప్రస్తుతంలో బ్రతకడానికి, పెరగడానికి ప్రాముఖ్యం లేకుండా చేసే పద్ధతి వల్ల వర్తమానం అర్థరహితమే అవుతుంది. భవిష్యత్తు సుదూరమే అవుతుంది. అట్టి పద్ధతి అభ్యుదయానికి ఒక శత్రువు. జీవితం బలంగాను, స్థిరంగాను ముందుకు సాగడానికి ఒక అవరోధం.

నాలుగు: సృష్టి ధర్మంలో ఏదీ స్థిరమైంది కాదనీ, ఏదీ శాశ్వతమైంది కాదనీ, ఏదీ సనాతనమైంది కాదనీ, ప్రతిదీ మారుతున్నదేననీ - వ్యక్తికి కాని సమాజానికి కాని మార్పే జీవిత ధర్మమనీ - తెలుసుకో గల తరుణం ఇంకా హిందువులకు రాలేదా?

హిందువులు అతి ముఖ్యంగా ఆలోచించుకో వలసిన విషయం ఇది. మారుతున్న సమాజంలో పాత విలువలను గురించిన విప్లవం నిరంతరంగా కొనసాగుతూ ఉంటుంది. ఈ సత్యాన్ని గుర్తించుకో వలసి ఉంది. మానవుడు చేసే పనులకు విలువ కట్టేందుకు కొన్ని ప్రమాణాలు ఉండక తప్పదనుకొన్నప్పుడు - అట్టి ప్రమాణాలను సవరించుకోడానికి సర్వదా సిద్ధంగా ఉండక తప్పదని కూడా హిందువులు గ్రహించుకోవలసి ఉంది.

## స్వరాజ్య సాధన కంటే, కుల నిర్మూలన ఎక్కువ ముఖ్యం

ఈ నా ఉపన్యాసం చాలా పొడుగ్గా ఉన్నదని ఒప్పుకొంటున్నాను. అయితే ఈ పొడుగుకు తగ్గ వెడల్పుగాని, లోతుగాని ఉన్నదో లేదో నిర్ణయించవలసింది మీరు. ధైర్యానికి తగ్గ గాంభీర్యం నా ప్రసంగంలో ఉన్నదని మీ రనుకొంటే చాలు. నా దృక్పథాన్నీ, నా భావాలనూ స్పష్టంగా, నిర్మొహమాటంగా మీ ముందుంచాననేదే నాకు గల సంతృప్తి. ఈ నా భావాలను యథాతథంగా మీరు అనుసరించాలని కాదు. నేను బాగా పరిశీలించి, పరిశోధించి ఈ సత్యాలు మీకు చెప్పాను. మీ భవిష్యత్తు పట్ల నాకు గల గాఢమైన ఆందోళనతో ఇంతగా మీకు వివరించ వలసి వచ్చింది.

మీరు అనుమతిస్తే మరొక విషయం కూడ చెపుతాను. ఇప్పుడు నేను వ్యక్తపరచిన ఈ భావాలు అధికార పదవికి దాసుడు కాని, గొప్ప తనానికి భట్రాజు కాని ఒక వ్యక్తిని. పేదల యొక్క, దళితజాతుల యొక్క విమోచన కోసం ఏ వ్యక్తి నిరంతరం బహిరంగ పోరాటం సాగిస్తున్నాడో, అట్టి పోరాటానికి బహుమానంగా ఏ వ్యక్తి జాతీయ నాయకుల చేత, జాతీయ పత్రికల చేత నిరంతరంగా తిట్లూ, నిందలూ భరిస్తున్నాడో - అట్టి వ్యక్తి గుండెల్ని చీల్చుకొని వచ్చిన భావాలివి. నిరంకుశ ప్రభువుల బంగారంతో, భాగ్య వంతుల రొక్కంతో దళిత జాతులను విమోచన చెయ్యడం,

పేదలను అభ్యున్నతి పరచడం అనే అద్భుత కృత్యాలు (గారడీలు అనను) చెయ్యడంలో తమతో నేను కలవక పోవడం – ఈ జాతీయ నాయకులు, జాతీయ పత్రికలు నన్నింత దుమ్మెత్తి పొయ్యడానికి గల మరొక కారణం.

నా భావాలు అంగీకరించ మనడానికి ఇదంతా చాలకపోవచ్చు. ఇవి మిమ్మల్ని అంతగా మార్చగలవని నేను అనుకోను. అయితే అవి మిమ్ము మార్చగలిగినా, మార్చలేక పోయినా హిందూమత సంస్కరణ విషయంలో మాత్రం బాధ్యత అంతా మీదే. కులాన్ని సమూలంగా పెల్లగించి పారవెయ్యడానికి మీరు తీవ్రంగా ప్రయత్నించవలసి ఉంది. నా పద్ధతిలో కాకపోయినా, మీ పద్ధతిలో అయినా ఇది జరిగి తీరాలి.

అయితే నేను మీతో ఉండజాలక పోతున్నందుకు విచారపడుతున్నాను. నే మార్పుకు (మతాంతీకరణకే) నిశ్చయించు కొన్నాను. అందుకు కారణాలు చెప్పడానికి ఇది స్థలంకాదు. అయితే మీ నుంచి (మీ మతం నుంచి) నేను విడివడి పోయినప్పటికీ, మీ కృషినీ, మీ ఉద్యమ పురోగతినీ నేను ఇతోధికమైన ఆసక్తితో గమనిస్తూనే ఉంటాను. నా నుంచి మీరు పొందగల సహాయం ఏదైనా ఉంటే, అట్టి సహాయాన్ని మీకు ఎల్లప్పుడూ అందజేస్తూనే ఉంటాను.

మీది ఒక జాతీయ ఉద్యమం. కులం హిందువులకు ప్రాణతుల్యం. దుష్టమైన ఈ కుల వ్యవస్థ ఒక్క తమ హిందూ సమాజాన్నే కాక భారతీయ వాతావరణం మొత్తాన్నే కలుషితం చేసింది. సిక్కులు, ముస్లింలు, క్రైస్తవులు కూడ ఈ దుష్ట వ్యాధికి గురి అయినారు. అందువల్ల ఈ కులతత్వ వ్యాధి సంక్రమించి బాధపడుతున్న వారందరూ సిక్కులు, ముస్లింలు, క్రైస్తవులతో సహా అందరూ – మీ పట్ల సానుభూతి ప్రదర్శించగలరు. వారందరి ప్రోత్సాహం మీకు లభించగలదు. స్వరాజ్యాన్ని కోరుతున్న జాతీయోద్యమం కంటే, కులాన్ని నిర్మూలన కోసం పోరాడుతున్నప్పుడు మొత్తం జాతి అంతా – అందులోను మీ స్వజాతి అంతా మీకు వ్యతిరేకంగా నిలుస్తుంది. అయినా – స్వరాజ్య సాధనకంటె కుల నిర్మూలన ఎక్కువ ముఖ్యం. స్వరాజ్యాన్ని సంపాదించి లాభం లేదు. – దాన్ని మీరు రక్షించ లేనప్పుడు. అంతేకాదు, స్వరాజ్యాన్ని రక్షించడం కంటె, స్వరాజ్యంలో హిందువుల్ని రక్షించడం అనేది ఎక్కువ ప్రధాన సమస్య.

నా ఉద్దేశంలో హిందూ సమాజం కుల రహిత సమాజం అయినప్పుడు మాత్రమే అది తనను తాను రక్షించుకొనే శక్తినీ, సామర్థ్యాన్నీ సంతరించుకోగలదు. అంతరంగికమైన బలం లేకుండా హిందువులకు స్వరాజ్యం వచ్చినా, అది మళ్ళీ ఆ దాస్యం వైపు ఒక అడుగు ముందుకు వెయ్యడమేకావచ్చు. బాగా ఆలోచించండి. మీ ప్రయత్నాలు ఫలించుగాక. సెలవు.

రాజగృహ,

దాదర్,

బొంబాయి - 14.

బి.ఆర్. అంబేద్కర్

## అనుబంధం - (i)

# కులానికి మహాత్మాగాంధీ సమర్థన

# డాక్టర్ అంబేడ్కర్ ప్రసంగ వ్యాసంపై గాంధీజీ విమర్శ

## ('హరిజన' పత్రికలోని వ్యాసాలు)

### డాక్టర్ అంబేడ్కర్ ఆరోపణలు :

లాహోరులో జాత్‌పాత్ తోడక్ మండలివారి వార్షిక సమావేశానికి గత మే నెలలో డాక్టర్ అంబేడ్కర్ అధ్యక్షత వహించవలసి ఉండినదన్న విషయం పాఠకుల స్మృతిపథంలో ఉండే ఉంటుంది. అయితే ఆ సమావేశం ఆహ్వాన సంఘం వారికి డాక్టర్ అంబేడ్కర్ తయారు చేసిన అధ్యక్షోపన్యాసం అభ్యంతరకరంగా ఉండడంవల్ల అసలు ఆ సమావేశమే రద్దు చెయ్యడం జరిగింది. తామే ఎంచుకొన్న ఒక అధ్యక్షుణ్ని అతడి అధ్యక్షోపన్యాసం తమకు నచ్చనంత మాత్రంచేత – తామే నిరాకరించడంలో ఆహ్వాన సంఘం వారి చర్య ఎంతవరకు న్యాయ సమ్మతమో విచారణీయం.

కులం గురించి, హిందూ శాస్త్రాల గురించి డాక్టర్ అంబేడ్కర్‌కు కల అభిప్రాయాలు ఆహ్వాన సంఘం వారికి తెలిసినవే. ఆయన హిందూ మతాన్ని విడిచి పెట్టడానికి నిర్ణయించుకొన్నట్టు స్పష్టంగానే ప్రకటించి ఉన్నాడు. ఆ విషయం కూడా ఆహ్వాన సంఘంవారికి తెలుసు. డాక్టర్ అంబేడ్కర్ నుంచి అంతకంటె తక్కువ స్థాయి ఉపన్యాసాన్ని ఎవరూ ఆశించి ఉండకూడదు. సమాజంలో ఒక విశిష్ట స్థానాన్ని సంపాదించుకొని ఉన్న ఒక వ్యక్తి యొక్క మౌలికోద్దేశాలను వినే అవకాశం ప్రజలకు లేకుండా పోయింది. అందుకు బాధ్యత ఆహ్వాన సంఘం వారిదే. భవిష్యత్తులో తాను ఏ ముద్ర ధరించినా, తనను మరిపింప చేసుకొనే వ్యక్తి మాత్రం కాదు డాక్టర్ అంబేడ్కర్.

ఆహ్వాన సంఘంవారికి ఏ విధంగాను లొంగిపోయే వ్యక్తి మాత్రం కాదాయన. ఆయనను అధ్యక్షుడిగా ఆహ్వాన సంఘం నిరాకరిస్తే ఆయన తన అధ్యక్షోపన్యాసాన్ని తానే స్వంత ఖర్చుతో ప్రకటించాడు. దాని ఖరీదు ఎనిమిది అణాలు పెట్టబడింది. రెండు అణాలు కాని, నాలుగు అణాలు కాని అయితే బాగుంటుందని నా సూచన.

డాక్టర్ అంబేడ్కర్ యొక్క ఈ ఉపన్యాసాన్ని ఏ సంస్కర్తా ఉపేక్షించ లేడు. సనాత నాచారపరులు ఈ ఉపన్యాసాన్ని తప్పక చదవవలసి ఉంది. అలా చదవడం వల్ల వారికి ఎంతో మేలు జరుగుతుంది. ఇలా చెప్పడం వల్ల ఈ ఉపన్యాసంలో అభ్యంతరకరమైన దేదీ లేదని కాదు. చాల అభ్యంతరకరమైన విషయం ఇందులో ఉన్నది కాబట్టే, దీనిని క్షుణ్ణంగా చదవవలసి ఉన్నదనడం. డాక్టర్ అంబేడ్కర్ హిందూ మతానికి ఒక సవాలు. హిందువుగా పుట్టి, హిందువుగా పెరిగి, ఒక హిందూ ప్రభువుచేత విద్య చెప్పించబడ్డ డాక్టర్ అంబేడ్కర్ సవర్ణ హిందువు లనబడే వారంటే ఎంతో విసుగెత్తి పోయాడు. అందుకు కారణం తానూ, తన ప్రజలూ సవర్ణ హిందువుల చేతుల్లో పొందిన, పొందుతున్న అవమాన పరంపరే. ఆయన ఎంతగా విసుగెత్తి పోయాడంటే. ఆ సవర్ణ హిందువులనే కాక, వాళ్ళకూ, తనకూ సమాన భాగధేయమైన హిందూ మతాన్నే విడిచిపెట్టి పోవాలని నిర్ణయించుకొన్నాడు. మతంలోని కొంతమంది పట్ల తనకు కల విసుగుదలను మొత్తం మతం పట్లనే ఆయన ప్రదర్శిస్తున్నాడు.

అయితే ఇది అంతగా ఆశ్చర్య పడవలసిన విషయం కాదు. ఏదైనా ఒక సంస్థ యొక్క లేక విధానం యొక్క మంచి చెడ్డలను, దాని ప్రతినిధుల ప్రవర్తనలోని మంచి చెడ్డలను బట్టి నిర్ణయించ వలసి ఉంటుంది. అది సహజమే. సవర్ణ హిందువులలో అత్యధిక సంఖ్యాకులు తమ సహ మతస్థులైన ఒక వర్గం ప్రజల్ని అస్పృశ్యులుగా వేర్పరచి వారిపట్ల అమానుషంగా ప్రవర్తించడమే కాక, అట్టి తమ అమానుష ప్రవర్తనకు శాస్త్రాధికారం చూపడం జరుగుతున్నది. నిజంగా అట్టి శాస్త్రాధికారం ఉన్నదా అని డాక్టర్ అంబేడ్కర్ పరిశీలించి చూచినప్పుడు అట్టిది ఉన్నట్లే ఆయనకు కనిపించింది. సవర్ణ హిందువులు అంటరాని తనాన్ని నమ్మడానికీ, పాటించడానికీ కారణం – అందువల్ల అంటరాని వర్గాల ప్రజలకు జరుగుతున్న అన్యాయాలకు కారణం హిందూమత శాస్త్రాలలోనే ఎంతో ఉన్నట్టు పరిశోధన ద్వారా ఆయన కనుక్కొన్నాడు. ఈ ఉపన్యాసంలోనే అట్టి శాస్త్రాలనుండి ఎన్నో శ్లోకాలను కూడ ఆరోపణకు ఉపబలకంగా ఉదహరించి ఉన్నాడు.

అస్పృశ్య ప్రజల పట్ల సవర్ణ హిందువుల అమానుష ప్రవర్తన, అట్టి ప్రవర్తనను సమర్థించుకొంటూ వారు (సవర్ణ హిందువులు) చెప్పే సిగ్గులేని సమాధానం, అట్టి

సమర్థనకూ. సమాధానానికి ఈ హేతువు హిందూమత శాస్త్రాలే కావడం – ఇదీ డాక్టర్ అంబేద్కర్ చేసే ప్రముఖమైన నిందారోపణ.

ఈ నిందారోపణ యొక్క ప్రాధాన్యాన్ని తన మతాన్ని ప్రాణం కంటే ఎక్కువగా పరిగణించే హిందువు డెవడూ ఉపేక్షించి ఊరుకోలేడు. సవర్ణ హిందువుల పట్ల, హిందూమతం పట్ల విసుగెత్తిపోయిన వాడు డాక్టర్ అంబేద్కర్ ఒక్కడే కాదు. అటువంటి ఎంతో మందిలో డాక్టర్ అంబేద్కర్ ఎక్కువ బలవంతుడూ, సమర్థుడూను. తన వాదాన్ని అప్రతిహతంగా ప్రతిపాదించగల మహా మేధావి ఆయన. ఇందులో ఏ మాత్రమూ రాజీకి సిద్ధపడే స్వభావం కాదాయనది. అందుకే దైవ కటాక్షం వల్ల అగ్రశ్రేణి నాయకులలో ఈయన ఒంటరివాడుగా ఉన్నాడు. అంతేకాదు, ఇంతవరకూ చాల కొద్దిపాటి మైనారిటీకి ప్రతినిధిగా ఉన్నాడు. దళిత జాతి ప్రజలకు చెందిన ఎంతోమంది నాయకులు డాక్టర్ అంబేద్కర్ విమర్శించేటంత తీవ్రంగానే హిందువులను, హిందూ మతాన్ని విమర్శిస్తూ ఉంటారు. అట్టి నాయకులలో రావు బహదూర్ ఎమ్.సి.రాజా, దివాన్ బహదూర్ శ్రీనివాసన్ మొదలైన వారు ముఖ్యులు. అయితే, ఈ నాయకులు డాక్టర్ అంబేద్కర్ వలె హిందూ మతాన్ని విడిచిపెట్టి పోతామని బెదిరించరు. పైగా, సవర్ణ హిందువుల చేతులలో హరిజనులు అనుభవిస్తున్న అమానుష హింసలకు ప్రతిగా హిందూ మతంలో తగినంత శక్తినీ, ఉత్సాహాన్నీ ఆ నాయకులు గుర్తించ గలుగుతున్నారు.

అయితే, హరిజనులకు చెందిన చాలామంది నాయకులు హిందూ మతంలోనే ఉంటున్నారన్నంత మాత్రం చేత డాక్టర్ అంబేద్కర్ చెప్పేదాన్ని నిర్లక్ష్యం చెయ్యడానికి వీలులేదు. సవర్ణహిందువులు తమ నమ్మకాలను, తమ నడవడిని సరిదిద్దుకోవలసి ఉంది. అంతే కాకుండా, సవర్ణులలో బాగా చదువుకొన్నవాళ్ళు, పలుకుబడి కలవాళ్ళు బాగా పరిశోధన చేసి శాస్త్రాలకు అధికారికమైన అర్థాన్ని ప్రకటించ వలసి ఉంది. శాస్త్రాలు చెపుతున్న నిజమైన విషయం ఏమిటో యథార్థంగా చెప్పవలసి ఉంది.

డాక్టర్ అంబేద్కర్ ఆరోపణలోని ప్రశ్నలు ఇవి:

1. శాస్త్రాలు ఏమిటి?

2. ఇప్పుడు ముద్రించబడి ఉన్న శాస్త్ర గ్రంథాలన్నీ శాస్త్రాల లోని అంతర్భాగాలేనా? లేక, అందులో దేనినైనా అనధికార ప్రక్షిప్తంగా నిరాకరించవచ్చా?

3. ఆ విధమైన అంగీకృతాలు, పరిష్కృతాలు అయిన శాస్త్రాలు అస్పృశ్య కులం, సమానత్వం, వర్ణాంతర భోజనాలు, వర్ణాంతర వివాహాలు - ఈ సమస్యలకు. ఇచ్చే జవాబు (పరిష్కార మార్గం) ఏమిటి?

(డాక్టర్ అంబేడ్కర్ తన ఉపన్యాసంలో నిశితంగా చర్చించిన సమస్యలే ఇవి.)

ఈ సమస్యలకు నా జవాబులు వచ్చే సంచికలో ప్రకటిస్తాను. డాక్టర్ అంబేడ్కర్ చేసిన సిద్ధాంతంలో కనిపిస్తున్న కొన్ని పొరపాట్లను గురించి కూడా అదే సంచికలో వివరిస్తాను.

**('హరిజన' 11, జూలై, 1936)**

## (ii)

హిందూ ధర్మశాస్త్రాలంటే వేదాలు, ఉపనిషత్తులు, స్మృతులు, పురాణాలు, అందులో రామాయణం, మహాభారతం కూడా ఉంటాయి. అయితే, ఈ శాస్త్రాల విషయంలో ఇదే తుది జాబితా కాదు. ప్రతి యుగం - ప్రతితరం కూడా - ఈ జాబితాను పెంచుతూ వచ్చింది. ఈ చారిత్రక సత్యాన్ని బట్టి చూస్తే-ముద్రించబడిన ప్రతీది వ్రాత ప్రతిగా కనిపించే ప్రతీది కూడ హిందూ ధర్మశాస్త్రమే అనడానికి వీలులేదు. ఉదాహరణకు-దైవసూక్తిగా ఇంతగా అంగీకరించ వీలులేని దెంతో స్మృతులలో మనకు కనిపిస్తుంది. అందువల్ల, స్మృతులనుంచి డాక్టర్ అంబేడ్కర్ ఉదాహరించిన ఎన్నో విషయాలు అధికారికమైనట్టివిగా అంగీకరించడానికి వీలులేదు. ధర్మశాస్త్రాలనేవి - అవి నిజమైన మత ధర్మ శాస్త్రాలే అయినప్పుడు - కేవలం ఆధ్యాత్మిక విషయాలను మాత్రమే ఉద్బోధించేవిగా ఉంటాయి. నిర్మలమైన హృదయాలకు హత్తుకొనేవిగా అంతరాత్మకు విశదమైనవిగా ఉంటాయి.

హేతుబద్ధం కాని దేదీ, ఆత్మానుభవానికి అనుకూలంకాని దేదీ వేదంగా (దైవ సూక్తిగా) అంగీకరించ బడజాలదు. ధర్మశాస్త్ర గ్రంథాల పరిష్కృత ప్రతులు

మనకు లభ్యమైనప్పటికీ, అట్టి వాటికి సరియైన వ్యాఖ్యానాలు కూడ మనకు తెలియవలసి ఉంది. సరియైన వ్యాఖ్యాత ఎవరు? పండితుడు మాత్రం కాదు. పాండిత్యం ఉండవలసిందే. కాని మతానికి కావలసింది, పాండిత్యం కాదు. మతానికి కావలసింది. – ఆ మతానికి చెందిన ఋషుల, యోగుల అనుభవాలు, వారి జీవితాలు, వారి ప్రవచనాలు, వాటి మీదనే ఏ మతమైనా బ్రతికేది. మహా పండితులైన ధర్మశాస్త్ర వ్యాఖ్యాతలంతా – ప్రజలచేత విస్మరించబడినప్పటికీ, ఋషుల, యోగుల పరమానుభవాలు బ్రతికే ఉంటాయి. భవిష్యత్తరాల ప్రజలను ఉత్తేజితుల్ని చేస్తూనే ఉంటాయి.

కులానికి మతంతో ఏమీ సంబంధం లేదు. కులమనేది ఒక ఆచారం. అది ఎలా ఎందుకు పుట్టిందో నాకు తెలీదు. తెలుసుకోవాలనే జిజ్ఞాస కూడ నాకు లేదు. అయితే ఆధ్యాత్మిక అభివృద్ధికీ, జాతీయ వికాసానికీ కూడ కులం విషతుల్యం అనేది నాకు బాగా తెలుసు.

వర్ణం, ఆశ్రమం అనేవి కులాలతో సంబంధంలేని వ్యవస్థలు. వర్ణం చెబుతున్న దేమిటంటే అనువంశికమైన వృత్తులను అనుసరించి ఎవరి తిండిని వారు సంపాదించుకో వాలని. మన హక్కుల్ని కాక, మన బాధ్యతల్ని వర్ణధర్మం నిర్వచిస్తుంది. మానవ సంక్షేమానికి అనుకూలంగా ఉండే వృత్తులనే ప్రతి మానవుడు అనుసరించాలని దాని ఉద్దేశం. వర్ణ ధర్మం శాసిస్తున్న దంత వరకే. ఒక వృత్తి తక్కువదని గాని, ఒక వృత్తి ఎక్కువదనిగాని ఏమీ లేదు. అన్ని వృత్తులు, అన్ని బ్రతుకు తెరువులు మంచివే. ధర్మ సమ్మతమై నట్టివే. గౌరవ ప్రతిపత్తులలో సమానమైనట్టివే. ఆధ్యాత్మిక ప్రబోధకుడైన ఒక బ్రాహ్మణుని కుల వృత్తీ, సమాజ పారిశుద్ధ్య ప్రవర్తకుడైన ఒక పాకీవాని కుల వృత్తీ రెండూ సమానమే. వాటిని సమర్థంగా నిర్వహించినప్పుడు ఆ రెండూ సమానంగా భగవదనుగ్రహ పాత్రాలే అవుతాయి.

పూర్వం ఒకప్పుడు మానవుడి నుండి కూడ ఆ ఇద్దరూ సమాన ప్రతిఫలాన్నే పొంది ఉండినట్టు కనిపిస్తోంది. బ్రాహ్మణుడూ, పాకీవాడూ కూడ బ్రతకడానికి మాత్రమే సంపాదించుకోవలసి ఉండేది. అంతకంటే ఎక్కువ సంపాదించుకోడానికి ధర్మం ఒప్పుకోదు. ఆ కాలంలో న్యాయ ధర్మం ఇంత చక్కగా, సవ్యంగా అమలు జరిగేది. ఇప్పటికీ మనం దీని చిహ్నాలను కొన్ని కొన్ని గ్రామాలలో చూడవచ్చు.

సెగాన్ గ్రామంలో ఉంటూ అక్కడ నేనీ సత్యాన్ని స్పష్టంగా గమనించాను. సుమారు ఆరు వందల జనాభాగల ఆ గ్రామంలో బ్రాహ్మణులతో పాటు అన్ని వృత్తుల వారికి ఆదాయం సరి సమానంగానే ఉండేది. ఈ నాటికీ - హిందూ సమాజం ఇంతగా దిగజారిపోయిన ఈ రోజుల్లో కూడ-నిజమైన బ్రాహ్మణులు గ్రామాల్లో కనిపిస్తారు. భిక్షాటన మీదనే వాళ్ళు బ్రతుకుతారు. ప్రజలు సంతోషంగా పెట్టే భిక్షను గ్రహించి తాము నేర్చిన ఆధ్యాత్మిక సంపదను స్వేచ్ఛగా ప్రజలకు అందజేస్తుంటారు. ఈ నాడు సవర్ణులనబడేవారు ప్రదర్శిస్తున్న వికృత రూపాన్ని చూచి వర్ణాన్ని, వర్ణ ధర్మాన్ని అపార్థం చేసుకోకూడదు. తాము ఏదో ఒక వర్ణానికి చెందిన వారమని చెప్పుకొంటూ, తమ వర్ణానికి సంబంధించిన ముఖ్య ధర్మాన్ని బాహాటంగా ఉల్లంఘిస్తుంటారు. చాలమంది ఒక వర్ణం కంటె మరొక వర్ణం గొప్పదనుకోవడం అసలు న్యాయం ధర్మాన్నే నిరాకరించడం.

అంతేకాదు. అంటరానితనం అనేది వర్ణ ధర్మంలో ఎక్కడా లేదు. అస్పృశ్యతను పాటించడం వర్ణ ధర్మ విరుద్ధమే. (సత్యం ఒక్కటే ఏకైక భగవత్ స్వరూపమని, అహింస యావన్మానవ కుటుంబ ధర్మమని అంగీకరించడంలోనే హిందూమత సారం యావత్తూ ఆవిష్కరించబడింది.)

హిందూ మతానికి ఇప్పుడు నేనిచ్చిన నిర్వచనం ఒక్క డాక్టర్ అంబేద్కర్‌కే కాక, ఇంకా చాలా మందికి అంగీకారంగా ఉండదని నాకు తెలుసు. అంతమాత్రంచేత నేను చలించే వాడ్ని కాదు. ఈ నిర్వచనం ప్రకారమే ఒక అర్ధ శతాబ్దం వరకు నేను జీవించాను. ఈ నిర్వచనం ప్రకారమే ఈ అర్ధ శతాబ్దమూ నా సమస్త శక్తినీ ధారపోసి నా జీవితాన్ని నడుపుకోడానికి కృషి చేశాను.

నా ఉద్దేశంలో డాక్టర్ అంబేద్కర్ చేసిన పెద్ద పొరపాటు ఏమిటంటే - అధికారంలోనూ, విలువలోనూ, అసందిగ్ధం కాని శాస్త్రాలను ఉదహరించడం. పైగా, హిందూ మతానికి ప్రాతినిధ్యం వహించడానికి పూర్తిగా పనికిరాని దుష్ట హిందువులను సమూనాగా ఎత్తి చూపడం. డాక్టర్ అంబేద్కర్ తీసుకొన్న ప్రమాణాలను బట్టి పరీక్షించి చూస్తే - బహుశా లోకంలో మనకు తెలిసిన ప్రతీ మతమూ దోష భూయిష్ఠమే ఔతుంది.

ప్రతిభా పూర్వకమైన తన ఉపన్యాసంలో పండితుడైన డాక్టర్ అంబేడ్కర్ తన వాదాన్ని ఒకింత అతిగానే ఋజువు చేసుకోగలిగాడు. చైతన్యుడు, జ్ఞానదేవుడు, తుకారాం. తిరువళ్ళువరు, రామకృష్ణ పరమహంస, రాజారామ మోహనరాయ్, మహర్షి దేవేంద్రనాథ టాగూరు, వివేకానంద మొదలైన ఎందరో అవలంభించిన మతం - డాక్టర్ అంబేడ్కర్ తన ఉపన్యాసంలో చిత్రించినట్టు - వట్టి గుణహీనమే కాగలదా? ఏ మతం మంచి చెడ్డలనైనా అది సృష్టించగల మహనీయులను బట్టి నిర్ణయించాలే గాని, దానిలో పుట్టే అధములను బట్టి కాదు. ఏ మతానికైనా అది అందివ్వగల ఆదర్శ సమున్నతి మాత్రమే దాని మంచి చెడ్డల పరీక్షకు ప్రమాణం (గీటురాయి) కావలసి ఉంది.

**('హరిజన' 18 జూలై, 1936)**

(iii)

## వర్ణము - కులము

లాహోరు నుంచి జాత్ పాత్ తోడక్ మండలికి చెందిన శ్రీ శాంత్‌రామ్ జీ ఈ క్రింది విషయాల్ని ప్రకటించ వలసిందిగా నన్ను కోరాడు.

డాక్టర్ అంబేడ్కర్ గురించి, జాత్‌పాత్ తోడక్ మండలి గురించి మీరు వెలిబుచ్చిన అభిప్రాయాలను చూశాను. ఈ విషయంలో నేను కొంత చెప్పవలసి ఉంది.

మహాసభకు అధ్యక్షత వహించవలసిందిగా డాక్టర్ అంబేడ్కర్‌ను మేము కోరామంటే-అందుకు కారణం ఆయన దళిత వర్గాలకు చెందిన వాడని కాదు. స్పృశ్య హిందువు, అస్పృశ్య హిందువు అనే భేదభావం మాకు లేదు. మహా సభాధ్యక్షుడుగా ఆయనను మేము ఎందుకు వరించామంటే-హిందూ సమాజాన్ని పట్టి పీడిస్తున్న భయంకర జాడ్యం ఏదో కనుక్కోవడంలో ఆయన చేసి సూచనలతో మాకు ఏకీభావం ఉండడం వల్ల, హిందువుల పతనానికి, వినాశనానికి మూల కారణం వర్ణ వ్యవస్థేనని మాకు లాగే డాక్టర్ అంబేడ్కర్ కూడ భావిస్తున్నాడు. ఆయన తన డాక్టరేటు డిగ్రీ థీసిస్సుకు ఎన్నుకొన్న విషయం కులవ్యవస్థే. అందువల్లనే,

ఈ విషయంలో ఆయన సమగ్ర పరిశోధన జరిపి ఉన్నాడు. మా మహాసభ ప్రధానోద్దేశం హిందూ సమాజాన్నుంచి కులాలను నిర్మూలించడం. కులాలను రద్దు చేసుకొనే మా ఉద్యమానికి సుముఖంగా హిందువుల్ని ప్రేరేపించడం. అయితే, హిందువుడు కాని వాడెవడు చెప్పిన మత సాంఘిక విషయాలలో హిందువులు వినిపించుకోరు. హైందవేతరుల సలహాలు ఈ విషయంలో హిందువుల చెవి కెక్కవు.

డాక్టర్ అంబేడ్కర్ తన ఉపన్యాసం కడపటి భాగంలో హిందువుడిగా తన ఆఖరు ఉపన్యాసం అదే నని స్పష్టంగా వ్రాశాడు. అది ఉపన్యాసంలో చెప్పాలని పట్టుబట్టాడు. అలా ప్రకటించడంలో సందర్భశుద్ధి లేకపోగా, అది మహాసభ ప్రధానోద్దేశానికే భంగకరం. అందువల్ల ఆ ఒక్క వాక్యాన్ని ఉపన్యాసం నుంచి తొలగించ వలసిందిగా ఆయనను నేను కోరాను. ఆ విషయాన్ని మరొక ఏ సందర్భంలోనైనా ఆయన సులభంగా చెప్పవచ్చు. అయితే ఆయన మా కోరికను నిరాకరించాడు. ఇక మాకు గత్యంతరం లేకపోయింది. ఫలితార్థం లేకుండ ఏదో తంతు కోసం మహాసభను జరిపి ఏం లాభం?

ఇంత జరిగినా – ఆయన ఉపన్యాసాన్ని పొగడకుండా మాత్రం ఉండలేము. నాకు తెలిసినంత వరకు ఈ (కుల వ్యవస్థ) విషయంపై ఈ ఉపన్యాసం ఒక గొప్ప పాండితీ ప్రతిభా ప్రపూరితమైన పరిశోధక వ్యాసం (థీస్సిస్సు). దీనిని దేశంలోని అన్ని ప్రాంతాల భాషలలోకి అనువదించి ప్రకటించడం అత్యంత ప్రయోజనకరం.

మరొక విషయాన్ని మీ దృష్టికి తేదలుస్తున్నాను. హిందూ సమాజంలో కులము, వర్ణము అనేవి రెండు పర్యాయ పదాలుగానే ఉన్నై. కాగా కులానికీ, వర్ణానికీ మధ్య మీరు చూపిన తాత్విక భేదం చాల సూక్ష్మమైనట్టిది. అది సామాన్య ప్రజానీకానికి అవగాహన కాదు. వర్ణాంతర భోజనాలు మొదలైనవాటి నిషేధం విషయంలోనే, అన్ని దైనందిన వ్యవహారాల దృష్ట్యాను కూడ వర్ణానికీ, కులానికీ మధ్య ఎట్టి భేదమూ కనపడదు. అవి రెండూ ఒకటిగానే ఉన్నై. మీ రిచ్చిన అర్థంలో వర్ణ వ్యవస్థ ఈ నాడు ఆచరణసాధ్యం కాదు. అచిర భవిష్యత్తులో కూడ అది ఆచరణ సాధ్యమయ్యే ఆశ లేదు. హిందువులు కులానికి బానిసలు. కులాన్ని నిర్మూలించడానికి హిందువులు అంగీకరించరు. అందువల్ల ఏదో మీ ఊహలో లక్ష్య ప్రాయమై ఉన్న

ఒక వర్ణ వ్యవస్థను మీరు ప్రచారం చెయ్యడం ప్రారంభిస్తే, దాన్ని సాకుగా తీసుకొని నేటి విషప్రాయమైన కుల వ్యవస్థను హిందువులు పట్టుకొని వ్రేలాడుతూనే ఉంటారు. కాగా మీ ఊహాగత వర్ణవ్యవస్థ ప్రచారం మా సంస్కరణోద్యమానికి తీరని అపకారమే చేయగలదు. వర్ణ వ్యవస్థ మూలానికే దెబ్బ కొట్టకుండా అంటరానితనాన్ని నిర్మూలించడం సాధ్యం కాదు. పైకి కనిపించే కొన్ని లక్షణాలకు మందిచ్చినంత మాత్రం చేత అసలు వ్యాధి నివారణ కాజాలదు. కులనిర్మూలన లేకుండా అస్పృశ్యతా నిర్మూలన నీటిపై వ్రాత మాత్రమే. నిజం చెప్పాలంటే శూద్రులకు – స్పృశ్యులుకానీ అస్పృశ్యులుకానీ – తమ సమానంగా సాంఘిక హోదాను కల్పించడం ద్విజులకు ఇష్టం ఉండదు. కాగా కుల వ్యవస్థను విచ్ఛిన్న చేయడానికి ద్విజులు అంగీకరించరు. పోతే అస్పృశ్యతా నివారణకు మాత్రం ఉదారంగా విరాళా లిస్తారు. – అసలు సమస్యను దాటవెయ్యడం కోసం. అస్పృశ్యతనే, కులాన్నీ నిర్మూలించడానికి శాస్త్రాల సహాయం కోరడం బురదను బురదతో కడిగి వెయ్యడానికి ప్రయత్నించడం మాత్రమే.

ఇదీ శ్రీ శాంత్‌రామ్‌జీ ప్రకటించమన్న విషయం. ఈ విషయంలో చివరి పేరా మొదటి పేరాను రద్దు చేసి పారేస్తున్నది. శాస్త్రాల సహాయాన్ని జాత్ పాత్ తోడక్ మండలి నిరాకరిస్తే అది సరిగ్గా డాక్టర్ అంబేడ్కర్ చేసిన పనే చేసినట్టవుతుంది. అటువంటప్పుడు – కేవలం హిందువుగా అదే తన ఆఖరి ఉపన్యాసం అన్నంత మాత్రానికే ఆ ఉపన్యాసాన్ని మండలి ఎందుకు నిరాకరించ వలసి వచ్చింది? డాక్టర్ అంబేడ్కర్ ఉపన్యాసంలోని వాదాన్ని ప్రశంసించడం – ఆయన ఆ మాట అన్నందుకు నిరసించడం – ఇదంతా పరస్పర విరుద్ధంగా ఉంది.

అయితే, శాస్త్రాలను నిరాకరిస్తే, మరి మండలి ఇక దేనిని విశ్వసిస్తున్నట్టు? ఖురానును నిరాకరించి, ఏ ముస్లిం అయినా ముస్లింగా ఉండగలడా? బైబిలును నిరాకరించి, ఏ క్రైస్తవుడయినా క్రైస్తవుడుగా ఉండగలడా? కులమూ, వర్ణమూ, పర్యాయ పదాలైనప్పుడు – హిందూమతాన్ని నిర్వచించే శాస్త్రాలలో వర్ణం ఒక ప్రధానాంశం అయినప్పుడు – కులాన్ని అంటే వర్ణాన్ని నిరాకరించే ఎవడైనా హిందువు డెలా అవుతాడో ఊహించలేకుండ ఉన్నాను.

శ్రీ శాంత్‌రామ్ శాస్త్రాలను బురదతో పోల్చాడు. డాక్టర్ అంబేడ్కర్ కూడ-నాకు జ్ఞాపకం ఉన్నంతవరకూ, శాస్త్రాలకు ఇంత ప్రస్ఫుటమైన పోలిక తెచ్చి ఉండలేదు. ప్రస్తుతం అమలులో ఉన్న అంటరానితనాన్ని శాస్త్రాలు బలపరుస్తూ ఉన్నట్టయితే నేను హిందువుడ్ననిపించుకోవడం మానేస్తానని నేను చెప్పినప్పుడు, అది నేను హృదయ పూర్వకంగా చెప్పిన మాటే. అలానే, ఎంతో అసహ్యంగా, దుష్టంగా నేడు అమలులో ఉన్న కుల వ్యవస్థను శాస్త్రాలు సమర్థించే టట్టయితే అలాంటి శాస్త్ర సిద్ధమైన హిందూ మతంలో నే నుండలేను. హిందువు ననిపించుకో లేను. హిందువునే కాజాలను.

వర్ణాంతర భోజనాలు కాని, వర్ణాంతర వివాహాలు కాని నాకు అభ్యంతరం లేదు. వాటి అమలులో నా కెట్టి ధర్మ సందేహమూ లేదు. శాస్త్రాల విషయంలోనూ, వాటి తాత్పర్యం విషయంలోను నా వైఖరి అందరకూ తెలిసిందే. ఇదొక్కటే హేతుబద్ధమూ, సవ్యమూ, నైతికంగా సమర్థనీయమూ అయిన వైఖరి అనీ – హిందూ సంప్రదాయంలో దీని కనుగుణంగా అపారమైన ఆధారం ఉన్నదనీ నేనే శ్రీ శాంత్‌రామ్‌కు సూచించ సాహసిస్తున్నాను.

**('హరిజన' 15, ఆగస్టు, 1936)**

# అనుబంధం - (ii)

# మహాత్మా గాంధీకి
# డాక్టర్ అంబేడ్కర్ జవాబు

## 1

కుల వ్యవస్థను గురించి జాత్ పాత్ తోడక్ మండలి వారి కోసం నేను తయారుచేసిన అధ్యక్షోపన్యాసాన్ని తన 'హరిజన' పత్రికలో ప్రస్తావించి, తద్వారా మహాత్ముడు నాకు చూపిన గౌరవానికి నేనెంతో హర్షిస్తున్నాను. అయితే-నా ఉపన్యాసంపై ఆయన చేసిన సమీక్షను బట్టి చూస్తే - కుల వ్యవస్థపై నేను వ్యక్తపరచిన అభిప్రాయాలకు మహాత్ముడు పూర్తిగా వ్యతిరేకి అని స్పష్టపడుతున్నది. ఏవో ప్రత్యేక కారణాలు ఉంటే తప్ప నా ప్రత్యర్థులతో వివాదానికి దిగే అలవాటు నాకు ఎప్పుడూ లేదు. ఇప్పుడు కూడ నా ప్రత్యర్థి ఎవడో అల్పుడూ, అనామకుడూ అయి ఉండి ఉన్నట్టయితే ఈ జవాబును ఇచ్చి ఉండేవాణ్ని కాదు. ఇప్పుడు మహాత్ముడే నా ప్రత్యర్థికావడం వల్ల - ఆయన చేసిన వ్యతిరేక వాదాన్ని ఖండించక తప్పదనే భావిస్తున్నాను. ఆయన నా పట్ల ఎంతో గౌరవం చూపిన మాట నిజమే. అందుకు నేను బహుగా హర్షిస్తున్నాను కూడా. అయితే మహాత్ముడంతటి వాడు నేను నా ఉపన్యాసాన్ని ముద్రించి ప్రకటించి నందుకు విమర్శించాడంటే - నిజంగానే ఆశ్చర్యంగా ఉంది.

ప్రసంగించని ఉపన్యాసాన్ని ముద్రించి ప్రకటించడంలో నేను ఇతరులు నన్ను మరచిపోకుండా జాగ్రత్త పడ్డాడనీ స్వయం ప్రచారం కావించుకొన్నాననీ మహాత్ముడు నాపై నేరారోపణ చేశాడు. అదే నాకు ఆశ్చర్యంగా ఉంది. సరే, మహాత్ముడు ఏమన్నా అనవచ్చు. నా ఉపన్యాసాన్ని ముద్రించి ప్రకటించడంలో నా ఉద్దేశం మాత్రం హిందువుల్ని ఉద్బోధించి, ఆలోచనకు పురికొల్పి, తమ స్థితిని తాము గుర్తించుకొనేటట్టు చెయ్యడం. నే నెప్పుడూ ప్రచారం కోసం ప్రాకులాడ లేదు. నిజానికి నేను కోరుకున్నంత కంటె, అవసరమైన దానికంటె కూడ ఎక్కువ ప్రచారమే నాకు లభించింది. పోనీ, నేను నిజంగా ప్రచారం కోసమే నా ఉపన్యాసాన్ని ముద్రించి

ప్రకటించా ననుకొన్నప్పటికీ – అది దోషం అని ఎవరు అనగలరు? నాపై రాళ్ళు విసిరేవాళ్ళు గాజు గృహాలలో నివసిస్తున్న మహాత్ముడి వంటి వాళ్ళు మాత్రం కాకూడదు గదా!

## 2

ఉద్దేశాల మాట అలా ఉంచి – ఇంతకూ నా ఉపన్యాసంలో నేను లేవనెత్తిన ప్రశ్న విషయంలో మహాత్ముడు చెప్పదలచిందేమిటి? నా ఉపన్యాసాన్ని చదివిన వారెవరైనా సరే – అందులో నేను ప్రస్తావించిన సమస్యల్ని మహాత్ముడు పూర్తిగా జారవిడిచాడని తెలుసుకోగలరు. నేను హిందువుల గురించి చేసిన ఆరోపణలంటూ మహాత్ముడు చర్చించిన సమస్యలకీ, నేను లేవనెత్తిన సమస్యలకీ సంబంధం కనబడదు. నా ఉపన్యాసం చదివిన వారెవరైనా దీన్ని గుర్తించ గలరు. నేను నా ఉపన్యాసంలో స్పష్టీకరించా లనుకొన్న ముఖ్యాంశాలను ఈ క్రింది విధంగా వివరించవచ్చు!

1. కుల వ్యవస్థ హిందువుల్ని నాశనం చేసింది.
2. చాతుర్వర్ణ్య ప్రాతిపదిక మీద హిందూ సమాజాన్ని పునర్మించడం అనేది అసాధ్యం. ఎందుకంటే వర్ణ వ్యవస్థ ఒక చిల్లి కుండ వంటిది. తనను తాను నిలుపుకొనే శక్తీ, గుణమూ దానికి లేదు. వర్ణాన్ని అతిక్రమించే ప్రతీ వ్యక్తీనీ కఠినంగా శిక్షించడానికి ఒక గట్టి శిక్షాస్మృతిని అమలు పరిస్తేనే తప్ప వర్ణ వ్యవస్థ కులవ్యవస్థగా పతనమై పోక తప్పదు. అలా పతనమై పోయే బలహీనత సహజంగానే వర్ణ వ్యవస్థ నిర్మాణంలో ఉంది.
3. హిందూ సమాజాన్ని చాతుర్వర్ణ్య ప్రాతిపదికపై పునర్నిర్మాణం చెయ్యడం చాలా హానికరం. ఎందుకంటే, అది ప్రజానీకానికి విద్యావకాశాలను నిరాకరించడం ద్వారా వారిని అజ్ఞాన కూపంలో త్రోసి వేస్తుంది. ఆయుధ ధారణ హక్కును నిరాకరించడం ద్వారా వారిని నిర్వీర్యులను చేస్తుంది.
4. స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాత్రం–ఈ మూడు ముఖ్య సూత్రాలను పవిత్ర సూత్రాలుగా ఆమోదించగల మతాన్ని ప్రాతిపదికగా తీసుకొని హిందూ సమాజం పునర్నిర్మించబడాలి.
5. ఈ విధంగా హిందూ సమాజం పునర్నిర్మాణం జరగాలంటే అందుకు

ముందుగా కులానికీ, వర్ణానికీ ప్రస్తుతం ఉన్న మతైక పవిత్రతా భావన తొలగించబడాలి.

6. ఆ విధంగా కుల వర్ణాలకు గల మత స్వాతంత్ర్యాన్ని నాశనం చెయ్యాలంటే ముందుగా శాస్త్రాల దైవీయ అధికారాన్ని నిరాకరించాలి.

ఇవీ నా ఉపన్యాసంలోని ప్రధానాంశాలు. వీటిని, మహాత్ముడు చేసిన విమర్శను పరిశీలించిన వారికి మహాత్ముడు అసలు విషయాల్ని వదలి పెట్టి ప్రక్క దారి పట్టినట్టు గ్రహించ గలరు. నా ఉపన్యాసంలోని ప్రధానాంశం మహాత్ముని యెడల పూర్తిగా నిష్ప్రయోజనం అయిపోయింది.

## 3

ఇప్పుడు మహాత్ముడు వెలిబుచ్చిన అభిప్రాయాలను గురించి సూక్ష్మంగా కొంత పరిశీలిస్తాం.

ఆయన అభిప్రాయాలలోని మొదటి అంశం-నేను ఉదాహరించిన శాస్త్రాల విషయాలు అధికారికమైనట్టివి కావని.

హిందూ మత శాస్త్ర విషయాలలో నేను పెద్ద అధికారిని కాదని నేను అంగీకరిస్తాను. అయితే నేను ఉదహరించిన శాస్త్ర విషయాలన్నీ కూడ స్వర్గీయ శ్రీ తిలక్ మహాశయుని రచనల నుండి తీసుకోబడినట్టివే అని మనవి చేస్తున్నాను. తిలక్ మహాశయుడంటే సంస్కృత భాషలోను, హిందూ శాస్త్రాలలోను అధికారికంగా సర్వత్రా గుర్తించ బడినవాడే కాదా?

మహాత్ముడి రెండవ అంశం ఏమిటంటే-ఈ శాస్త్రాలను కేవలం పండితులు వ్యాఖ్యానించ కూడదని, జ్ఞానులు, భక్తులు అయిన వాళ్ళు (సెయింట్సు) మాత్రమే వ్యాఖ్యానించాలని, శాస్త్రాలకు సెయింట్సు చేసిన వ్యాఖ్యానాలను బట్టి చూస్తే-కులాన్ని కాని, అస్పృశ్యతను కాని శాస్త్రాలు బలపరచడం లేదని. ఇదీ మహాత్ముని వాదన.

మొదటి అంశానికి సంబంధించి నేను మహాత్ముణ్ని అడగా లనుకొంటున్న ప్రశ్న ఏమిటంటే-శాస్త్రాలు అధికారిక మైనట్టివా, లేక ప్రక్షిప్తాలా (మధ్యలో ఎవరో

కల్పించి నట్టివా) అనే విషయంలో కాని, వాటిని పండితులు వ్యాఖ్యానించారా సెయింట్సు వ్యాఖ్యానించారా అనే విషయంలో కాని ప్రజలకు ఏమిటి ప్రమేయం? ఈ శాస్త్రాలకు ఋషులు చెప్పే అర్థం వేరు అని చెప్పడంలో ఏమిటి ప్రయోజనం.

శాస్త్రాలు అధికారికాలో, ప్రక్షిప్తాలో ప్రజలకు అక్కర లేదు. వాటి మధ్య తేడా ఏమిటో కూడ ప్రజలకు తెలియదు. అసలు శాస్త్రాలనే ప్రజలు ఎరుగరు. శాస్త్రాలలో ఏమున్నదో తెలుసుకోగలిగినంత చదువూ, జ్ఞానమూ ప్రజానీకానికి లేదు. వారికి తెలిసింది ఒక్కటే-అది వారికి ఇతరులు (బ్రాహ్మణులు) చెప్పినట్టిది. ఆ ఇతరులు వారికి చెప్పిందేమిటంటే- కులాలన్నీ, అస్పృశ్యతనూ పాటించడం పవిత్ర మత ధర్మంగా శాస్త్రాలు విధిస్తున్నాయని.

ఇక, సెయింట్సుకు సంబంధించి: వాళ్ళు ఎంతటి పరమ భక్తులూ, జ్ఞానులూ సాధువులూ, స్వాములూ అయినప్పటికీ-కేవలం పండిత ప్రవచనాల కంటె వాళ్ళ బోధనలు ఎంత ప్రత్యేకమై నట్టివిగా, సమున్నతమైనట్టివిగా ఉన్నప్పటికీ, ప్రజల మీద వాటి ప్రభావం ఏమీ లేదని ఎల్లరకూ తెలిసిందే. ప్రజల మీద వాటి ప్రభావం లేకపోవడానికి కారణాలు రెండు. అందులో ఒకటి-ఈ సెయింట్సు అందరూ కూడ కుల వ్యవస్థలో ప్రగాఢ విశ్వాసం కలవారే. వాళ్ళలో చాలమంది ఏదో ఒక కులానికి చెంది ఉండి, అందులోనే బ్రతికి, ఆయా కులస్థులు గానే చచ్చిపోయిన వాళ్ళు. ఉదాహరణకు జయదేవుణ్ణే తీసుకోవచ్చు. పైఠాన్ బ్రాహ్మణులు మొదట్లో జయదేవుణ్ణి తమలో చేర్చుకోనందుకు ఆయన ఎంతో బాధపడి, వారిచే బ్రాహ్మణుడనిపించుకొనే దాకా నిద్ర పోలేదు. బ్రాహ్మణుడుగా బ్రాహ్మణులచేత గుర్తింప జేసుకోవడానికి ఆయన చేసి ప్రయత్నం ఇంతా అంతా కాదు. ధర్మాత్మ ఫిల్ములో నాయకుడైన ఏకనాథుడు అస్పృశ్యులను స్పృశించగల, అస్పృశ్యులతో కలిసి భుజించ గల ధైర్యాన్ని ప్రదర్శించడం వల్ల ధర్మవీరుడుగా కీర్తింప బడ్డాడు గదా. అయితే, ఆయన అలా చేయడానికి కారణం కులాన్నీ, స్పృశ్యతనూ ఆయన వ్యతిరేకించడం కాదు. అలా చెయ్యడం వల్ల సంక్రమించే దోషాన్ని పవిత్ర గంగాజల స్నానంతో తొలగించుకోవచ్చునన్న విశ్వాసం ఉండడం వల్ల ఆయన చెయ్య గలిగాడు.

*"అంత్యా జా చా విటాళ జ్యాసీ*
*గంగాస్నానే శుద్ధ త్యాసీ"*

**(ఏకనాథీ భాగవత)**

నేను చదివి చూచి నంతవరకు, నాకు తెలిసినంత వరకు మన సెయింట్సు ఎవళ్లూ కూడ కులానికీ, అస్పృశ్యతకూ వ్యతిరేకంగా ఏ విధమైన ఉద్యమాన్నీ నడిపిన వాళ్ళు కాదు. మానవుల మధ్య ఉత్పన్న మయ్యే సంఘర్షణలతో వాళ్ళు ఎట్టి జోక్యాన్నీ పెట్టుకోలేదు. మానవుడికీ, భగవంతుడికీ మధ్య ఉండే సంబంధాన్ని గురించి మాత్రమే వాళ్ళు ఆలోచించే వాళ్ళు. మానవులంతా సమానులని వాళ్ళు బోధించలేదు. భగవంతుడి దృష్టిలో మానవులంతా సమానం అని మాత్రమే వాళ్ళు చెప్పగలిగారు. ఈ రెండూ ఒకటి కాదు. ఈ రకమైన బోధనలు, ఉపదేశాలు ఎవరైనా చేయవచ్చు. అందులో కష్టమూ లేదు. ప్రమాదమూ లేదు.

ఈ సెయింటులు ప్రబోధాలు, ఉపదేశాలు నిష్ప్రయోజనం కావడానికి మరొక కారణం - భక్తులు, సాధువులు, జ్ఞానులు అయినవాళ్ళు కులాన్ని అధిగమించవచ్చుననీ, సామాన్య మానవులు మాత్రం కులానికి లోబడే ఉండాలనీ విశ్వసించ బడడం. సెయింటు కులాన్ని దాటి పోవచ్చు. సామాన్య మానవుడు మాత్రం కులానికి కట్టుబడే ఉండాలి. ప్రజలలో జరిగిన ఈ విపరీత ప్రచారం వల్ల సెయింటు ఎన్నడూ ప్రజల ప్రవర్తనకు మార్గదర్శకం కాలేక పోయాడు. ప్రజలకు అనుసరణ యోగ్యుడు కాలేక పోయాడు. అతడెప్పుడూ, గౌరవనీయుడైన పవిత్ర మూర్తిగానే నిలిచిపోయాడు. కులంలోను, అంటరాని తనంలోనూ ప్రజలు తమ మూఢ విశ్వాసాలను తాము నిలుపుకొంటూనే ఉన్నారంటే అర్థమేమిటి: జ్ఞానులు, భక్తుల, సాధు పురుషుల ప్రవచనాల ప్రభావం వాళ్ళ నిత్య జీవనంలో ఏమి మార్పు తేలేక పోయింది. శాస్త్రాల కబంధ హస్తాలను సడలించలేక పోయింది.

కాగా, కొద్ది మంది పండితులకూ, అశేషమైన పామరులకూ భిన్నంగా శాస్త్రాలను అర్థం చేసుకొనే ఒక మహాత్ముడు, కొందరు సెయింటులు ఉన్నారనేది ప్రజలకు ఓదార్పు నివ్వజాలదు గదా. అది ప్రజలకు ఏ విధంగానూ ప్రయోజనకరం కూడ కాజాలదు. శాస్త్రాలు కులాన్నీ, అంటరానితనాన్ని పాటించ మంటున్నాయని

తమకు బోధించబడ్డది. దాన్నే ప్రజలు సంపూర్ణంగా నమ్ముతున్నారనేది పూర్తిగా వాస్తవం. ఈ వాస్తవాన్ని మనం ముఖ్యంగా గుర్తించాలి. శాస్త్రాల అధికారాన్ని తొలగించకుండా ప్రజల మీద శాస్త్రాల ప్రభావాన్ని తొలగించకుండా - ప్రజలు కులాన్ని, అంటరాని తనాన్ని పాటించకుండా చేయడం ఎలాగో మహాత్ముడు ఆలోచించడం లేదు.

శాస్త్రాల ఆదేశాల నుంచి ప్రజా సమూహాన్ని విమోచన చేయడానికి మహాత్ముడు ప్రతిపాదించే ప్రణాళిక ఏదైనప్పటికీ–లోకంలో ఒక జ్ఞాని యొక్క పవిత్ర జీవిత పద్ధతి, అతని ఆత్మ సమున్నతికి మాత్రమే తోడ్పడ వచ్చు. ఇండియాలో సామాన్య వ్యక్తి జ్ఞానులను, మహాత్ములను గౌరవిస్తాడే గాని, వారు చెప్పేదాన్ని ఆచరించడు. ఈ వైఖరిగల ప్రజాబాహుళ్యాన్ని దృష్టిలో ఉంచుకొన్నప్పుడు వల్ల ప్రజలకు ఏ ప్రయోజనమూ లేదని మహాత్ముడు కూడ అంగీకరించక తప్పదు.

## 4

మహాత్ముడు ప్రతిపాదించిన మరొక అంశం ఏమిటంటే–చైతన్యుడు జ్ఞానదేవుడు, తుకారాం, తిరువళ్ళువరు, రామకృష్ణ పరమహంస మున్నగు వారిచే అవలంబించ బడిన మతం గుణహీనమై నట్టిది కాజాలదనీ, ఏ మతాన్నైనా అందులో పుట్టిన ఉత్తములను బట్టి పరీక్షించాలే కాని అధములను బట్టి కాదు అనీ.

మహాత్ముడి ఈ అభిభాషలోని ప్రతి మాటతోను నేనే ఏకీభవిస్తాను. అయితే అలా చెప్పడంలో మహాత్ముడు దేనిని ఋజువు చేయదలచుకొన్నాడో నా కర్థం కావడంలేదు. మతాన్ని దానిలోని అధములను బట్టిగాక దాని ఉత్తములను బట్టి పరీక్షించాలనేది నిజమే. అయితే అంతటితో సమస్య పరిష్కార మయిందా? కాలేదనే నేనంటాను. మతంలో అధములు అసంఖ్యాకంగా ఉండి, ఉత్తములు బహు కొద్దిమంది మాత్రమే ఉన్నారేమి? ఇదీ ముఖ్యమైన ప్రశ్న. ఈ ప్రశ్నకు రెండు విధాలైన జవాబులు నా మనస్సుకు తోస్తున్నాయి.

1. అధములుగా ఉన్నవారు తమ జీవిత మూల విధానంలోనే ఏదో ఒక వక్రత కారణంగా నైతికంగా శిక్షణ పొందలేనివారు కావడం, ఏతత్ కారణంగా వాళ్ళు మత లక్ష్యం దరిదాపుల లోకి కూడ వెళ్ళలేక పోవడం. లేక--

2. మత లక్ష్యమే పూర్తిగా తప్పుడు లక్ష్యం కావడం. మత లక్ష్యమే చెడ్డది కావడం వల్ల ఆ మతంలోని అత్యధిక సంఖ్యాకులైన ప్రజల జీవితాలను అది తప్పుదారి పట్టించిందని చెప్పవచ్చు. ఉత్తములైన కొద్దిమంది అలా ఉత్తములు కావడానికి కారణం ఆ తప్పుడు లక్ష్యాన్ని అధిగమించి పోవడమో, లేక ఏతత్ లక్ష్యాన్ని త్రిప్పి సరియైన మార్గంలో పెట్టి అనుసరించడమో కావచ్చు.

ఈ రెండు సమాధానాలలోను మొదటి దానికి నే నంగీకరించను. మహాత్ముడు కూడ అంగీకరించడనే నా ఉద్దేశం. రెండవ సమాధానమే వాస్తవానికి దగ్గరగాను, హేతుబద్ధంగాను ఉన్నదని నాకు తోస్తున్నది. మతంలో అధములు అనేకులూ, ఉత్తములు బహు కొద్దిమందీ ఉండడానికి మరొక మూడవ కారణం తాను చెప్పగలిగితేనే తప్ప మహాత్ముడు కూడ ఈ రెండవ సమాధానాన్నే అంగీకరిస్తాడనుకుంటాను. ఈ రెండోదే నిజంగా ఏకైక సమాధానం అయినప్పుడు – ఏ మతాన్నైనా దాని అనుయాయులలోని అధములను బట్టి గాక ఉత్తములని బట్టి పరీక్షించాలనే మహాత్ముడి వాదం నిష్ప్రయోజనమే అవుతుంది. అప్పుడు లక్ష్యాలను గుడ్డిగా ఆరాధించేటట్టు చేయబడి, తప్పుదారులలో పడిపోతున్న అశేష ప్రజానీకం పట్ల జాలి పడడానికే అది పనికి వస్తుంది.

## 5

ఎక్కువ మంది ప్రజలు సెయింట్ల అడుగు జాడలలో నడవడం జరిగితే, హిందూమతం సహన యోగ్యంగా ఉండగలదని మహాత్ముడు చేసే వాదంలో హేతువు ఏ మాత్రమూ లేదు! పైగా అది వట్టి భ్రమ అని కూడ అనవచ్చు. ఈ విషయంలో ఎక్కువ వివరాలు కావలసిన వారు 'ఆర్యన్ పాత్' అనే పత్రిక 1936 ఏప్రిల్ సంచికలో శ్రీ హెచ్. ఎన్. బ్రెయిల్స్‌ఫోర్డ్ వ్రాసిన "నైతికత సాంఘిక నిర్మాణం" అనే వ్యాసాన్ని చదవవచ్చు.

చైతన్యుడు మొదలైన ప్రఖ్యాత పురుషుల పేర్లను పేర్కొనడంలో మహాత్ముడి ఉద్దేశం ఏమిటి? బహుశః హిందువులలోని నిమ్న కులాల వారితో ఉన్నత నైతిక ప్రమాణాలను అనుసరించి వ్యవహరించ గలిగితే, హిందూ సమాజాన్ని–దాని నిర్మాణంలో ప్రాథమిక మైన మార్పు ఏదీ అవసరం లేకుండానే–సహన యోగ్యమూ,

సుఖవంతమూ కూడ చేయవచ్చునని సూచించడమే అయి ఉండవచ్చు. ఈ రకమైన భావనా ధోరణికి నేను పూర్తిగా వ్యతిరేకిని, తమ జీవితంలో ఒక ఉన్నతమైన సాంఘిక ఆదర్శాన్ని ఆచరణలో సాధించడానికి ప్రయత్నించే సవర్ణ హిందువుల్ని నేను గౌరవించగలను. నిజానికి అట్టివారే లేకపోతే భారతదేశం ఇప్పటికంటె దుస్సహంగా ఉండి ఉండేది. అసలు మానవ వాసయోగ్యంగానే ఉండేది కాదు. అయితే సవర్ణ హిందువులను-వారి వ్యక్తిగతమైన ప్రవర్తనను అభివృద్ధి చెయ్యడం ద్వారా - ఉత్తమ మానవులుగా మార్చడానికి ప్రయత్నించడం. అట్టి ప్రయత్నంపై ఆధారపడడం నా ఉద్దేశంలో శుద్ధ దండగ. కేవలం భ్రమ.

ఆయుధాలు తయారుచేసే వ్యక్తిని, అతడి వ్యక్తిగత ప్రవర్తన మంచివాణ్ణిగా చేయగలదా? అంటే అతడు చేసిన తూటాలు పేలకుండానూ, విషవాయువు చంపకుండానూ ఉండగలదా? కాని పక్షంలో - కుల చైతన్యంతో నింపబడి ఉన్న ఒక వ్యక్తిని అతడి వ్యక్తిగత ప్రవర్తన మంచివాణ్ణిగా మార్చగలదని మీరు ఎలా ఆశిస్తారు? కులతత్వంతో నిండివున్న వ్యక్తి ఎంత సత్ప్రవర్తన కలవాడైనా తక్కిన కులాల వ్యక్తుల్ని మిత్రులుగాను, తనతో సమానులుగాను చూడడం ఎలా సాధ్యం?

ఒక కులానికి చెందినవాడు - అతడి ప్రవర్తన ఎంత గొప్పదైన-మనస్సాక్షిగా వ్యవహరించాలంటే తక్కిన కులాల వాళ్ళను ఎక్కువగానో, తక్కువగానో చూడడం తప్పదు. తన కులం వాళ్ళను చూచినట్టు బంధుభావంతో, సమానులుగా ఇతర కులాల వాళ్ళను చూడడం సాధ్యం కాదు. కాగా-హిందువుడైనవాడు ఏదో ఒక కులానికి చెందక తప్పదు కనుక, అతడు తక్కిన కులాల వాళ్లను తమ వాళ్ళుగా చూడలేడు. పైగా, పరాయివాళ్ళను వలె చూస్తాడు. పరాయివాళ్ళ పట్ల వలెనే ఇతర కులాలవాళ్ళ పట్ల కూడ భేద భావంతో, కృత్రిమంగా, మోసంతో వ్యవహరించడానికి వెనుదీయడు. సిగ్గుపడడు. దీనంతటి సారాంశము ఏమిటంటే - హిందువులలో ఒకడు ఉత్తమ హిందువుడో, అధమ హిందువుడో కావచ్చు. కాని మంచి హిందువుడుగా ఉండలేడు. అందుకు కారణం అతడి వ్యక్తిగత ప్రవర్తనలో ఏదైనా చెడుగు ఉండి కాదు. తమ తోడి ప్రజలతో అతడికి ఉండే సంబంధంలోనే ఆ చెడుగు ఉంది. తమకూ, తమ తోడి ఉత్తములైన వ్యక్తులు కూడా నీతిమంతులుగా ఉండలేరు. ఒక

బానిసకు అతడి యజమాని ఉత్తముడుగానో, అధముడుగానో కనిపించవచ్చు. కాని మంచి యజమాని అనేవాడెవడూ ఉండడు. మంచివాడు యజమానిగా ఉండ లేడు. యజమాని మంచివాడుగా ఉండలేడు.

ఇదే సూత్రం ఉన్నత కులానికి, నిమ్నకులానికీ మధ్య ఉండే సంబంధంపట్ల కూడ వర్తిస్తుంది. ఒక నిమ్న కులం వ్యక్తికి, ఒక ఉన్నత కులం వ్యక్తి-తక్కిన ఉన్నత కులాలకంటె ఉత్తముడుగానో, అధముడుగానో కన్పించవచ్చు. ఒక ఉన్నత కులం వ్యక్తి ఎప్పుడూ మంచి వాడుగా ఉండలేడు. ఎందుకంటే తన కులాధిక్యతను గుర్తించే మరొక నిమ్నకులం అతడి క్రింద ఉండవలసి ఉంది కనుక, తన మీద మరొక ఉన్నతకులం వాడున్నాడని సదా గుర్తెరిగి ఉండడం నిమ్న కులం వాడికీ మంచిది కా జాలదు. నా ఉపన్యాసంలో నేను చేసే వాదన ఏమిటంటే-వర్ణం లేక కులం మీద ఆధారపడ్డ సమాజం ఒక దోష భూయిష్ఠమైన సంబంధం మీద ఆధార పరచ బడినట్టి సమాజం అని. ఈ నా వాదనను పూర్వ పక్షం చెయ్యడానికి మహాత్ముడు ప్రయత్నిస్తాడని ఆశించాను. కాని ఆయన అది చేయకుండా చాతుర్వర్ణ్య సిద్ధాంతం పట్ల తన కున్న విశ్వాసాన్ని మాత్రం పునరుద్ఘాటించి వదిలి పెట్టాడు. తన విశ్వాసానికి గల మూలకారణాల నైనా ఆయన వెల్లడించలేదు.

## 6

మహాత్ముడు తాను బోధించేదాన్ని తానైనా ఆచరిస్తున్నాడా? సాధారణంగా ఏదైనా ఒక వాదన చేసే టప్పుడు వ్యక్తిగతమైన ప్రవర్తన తేవడం మంచిది కాదు. కానీ, ఎవరైనా ఒక వ్యక్తి ఒక సిద్ధాంతాన్ని బోధిస్తూ అదే పరమార్థమని విశ్వసిస్తున్నప్పుడు-అతడు ఆ సిద్ధాంతాన్ని ఎంతవరకు ఆచరణలో పెడుతున్నాడో తెలుసుకోవాలనే కుతూహలం కలగడం సహజం. అతడు ఒకవేళ తన సిద్ధాంతాన్ని ఆచరించలేకపోతే, అందుకు కారణమేమిటో పరిశీలించడం కూడ సహజమే. అతడే ఆచరణలో విఫలుడైతే అందుకు కారణం బహుశా అతడు పెట్టుకొన్న ఆదర్శం అందుకోరానంత ఉన్నతమైనదై ఉండడం కావచ్చు. కారణం ఏదైనప్పటికీ అటువంటి వ్యక్తి ప్రవర్తన ప్రజల పరిశీలనకు గురి గాక తప్పదు. కాగా, మహాత్ముడు తన

సిద్ధాంతాన్ని తాను ఆచరణలో పెట్టడానికి ఎంతవరకు ప్రయత్నించాడని నే నడిగితే, అందుకు నన్నెవరు తప్పు పట్టకూడదు.

మహాత్ముడు పుట్టుక రీత్యా వైశ్యుడు (కోమటి). ఆయన పూర్వీకులు తమ కులవృత్తి అయిన వ్యాపారాన్ని విడనాడి బ్రాహ్మణవృత్తి అయిన మంత్రిత్వాన్ని స్వీకరించారు. తన స్వవిషయంలో కూడ తాను మహాత్ముడు కాక పూర్వం - ఆయన ఒక వృత్తిని ఎన్నుకోవలసి వచ్చినప్పుడు తూనిక రాళ్ళకు (వ్యాపారానికి) బదులు ప్లీడరీ వృత్తిని ఎన్నుకోవలసి వచ్చినప్పుడు తూనిక రాళ్ళకు (వ్యాపారానికి) బదులు ప్లీడరీ వృత్తిని చేబట్టాడు. ప్లీడరీ వదిలేసి, ఆ తర్వాత ఆయన సగం స్వాములవారు, సగం రాజకీయవేత్త అయినాడు. తన కులవృత్తి అయిన - తన పూర్వీకుల కుల వృత్తి అయిన - వ్యాపారాన్ని ఆయన ఏనాడూ ముట్టలేదు. ఆయన చిన్న కొడుకు - ఆయన కొడుకులలో తండ్రికి నమ్మకస్తుడైన కొడుకును మాత్రమే ఇక్కడ ఉదహరిస్తున్నాను. వైశ్యుడుగా పుట్టి ఒక బ్రాహ్మణుడి కుమార్తెను పెళ్లాడి, ఒక పత్రికాధిపతిని సేవించే వృత్తిని స్వీకరించాడు. తన కొడుకు ఆ విధంగా వంశానుగత వృత్తినుంచి వైదొలగి పోయినందుకు అతడ్ని మహాత్ముడు మందలించినట్టు కూడ కనిపించదు. ఒక ఆదర్శంలోని మంచిచెడ్డలను, దాని అనుయాయులలోని అధములనుబట్టి నిర్ణయించడం మంచిది కాదు, నిజమే. కాని మహాత్ముడి సంగతి ఏమిటి? ఆయన ఎలాంటి అనుయాయుడనాలి? మహాత్ముడు కూడ విఫలుడయ్యాడని అనుకుంటే అసలు ఆ సిద్ధాంతమే తప్పు సిద్ధాంతమని, ఆచరణయోగ్యం కానట్టిదని, మానవ సమాజ ప్రవృత్తికి విరుద్ధమైనట్టిదని మనం నిర్ణయించుకోవడంలో తప్పేముంది?

కార్లయిలు మహాశయుని శిష్యకోటి కందరికీ తెలిసిందే-ఆయన ఏదైనా ఒక విషయంలో బాగా ఆలోచించకుండానే ఆ విషయం గురించి ప్రసంగిస్తూ ఉండేవాడని. వర్ణ వ్యవస్థ విషయంలో మహాత్ముడి ధోరణి కూడ అలాంటిదేనా అని నా అనుమానం. అలా కాకపోతే నాకు మిలిగిన కొన్ని ప్రశ్నలు ఆయన దృష్టి కెందుకు వచ్చి వుండవు? ఏదైనా ఒక వృత్తి అనువంశిక వృత్తి ఎప్పుడవుతుంది. ఒక వ్యక్తికి అది ఎప్పుడు తప్పనిసరిగా అనుసరించవలసిన వృత్తి అవుతుంది? ఎవరైనా

ఒక మనిషి తన అనువంశిక వృత్తి సరిపడకపోయినప్పటికీ, అది తనకు ఏ విధంగానూ లాభదాయకం కాకపోయినప్పటికీ, అతడు దానిని అనుసరించి తీరవలసిందేనా? తన అనువంశిక వృత్తి అవినీతికరమని తనకు కనిపించినప్పటికీ అతడు దానినే అనుసరించి బ్రతకవలసి ఉన్నదా? ప్రతి వ్యక్తి తన వంశానుగత వృత్తిని మాత్రమే అనుసరించి బ్రతక వలసి ఉంటే – ఒక తార్పుడి గాడి మనుమడు తార్పుడుగాడు గానే బ్రతక వలసి ఉంటుంది. ఒక పుడుపుగత్తె మనుమరాలు పుడుపుగత్తెగానే బ్రతక వలసి ఉంటుంది. తన సిద్ధాంతపు ఈ సహేతుక పర్యవసానాన్ని అంగీకరించడానికి మహాత్ముడు సంసిద్ధుడేనా? వ్యక్తి తన పూర్వుల వృత్తినే అనుసరించాలన్న మహాత్ముడి సిద్ధాంతం అసాధ్యమో, అనాచరణీయమో మాత్రమే కాక నైతికంగా అది అసమర్థనీయమూ, అతి నికృష్టమూ అయినట్టిది కూడా.

## 7

మహాత్ముడి దృష్టిలో జీవితకాలమంతా బ్రాహ్మణుడుగా ఉండిపోయే బ్రాహ్మణుడే నిజమైన బ్రాహ్మణుడు. తమ జీవిత కాలమంతా బ్రాహ్మణులుగా ఉండిపోవడానికీ ఇష్టంలేని బ్రాహ్మణులెంతో మంది ఉన్నారు. వారి సంగతి అలా ఉంచుదాం. తమ వంశానుగత వృత్తి అయిన పౌరోహిత్యానికే అంటిపెట్టుకొని ఉంటే బ్రాహ్మణుల సంగతేమిటి. వాళ్ళు అలా అంటిపెట్టుకొని ఉండడానికి కారణం వంశానుగత సిద్ధాంతం పట్ల తమకు గల విశ్వాసం చేతనా? లేక హేయమైన ధనాశ చేతనా? ఈ రకమైన ప్రశ్నలను గురించి మహాత్ముడు పట్టించుకొనేటట్టు కనిపించడు.

“ఉచితంగా లభించే భిక్షపై బ్రతుకుతూ తమ ఆధ్యాత్మిక సంపదను ప్రజలకు ఉచితంగా పంచిపెట్టే బ్రాహ్మణులు” ఉన్నారనే సంతృప్తితో మహాత్ముడున్నాడు. వంశానుగత వృత్తిని అవలంబిస్తున్న బ్రాహ్మణ పురోహితుడు మహాత్ముడికి ఆధ్యాత్మిక సంపదకు నిధిగా కనిపిస్తున్నాడు. అయితే ఈ అనువంశిక బ్రాహ్మణ పురోహితుడ్ని మరొక రూపంలో కూడ చూడవచ్చు. బ్రాహ్మణుడు స్థితికారుడైన విష్ణువుకి పూజకుడు కాగలడు. నాశన కారుడైన శంకరుడికి అర్చకుడు కాగలడు. మానవజాతికి అతి ఉదాత్తమైన ప్రేమ సిద్ధాంతాన్ని బోధించిన బుద్ధుడికి బుద్ధగయలో ఆచార్యుడు

కాగలడు. తన రక్త దాహాన్ని తీర్చుకునేటందుకు రోజుకొక జంతువును బలిగొనే, క్షత్రియుల్ని నాశనం చేయడానికే అవతారమెత్తిన పరశురాముడి గుడిలోను కూడ బ్రాహ్మణుడు దేవాజీవి కాగలడు. సృష్టి కర్తయైన బ్రహ్మకూ, బ్రహ్మదేవుడికి మతపరమైన ప్రపంచాధిపత్యాన్ని ఏ మాత్రమూ అంగీకరించని అల్లాదేవుడికి సంబంధించిన "పీరు" కూడ తంబళి కాగలడు. ఇదంతా యధార్థజీవిత చిత్రణ కాదని ఎవరైనా అనగలరా?

బ్రాహ్మణుని యదార్థ జీవితం ఇటువంటి దైనప్పుడు - పరస్పర వ్యతిరేక తత్వాలు గల దేవీదేవులను సేవించగల అతడి ఈ సామర్థ్యాన్ని గురించి ఏమనాలి? ఇలాంటి పని మనస్సాక్షి గల వాడెవడైనా చేయగలడా? ఈ పరస్పర విరుద్ధ దేవీదేవులకు అందరికీ నిజాయితీ కలవాడెవడై నా భక్తుడుగా ఉండగలడా? అయితే, ఈ అసాధారణ విచిత్ర స్థితినే హిందూమతంలోని గొప్పతనానికీ, దాని ఆధ్యాత్మిక సహన శీలతకూ, సార్వజనీనతకూ నిదర్శనంగా హిందువులు చెప్పుకోవడం ఉంది. ఇది కేవలం చవుకబారు దృష్టి, సహనశీలత, ఔదార్యం, సార్వజనీనత అని దేనినైతే అంటున్నారో అదంతా నిజానికి వట్టి నిర్లక్ష్యం, ఉపేక్ష, పేలవమైన స్వైరత మాత్రమే. అంతకంటె మరేమీ కాదు.

అయితే ఈ రెండు దృక్పథాలనూ స్థూలంగా చూస్తే, పెద్ద భేదం కనిపించక పోవచ్చు. కాని సూక్ష్మదృష్టితో పరిశీలించి చూస్తే వాటి మధ్యగల భేదం స్పష్టంగా తెలుస్తుంది. రెండూ ఒకటే అనుకోడానికి వీలుండదు. అనేకమంది దేవీ దేవుళ్ళకు పూజలు చెయ్యడానికి ఒక వ్యక్తి సిద్ధపడుతున్నాడంటే అది అతని సహనశీలతకు నిదర్శనంగా చెప్పవచ్చు. కాక సమయానుకూలంగా ఏ ఎండ కా గొడుగు పట్టే కపట మనస్తత్వానికి అది నిదర్శనం అని చెప్పవచ్చు. సహనశీలత అని చెప్పబడేది కేవలం కపట స్వభావమే అని నా విశ్వాసం. ఈ దృక్పథం సరైనదని అంగీకరించిన వాడు స్వప్రయోజన బుద్ధితో ఏ దేవుడ్ని బడితే ఆ దేవుడ్ని సేవించడానికి సిద్ధపడే అట్టి బ్రాహ్మణుడు ఏపాటి ఆధ్యాత్మిక సంపదకు నిధి కాగలడు? ఆధ్యాత్మిక సంపద సమున్నతి మాట అలా వుంచి - తనకు నమ్మకమూ, విశ్వాసమూ లేకపోయినప్పటికీ - కేవలం తన పూర్వీకుల వృత్తి అన్న కారణంగా - తన తాత ముత్తాతల నుంచి వంశపారంపర్యంగా వస్తున్నది కనుక - వట్టి యాంత్రికంగా దేవతార్చన వంటి

ఉత్కృష్ణ విధిని నిర్వహించడ మంటె – ఆధ్యాత్మిక సంపత్తిని నిక్షేప పరచుకోవడం కాజాలదు. అది దైవార్చన వంటి ఉన్నత విధి నిర్వహణ వృత్తిని–అంటే మత సేవా విధిని–నిజంగా పడుపువృత్తి క్రిందకు దిగజార్చడమే అవుతుంది.

## 8

ప్రతి వ్యక్తీ, తన పూర్వీకుల వృత్తినే అవలంబించాలన్న సిద్ధాంతాన్ని మహాత్ముడు ఎందుకుపట్టుకొని వ్రేళ్ళాడుతున్నట్లు? ఎందుకో ఆయన కారణాలు ఎక్కడా చెప్పినట్టు లేదు. అయితే–మహాత్ముడు చెప్పక పోయినా–అందుకు ఏదో ఒక కారణం ఉండకపోదు కదా? చాల సంవత్సరాల క్రితం తన "యంగ్ ఇండియా" పత్రికలో "కులం–వర్గం" అనే విషయం మీద ఒక వ్యాసం వ్రాస్తూ– వర్గ విధానం కంటె కుల విధానమే శ్రేష్టతరమైనదనీ, అందుకు కారణం సాంఘిక స్థైర్యానికి కులం పెట్టని కోట వంటిది కావడమే ననీ మహాత్ముడు పేర్కొన్నాడు.

వంశానుగత వృత్తి సిద్ధాంతాన్ని మహాత్ముడు పట్టుకొని వ్రేళ్లాడడానికి అదే కారణమైతే – ఆయన సాంఘిక జీవితంపట్ల ఒక మిథ్యా దృక్పథాన్ని కలిగి ఉన్నాడని అనక తప్పదు. సాంఘిక స్థైర్యం అందరూ కోరేదే. అట్టి స్థైర్యాన్ని సాధించడానికి వ్యక్తుల మధ్యా, వర్గాల మధ్యా ఏదో ఒక విధమైన సంబంధమూ, సర్దుబాటూ అవసరమే. కాని రెండు విషయాలను మాత్రం ఎవ్వరూ వాంఛించరని నా ఉద్దేశం. అందులో ఒకటి అచేతనమైన సంబంధం. ఎవ్వరినీ మార్చడానికి వీలులేని, కలకాలమూ ఒకేలా, ఒకే చోట స్తబ్దంగా పడి ఉండే సంబంధాన్ని ఎవరూ కోరరు. స్థైర్యం ఉండవలసిందే. కాని మార్పు అవసరమైనప్పుడు మార్చడానికి వీలు మాత్రం తప్పక ఉండాలి. ఇనుప కడ్డీలతో బిగించిన స్థిరత్వం సచేతన సమాజం దృష్ట్యా, స్థైర్యం ఉండవలసిందే. కాని మార్పు అవసరమైనప్పుడు మార్చడానికి వీలు మాత్రం తప్పక ఉండాలి. ఇనుప కడ్డీలతో బిగించిన స్థిరత్వం సచేతన సమాజం దృష్ట్యా, స్థైర్యం కాజాలదు.

ఇక ఎవరూ వాంఛించని రెండవ విషయం – కేవలం సర్దుబాటు అనేది అవసరమే. కాని, అది సాంఘిక న్యాయాన్ని నాశనం చేసే సర్దుబాటు కాకూడదు.

కులం ప్రాతిపదికగా ఏర్పడ్డ సాంఘిక సంబంధం ద్వారా - అనువంశిక వృత్తినే ప్రతివాడూ అనుసరించాలని విధించే సాంఘిక సంబంధం ద్వారా - సాధించబడ్డ సర్దుబాటులో ఈ రెండు లోపాలూ లేవా? ఉన్నాయనే నే నంటాను. కుల విధానం ఒక మంచి సాంఘిక సంబంధపు సర్దుబాటు కాదు. అది అధమాధమమైన సర్దుబాటు. సాంఘిక సంబంధానికీ, సర్దుబాటుకూ ఉండవలసిన మూలసూత్రాలకు, అంటే పరిణామశీలతకూ: న్యాయ శీలతకూ, ఈ సర్దుబాటు - అంటే కుల వ్యవస్థ-పూర్తిగా విరుద్ధమైనట్టిది. పరమ హానికరమై నట్టిది.

## 9

మహాత్ముడు ఇప్పుడు కులవ్యవస్థను విశ్వసించడం లేదు. కనకను, వర్ణవ్యవస్థను మాత్రమే నమ్ముతున్నాడు. కనుకను ఆయన చాలా అభ్యుదయాన్ని సాధించాడని కొంతమంది అనుకోవచ్చు. మహాత్ముడు ఒకప్పుడు కరడు గట్టిన, శుద్ధకులతత్వవాది అయిన సనాతన హిందువుడు అన్నమాట నిజమే. వేదాలను, ఉపనిషత్తులను, పురాణాలను, హిందూశాస్త్రాల పేరుతో చలామణి అయ్యే ప్రతీదాన్ని, అవతారాలను, పునర్జన్మను కూడ ఆయన నమ్మినవాడే. పూర్వాచారపరాయణుల కంటే ఎక్కువగా దానిని సమర్థించినవాడే. వర్ణాంతర భోజనం, వర్ణాంతర పానకం, వర్ణాంతర వివాహం - వీటన్నిటినీ ఖండించినవాడే, వర్ణాంతర భోజనం మంచిది కాదని, దానిని నిగ్రహించాలని, అట్టి నిగ్రహం అత్మశక్తిని పెంచడానికి, సాంఘిక సౌశీల్యాన్ని నిలిపి ఉంచడానికి ఉపయోగపడుతుందని ఆయన గట్టిగా వాదించినవాడే. ఇప్పుడు కొంత మార్పు చెంది ఆయన ఇదంతా వట్టి చాదస్తపు చెత్త అని గుర్తించినందుకూ, కులవ్యవస్థ ఆధ్యాత్మికోన్నతికీ, జాతీయ ప్రగతికీ హానికరమని ఆయన అంగీకరించి నందుకూ కొంత సంతోషించవలసిందే. బహుశా ఆయన దృక్పథం మారడానికి కారణం తన కొడుకు వర్ణాంతర వివాహం చేసుకోవడమే కావచ్చు. అయితే మహాత్ముడు నిజంగానే అభ్యుదయ గామి అయినాడా?

మహాత్ముడు సమర్థిస్తున్న వర్ణవ్యవస్థ యొక్క నిజ స్వరూపం ఎలాంటిది? అది స్వామిదయానంద సరస్వతీ, ఆయన అనుయాయులైన ఆర్యసమాజకులూ సాధారణంగా అర్థం చేసుకొని బోధిస్తున్న వైదిక వర్ణ వ్యవస్థేనా?

వైదిక వర్ణ వ్యవస్థ చెప్పేదేమిటంటే - ప్రతివ్యక్తీ తన సహజ అభిరుచిని బట్టి అందుకు తగిన వృత్తిని అవలంబించాలని. మహాత్ముడు సమర్థిస్తున్న వర్ణ వ్యవస్థ సారాంశం ఏమిటంటే - ప్రతీ వ్యక్తి తన సహజ అభిరుచిని అవతలపెట్టి, విధిగా తన పూర్వీకుల వృత్తినే అవలంబించాలని. ఇప్పుడు ఆలోచించి చూడండి కులానికీ, వర్ణానికీ మధ్య మహాత్ముడు చూపుతున్న తేడా ఏమిటి? నాకు మాత్రం తేడా ఏమీ కనిపించడం లేదు. మహాత్ముడి నిర్వచనం ప్రకారం వర్ణం కులానికి మరొక పేరు మాత్రమే. ఎందుకంటే వాటి రెండింటి లక్ష్యం ఒకటే వంశానుగత వృత్తిని అవలంబించడం. దీనినిబట్టి చూస్తే - పురోగమించడం మాట అటుంచి, మహాత్ముడు ఎంతో తిరోగమించాడని తెలియడం లేదా? వైదిక వర్ణసూత్రానికి తన స్వంత నిర్వచనం చెప్పి, అపార్థం కల్పించి, ఉదాత్తమైన సూత్రాన్ని అపహాస్యం పాలుచేశాడు మహాత్ముడు.

వైదిక వర్ణ వ్యవస్థను నేను నిరాకరించిన మాట నిజమే. అందుకు కారణాలు నా ఉపన్యాసంలో చెప్పాను. అయితే, స్వామిదయానంద మరికొంత మంది చెప్పిన అర్థం ప్రకారం, వేదాలలో చెప్పబడ్డ వర్ణసూత్రం సవ్యమైందేనని, నిరపాయకరమైనదేనని నేను అంగీకరిస్తాను. వైదిక వర్ణసూత్రం ప్రకారం సమాజంలో ఒక వ్యక్తి స్థానాన్ని నిర్ణయించేది పుట్టుక మీద ఆధారపడింది. పుట్టుకనుబట్టి వ్యక్తికి సాంఘిక స్థాయిని నిర్ణయించేది కుల వ్యవస్థ. సున్నపు ముద్దకు, జున్ను ముక్కకు ఎంత తేడా ఉన్నదో అంత తేడా ఉన్నది కులానికీ, వర్ణానికీ మధ్య. నిజానికి అవి రెండూ - రెండు విరుద్ధ వ్యవస్థలు.

ప్రతీ వ్యక్తీ తన పూర్వీకుల వృత్తినే అవలంబించాలనే విషయంలో మహాత్ముడికి, ఆయన వాదన ప్రకారం, నిజంగా విశ్వాసముంటే ఆయన ఖచ్చితంగా కులవ్యవస్థను ప్రచారం చేస్తున్నా డన్నమాట. తాను ప్రచారం చేస్తున్న కులవ్యవస్థను వర్ణవ్యవస్థ అని ఆయన పేర్కొనడంలో అపశబ్ద దోషానికి పాల్పడడమే గాక, గజిబిజినీ, గందరగోళాన్ని కలిగించటం కూడ అవుతుంది. మహాత్ముడి ఈ గందర గోళానికంతటికీ కారణం - కులం గురించి గాని, వర్ణం గురించి గాని, హిందూమతం నిలపడానికి యీ రెండింటిలో ఏ ఒకటైనా అవసరమా అనేదాన్ని గురించి గాని ఆయనకు ఖచ్చితమైన, స్పష్టమైన అభిప్రాయమేదీ లేకపోవడమే. హిందూమత సారం కులం కాదు అని మహాత్ముడు అన్నాడు. ఈ ఉద్దేశాన్ని మార్చుకోవడానికి ఏదో ఒక మర్మాత్మకమైన కారణాన్ని వెదకడనే ఆశిద్దాం.

హిందూమతం సారాంశం కులం కాదు అని మహాత్ముడు అన్నాడు. సరే, హిందూమత సారాంశం వర్ణం అని ఆయన అనుకుంటున్నాడా? ఈ ప్రశ్నకు ప్రస్తుతం ఎవరూ కచ్చితమైన జవాబు చెప్పలేకపోవచ్చు. కాని "డాక్టర్ అంబేద్కర్ నిందారోపణ" అనే తన వ్యాసంలో మహాత్ముడు వ్రాసినదాన్ని చదివినవాళ్ళు మాత్రం "లేదు" అని చెప్పగలరు. హిందూమత జీవిత సరళిలో వర్ణ సిద్ధాంతం ఒక ప్రధాన భాగమని ఆ వ్యాసంలో ఆయన చెప్పలేదు. అంతేకాదు. ఆ వ్యాసంలో ఆయన చెప్పిందేమంటే - భగవంతు డొక్కడే, ఆయన సత్య స్వరూపుడు అని నిర్వచించడమూ, మానవ కుటుంబ శాసనంగా అహింసను ధైర్యంగా అంగీకరించడమూ-ఇదే హిందూమత సారాంశ మని.

అయితే మహాత్ముడు శ్రీ శాంత్‌రామ్‌కు జవాబిస్తూ వ్రాసిన వ్యాసాన్ని చదివిన వాళ్ళు మాత్రం "అవును" అని సమాధానం చెబుతారు. ఆ వ్యాసంలో మహాత్ముడు చెప్పింది: "ఒక ముస్లిం ఖురానును నిరాకరిస్తే అతడు ముస్లింగా ఎలా ఉంటాడు? బైబిలును నిరాకరించిన వాడు క్రైస్తవుడుగా ఎలా ఉంటాడు? కులమూ, వర్ణమూ పర్యాయ పదాలైనప్పుడు, హిందూమత శాస్త్రాలలో వర్ణం ఒక ప్రధానాంశం అయినప్పుడు కులాన్ని (అంటే వర్ణాన్ని) నిరాకరించేవాడు హిందువుడనని ఎలా చెప్పుకోగలడు?" అంటే మహాత్ముడేమంటున్నట్టు? ఎందుకీ వాక్ఛలం? ఛద్మ వాదం? ఎందుకీ కప్పదాటు? ఎవరిని మెప్పించాలనుకుంటున్నాడు? సత్యాన్ని గుర్తించడంలో సాధుపుంగవుడు విఫలుడైనాడా? లేక ఆయనలోని రాజకీయవాది సాధువుకు అడ్డం వచ్చాడా?

మహాత్ముడు ఇంతగా తికమకపడడానికి నిజమైన కారణాలు రెండు చెప్పుకోవచ్చు. ఒకటి ఆయన స్వభావం. రెండు-మహాత్ముడుగాను, రాజకీయవేత్తగాను ఆయన చేయదలచిన ద్విపాత్రాభినయం.

మహాత్ముడి స్వభావం శిశు స్వభావం. ప్రతి విషయంలోనూ, పసివాడి లాగే అమాయకత్వంతోను, సరళ చిత్తంతోనూ ఆయన వ్యవహరిస్తాడు. పసివాళ్ళలాగే ఆయన ఆత్మవంచన చేసుకోగలడు. పిల్లలలాగే తాను నమ్మాలనుకున్న దానిని నమ్మివేయగలడు. అందువల్ల కులంపట్ల నమ్మకాన్ని ఎంత ఉదారంగా వదులుకొన్నాడో అంత ఉదారంగానే వర్ణంపట్ల నమ్మకాన్ని కూడ మహాత్ముడు వదులుకోవచ్చు. అట్టి తరుణం వచ్చేవరకు మనం వేచి చూడవలసి ఉంది.

ఇక పోతే - మహాత్ముడి ఆధ్యాత్మిక, రాజకీయ ద్వంద్వ ప్రకృతి సంగతి మహాత్ముడి పాత్రలో ఆయన బహుశా రాజకీయాలను ఆధ్యాత్మీకరించడానికి ప్రయత్నిస్తూ ఉండవచ్చు.

అయితే ఇందులో తన ప్రయత్నం సఫలం అయినా కాకపోయినా, రాజకీయాలు మాత్రం ఆయనను ఇప్పటికే వ్యాపారంలోకి దించేశాయి. సమాజం పూర్ణ సత్యాన్ని భరించజాలదని, అందువల్ల తాను పూర్ణ సత్యాన్ని చెప్పకూడదని రాజకీయ వేత్తకు తెలిసి ఉండాలి. అతడు పూర్ణ సత్యాన్ని చెబుతూ ఉంటే అది అతడి రాజకీయాలకు చెడుగు చేస్తుంది. మహాత్ముడు ఎప్పుడూ కులాన్ని, వర్ణాన్ని సమర్థిస్తూ ఉండడానికి కారణం – అలా సమర్థించక పోతే రాజకీయాలలో తన స్థానం క్షోభుందన్న భయమే. ఈ విషయంలో ఆయన పడుతున్న గందర గోళానికి కారణభూతాలు ఇవి రెండే అనవచ్చు. ఏది ఏమైనప్పటికి – మహాత్ముడు తనను తాను మోసగించుకొంటున్నాడని, వర్ణం పేరుతో కులాన్ని ప్రచారం చేస్తూ ప్రజలను కూడ మోసగిస్తున్నాడని చెప్పక తప్పదు.

## 10

హిందువులను, హిందూమతాన్ని, పరీక్షించడానికి నేను తీసుకొన్న ప్రమాణాలు (గీటురాళ్ళు) చాల కఠినమైనట్టివి. వాటి ప్రకారం చూస్తే ప్రపంచంలోని ఏ మతమూ కూడ నిలువజాలదని మహాత్ముడు చెపుతున్నాడు. నేను తీసుకొన్న ప్రమాణాలు కఠినమైనవనడంలో నిజం ఉంటే ఉండవచ్చు. అయితే అవి కఠినమైనవా, సులభమైనవా అనేది కాదు ప్రశ్న. అవి సరియైనవా, కాదా అనేది ముఖ్యంగా పరిశీలించవలసినట్టిది. ఏ జాతి ప్రజలనైనా, ఏ ప్రజల మతాన్నైనా సాంఘిక నీతిపై ఆధారపడ్డ సాంఘిక ప్రమాణాలను బట్టి పరీక్షించవలసి ఉంది. ప్రజల శ్రేయస్సుకు మతం అనుకూలమైనట్టిదిగా ఉండాలంటే, సామాజిక, నైతిక ప్రమాణాలకు అది సరిపడినదై ఉండాలి. హిందువులను, హిందూమతాన్ని పరీక్షించడానికి నేను తీసుకున్న ప్రమాణాలు, ఈ దృష్టితో చూసినప్పుడు, ఎంతో సమంజస మైనట్టివని, అంతకంటే మంచి ప్రమాణాలు మరెక్కడా ఉండవని నేను ఉద్దేశపడుతున్నాను. నా ప్రమాణాలనుబట్టి పరీక్షిస్తే, లోకంలో తెలిసిన ఏ మతమూ కూడ నిలవదనడం కూడ నిజమే కావచ్చు. అయితే అంతమాత్రం చేత హిందువులను, హిందూమతాన్ని వెనక వేసుకు వస్తున్న మహాత్ముడు ఓదార్పు పొందకూడదు. ఇది ఎలా ఉందంటే తనవంటి వాడే మరొక పిచ్చివాడున్నాడు కదా అని ఒక పిచ్చివాడు తన వంటివాడే మరొక నేరస్తుడున్నాడు కదా అని ఒక నేరస్తుడు సంతృప్తిని, ఓదార్పును పొందినట్టున్నది. హిందువులు, హిందూమతం, పరీక్షకు నిలవక పోవడమూ, విఫలం కావడమూ మాత్రమే కాదు–నాపై ఆరోపించిన నా విసుగుకు తిరస్కారానికి కారణం. ఈ విషయాన్ని నేను మహాత్ముడికి స్పష్టంగా చెప్పగలను. ప్రపంచం ఎన్నో లోపాలతో

ఒప్పుకోరు. హిందూ సమాజం పునాదుల శిధిలస్థితి ఇలా ఉంది. దానిపట్ల హిందూనాయకుల పురాణ విశ్వాసాల దుస్థితి అలావుంది. దేని విషయంలోను కూడ హిందూ ప్రజానీకం ఏమి పట్టించుకోరు. అంతా కావలసినది హిందూ నాయకులకు మాత్రమే. అన్నిటికంటే ఘోరం ఏమిటంటే – తమ విశ్వాసాల పట్ల ఈ నాయకులకు ఉండే దుర్మోహం. వాటిని విమర్శించే వారిపట్ల దుస్తాపం. తమ విశ్వాసాలను ఏ కొంచెం కూడ సడలించుకోడానికి కానీ, వాస్తవాన్ని చూడడానికి కానీ ఈ నాయకులు ఒప్పుకోరు. మహాత్ముడు కూడ ఇందుకు భిన్నుడు కాదు. ఈ దుర్మోహ దుస్తాపాలకు అతీతుడు కాదు.

ఆలోచించడం అనేదానిలో మహాత్ముడికి విశ్వాసం ఉన్నట్టు కనిపించదు. పెద్దలను అనుసరించడమే మంచి దంటాడాయన. పవిత్రంగా భావించబడే ప్రాచీనమైన అభిప్రాయాల పట్ల ఆయనకు గౌరవం మెండు. ఆయన కరడుగట్టిన సనాతనాచార పరుడివలె – ఆలోచనకు వ్యతిరేకి. ఆలోచించడం మొదలు పెడితే తాను పట్టుకొని వ్రేలాడు తున్న అనేక లక్ష్యాలు, వ్యవస్థలు పేకమేడలవలె కూలిపోగలవని ఆయన భయం. ఆయన గురించి మనం జాలిపడవలసి ఉంది.

స్వతంత్రంగా ఆలోచించడం మొదలు పెడితే – ఒక్కొక్క ఆలోచన సుస్థిరంగా కనబడే ప్రపంచానికి ఏదో మూల గండాన్ని తెచ్చిపెట్ట గలదు. అయితే స్వతంత్రంగా ఆలోచించడాన్ని మానుకొని సెయింటుల మీద (జ్ఞానులమీద, స్వాములమీద) ఆధార పడడంవల్ల మనకు సత్యం ఎలా గోచరిస్తుంది? సెయింట్లు కూడ మానవ మాత్రులే. లార్డు బాల్ ఫోర్డ్ మహాశయుడు చెప్పినట్టు "మానవుని మనస్సు పంది ముట్టెవలె ఒక సత్యాన్వేషక సాధనం మాత్రమే"

ఆయన (మహాత్ముడు) ఆలోచించడానికి పూనుకున్నా–అది సరియైన పద్ధతిలో ఆలోచించడంగా నాకు కన్పించదు. పాతబడి, బూజుపట్టిపోయిన హిందూ సామాజిక వ్యవస్థను సమర్థించడానికి కారణాలను వెదకడంకోసం మాత్రమే ఆయన తన ఆలోచనను వినియోగిస్తాడని నా అభిప్రాయం. ఆ విధంగా ఆలోచించడం తన మేధాశక్తిని వ్యవహరింప జేయడమే (దుర్వినియోగ పరచటమే) అవుతుంది. ఈ ప్రాచీన, నిర్జీవ హిందూ సామాజిక వ్యవస్థను సమర్థిస్తూ సమాధానపడే మహాశయులలో మహాత్ముడు అగ్రగణ్యమైన పలుకుబడి కలవాడు. ఆ విధంగా హిందువులకు ఆయన పరమ శత్రువు.

నిండిఉన్నట్టిదని, ప్రపంచంలో బ్రతకదలిచినవాడు దాని లోపాలన్నింటితోను సర్దుబాటు చేసుకొంటూ బ్రతకవలసి ఉన్నదని నే నెరుగుదును. నేను ఏ సమాజంలో బ్రతకవలసి ఉన్నదో, ఆ సమాజం యొక్క అన్ని లోపాలనూ భరిస్తూ శ్రమపడగలను. కాని ఏ సమాజం తప్పుడు ఆదర్శాలను ఆరాధిస్తున్నదో, ఏ సమాజం మంచి ఆదర్శాలను కలిగి ఉన్నప్పటికీ ఆ ఆదర్శాలతో సామాజిక జీవితాన్ని సమన్వయ పరచుకోడానికి అంగీకరించదో - అట్టి సమాజంలో బ్రతకడానికి నేను ఒప్పుకోను. హిందువులతోనూ, హిందూ మతంతోనూ నాకున్న వివాదం వాళ్ళ సాంఘిక ప్రవర్తనలోని లోపాలతో కాదు. ఆ వివాదం ఇంకా లోతైనట్టిది. ప్రాతిపదిక సూత్రాలకు సంబంధించినట్టిది. నా వివాదం వాళ్ళ ఆదర్శాలతో.

## 11

హిందూసమాజం నిలవాలంటే, అది వెంటనే నైతిక పునరుజ్జీవాన్ని పొందవలసి ఉంది. నైతిక పునరుజ్జీవ కార్యక్రమం ఎంత ఆలస్యమైతే అంత ప్రమాదం ఏర్పడుతుంది. అయితే, ఈ పునరుజ్జీవ కార్యక్రమాన్ని నిర్ణయించేదీ, నిర్వహించేదీ ఎవరు? ఇదొక పెద్ద సమస్య. తమ బుద్ధి ముందుగా పునరుజ్జీవం పొందిన వాళ్ళు, తద్వారా ఏర్పడ్డ దృఢ భావాలను వెల్లడించే ధైర్యం కల నిజాయితీపరులు అయినవాళ్ళు మాత్రమే ఈ నైతిక పునరుజ్జీవ కార్యక్రమాన్ని నిర్ణయించి నిర్వహించవలసి ఉంది. ఈ దృష్టితో చూచినప్పుడు, ఈనాడు పేరు ప్రఖ్యాతులలో ఉన్న హిందూ నాయకులెవ్వరూ కూడ ఇందుకు పనికిరారనే నా ఉద్దేశం. నేటి హిందూ నాయకులలో ఏ ఒక్కరైనా కనీసం అట్టి బౌద్ధిక పునరుజ్జీవనాన్ని ఏమాత్రం పొందిఉన్నా - పామర ప్రజానీకం వలె తమను తాము భ్రమ పెట్టుకోవడం కాని, ఇతరుల అజ్ఞానాన్ని తమ స్వార్థానికి ఉపయోగించుకొని బ్రతకడానికి గాని పాల్పడి ఉండే వాళ్ళు కాదు.

హిందూసమాజం తమ కళ్ళ ముందు శిథిలమై పోతున్నప్పటికీ ఈ హిందూనాయకులు కళ్ళు మూసుకొని సిగ్గులేకుండా, గత కాలపు ఆదర్శాలను ఏకరువు పెడుతూ ఉన్నారు. ఆ ఆదర్శాలు ఈ కాలానికి ఎందుకూ పనికిరానట్టివి. అవి పుట్టిన రోజులలో ఎంత ప్రయోజన కరంగా ఉండిఉన్నా, ఇప్పుడు మాత్రం మార్గదర్శకంగా కంటే హెచ్చరికగా మాత్రమే మిగిలిఉన్న ఆదర్శాలు. అయినా - ఈ హిందూ నాయకులు వాటిపట్ల మూఢభక్తిని మానుకోరు. వాటిని విమర్శనా దృష్టితో పరిశీలించడానికి కూడ

ఒప్పుకోరు. హిందూ సమాజం పునాదుల శిధిలస్థితి ఇలా ఉంది. దానిపట్ల హిందూనాయకుల పురాణ విశ్వాసాల దుస్థితి అలావుంది. దేని విషయంలోను కూడ హిందూ ప్రజానీకం ఏమి పట్టించుకోరు. అంతా కావలసినది హిందూ నాయకులకు మాత్రమే. అన్నిటికంటే ఘోరం ఏమిటంటే – తమ విశ్వాసాల పట్ల ఈ నాయకులకు ఉండే దుర్మోహం. వాటిని విమర్శించే వారిపట్ల దుస్తాపం. తమ విశ్వాసాలను ఏ కొంచెం కూడ సడలించుకోడానికి కానీ, వాస్తవాన్ని చూడడానికి కానీ ఈ నాయకులు ఒప్పుకోరు. మహాత్ముడు కూడ ఇందుకు భిన్నుడు కాదు. ఈ దుర్మోహ దుస్తాపాలకు అతీతుడు కాదు.

ఆలోచించడం అనేదానిలో మహాత్ముడికి విశ్వాసం ఉన్నట్టు కనిపించదు. పెద్దలను అనుసరించడమే మంచి దంటాడాయన. పవిత్రంగా భావించబడే ప్రాచీనమైన అభిప్రాయాల పట్ల ఆయనకు గౌరవం మెండు. ఆయన కరడుగట్టిన సనాతనాచార పరుడివలె – ఆలోచనకు వ్యతిరేకి. ఆలోచించడం మొదలు పెడితే తాను పట్టుకొని వ్రేలాడు తున్న అనేక లక్ష్యాలు, వ్యవస్థలు పేకమేడలవలె కూలిపోగలవని ఆయన భయం. ఆయన గురించి మనం జాలిపడవలసి ఉంది.

స్వతంత్రంగా ఆలోచించడం మొదలు పెడితే – ఒక్కొక్క ఆలోచన సుస్థిరంగా కనబడే ప్రపంచానికి ఏదో మూల గండాన్ని తెచ్చిపెట్ట గలదు. అయితే స్వతంత్రంగా ఆలోచించడాన్ని మానుకొని సెయింటుల మీద (జ్ఞానులమీద, స్వాములమీద) ఆధార పడడంవల్ల మనకు సత్యం ఎలా గోచరిస్తుంది? సెయింట్లు కూడ మానవ మాత్రులే. లార్డు బాల్ ఫోర్డ్ మహాశయుడు చెప్పినట్టు "మానవుని మనస్సు పంది ముట్టెవలె ఒక సత్యాన్వేషక సాధనం మాత్రమే"

ఆయన (మహాత్ముడు) ఆలోచించడానికి పూనుకున్నా–అది సరియైన పద్ధతిలో ఆలోచించడంగా నాకు కన్పించదు. పాతబడి, బూజుపట్టిపోయిన హిందూ సామాజిక వ్యవస్థను సమర్థించడానికి కారణాలను వెదకడంకోసం మాత్రమే ఆయన తన ఆలోచనను వినియోగిస్తాడని నా అభిప్రాయం. ఆ విధంగా ఆలోచించడం తన మేధాశక్తిని వ్యవహరింప జేయడమే (దుర్వినియోగ పరచటమే) అవుతుంది. ఈ ప్రాచీన, నిర్జీవ హిందూ సామాజిక వ్యవస్థను సమర్థిస్తూ సమాధానపడే మహాశయులలో మహాత్ముడు అగ్రగణ్యమైన పలుకుబడి కలవాడు. ఆ విధంగా హిందువులకు ఆయన పరమ శత్రువు.

మహాత్ముడివలె గాక, నమ్మి అనుసరించడంలో మాత్రమే తృప్తి పడని హిందూ నాయకులు చాలమందే ఉన్నారు. వాళ్ళు ఆలోచించడానికి సాహసిస్తారు. కాని, అట్టి వాళ్ళతో ఉన్న దురదృష్టం ఏమిటంటే – ప్రజాసమూహానికి సరియైన మార్గదర్శకులు కావలసిన సందర్భాలు ఏర్పడిప్పుడు అట్టి నాయకులు నిజాయితీ హీనులుగాను, శ్రద్ధాహీనులుగాను ఉండి పోతున్నారు. ప్రతీ బ్రాహ్మణుడు తన కుల కట్టడిని ఉల్లంఘించిన వాడే పౌరోహిత్యాన్ని, అర్చకత్వాన్ని అవలంబిస్తున్న బ్రాహ్మణులకంటే, చెప్పులు అమ్ముకొంటున్న బ్రాహ్మణులే చాలా ఎక్కువ మంది. వంశానుగతమైన పౌరోహిత్యాది వృత్తుల్ని విడిచిపెట్టుకొని వ్యాపారంలోకి దిగడం మాత్రమే కాక, శాస్త్ర నిషిద్ధాలయిన వృత్తులలోకి కూడ బ్రాహ్మణులు ప్రవేశించారు. అయితే అడుగడుగునా, క్షణక్షణమూ తమ కుల నిబంధనలను ఉల్లంఘిస్తుండే బ్రాహ్మణులలో కులవ్యవస్థకూ, శాస్త్రాలకూ వ్యతిరేకంగా మాట్లాడగల వాళ్ళెంత మంది?

నీతి, నిజాయితీ, వాస్తవదృష్టి, నిర్మల అంతఃకరణమూ కలిగి ఉండడంవల్ల తద్విరుద్ధమైన కులవ్యవస్థనూ, శాస్త్రాలను ఖండించగల సద్బ్రాహ్మణు డొకడుంటే, అందుకు ప్రతిగా – ప్రతిరోజూ కులాన్ని ధిక్కరిస్తూ, శాస్త్రాలను కాలరాస్తూ ఉండికూడ, కుల వ్యవస్థనూ, శాస్త్రాలనూ ఎలుగెత్తిచాటే ఉన్మాదులైన బ్రాహ్మణులు వందల కొలది ఉన్నారు. ఈ కపట నాటకం ఎందుకు? ఈ ధూర్తత్వం ఎందుకు? ఎందుకంటే – ప్రజాసామాన్యం కులవ్యవస్థ అనే దుష్టభారం నుంచి విమోచన పొందితే, అప్పుడు మొత్తం తమ కులం యొక్క అధికార ప్రతిష్టలకే గొడ్డలిపెట్టు కాగలదని బ్రాహ్మణులు భావించడంవల్ల. అశేష ప్రజానీకాన్ని ఆలోచనా హీనుల్ని చేసి తమ ఆలోచనా ఫలితాలను వారికి దక్కకుండా చేస్తున్న ఈ మేధావివర్గం (బ్రాహ్మణ కులం) యొక్క బేనిజాయితీ (దగాకోరుతనం) నిజంగా లోకంలోనే అపూర్వమైన లజ్జా విహీన విచిత్ర సృష్టి.

మాథ్యూ ఆర్నాల్డ్ చెప్పినట్టు, హిందువులు రెండు లోకాల మధ్య అల్లాడుతున్న ఒక విచిత్ర జాతి. ఆ లోకాలలో ఒకటి చచ్చిపోయి నట్టిది. రెండోది పుట్టడానికి శక్తి లేనట్టిది." పాపం వాళ్ళేమి చేయగలరు? ఎవరి దారి చూపగలరు!

దారి చూపడం కోసం వాళ్ళు (హిందువులు) ఆశ్రయించిన మహాత్ముడికి ఆలోచించడంలో నమ్మకం లేదు. కాగా – అనుభవయోగ్యమైన సలహా సహాయాలకు

ఆయన పనికిరాడు. ప్రజానీకం సహజంగా ఏ మేధావి వర్గంనుంచి వెలుగును ఆశిస్తుందో, ఆ మేధావివర్గం పూర్తిగా దగాకోరులుగా అయినా ఉంటున్నారు. లేక ప్రజానీకాన్ని సరైన పద్ధతిని విద్యావంతుల్ని చేయడంలో నిరర్థకులైన నిరపేక్షకులుగా అయినా వుంటున్నారు. నిజంగా మనం ఈనాడు ఒక ఘోరమైన విషాద చరిత్రకు సాక్షీబూతలంగా ఉంటున్నాం. ఆ మహా విషాద పరిభూతి సమ్ముకంలో ఏడవడం కంటే, "ఓ హిందువులారా! వీళ్ళా మీ నాయకులు!" అంటూ మొత్తుకోవడం కంటే ఎవరు ఏమి చేయగలరు.